ఈనాడు

విజయవాడ 26-8-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 17
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14+20 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


విజయవాడలో ప్రభుత్వం పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డు

సాంకేతికతతో రేషన్ దుర్వినియోగానికి అడ్డుకట్ట

మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: సాంకేతికత వినియోగంతో రేషన్ సరకుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడలోని వరలక్ష్మీనగర్‌లో సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, కలెక్టర్ లక్ష్మీశతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. స్మార్ట్ రేషన్ కార్డులో క్యూఆర్ కోడ్ పొందుపరిచామని, రేషన్ తీసుకున్న వెంటనే ఆ సమాచారం కేంద్ర కార్యాలయానికి (మిగతా 3లో)

ప్రపంచంతో పోటీ పడండి

భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోండి

- మెరుగైన విద్యను అందించేందుకు ఎంత ఖర్చుకైనా సిద్ధం
- విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం
- ఐఐటీ, నిట్, నీట్‌లకు ఎంపికైన 55 మందికి అభినందన
- ప్రోత్సాహకంగా రూ.లక్ష చొప్పున అందజేత
- కొత్తగా 7 ఐఐటీ-నీట్ శిక్షణ కేంద్రాలను అందుబాటులోకి తేవాలని అధికారులకు ఆదేశం


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఐఐటీ, నిట్‌లలో సీట్లు సాధించిన విద్యార్థులతో సంభాషిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఈ ఏడాది కొత్తగా 7 ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కొత్తగా ఏర్పాటు కాబోయే ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లతో 1,411 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివి ఈ ఏడాది ఐఐటీ, నిట్‌లకు ఎంపికైన, నీట్‌లో విజయం సాధించిన 55 మంది విద్యార్థులకు సచివాలయంలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవితక్కెళ్లపాడులోని (మిగతా 3లో)

ఉచిత బస్సులకు లైవ్ ట్రాకింగ్ 2లో
'జన ఔషధి' స్టోర్లతో బీసీలకు ఉపాధి 3లో
వరద ప్రవాహాలతో ప్రాజెక్టులన్నీ నింపండి 3లో

పీఎం, సీఎంలు జైళ్లనుంచి పాలిస్తారా?

విలువల స్థాయి పెంపునకే రాజ్యాంగ సవరణ బిల్లు

- నిస్సిగ్గుగా కారాగారాల నుంచే పాలించే సంస్కృతి రెండేళ్లుగా మొదలైంది
- సోహ్రాబుద్దీన్ కేసులు కొట్టివేసే వరకు నేను ఏ పదవీ తీసుకోలేదు
- నాడు లాలూను రక్షించడానికి మన్మోహన్‌సింగ్ ఆర్డినెన్సు తెచ్చారు
- దాన్ని ఎందుకు చించేశారో రాహుల్ చెప్పగలరా?


ఏఎన్ఐ ఇంటర్వ్యూలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు జైళ్ల నుంచి ప్రభుత్వాలను నడపవచ్చా? కారాగారాలను కార్యాలయాలుగా మార్చుకొని పీఎం, సీఎం పరిపాలించడం ప్రజాస్వామ్యానికి శోభనిస్తుందా అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. నేతలు జైల్లోఉంటే ఫైళ్లు పట్టుకుని వాటిపై ఆదేశాల కోసం క్యాబినెట్ కార్యదర్శి, ముఖ్యకార్యదర్శులు, డీజీపీలు జైళ్లకు తిరగాలా? ఇలాంటి ప్రజాస్వామ్యాన్ని ప్రపంచం గౌరవిస్తుందా? అని నిలదీశారు. ప్రజా జీవితంలో ఇంతటి సిగ్గుమాలిన పరిస్థితి వస్తుందని రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరన్నారు. జైలుకెళ్లిన ఎంతోమంది నేతలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేశారని, అక్కడినుంచే పరిపాలించే కొత్త సంప్రదాయం అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మంత్రుల నుంచి మొదలైందని విమర్శించారు. వీటిని అరికట్టడానికే.. తీవ్ర నేరాభియోగాలున్న కేసుల్లో జైలుకెళ్లి 30 రోజుల్లోపు బెయిల్ పొందలేక పోయినవారి పదవులు వెంటనే (మిగతా 3లో)

నక్సలిజం మరో 20 ఏళ్లు సాగడానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పే కారణం
మరోసారి ధ్వజమెత్తిన అమిత్‌షా 13లో


జస్టిస్ ఆలోక్ అరాధే


జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలీ

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ పంచోలీ

కొలీజియం సిఫారసు

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయ్ పంచోలీ పేర్లను సిఫారసు చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. సీజేఐతో కలిపి 34 న్యాయమూర్తి పోస్టులున్న సుప్రీంకోర్టులో ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెండు స్థానాల భర్తీకోసం కొలీజియం వీరి పేర్లను ఎంపిక చేసింది. 1964 ఏప్రిల్ 13న జన్మించిన జస్టిస్ ఆలోక్ అరాధే ఇదివరకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. జస్టిస్ పంచోలీ 1968 మే 28న జన్మించారు. ఆయన గత నెల 21నే పట్నా హైకోర్టు సీజే అయ్యారు. వీరిద్దరి నియామకానికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే (మిగతా 3లో)


జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్


జస్టిస్ రమేశ్


జస్టిస్ సుభేందు సామంత

మళ్లీ హైకోర్టుకు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ రమేశ్

- కోల్‌కతా నుంచి జస్టిస్ సుభేందు సామంత సైతం..
- బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు
- హైకోర్టులో 33కు చేరనున్న న్యాయమూర్తుల సంఖ్య

ఈనాడు, అమరావతి: గుజరాత్, అలహాబాద్ హైకోర్టులకు బదిలీపై వెళ్లిన జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ దొనాడి రమేశ్‌లు తిరిగి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (మాతృ హైకోర్టు)కు రానున్నారు. కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ సుభేందు సామంత కూడా ఏపీ హైకోర్టుకు బదిలీ కానున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం (మిగతా 3లో)

ప్రమాదకరంగా 352 వంతెనలు

ఈ కింది చిత్రంలో కనిపిస్తోంది అనకాపల్లి జిల్లాలో వడ్డాది నుంచి నర్సీపట్నం వెళ్లే రహదారిలో పెద్దేరుపై ప్రమాదకరంగా ఉన్న వంతెన. ఐదేళ్ల కిందట మూడు పిల్లర్లు, రెండు స్లాబ్లు దెబ్బతిని కూలిపోయింది. అక్కడ బండరాళ్లు వేయడంతో ప్రమాదకర పరిస్థితుల్లోనే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. దీని పక్కనే రూ.కోటితో తాత్కాలికంగా కాజ్‌వే నిర్మించినప్పటికీ.. పెద్దేరులో ఎగువ నుంచి వరదొచ్చినప్పుడల్లా అది మునిగిపోతోంది. దీంతో పాత శిథిల వంతెనపై నుంచే రాకపోకలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.




- తక్షణం వీటిని పునర్నిర్మించాల్సిందే
- 1,057 వారధులు పాక్షికంగా సురక్షితం కావు
- ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ల తనిఖీల్లో వెలుగులోకి

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రహదారుల్లోని 352 వంతెనలు ప్రమాదకరంగా ఉన్నట్లు, 1,057 వంతెనలు సైతం పాక్షికంగా దెబ్బతిన్నట్లు, 6,609 వంతెనలు సురక్షితంగా ఉన్నట్లు ఇంజినీర్ల తనిఖీల్లో గుర్తించారు. ప్రమాదకరంగా ఉన్న, పాక్షికంగా దెబ్బతిన్న వంతెనలకు వెంటనే మరమ్మతులు చేయాల్సిందేనని తేల్చారు. ఈ ఏడాది జులైలో గుజరాత్‌లో మహిసాగర్ నదిపై ఆర్‌అండ్‌బీ వంతెన కూలిన నేపథ్యంలో.. మన రాష్ట్రంలో రహదారుల్లో వంతెనల పరిస్థితి ఏమిటో తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అన్ని ఆర్‌అండ్‌బీ డివిజన్లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారుల్లోని వంతెనలను ఇంజినీర్లు తనిఖీ చేశారు.

తనిఖీల్లో బయటపడ్డ అంశాలు..

■ 583 వంతెనల పునాదులు బలహీనంగా ఉన్నాయి. ■ 754 వంతెనల్లో (మిగతా 3లో)



మనలోనే ఉన్నాడు బొజ్జ గణపయ్య

మనిషిలోనే దేవుడున్నాడని దృశ్య రూపంలో చూపించినట్లుంది కదూ ఈ చిత్రం! వినాయక చవితి సంబరాల్లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా కలసపాడులోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థినులు గణపయ్య ఆకారంలో కూర్చొని ఆ భక్త సులభుడిని ఆవిష్కరింపజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కలసపాడు

వినాయకచవితి పందిళ్లకు ఉచిత విద్యుత్తు

దుర్గాదేవి మండపాలకూ ఇవ్వాలని నిర్ణయం • మంత్రి నారా లోకేశ్ వెల్లడి

ఈనాడు-అమరావతి, ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వనున్నట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఏర్పాటు చేసే దుర్గాదేవి పందిళ్లకూ ఉచిత విద్యుత్తు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకోసం రూ.25 కోట్లు వెచ్చించనున్నట్లు సోమవారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. 'వినాయకచవితి ఉత్సవ సమితులు, మండపాల నిర్వాహకులకు శుభవార్త. ఉత్సవాలు జరిగే రోజుల్లో (మిగతా 3లో)

ఆందోళన వద్దు.. యూరియా వస్తోంది

- ఒడిశా పోర్టు నుంచి 10,800 టన్నులు కేటాయించిన కేంద్రం
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడి వెల్లడి


2లో

మద్యం ముడుపుల చేరవేతలో చెవిరెడ్డి కీలక సూత్రధారి

- దర్యాప్తు కీలక దశలో ఉంది.. నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దు
- బెయిల్ పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేసిన సిట్

14లో

ఇదీ సంగతి!



గోడ దూకి పార్టీలు మారినంత తేలిక కాదు సార్... మా నుంచి తప్పించుకోవడం!!

50 కి.మీ.లకు ఒక పోర్టు

- వచ్చే ఏడాదికి 4 అందుబాటులోకి తేవాలని లక్ష్యం
- రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధానం
- ఇక మరింత వేగంగా పనులు

ఈనాడు - అమరావతి

నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టుల పనులను వేగంగా పూర్తి చేసి 2026 నాటికి వాటిని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆలోగా పోర్టులను అనుసంధానిస్తూ రోడ్డు, రైలు మార్గాల కనెక్టివిటీ ప్రాజెక్టులను ప్రతిపాదించింది. పొరుగు రాష్ట్రాలకూ పోర్టు సేవలు విస్తరించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనికోసం తెలంగాణ, ఒడిశాల్లో డ్రైపోర్టులు


రామాయపట్నం పోర్టులో సాగుతున్న పనులు

ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి పోర్టులను అనుసంధానించే ప్రతిపాదనలు రూపొందించింది. సముద్ర తీరం వెంట ప్రతి 50 కి.మీ.లకు పోర్టు, ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా.. మొత్తంగా 20 పోర్టులను అందుబాటులోకి తేవాలన్నది ప్రభుత్వ ఆలోచన.

రామాయపట్నం పోర్టు

నిర్మాణ పనులు 69 శాతం పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ పోర్టును వినియోగంలోకి తేవాలన్నది ఆలోచన. అయితే, కేప్ సైజు నౌకల రాకపోకలకు వీలుగా ప్రస్తుతం ప్రతిపాదించిన డ్రెడ్జింగ్‌ను 16 నుంచి 18.5 మీటర్లకు పెంచేందుకు నిర్మాణ సంస్థ చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం అనుమతిస్తే గడువు పొడిగించాల్సి వస్తుంది.

■ మొదటి దశలో 4 బెర్తులు నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం ఒకటి పూర్తయింది.
■ 3.7 కి.మీ. దక్షిణ, 1.35 కి.మీ.మేర ఉత్తర బ్రేక్ వాటర్ పనులు కొనసాగుతున్నాయి.
■ జాతీయ రహదారి-16తో ఉమ్మడి ప్రకాశం జిల్లా చేవూరు జంక్షన్ దగ్గర అనుసంధానం చేస్తారు.

మచిలీపట్నం పోర్టు

■ 2026 నవంబరు నాటికి ఈ పోర్టును పూర్తి చేయాలన్నది లక్ష్యం. ప్రస్తుతం 45.5 శాతం మేర పనులు పూర్తి చేశారు.
■ **మొదటి దశలో:** 4 బెర్తులు.. 16 బెర్తులకు విస్తరించుకోవచ్చు. (మిగతా 3లో)

ఆందోళన వద్దు.. యూరియా వస్తోంది

- ఒడిశా పోర్టు నుంచి 10,800 టన్నులు కేటాయించిన కేంద్రం
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి వెల్లడి



ఈనాడు, అమరావతి: రైతుల అవసరాలకు అనుగుణంగా కేంద్రం నుంచి యూరియా వస్తోందని.. ఎవరూ ఆందోళన పడొద్దని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. యూరియా సరఫరాపై కేంద్రంతో మాట్లాడినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాలోని ధమ్రా పోర్టు నుంచి 10,800 టన్నుల యూరియా రాష్ట్రానికి కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చిందని వివరించారు. యూరియా కోసం ఎదురుచూస్తున్న ప్రాంతాల్లోని రైతులకు వెంటనే దీన్ని పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 6న గంగవరం పోర్టుకు 15,000 టన్నులు, సెప్టెంబరు రెండో వారంలో కాకినాడ పోర్టుకు 30,000 టన్నుల యూరియా సరఫరా చేసేందుకు కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. ఎరువుల కొరత తలెత్తకుండా మార్క్‌ఫెడ్ ద్వారా 1.10 లక్షల టన్నుల బఫర్ నిల్వలు సిద్ధంగా ఉంచామని అచ్చెన్నాయుడు తెలిపారు.

తాత్కాలిక వైకల్యంగా నమోదైన వారికి యథావిధిగా పింఛన్ల కొనసాగింపు


ఈనాడు, అమరావతి: వైకల్యం 40 శాతానికి కంటే ఎక్కువగా ఉండి, సదరం ధ్రువీకరణ పత్రాల్లో తాత్కాలిక వైకల్యంగా నమోదైన వారికి గతంలో మాదిరిగానే ప్రతినెలా పింఛన్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన తనిఖీల్లో కొంత మందికి 40 శాతం వైకల్యం పైబడిన వారి సదరం ధ్రువీకరణ పత్రాల్లో తాత్కాలిక వైకల్యంగా నమోదు చేశారు. వారికి నోటీసులు జారీ చేశారు. ఇలాంటి వారిలో అర్హులుండడంతో వారికి జారీ చేసిన నోటీసుల్ని వెనక్కి తీసుకుని, పింఛన్లను యథావిధిగా కొనసాగించాలని అధికారుల్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది.

నేడు పలు జిల్లాలకు అతిభారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో సోమవారం ఏర్పడాల్సిన అల్పపీడనం ఆలస్యంగా బుధవారం లోపు ఏర్పడొచ్చని ఐఎండీ తెలిపింది. మరోవైపు రాజస్థాన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

ఉచిత బస్సులకు లైవ్ ట్రాకింగ్

- స్త్రీశక్తి పథకం విజయవంతమైంది
- సహకరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు: సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: మహిళల ఉచిత ప్రయాణానికి కేటాయించిన ఐదు రకాల బస్సులకు లైవ్ ట్రాకింగ్ అందుబాటులోకి తీసుకురావాలని, దీనివల్ల అవి ఎప్పుడొస్తాయో తెలుసుకుని, మహిళలు తమ ప్రయాణ సమయాలు ఖరారు చేసుకుంటారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్త్రీశక్తి అమలు చేస్తున్న 8,458 బస్సులను సులువుగా గుర్తించేందుకు వాటి ముందు, వెనుక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పథకం ఎంతో విజయవంతమైందని హర్షం వ్యక్తం చేశారు. స్త్రీశక్తి పథకం అమలు తీరుపై ఆర్టీసీ అధికారులతో సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు.

అవసరముంటేనే ప్రయాణిస్తున్నారు..

'ప్రభుత్వానికి ఆర్థిక భారమైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి, మహిళలకు చేయూతనిచ్చేందుకు స్త్రీశక్తి పథకం ప్రారంభించినట్లు చెప్పాం. దానికి అనుగుణంగానే మహిళలంతా ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకుంటున్నారు. అవసరముంటేనే ప్రయాణిస్తున్నారు. స్త్రీశక్తి విజయవంతానికి సహకరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు. భవిష్యత్‌లోనూ ఇలాగే సహకరించాలని కోరుతున్నా. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఇలాంటి సహకారం లభిస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తాం.

బస్‌పాస్‌ల కోసం నిల్చొనే శ్రమ తప్పింది

★ మన రాష్ట్ర మహిళల్లో చైతన్యం ఎక్కువ. ఎలాంటి పథకాన్ని అయినా అందిపుచ్చుకొని అభివృద్ధి చెందుతారు.

★ ఉమ్మడి రాష్ట్ర సీఎంగా డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాం. ఇప్పుడు స్త్రీశక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాం.

★ గతంలో బాలికల విద్యను ప్రోత్సహించేందుకు వాళ్లకు సైకిళ్లు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థినులు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని కానుక అందజేశాం.

★ విద్యార్థినులు బస్‌పాస్‌ల కోసం వరుసలో నిల్చొనే శ్రమ తప్పింది. బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుంది' అని సీఎం పేర్కొన్నారు.

13 జిల్లాల్లో నూరు శాతం ఆక్యుపెన్సీ

స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో ఆ బస్సుల్లో సీట్ల కోసం పోటీపడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా? ఆక్యుపెన్సీ రేషియో ఎంత పెరిగిందని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. సీట్ల కోసం ఇబ్బందులు, గందరగోళం వంటి ఘటనలు ఎక్కడా లేవని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వివరించారు.

★ గతంలో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 68-70 శాతం ఉండగా, ప్రస్తుతం 60 డిపోల పరిధిలో 100 శాతం వస్తోందని తెలిపారు. 13 జిల్లాల్లో నూరు శాతం ఓఆర్‌తో బస్సులు తిరుగుతున్నాయన్నారు.

★ గతంలో 40 శాతం మహిళా ప్రయాణికులుంటే, 60 శాతం పురుషులు ప్రయాణించేవారని, ఇప్పుడు మహిళలు 65 శాతానికి పెరిగారని ఎండీ వెల్లడించారు.

★ స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్న బస్సులన్నింటికి లైవ్ ట్రాకింగ్ విధానం ఎప్పటికి అమల్లోకి తీసుకొస్తారని సీఎం ప్రశ్నించారు. గుంటూరు డిపోలోని అన్ని స్త్రీశక్తి బస్సులకు రెండు, మూడు రోజుల్లో లైవ్ ట్రాకింగ్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ఆరంభిస్తామని ఎండీ చెప్పారు. తర్వాత రాష్ట్రమంతా అమలు చేస్తామన్నారు.

★ ఈ సమీక్షలో రెండు బస్సులు కలిపి ఉండే (ఆర్టిక్యులేటెడ్) ఈ-బస్సులపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రద్దీ ఉండే రూట్లలో ఇటువంటి బస్సులను నడిపితే ఒకేసారి 100-120 మంది ప్రయాణించేందుకు వీలుంటుందని చెప్పారు.

నిండు కుండల్లా జలాశయాలు

ఇప్పటికే ఆయకట్టుకు 130 టీఎంసీల నీటి సరఫరా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అన్ని జలాశయాలు 80% మేర నిండాయి. కృష్ణా, గోదావరి, వంశధార నదుల కింద ఆయకట్టుకు ఇప్పటికే 130 టీఎంసీల నీటిని అందించారు. కృష్ణా జలాలను పోలిరెడ్డిపాడు, హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకాలకు పంపింగ్ చేస్తున్నారు. నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి 156 టీఎంసీల నీటిని ఆయకట్టుకు, తాగునీటి అవసరాలకు మళ్లించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సమర్థ నీటి నిర్వహణ వల్లే ఇలా నీటి తరలింపు, జలాశయాలు నింపడం సాధ్యమైందని ప్రభుత్వం వెల్లడించింది.

ఆగస్టు 24 వరకు..

★ కృష్ణా డెల్టాలో నీటి వినియోగం: 52 టీఎంసీలు

★ గోదావరి డెల్టాలో: 70 టీఎంసీలు

★ వంశధార కాలువలకు: 8 టీఎంసీలు

★ గతేడాదితో పోలిస్తే కృష్ణా డెల్టాలో ఈ ఏడాది అదనంగా 12 టీఎంసీల వినియోగం.

★ ప్రధాన జలాశయాల్లో మొత్తం నీటి నిల్వ: [illegible] టీఎంసీలు

★ సముద్రంలో కలిసిన నీళ్లు: 1,969 టీఎంసీలు (కృష్ణా, గోదావరి, వంశధార నదుల ద్వారా)

★ హంద్రీ-నీవా కాల్వల ద్వారా కృష్ణా వరద జలాలు 718 కి.మీ ప్రయాణించి కుప్పం బ్రాంచి కాల్వకు చేరుకున్నాయి.

నాడు.. సినిమా సెట్టింగును మరిపించేలా జగన్ మాయ!

- నేడు కృష్ణా జలాల విడుదలతో సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు

కుప్పం, న్యూస్‌టుడే, ఈనాడు, చిత్తూరు: 'చంద్రబాబు నియోజకవర్గం.. కుప్పానికి మా హయాంలోనే హంద్రీ-నీవా జలాలను ఇచ్చాం.. వైనాట్ కుప్పం' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన నాటి సీఎం జగన్ మాయ మాటలు.. చేతలను ఇక్కడి ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదు. 2014-19 మధ్య తెదేపా పాలనలో హంద్రీ-నీవా కాలువ పనులను 87 శాతం పూర్తి చేయగా.. అనంతరం వచ్చిన వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో కుప్పంపై కేవలం కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్యం ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంలో పట్టు సాధించాలన్న ఆలోచనతో ఎన్నికలకు కొన్ని నెలల ముందు కాలువ ముగింపు దశ పనుల పేరుతో దాదాపు రూ.వంద కోట్లను ఖర్చు చేశామని ప్రచారం చేశారు. ఆఖరికి నాసిరకం నిర్మాణాలతో ఎక్కడి పనులు అక్కడే వదిలిపెట్టారు.



2023లో జగన్ పర్యటనలో రాజుపేట సమీప హంద్రీ-నీవా కాలువలో నిల్వ చేసిన నీళ్లు



ప్రస్తుతం..రాజుపేట వద్ద ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

సినిమా సెట్టింగులా కాలువలో నీటి విడుదల

ఎన్నికలకు ముందు.. 2023లో జగన్ కుప్పంలో పర్యటించారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువలో నిల్వ చేసిన నీటిని గేటు బటన్ నొక్కి విడుదల చేశారు. శాంతిపురం వద్ద బహిరంగ సభ నుంచి ఆయన తిరుగుముఖం పట్టాగానే సినిమా సెట్టింగులా ఏర్పాటు చేసిన గేట్లను గుత్తేదారులు తీసుకెళ్లిపోయేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. కనీసం పది కి.మీ. కూడా కాలువలో నీరు ప్రవహించకుండానే వారం రోజులకే ఎండిపోయింది.



నాడు.. జగన్ పర్యటనలో ఏర్పాటు చేసిన గేటును పరిశీలిస్తున్న చంద్రబాబు

యుద్ధప్రాతిపదికన పూర్తి..

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే హంద్రీ-నీవా కాలువ ముగింపు దశ పనులు పూర్తి చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆయన వాగ్దానం చేసిన విధంగానే కూటమి పాలనలో కుప్పానికి కృష్ణా జలాలను తీసుకొచ్చారు. కుప్పం బ్రాంచి కాలువ ముగింపు దశ పనుల్లో ప్రధానంగా ఆర్వైపైలు.. అడుగు భాగంలో సిమెంట్ పనులను వేగవంతం చేయించారు. దాదాపు 92 కి.మీ. పరిధి కాలువ గట్టు కాంక్రీటు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారులను పరుగులు పెట్టించారు. కృష్ణా జలాలు ఆదివారం కుప్పం నియోజకవర్గానికి చేరాయి. దశాబ్దాల తరబడి తీరని సమస్యకు సీఎం చంద్రబాబు చొరవతో శాశ్వత పరిష్కారం లభించడం పట్ల నియోజకవర్గ ప్రజలు.. రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

26–8–2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, భాద్రపద మాసం, శుక్లపక్షం

తదియ: మ. 12-36 తదుపరి చవితి

హస్త: తె. 5-46 తదుపరి చిత్త

వర్జ్యం: మ. 1-00 నుంచి 2-45 వరకు

అమృత ఘడియలు: రా.11-19 నుంచి 1-02 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-17 నుంచి 9-07 వరకు తిరిగి రా. 10-53 నుంచి 11-36 వరకు

రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు

సూర్యోదయం: ఉ.5.48; సూర్యాస్తమయం: సా.6.17

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	40.0	26.0
ఒంగోలు	35.8	28.0
విజయవాడ	35.5	26.8
నరసాపురం	35.0	27.5
కడప	35.0	24.0
తిరుపతి	34.2	25.1
గుంటూరు	34.0	28.0
నెల్లూరు	33.8	28.1
అనంతపురం	33.3	24.2
కర్నూలు	33.2	23.6
విశాఖపట్నం	32.4	27.0
తాడేపల్లిగూడెం	31.1	27.0
విజయనగరం	28.0	25.0

ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు అవకాశాలు

- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్
- పలు పరిశ్రమలకు ఈఈపీసీ అవార్డుల ప్రదానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్. వేదికపై రాజగోపాలరావు, ఆదిప్ మిశ్రా, అభిషిక్త్ కిషోర్, ఆకాశ్ షా, రమణ్ రఘు, శశి లూయిస్

విజయవాడ(పటమట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న నూతన పారిశ్రామిక విధానం వల్ల మన ప్రాంతం నుంచి ఇంజినీరింగ్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ నోవోటెల్ హోటల్‌లో సోమవారం కేంద్ర వాణిజ్య పరిశ్రమ మంత్రిత్వ శాఖ, ఇంజినీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఈఈపీసీ) ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి అత్యుత్తమ పనితీరు, ఎక్కువ ఎగుమతులు చేసిన ఇంజినీరింగ్ ఉత్పత్తుల పరిశ్రమలకు అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులు అందజేశారు. లార్జ్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ (చెన్నై) 2021-22, 2022-23 సంవత్సరాలకు గాను గోల్డ్ ట్రోఫీ అందుకుంది. మీడియం ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో థర్మోప్యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) 2021-22 సంవత్సరానికి, ఐజీపీ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (చెన్నై) 2022-23 ఏడాది గాను గోల్డ్ ట్రోఫీ అవార్డులు అందుకున్నాయి. వాటితో పాటు 91 కంపెనీలకు వివిధ విభాగాల్లో అవార్డులు ప్రదానం చేశారు. మంత్రి మాట్లాడుతూ... భారతదేశం నుంచి 2024-25 ఏడాదిలో జరిగిన మొత్తం ఎగుమతుల్లో 26 శాతం ఇంజినీరింగ్ ఉత్పత్తులే ఉన్నాయని, అందులో దక్షిణాది రాష్ట్రాల నుంచే 32 శాతం ఉండడం అభినందనీయమని అన్నారు. ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ అభిషిక్త్ కిషోర్, ఈఈపీసీ ఇండియా రీజనల్ ఛైర్మన్ రమణ్ రఘు, వైస్ ఛైర్మన్ ఆకాశ్‌షా, డిప్యూటీ రీజనల్ ఛైర్మన్ శశి లూయిస్, రీజనల్ డైరెక్టర్ రాజగోపాలరావు, సెక్రటరీ ఆదిప్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణలు చెప్పకుంటే పరువునష్టం దావా వేస్తా

- మంత్రి సంధ్యారాణి



విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: తనపై పని కట్టుకొని ఒక ఛానల్ దుష్ప్రచారం చేస్తోందని తక్షణమే క్షమాపణలు చెప్పకుంటే పరువు నష్టం దావా వేస్తానని, జాతీయ ఎస్టీ కమిషన్‌లో సైతం ఫిర్యాదు చేస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. విశాఖలో సోమవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కార్యకర్త నుంచి మంత్రి స్థాయికి ఎదిగానని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలు చేస్తుంటే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తన కుమార్తె పుట్టినరోజు వేడుకలు విజయవాడలో నిర్వహిస్తే తిరుపతిలో చేసి చిందులు వేసినట్లు తప్పుడు కథనాలు ప్రసారం చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను అంటిపెట్టుకొని ఉన్న ఛానల్స్ ఆధారాలు లేకుండా కథనాలు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నా శాఖలో అవినీతి చేసి ఒక అధికారి అనిశాకు పట్టుబడితే నాపై తప్పుడు వార్తలు రాయడమేమిటని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ శాఖలో ఇంజినీరింగ్ అధికారి అక్రమాలపై విచారణ జరుపుతామని, ఆయా అంశాలపై దృష్టి పెట్టామని మంత్రి పేర్కొన్నారు.

మళ్లీ కేంద్ర సర్వీసులకు లవ్ అగర్వాల్, అనిల్‌కుమార్ సింఘాల్

ఈనాడు, దిల్లీ: కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ అదనపు కార్యదర్శిగా 1996 బ్యాచ్ ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి లవ్ అగర్వాల్ నియమితులయ్యారు. ప్రస్తుతం దిల్లీలోని ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ఉన్న ఆయన కేంద్ర సర్వీసులకు బదిలీ అయ్యారు. అలాగే 1993 బ్యాచ్ ఏపీ కేడర్‌కు చెందిన మరో సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్ సింఘాల్ అదనపు కార్యదర్శి హోదాలో కేంద్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ రెయిన్‌ఫెడ్ ఏరియా అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో లవ్ అగర్వాల్ కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ, అనిల్ సింఘాల్ విద్యా శాఖల్లో అదనపు కార్యదర్శి హోదాల్లో పనిచేసి రాష్ట్ర సర్వీసులకు వచ్చారు. ఇప్పుడు మళ్లీ వీరిద్దరూ కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం సోమవారం మొత్తం 15 మంది అదనపు కార్యదర్శి స్థాయి అధికారులను బదిలీ చేసింది. కేంద్ర పాడి, పశుసంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శిగా ఏపీకి చెందిన కె.గురుమూర్తి నియమితులయ్యారు. ఈయన సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ అధికారి. ఇదివరకు కర్నూలులోని ట్రిపుల్ ఐటీడీఎం రిజిస్ట్రార్‌గా పనిచేశారు.

ఏపీఎన్ఆర్టీఎస్ సీఈవోగా పి.కృష్ణమోహన్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్టీఎస్) సీఈవోగా విశ్రాంత అధికారి పి.కృష్ణమోహన్‌ను ఒప్పంద ప్రాతిపదికన ప్రభుత్వం నియమించింది. ఏడాదిపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ కాలంలో నెలకు రూ.2 లక్షల చొప్పున వేతనం చెల్లిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ పదవిలో కొనసాగుతున్న పి.హేమలతారాణిని మాతృశాఖ గిరిజన సంక్షేమశాఖకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భూగర్భ జల పర్యవేక్షణ పరికరాలకు రూ.27.66 కోట్లు

ఈనాడు, అమరావతి: రియల్‌టైమ్ భూగర్భ జల పర్యవేక్షణలో భాగంగా టెలిమెట్రీ విధానంలో పనిచేసే 1379 డిజిటల్ వాటర్ లెవెల్ రికార్డర్లు, 30 డేటా రిట్రీవల్ సిస్టమ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.27.66 కోట్లు మంజూరు చేసింది.

నర్సింగ్ కోర్సు ప్రవేశాల్లో సంస్కరణలు

మేనేజ్‌మెంట్ కోటాకు వెబ్ కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: బీఎస్సీ నర్సింగ్ కోర్సు ప్రవేశాల్లో ప్రతిభకు ప్రాధాన్యం ఇచ్చేలా పలు సంస్కరణలను ఈ ఏడాది నుంచి అమల్లోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష అనంతరం 1998, 2003లో జారీచేసిన ఉత్తర్వుల్లో మార్పులు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఇప్పటివరకు నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా, ఇంటర్మీడియట్ మార్కుల ప్రాతిపదికన ప్రవేశాలు జరిగేవి. బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ఈ ఏడాది జులైలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీఎన్‌సెట్)ను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించింది. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలు జరుగుతాయి. ఇప్పటివరకు ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించేది. మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలను ఆయా కళాశాల యాజమాన్యాలు నిర్వహించేవి. దీంతో ప్రతిభ లేని విద్యార్థులకు, ఇతర రాష్ట్రాల వారికి మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు దక్కేవన్న ఆరోపణలు వినిపించేవి. ఇకపై ప్రభుత్వ ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాతో పాటే మేనేజ్‌మెంట్ కోటాలోనూ ప్రవేశాలు... ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ సీట్లను కూడా ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేస్తారు. విశ్వవిద్యాలయం నియమించే సెలక్షన్ కమిటీ.. ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులనే మేనేజ్‌మెంట్ సీట్లలో చేర్చుకోవాల్సి ఉంటుంది. సాధారణ తరగతుల వారికి (అన్ రిజర్వుడు) ఏపీఎన్‌సెట్‌లో 50 పర్సంటైల్ ఉండాలి. ఈ క్యాటగిరీకి చెందిన దివ్యాంగులకు 45 పర్సంటైల్ ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతుల వారు, ఈ తరగతుల్లోని దివ్యాంగులకు 40 పర్సంటైల్ ఉండాలి. కన్వీనర్ కోటా ప్రవేశాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయి. మేనేజ్‌మెంట్ కోటాలో వర్తించవు. ప్రవేశాలకు కౌన్సిలింగ్ తేదీలు త్వరలో ప్రకటిస్తారు.

దేశంలోనే తొలి స్మార్ట్ వర్సిటీగా అనంతపురం కేంద్రీయ విశ్వవిద్యాలయం



పాఠాల బోధనకు తరగతిలో ఏర్పాటు చేసిన డిజిటల్ తెర

ఈనాడు, అనంతపురం-న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం జంతులూరులో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం దేశంలోనే తొలి స్మార్ట్ వర్సిటీగా నిలిచింది. ఈ విషయాన్ని వర్సిటీ వీసీ ఎస్‌ఏ. కోరి సోమవారం వెల్లడించారు. వర్సిటీ ప్రాంగణం, తరగతి గదులు, వసతి గృహాల్లో అత్యాధునిక వసతులు సమకూర్చామని, వీటిని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇటీవల వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. ఇక్కడ తొమ్మిది యూజీ, పదిహేడు పీజీ, ఆరు పీహెచ్‌డీ కోర్సులుండగా.. 23 రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారని వివరించారు.

‘జన ఔషధి’ స్టోర్లతో బీసీలకు ఉపాధి

1.63 కోట్ల కుటుంబాలకు వైద్య బీమా

‘ఆరోగ్య రథం’తో సంచార వైద్యసేవలు.. ఉచిత పరీక్షలు

అమరావతిలో నేచురోపతి వర్సిటీ

వైద్యారోగ్య శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పేదలపై భారం తగ్గేలా, ప్రతి మండలంలో జనరిక్ ఔషధాలు లభ్యమయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను సూచించారు. జన ఔషధి స్టోర్లు పెట్టేందుకు బీసీ కార్పొరేషన్ నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో సీఎం సోమవారం సమీక్షించారు. రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మెరుగు, ఆరోగ్య బీమాలో మార్పులు, కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, ఉచిత వైద్య పరీక్షలు, యోగా- నేచురోపతి సేవల విస్తరణపై పలు సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోనిలో నిర్మిస్తున్న వైద్య కళాశాలల పురోగతిపై చర్చించారు. డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాల ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు మూడు పడకలు ఉండాలని, ఆ లెక్కన రాష్ట్రంలో మరో 12,756 పడకలు అవసరమని పేర్కొన్నారు. యోగా, నేచురోపతిని ప్రోత్సహించేలా ‘యోగా ప్రచార పరిషత్’ నెలకొల్పాలని సీఎం ఆదేశించారు. మూడు రీజినల్ స్టడీ సెంటర్లలో 64 మంది సభ్యులను నియమించేందుకు అనుమతిచ్చారు. అమరావతిలో నేచురోపతి విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని చంద్రబాబు సూచించారు.



వైద్యారోగ్య శాఖ అధికారులతో జరిగిన సమీక్షలో కిట్‌లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రూ.25 లక్షల వరకు వైద్య బీమా

ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకు వైద్య బీమా అందించే అంశంపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. ప్రస్తుత విధానంలో 1.43 కోట్ల కుటుంబాలకు మాత్రమే లబ్ధి కలుగుతోందని, దీన్ని 1.63 కోట్ల కుటుంబాలకు వర్తించేలా విస్తరించాలని సూచించారు. వైద్య బీమా అమలైతే 5.02 కోట్ల మందికి ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు.

■ ప్రతి గ్రామంలో ‘ఆరోగ్య రథం’ ద్వారా సంచార వైద్యసేవలు అందించాలని సీఎం సూచించారు. 108 వాహనాల సిబ్బందికి యూనిఫామ్ అమల్లోకి తేవాలన్నారు. త్వరలో ప్రారంభించే ‘ఎన్టీఆర్ బేబీ కిట్’ పథకంలో ఇవ్వనున్న నమూనా కిట్లను సీఎం పరిశీలించారు.

■ రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించే క్రమంలో కుప్పం నియోజకవర్గంలో చేపట్టిన ఉచిత వైద్య పరీక్షల పైలెట్ ప్రాజెక్టును 45 రోజుల్లో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. కుప్పం, శాంతిపురం, రామకుప్పంతో పాటు మరికొన్ని చోట్ల ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని, నమూనాల సేకరణకు బృందాలు పెంచాలని సూచించారు.

మోడల్ ఇన్‌క్లూజివ్ సిటీగా అమరావతి

పెర్కిన్స్ ఇండియా, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఉమ్మడిగా అమరావతిలో ‘మోడల్ ఇన్‌క్లూజివ్ సిటీ’ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. ఆ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం కలిసి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర విద్య, సమాన హక్కులు, అందరికీ అందుబాటులో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. బారియర్ ఫ్రీ పబ్లిక్ స్పేస్, ఇన్‌క్లూజివ్ రోడ్ డిజైన్, ప్రజారవాణా సౌకర్యాల రూపకల్పన, డిజిటల్ స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ మోడల్ స్కూల్ ప్రోగ్రామ్స్ ద్వారా పిల్లలు తమ సహచరులతో సమానంగా నేర్చుకునే వాతావరణం కల్పిస్తామని, ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని వారికి సూచించారు.



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఐఐటీ, నిట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులతో ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, అధికారులు

ప్రపంచంతో పోటీ పడండి

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ-నీట్ సెంటర్లలో 356 మంది కోచింగ్ తీసుకోగా 55 మంది అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారితో మాట్లాడారు. మరింతగా కష్టపడి ఉన్నత చదువుల్లోనూ మంచి ప్రతిభ కనబరచాలన్నారు. భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

వచ్చే ఏడాది నాలుగు రెట్లు పెరగాలి..

రాష్ట్రంలోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదని చంద్రబాబు అన్నారు. వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా ఉందని చెప్పారు. ఇందుకు ఇప్పుడున్న 55 మందే నిదర్శనమన్నారు. ‘సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాది నాలుగు రెట్లు పెరగాలి. ఇప్పుడు ర్యాంకులు సాధించిన వారు తాము చదువుకున్న విద్యాసంస్థలకు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలి’ అని సీఎం సూచించారు. అనంతరం 55 మందికీ రూ.లక్ష చొప్పున చెక్కు, జ్ఞాపికను అందించారు. వారితో విడివిడిగా ఫొటోలు దిగి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, అధికారులు పాల్గొన్నారు.

వరద ప్రవాహాలతో ప్రాజెక్టులన్నీ నింపండి

రాయలసీమలో చెరువులన్నీ కళకళలాడాలి: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కృష్ణా, గోదావరి నదుల్లో ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని, వాటితో ప్రాజెక్టులన్నీ నింపాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సముద్రంలోకి పోతున్న నీటిని కాల్వలకు మళ్లించి, రాష్ట్రంలో చెరువులను నింపేలా ప్రణాళికలు అమలు చేయాలని, ప్రత్యేకించి రాయలసీమలోని చెరువులన్నీ వెంటనే నింపేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో జలవనరుల శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు.

■ సముద్రంలోకి వృథాగా నీళ్లు పోతుంటే బాధ కలుగుతోంది.

■ వరద నీటిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది.

■ ప్రధాన కాల్వల నుంచి ఫీడర్ కాలువలకు ఉండే అడ్డంకులన్నీ సరిచేసి, నీటిని సరఫరా చేస్తే ప్రజలకు మేలు కలుగుతుంది.

■ కుప్పం వరకు నీరు తీసుకెళ్లినట్లే.. మిగిలిన ప్రాంతాలకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోండి.

■ ప్రస్తుతం హంద్రీ-నీవా ప్రధాన కాల్వ నుంచి రాయలసీమ జిల్లాలకు నీరందుతోంది. సోమశిల, కండలేరు రిజర్వాయర్లను త్వరగా నింపాలి.

■ కుప్పం, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె పరిధిలోని చెరువులన్నింటినీ ఈ నీటితో నింపాలి.

■ జీడిపల్లి నుంచి పీఏబీఆర్‌కు, అక్కడి నుంచి నీటిని పంపి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నింపాలి.

బ్లూప్రింట్ సిద్ధం చేయండి

■ గాలేరు-నగరి ద్వారా కడపకు, పేరూరు- భైరవానితిప్ప ప్రాజెక్ట్ (బీటీపీ) ద్వారా హిందూపురానికి, అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు వరకు నీరు తీసుకెళ్లేందుకు ఏం చేయాలనేదానిపై బ్లూప్రింట్ సిద్ధం చేయాలి.

■ పోలవరం ఎడమ కాల్వ పనులు గడువులోగా పూర్తికావాలి. నిధులకు ఇబ్బంది లేదు.

■ వంశధార-నాగావళి, చంపావతి నదుల అనుసంధానం కోసం ఏయే పనులు చేయాలో గుర్తించండి’ అని సీఎం ఆదేశించారు. సమీక్షలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ రేషన్ కార్డు అందజేస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, కలెక్టర్ లక్ష్మీశ

సాంకేతికతతో రేషన్ దుర్వినియోగానికి అడ్డుకట్ట

(మొదటి పేజీ తరువాయి)

చేరుతుందని మనోహర్ తెలియజేశారు. రాష్ట్రంలోని 1.46 కోట్ల కుటుంబాలకు సెప్టెంబరు 15 కల్లా స్మార్ట్‌కార్డులు అందిస్తామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో రేషన్ దుకాణాల ద్వారా గోధుమలు పంపిణీ చేస్తామని, డీలర్ల వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 29,797 రేషన్ దుకాణాలుండగా, ప్రజల అవసరాల దృష్ట్యా వాటి సంఖ్య పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. దీనిపై అధ్యయనం చేసి, అవసరమైన ప్రాంతాల్లో సబ్ డిపోల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు.

మళ్లీ హైకోర్టుకు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ రమేశ్

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం సమావేశమై వివిధ హైకోర్టులకు చెందిన మొత్తం 14 మంది న్యాయమూర్తులను బదిలీ చేయాలని కేంద్రానికి సిఫారసు చేసింది. ఈ సిఫారసులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులకుగాను ప్రస్తుతం 30 మంది పనిచేస్తున్నారు. తాజాగా రానున్న ముగ్గురితో న్యాయమూర్తుల సంఖ్య 33కు చేరనుంది.

జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్

జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ స్వస్థలం ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురం. వ్యవసాయ కుటుంబం. చీకటి నరహరిరావు, విజయలక్ష్మి దంపతులకు 1964 మే 21న జన్మించారు. విశాఖలోని సెయింట్ అలోసియస్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్య, ఎన్వీపీ న్యాయకళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. తాత చీకటి పరశురాంనాయుడు రైతు పక్షపాతి. ఆయన న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా సేవలందించారు. 1980లో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ 2002లో జిల్లా జడ్జి క్యాడర్‌లో ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో న్యాయసేవలు అందించారు. 2015 జులై నుంచి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీ)గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి హైకోర్టు విభజన సమయంలో ఆర్‌జీగా కీలకపాత్ర పోషించారు. 2019 జూన్ 12న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. గుజరాత్ హైకోర్టుకు బదిలీపై వెళ్లి 2023 నవంబర్ 2న అక్కడ బాధ్యతలు స్వీకరించారు.

జస్టిస్ దొనాడి రమేశ్

జస్టిస్ రమేశ్ స్వస్థలం ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లె దగ్గర్లోని కమ్మపల్లి. అన్నపూర్ణమ్మ, నారాయణనాయుడు దంపతులకు 1965 జూన్ 27న జన్మించారు. నారాయణనాయుడు పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్‌గా పనిచేశారు. జస్టిస్ రమేశ్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల నుంచి డిగ్రీ పూర్తి చేశారు. నెల్లూరు వీఆర్ లా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఏపీ బార్ కౌన్సిల్‌లో 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ప్రభుత్వ న్యాయవాది (జీపీ)గా నియమితులై 2000 డిసెంబర్ నుంచి 2004 వరకు సేవలందించారు. ఏపీ సర్వశిక్ష అభియాన్‌కు స్టాండింగ్ కౌన్సెల్‌గా 2013 వరకు పనిచేశారు. 2014 నుంచి 2019 మే వరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ)గా బాధ్యతలు నిర్వర్తించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై 2020 జనవరి 13న బాధ్యతలు స్వీకరించారు. 2023 జులై 24న అలహాబాద్ హైకోర్టుకు బదిలీపై వెళ్లారు.

జస్టిస్ సుభేందు సామంత

పశ్చిమబెంగాల్‌కు చెందిన జస్టిస్ సుభేందు సామంత 1971 నవంబర్ 25న జన్మించారు. తమ్లుక్‌లోని హామిల్టన్, తూర్పు మేదినిపూర్‌లోని పరమానందపూర్ జగన్నాథ్ ఇన్‌స్టిట్యూట్‌లో పాఠశాల విద్య చదివారు. కోల్‌కతా యూనివర్సిటీ హాజ్రా క్యాంపస్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. తమ్లుక్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. న్యాయాధికారుల నియామక పరీక్ష రాసి ఎంపికయ్యారు. పశ్చిమ మేదినిపూర్‌లో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జిగా, కోల్‌కతాలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జిగా పనిచేశారు. అండమాన్ నికోబార్‌లో జిల్లా సెషన్స్ జడ్జిగా బాధ్యతలు నిర్వహించారు. బీర్‌భూం, నదియా జిల్లాలకు జిల్లా, సెషన్స్ జడ్జిగా పనిచేశారు. కోల్‌కతా సిటీ సెషన్స్ కోర్ట్ చీఫ్ జడ్జిగా పనిచేశారు. కోల్‌కతా హైకోర్టు అదనపు జడ్జిగా 2022 మే 18న నియమితులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 28న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ పంచోలీ

(మొదటి పేజీ తరువాయి)

సీనియారిటీ పరంగా జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ తర్వాత జస్టిస్ పంచోలీ 3.10.2031న సీజేఐగా బాధ్యతలు స్వీకరించి 27.5.2033 వరకు ఆ స్థానంలో కొనసాగే వీలుంటుంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఆరుగురు న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఆ స్థానాల్లో ఐదుగురు నియమితులయ్యారు. ఇప్పుడు కొత్తగా ఇద్దరి పేర్లను కొలీజియం సిఫార్సు చేసింది.

పీఎం, సీఎంలు జైళ్లనుంచి పాలిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

పోయేలా బిల్లు తెచ్చామని చెప్పారు. సోమవారం ఏఎన్‌ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

ఒకవ్యక్తి జైలుకెళ్తే ప్రభుత్వాలేమీ కూలవు

ఏదైనా బిల్లును పార్లమెంటు ముందుకు తెచ్చేటప్పుడు ప్రతిపక్షాలు ఎందుకు వ్యతిరేకించాలి? అలా ప్రయత్నించడం మంచిదా? అది ప్రజాస్వామ్యమా? పార్లమెంటు ఉన్నది గొడవల కోసమా? దేశంలో ఎన్డీయే ముఖ్యమంత్రుల సంఖ్య ఎక్కువ. అందువల్ల ఈ బిల్లు విపక్షాల ముఖ్యమంత్రుల కోసమేననే ప్రశ్న ఉత్పన్నం కాదు. ఎన్డీయే ముఖ్యమంత్రులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదుకావన్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించడమే.

మంత్రులు, ముఖ్యమంత్రులపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదుచేస్తే హైకోర్టులు, సుప్రీంకోర్టు చూస్తూ కూర్చోవు. బెయిల్ రాకపోతేనే పదవి వదులుకోవాల్సి వస్తుంది. కేసు కారణంగా ముఖ్యమంత్రి తన పదవి కోల్పోయినా వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీకి సభలో మెజార్టీ ఉంటుంది కాబట్టి ప్రభుత్వం కొనసాగుతుంది. ఒకవ్యక్తి జైలుకెళ్లినంత మాత్రాన ప్రభుత్వాలేమీ కూలవు. అయిదేళ్లకు మించి శిక్షపడటానికి అవకాశం ఉన్న తీవ్రమైన కేసుల్లోనే పదవి నుంచి దిగాల్సి వస్తుంది తప్పితే చిన్నచిన్న ఆరోపణలతో కాదు.

ఉపశమనం లభిస్తే పునరుద్ధరణ

ప్రజాప్రతినిధికి ఏదైనా కేసులో రెండేళ్లకు మించి శిక్ష పడితే వారి పదవి దానంతట అదే రద్దవుతుంది. ఉన్నత న్యాయస్థానాల్లో ఉపశమనం లభిస్తే సభ్యత్వ పునరుద్ధరణ జరుగుతుంది. ఆప్ చెప్పే అబద్ధాలు నమ్మొద్దు. ఎంతోమంది మంత్రులు, ముఖ్యమంత్రులు రాజీనామా చేసిన తర్వాతే జైలుకుపోయారు. రాజీనామా చేయకుండా పదవుల్లో కొనసాగే పోకడ ఇప్పుడే ప్రారంభమైంది. దిల్లీ ముఖ్యమంత్రి, మంత్రులు, తమిళనాడు మంత్రులు ఈ కొత్త సంస్కృతికి నాంది పలికారు.

బెయిల్ ఆలస్యం కాదు

కొత్త చట్టం వచ్చాక నేతల బెయిళ్లలో జాప్యం జరగదు. ప్రజాప్రతినిధిని పదవి నుంచి తొలగించే నిబంధన ఉన్నందున కోర్టులు వెంటనే జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. అవును.. కాదు అనేది వేగంగా తేలుతుంది. 30 రోజుల తర్వాత నేతలకు పదవి పోతుంది కాబట్టి వారికి బెయిల్ ఇవ్వాలా? వద్దా? అన్నది ఆ గడువుకు ముందే నిర్ణయిస్తాయి. ఇదివరకే ఈ చట్టం అమల్లోకి వచ్చి ఉంటే అరవింద్ కేజ్రీవాల్ జైలుకు వెళ్లిన వెంటనే రాజీనామా చేయాల్సి వచ్చేది. బయటికొచ్చిన తర్వాత ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో చివరకు నైతికత ఆధారంగా రాజీనామాచేసి ఆతిశీని ముఖ్యమంత్రిని చేయాల్సి వచ్చింది. ఇప్పుడు మేం దానికి బదులుగా చట్టం తీసుకొస్తున్నాం. జైల్లో ఉండి ఎవ్వరూ ప్రభుత్వాన్ని నడపకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఆడ్వాణీ, యడ్యూరప్ప, జార్జి ఫెర్నాండెజ్‌లాంటివాళ్లు నైతికత ఆధారంగా రాజీనామాలు చేశారు. వీరెవ్వరూ జైలునుంచి పరిపాలించలేదు. ప్రభుత్వాల ఇష్టానుసారం ఎవర్నీ జైల్లో వేయడం కుదరదు. ఆధారాలు లేకపోతే కోర్టులు వెంటనే జోక్యం చేసుకుంటాయి.

మళ్లీ పదవి పొందవచ్చు

బెయిల్ పిటిషన్లు కోర్టుల్లో సుదీర్ఘకాలం సాగవు. నా కేసు (సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్) తప్పితే ఇతర ఏ బెయిల్ కేసూ సుప్రీంకోర్టులో అయిదు రోజులకు మించి సాగలేదు. బెయిల్ పొందిన వెంటనే నాయకులు తమ పదవులు స్వీకరించొచ్చు. జైల్లో ఉన్నప్పుడు మాత్రమే అక్కడినుంచి పాలన కొనసాగించడానికి వీల్లేదన్నదే బిల్లు ప్రధానోద్దేశం. 30 రోజులకు బదులు 40 రోజులకు బెయిల్ వస్తే 41వ రోజు మళ్లీ పదవి పొందొచ్చు. అభద్రతకు గురికావాల్సిన అవసరంలేదు. ప్రాథమిక విచారణ, ఎఫ్‌ఐఆర్ నమోదు, సమన్ల జారీ, విచారణలాంటి ఏ దశలోనైనా కోర్టుల నుంచి స్టే తెచ్చుకోవచ్చు. అరెస్టయిన వెంటనే బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అవినీతిలో పీకల్లోతు మునిగితే జైలుకెళ్లాల్సి ఉంటుంది.

అవినీతిపరుల్ని కౌగిలించుకుంటున్న రాహుల్



కేంద్రంలో యూపీయే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న లాలూప్రసాద్ యాదవ్‌కు శిక్ష పడినప్పుడు ఆయన సభ్యత్వం కోల్పోకుండా చేయడానికి నాటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆర్డినెన్సు తెచ్చింది. రాహుల్ గాంధీ విలేకర్ల సమావేశంలో దానిని చించేశారు. కాంగ్రెస్ ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయాన్నే నాడు నైతికత ఆధారంగా ఎగతాళి చేశారు. అదే రాహుల్‌గాంధీ ఇప్పుడు బిహార్ ఎన్నికల్లో గెలవడానికి.. అవినీతి కేసుల్లో శిక్షపడినవారిని కౌగిలించుకుంటున్నారు. ఆర్డినెన్సును చించేయడం వెనుక ఔచిత్యమేమిటో చెప్పగలరా? మూడుసార్లు ఓడిపోవడంతో నైతికత పోయిందా? కేసుల నుంచి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతికి ఉన్న రక్షణ పరిధిలోకి ప్రధానమంత్రిని కూడా చేరుస్తూ ఇందిరా గాంధీ రాజ్యాంగ సవరణ చేపట్టారు. మోదీ మాత్రం ప్రధానమంత్రి పదవిలో ఉన్నవారు జైలుకెళ్లినా పదవి కోల్పోవాల్సిందేనన్న దృఢచిత్తంతో ఈ బిల్లు పరిధిలోకి పీఎంనీ చేర్చారు.

రెండేళ్లు గుజరాత్ బయటే ఉన్నాను

న్యాయమూర్తి జస్టిస్ ఆఫ్తాబ్ ఆలం మా ఇంటికి ఎప్పుడూ రాలేదు. ఆ అవసరం కూడా రాలేదు. ఆదివారం కోర్టును ప్రత్యేకంగా సమావేశపరిచి నా బెయిల్ దరఖాస్తు విచారించారు. నాడు నేను గుజరాత్ హోంమంత్రిగా ఉన్నాను కాబట్టి సాక్షులను ప్రభావితం చేయొచ్చని దర్యాప్తు సంస్థ అనుమానం వ్యక్తంచేయడంతో బెయిల్‌పై కోర్టు నిర్ణయం తీసుకునేవరకూ నేను గుజరాత్ బయటే ఉంటానని మా న్యాయవాదులు కోర్టుకు చెప్పారు. అలా నేను రెండేళ్లు గుజరాత్ బయటే ఉన్నాను. దేశచరిత్రలో ఎన్నడూ ఎవరి బెయిల్‌పైనా రెండేళ్ల విచారణ జరిగిన దాఖలా లేదు. జస్టిస్ ఆలం దయవల్ల నా బెయిల్ దరఖాస్తు రెండేళ్లు నడిచింది. తాజా బిల్లు ఆమోదం పొందుతుందని నమ్మకం ఉంది. జేపీసీ అధ్యక్షుడి ఎంపిక తర్వాత నివేదిక రావడానికి ఎంత సమయం పడుతుందన్నది తెలుస్తుంది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో దీన్ని తీసుకొస్తాం.

50 కి.మీ.లకు ఒక పోర్టు

(మొదటి పేజీ తరువాయి)



శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు

■ ఏడాదికి 36 మిలియన్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం.

■ తెలంగాణలో డ్రైపోర్టును ఏర్పాటు చేసి అక్కడి నుంచి మచిలీపట్నానికి సరకు చేర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. ■ బీచ్‌రోడ్డును రూ.638 కోట్లతో ఆరు లేన్ల రోడ్డుగా అభివృద్ధి చేసి.. జాతీయ రహదారి-65కు అనుసంధానం చేసే ప్రతిపాదన ఉంది. దీనిని కేంద్ర పరిశీలనకు పంపారు.

మూలపేట పోర్టు

■ 54.01 శాతం నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. 2026 మే నాటికి వినియోగంలోకి తేవాలన్నది లక్ష్యం. ■ ఏటా 25-30 మిలియన్ టన్నులు సరకు రవాణా లక్ష్యం. ■ ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో డ్రై పోర్టులు నిర్మించి మూలపేటతో అనుసంధానం చేస్తారు. ■ చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి-16తో టెక్కలి జంక్షన్ దగ్గర అనుసంధానం. ■ హావ్‌డా-చెన్నై రైలు మార్గంతో కలుపుతారు.

నాలుగు పోర్టుల్లో ఏయే పనులు.. ఎంతెంత పూర్తి(శాతంలో)

వివరాలు	రామాయపట్నం	మచిలీపట్నం	మూలపేట	కాకినాడ గేట్‌వే
బ్రేక్ వాటర్స్	87.42	77.50	80.21	83.45
డ్రెడ్జింగ్	67.58	32.55	59.78	16.35
బెర్త్‌లు	57.13	58.30	55.10	5.60
ఆన్‌షోర్ సదుపాయాలు	27.31	30.00	2.85	--
బాహ్య మౌలిక వసతులు	32.50	13.00	2.70	82.5

■ కాకినాడ గేట్‌వే పోర్టు నిర్మాణ పనులు 31.5 శాతం పూర్తయ్యాయి. వాకపూడి లైట్ హౌస్- అన్నవరం రోడ్డు ద్వారా ఎన్‌హెచ్-16తో అనుసంధానించేందుకు ప్రతిపాదన ఉంది.

ప్రమాదకరంగా 352 వంతెనలు

(మొదటి పేజీ తరువాయి)

స్తంభాలు (పియర్స్) కొంత దెబ్బతిన్నాయి.

■ 696 బ్రిడ్జిల డెక్ స్లాబ్‌లు దెబ్బతిన్నాయి.

■ 484 వంతెనల ఎక్స్‌పాన్షన్ జాయింట్స్, 194 వంతెనల బేరింగ్స్ బాగుచేయాలి.

■ వెయ్యి వంతెనల్లో పగుళ్లు ఏర్పడ్డాయి.

■ 1,328 వంతెనల్లో రక్షిత గోడలు, రెయిలింగ్స్ దెబ్బతిన్నాయి.

■ వర్షం కురిస్తే 831 వంతెనలపై నీరు నిలుస్తోంది.

రూ.4,511 కోట్లు అవసరం

■ విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, చిత్తూరు, నంద్యాల జిల్లాల పరిధిలో ప్రమాదకరమైన వంతెనలు ఎక్కువగా ఉన్నాయి.

■ 870 వంతెనలను పునర్నిర్మించాలి. వీటికి రూ.3,866.89 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు.

■ 3,543 వంతెనలకు వివిధ రకాల మరమ్మతులు చేయాల్సి ఉందని గుర్తించగా, ఇందుకు రూ.644.95 కోట్లు ఖర్చు అవుతుందని లెక్క వేశారు.

రాష్ట్రంలోని మొత్తం వంతెనలు: చిన్నవి, పెద్దవి కలిపి	8,018
ఏయే రోడ్లపై ఎన్ని: జిల్లా రోడ్లపై	4,392
రాష్ట్ర రహదారులపై:	2,477
జాతీయ రహదారులపై:	2,049

■ మొత్తంగా వంతెనల పునర్నిర్మాణం, మరమ్మతులకు రూ.4,511.84 కోట్లు కేటాయించాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఇంజినీర్లు నివేదిక పంపారు.

వార్షిక ప్రణాళికలో ఎన్‌హెచ్ వంతెనల ప్రతిపాదన

రాష్ట్రంలోని జాతీయ రహదారులపై 2,049 వంతెనలు ఉండగా, వీటిలో 1,995 సురక్షితంగా ఉన్నాయి. 50 వంతెనలకు మరమ్మతులు చేయాలని, 4 ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించారు. వీటి మరమ్మతులు, పునర్నిర్మాణం కోసం రూ.71.66 కోట్లతో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) వార్షిక ప్రణాళికలో ఇంజినీర్లు ప్రతిపాదించారు.

వినాయకచవితి పందిళ్లకు ఉచిత విద్యుత్తు

(మొదటి పేజీ తరువాయి)

మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని నా దృష్టికి మీరు తెచ్చిన విషయాన్ని సీఎం చంద్రబాబు, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లతో చర్చించాను. ఇందుకు అంగీకరించిన ప్రభుత్వం.. ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేయనుంది’ అని లోకేశ్ పేర్కొన్నారు. గణపతి మండపాలకు ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పిస్తున్నట్లు విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా వెల్లడించారు. ఒంగోలులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వ నిర్ణయానికి ధన్యవాదాలు

వినాయకచవితి పందిళ్లకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ గణేశ్ ఉత్సవ సమితి హర్షం వ్యక్తం చేసింది. సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లకు ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు సమితి గౌరవ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు, అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

వినాయక చవితి మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు. సింగిల్ విండో పద్ధతిలో ఎలాంటి రుసుము లేకుండా చవితి మండపాలకు అనుమతి సహా గణేష్ ఉత్సవం కమిటీల సమన్వయం లాంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం శుభ పరిణామమని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జగన్ హయాంలో పందిళ్లు వేయొద్దని ఆంక్షలు

‘దీపావళికి టపాసులు కాల్చకూడదు. హోలీకి రంగులు చల్లకూడదు. వినాయక చవితికి పందిళ్లు వేయకూడదు. ఊరేగింపుల్లో డప్పులు కొట్టకూడదు అని జగన్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది’ అని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వడాన్ని భాజపా ఆంధ్రప్రదేశ్ శాఖ స్వాగతిస్తోందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఈనాడు

ఉత్పాదకతను హరిస్తున్న ఉష్ణోగ్రతలు

ప్రపంచవ్యాప్తంగా పదిహేనేళ్లకు పైబడిన కార్మికశక్తిలో పాతికశాతానికి పైగా వ్యవసాయం, నిర్మాణం, చేపల వేట తదితరాలలో నిమగ్నమైంది. ఇవన్నీ బహిరంగ ప్రదేశాల్లో చెమటోడ్చాల్సిన పనులే. వాటిలో తలమునకలవుతున్న వాళ్లలో అత్యధికులు రెక్కాడితే కానీ డొక్కాడని వారే. రోజురోజుకూ తీవ్రతరమవుతున్న ఉష్ణతాపం కష్టజీవుల ఉపాధిని, ఆరోగ్యాన్ని దెబ్బతీసి సామాజిక అంతరాలను మరింత ఎగదోస్తోంది. ఉత్పాదకతను కుంగదీస్తోంది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య, పర్యావరణ సంస్థల నివేదిక ఒకటి చేదు వాస్తవాలను వెల్లడించింది. 20 డిగ్రీల సెల్సియస్‌కు పైన ఉష్ణోగ్రత ఒక్కో డిగ్రీ పెరిగే కొద్దీ శ్రామిక ఉత్పాదకత 2-3శాతం చొప్పున తెగ్గోసుకుపోతుందని అది స్పష్టం చేసింది. ఠారెత్తించే ఎండల్లో పనిచేసేవారికి వడదెబ్బ సమస్య ఎప్పుడూ ఉంటుంది. దానికితోడు మూత్రపిండాలు, నరాల రుగ్మతల వంటివీ పీడిస్తాయని తాజా నివేదికాంశాలు హెచ్చరిస్తున్నాయి. ఉద్ధృతమవుతున్న వాతావరణ మార్పులతో అన్ని దేశాల్లో ప్రకృతి విపత్తులు విరుచుకుపడుతున్నాయి. ప్రభుత్వాలు ఇప్పటికైనా మేల్కొనకుంటే రాబోయే రోజుల్లో మరిన్ని భీకర పరిణామాలను చవిచూడక తప్పదు!

భరించలేని వేడిమి కారణంగా 2023లో ప్రపంచం 51వేల కోట్ల పనిగంటలను కోల్పోయినట్లు అంచనా. ఆ సంవత్సరం వడగాడ్పుల మూలంగా ప్రపంచ జీడీపీకి 0.6శాతం మేర నష్టం వాటిల్లింది. ఉష్ణ పవనాల తాకిడికి 2030నాటికి ఇండియాలో 5.8శాతం మేర పనిగంటలు తగ్గిపోతాయని, ప్రపంచ సగటుతో పోలిస్తే అది రెండున్నర రెట్లు ఎక్కువని అంతర్జాతీయ కార్మిక సంస్థ రెండేళ్ల కిందటే అప్రమత్తం చేసింది. మాడు పగలగొట్టే ఎండల ధాటికి రాబోయే దశాబ్దాల్లో తృణధాన్యాల దిగుబడి పావు వంతు వరకు తరిగిపోవచ్చన్న విశ్లేషణలు- ఆహార అభద్రతా గండం ముంచుకొస్తోందని గుర్తుచేస్తున్నాయి. పారిశ్రామిక విప్లవం ముందు నాటితో పోలిస్తే- ఈ శతాబ్దం చివరికి భూతాప పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్నది పారిస్ ఒప్పంద లక్ష్యం. దానికి కట్టుబడటంలో ప్రపంచ దేశాల దారుణ నిర్లక్ష్యంవల్ల ఇప్పటికే ఉష్ణతాపం 1.3 డిగ్రీల దాకా పెరిగింది. ఇలాగే వదిలేస్తే 75ఏళ్లలో అది మరో రెండున్నర రెట్లు అధికమవుతుందని ఐరాస నిరుడు హెచ్చరికలు జారీచేసింది. దానివల్ల 2100 నాటికి ప్రపంచార్థికం 40శాతం మేర కుంగుతుందన్న అధ్యయనాలు- మానవాళి సౌభాగ్యానికి పొంచి ఉన్న ముప్పు తీవ్రతకు అద్దంపడుతున్నాయి!


వాతావరణం వేడెక్కుతున్న కొద్దీ సాగరాలు సలసల కాగుతూ తుపానులు, కుంభవృష్టి వానలు ముమ్మరిస్తున్నాయి. ధ్రువ ప్రాంతాల్లో మంచు కరిగి తీరప్రాంతాలు కోతకు గురవుతున్నాయి. వేడిమి మితిమీరుతున్న కొద్దీ చాలా దేశాల్లో చిన్నారులు నెలలు నిండకుండానే జన్మిస్తున్నారు. రోళ్లు పగిలే ఎండల దెబ్బకు పిల్లల చదువులు సైతం గతితప్పుతూ, వారి బంగారు భవితను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇంత విధ్వంసం జరుగుతున్నా వాతావరణ విపరిణామాలు బూటకమంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వితండ వాదన విస్తుగొలుపుతోంది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబాటు చాటాల్సిన 'కాప్' సదస్సులు మొక్కుబడి తంతుగా మిగులుతుండటమూ ఆందోళన రేపుతోంది. భావితరాల మనుగడ గాలిలో దీపం కాకూడదంటే- శిలాజ ఇంధనాల వాడకాన్ని ప్రపంచ దేశాలు కలిసికట్టుగా కట్టడి చేయాలి. పర్యావరణ మార్పుల దుష్ప్రభావాలను ఎదుర్కోవడంలో వర్ధమాన రాజ్యాలకు సంపన్న దేశాలు చేయూతనందించాలి. హరితారణ్యాల విస్తీర్ణాన్ని పెంచుతూ పునరుత్పాదక ఇంధన వనరులకు అధిక ప్రాధాన్యమివ్వాలి!

ఉద్వాసన బిల్లుల్లో వైరుధ్యాలెన్నో!

అత్యున్నత అధికార స్థానాల్లో నైతికతను పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్రం ఇటీవల మూడు బిల్లులను పార్లమెంటు ముందుకు తెచ్చింది. ఇవి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులకు సైతం ఉద్వాసన పలికే వీలు కల్పిస్తున్నాయి. వీటి ప్రకారం- అయిదేళ్లు, అంతకుమించి జైలుశిక్ష పడేంత నేరానికి పాల్పడిన ఆరోపణలతో నెలరోజుల పాటు నిర్బంధంలో ఉన్నవారిని పదవి నుంచి తప్పించవచ్చు. అయితే, ఈ బిల్లులలో పలు వైరుధ్యాలు సమస్యలూ ఉన్నాయి.

రాజ్యాంగ సవరణ(130), అనుబంధ బిల్లులు-2025లోని చట్టపరమైన సమస్యలు, మసాయిదాలో లొసుగులు... వాటి అమలును క్లిష్టతరంగా మార్చే అవకాశం ఉంది. 'అయిదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలపాటు కారాగార శిక్ష విధించదగిన నేరానికి పాల్పడిన ఆరోపణలతో అరెస్టు లేదా నిర్బంధానికి గురైన' అనే మాటలు సుప్రీంకోర్టు నిర్దేశించిన న్యాయసూత్రాలకు విరుద్ధమైనవి. ఏదేళ్లదాకా జైలుశిక్ష విధించదగిన కేసుల్లో నిందితుల అరెస్టు తప్పనిసరి కాదని అర్నేశ్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించింది. గత దశాబ్దకాలంగా





ఈ నిర్దేశం అమలవుతోంది. కేంద్రం ప్రవేశపెట్టిన తాజా బిల్లులు ఈ న్యాయసూత్రానికి విరుద్ధంగా ఉన్నాయి. చట్టసభలో దొర్లిన ఈ మౌలిక పొరపాటు బిల్లులను నిర్వీర్యంగా మారుస్తోంది.

అర్నేశ్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు పర్యవసానంగా సీఆర్‌పీసీలో సెక్షన్ 41ఏ చేర్చారు. సీఆర్‌పీసీకి కొత్త అవతారమైన బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 35లో ఇదే అంశాన్ని పొందుపరిచారు. దీని ప్రకారం ఏడేళ్లదాకా కారాగార శిక్ష విధించదగిన నేరాలకు పాల్పడినట్లుగా ఆరోపణలను ఎదుర్కొంటున్నవారిని అరెస్టు చేయడానికి బదులు నోటీసు జారీ చేయాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈ సెక్షన్ కింద తప్పనిసరి అరెస్టుకు వీలుండటంతో నిందితుడు ముందస్తు బెయిలుకోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. కోర్టులు ఎన్నో సందర్భాల్లో ఈ సెక్షన్ కింద బెయిలు మంజూరు చేశాయి. అయిదేళ్ల కారాగార శిక్షకు గురయ్యే కేసుల్లో నిందితుల అరెస్టు తప్పనిసరి కానప్పుడు, ఉద్వాసన బిల్లుల అమలు క్లిష్టతరమే అవుతుంది.

జవాబు లేని ప్రశ్నలు...

చట్టం ముందు అందరూ సమానులేనని రాజ్యాంగంలోని 14వ అధికరణం చెబుతోంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, వారి కేబినెట్ సహచరులు 'పబ్లిక్ సర్వెంట్స్' అని అవినీతి నిరోధక చట్టం నిర్వచిస్తోంది. 48 గంటలకుపైబడి రిమాండులో ఉన్న ప్రభుత్వోద్యోగి ఆర్నెల్లపాటు సస్పెన్షన్‌కు గురవుతారు. ఆ తరవాత కేసుపై సమీక్ష జరుగుతుంది. మరి అత్యున్నత అధికార స్థానాల్లో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు తదితరులకు 30 రోజుల వ్యవధి ఇవ్వడం, వారికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించడం సమానత్వ సూత్రానికి విఘాతం కలిగించదా? ఒకవేళ 30వ రోజు జైలు నుంచి విడుదలైతే వీరి పదవులకు ఢోకా ఉండదు కదా! ఇక ముఖ్యమంత్రి 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే శాసనసభా పక్షం తాత్కాలిక నాయకుణ్ని ఎన్నుకునే వరకూ సీఎంగా ఎవరుంటారన్నది తాజా బిల్లులు వివరించడం లేదు. ఈ విరామ కాలంలో రాష్ట్రాన్ని ఎవరు పాలిస్తారన్నది స్పష్టీకరించలేదు. 31వ రోజు పదవి కోల్పోయిన ముఖ్యమంత్రి కొత్త సీఎం పదవీ స్వీకారం చేశాక జైలు నుంచి విడుదలైతే పరిస్థితి ఏంటి అనేదీ ప్రశ్నార్థకమే. ఈ బిల్లులతో పరిపాలనపై తీవ్ర ప్రభావం పడే అవకాశమూ లేకపోలేదు. ఉదాహరణకు అంతర్గత భద్రతకు బాధ్యులైన మంత్రి నిర్బంధంలో ఉన్నప్పుడు మత కల్లోలాలు, హింసాకాండ లేదా ప్రకృతి విపత్తులు సంభవిస్తే వాటిపై అధికారుల చర్యలను ఎవరు పర్యవేక్షిస్తారు? అప్పుడు పరిపాలనను గాలికి వదిలెయ్యాల్సిందేనా?

అభియోగాలు నమోదయ్యాకే...

అయిదేళ్లు లేదా అంతకన్నా ఎక్కువకాలం కారాగార శిక్షకు అర్హమైన నేరాలనే ఎంచుకోవడానికి 2014 ఫిబ్రవరిలో లా కమిషన్ చేసిన సిఫార్సులే కారణం. ఒకవైపు అయిదేళ్ల కారాగార శిక్షను ప్రామాణికంగా పేర్కొన్న లా కమిషన్ సూచన, మరోవైపు ఏడేళ్ల కారాగార శిక్షకు వీలున్న నేరాలకు పాల్పడిన వారి అరెస్టు తప్పనిసరి కాదన్న సుప్రీంకోర్టు ఆదేశం... ఈ రెండింటిలో ఏది చెల్లుబాటవుతుందనేది తేలాలి. కేవలం సిఫార్సులు చేసే అర్హత మాత్రమే కలిగి ఉన్న లా కమిషన్ సూచన కంటే సుప్రీంకోర్టు ఆదేశాలకే చట్టబద్ధత ఉంటుంది. జస్టిస్ ఏపీ షా నేతృత్వంలోని లా కమిషన్ 2014, ఫిబ్రవరి 24న ఎన్నికల్లో పోటీ చేసే వారి అనర్హతలను పునర్నిర్వచిస్తూ కేంద్ర న్యాయశాఖకు నివేదిక సమర్పించింది. రాజకీయాల్లో విపరీతంగా పెరిగిన నేరచరితుల ప్రవేశంపై ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం నేపథ్యంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలకు అనుగుణంగా ఆ నివేదికను రూపొందించారు. అది నేర నేపథ్యం కలిగిన అభ్యర్థుల అనర్హత, తప్పుడు అఫిడవిట్‌కు ఎదురయ్యే పర్యవసానాలు వంటి అంశాలను విశ్లేషించింది. ట్రయల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాక మాత్రమే అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని కమిషన్ పేర్కొంది.

ప్రత్యేక చట్టం అవసరం...

కేంద్రం తీసుకొచ్చిన ఉద్వాసన బిల్లుల్లోని లోపాల వల్ల అమలులో సమస్యలు తలెత్తే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సీబీఐ, ఈడీల పనితీరుపై ఇటీవల విమర్శలు, ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ప్రజలు ఈ బిల్లులను పెదవి విరుస్తున్నారు. బిల్లుల ఉద్దేశం గొప్పదే అయినా వాటి రూపకల్పనలో పొరపాట్లు స్పష్టంగా కనపడుతున్నాయి. అందుకని ఎన్నికైన ప్రజా ప్రతినిధుల్లో నైతికతను, నిజాయతీని పెంపొందించాలని భావిస్తే, దానికోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి. కేసు దర్యాప్తును రాష్ట్ర పోలీసులు, సీబీఐ, లోకాయుక్త లేదా లోక్‌పాల్ డైరెక్టర్లు సంయుక్తంగా చేపట్టాలి. రెండు లేదా మూడు నెలల్లో విచారణ పూర్తయ్యేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలి. ఇలాంటి చర్యల ద్వారా అత్యున్నత స్థాయిలో నైతికత పెంపునకు కృషి చేయాలి.



ఇ.దామోదర్
విశ్రాంత ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్

ఏ రంగంలోనైనా ప్రపంచ రికార్డు సాధించడమంటే మాటలు కాదు. ఎంతో కష్టపడితే ఒకటో రెండో రికార్డులు మన పేర రాసుకోవచ్చు. కానీ కొన్నాళ్లకే మళ్లీ వాటిని ఎవరో ఒకరు అధిగమిస్తారు. కానీ న్యూయార్క్‌కు చెందిన డెబ్బయ్యేళ్ల ఆశ్రిత ఫర్మాన్ ఇప్పటివరకూ 700లకు పైగా గిన్నిస్ రికార్డులు నెలకొల్పాడు. వాటిలో 200 రికార్డులను ఇంకా ఎవరూ బ్రేక్ చేయకపోవడంతో ఇప్పటికీ తన పేరునే ఉన్నాయి. చాలామంది పిల్లల్లాగే ఫర్మాన్‌కి కూడా ఏటా వచ్చే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పుస్తకం చూడటం చిన్నప్పటినుంచి అలవాటు. అయితే తనది అథ్లెటిక్ బాడీ కానందున గొప్ప సాహసాలేవీ తాను చేయలేడు కాబట్టి గిన్నిస్‌లో తన పేరు వచ్చే అవకాశం లేదనుకునేవాడట. దాంతో పాతికేళ్ల వరకూ అటువైపే చూడలేదు.

టీనేజ్‌లో ఉన్నప్పుడు ఫర్మాన్‌కి ఓ భారతీయ ఆధ్యాత్మిక గురువు పరిచయమయ్యారు. ఆయన దగ్గర మెడిటేషన్ సాధన చేశాడు. సంకల్పబలం ముందు ఏదీ అసాధ్యం

రికార్డుల రారాజు



కాదని, శారీరక సామర్థ్యం తాలూకు హద్దులను అవలీలగా అధిగమించవచ్చని తెలుసుకున్నాడు. గురువు ఇచ్చిన ప్రేరణతో కేవలం రెండు వారాల శిక్షణతో మొదటిసారి 24 గంటల సైకిల్ రేసులో పాల్గొని మూడోస్థానంలో నిలిచాడు. ఆ గెలుపు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. గురువు ప్రభావంతోనే కీత్ ఫర్మాన్ అన్న తన పేరును ఆశ్రిత ఫర్మాన్‌గా మార్చుకున్నాడు. ఇక అతడి దృష్టి గిన్నిస్ రికార్డుల మీదికి మళ్లింది. ఆపకుండా జంపింగ్ జాక్స్ చేసి రికార్డు సృష్టించాలనుకున్నాడు. అదేమంత తేలికైన పని కాదు. దాంతో తొలి ప్రయత్నంలో విఫలమయ్యాడు. అయినా నిరుత్సాహపడలేదు. పట్టుదలగా శారీరక సామర్థ్యాన్ని పెంచుకోడానికి వ్యాయామాన్ని, మనోబలాన్ని ఇనుమడింపజేసుకోడానికి ధ్యానాన్ని కొనసాగించాడు. గిన్నిస్ రికార్డు హోల్డర్‌కి కావాల్సిన లక్షణాలన్నీ కష్టపడి పెంపొందించుకున్నాడు. మొత్తానికి 6 గంటల 45 నిమిషాల్లో ఏకంగా 27వేల జంపింగ్ జాక్స్ చేసి తన పేర తొలి రికార్డును నమోదు చేసుకున్నాడు. 1980 గిన్నిస్ రికార్డ్స్ పుస్తకంలో ఒలింపిక్ స్వర్ణపతక విజేత నదియా కొమనేసి పక్కనే అతడి పేరు వచ్చింది. ఇక వెనక్కి తిరిగి చూడలేదు ఫర్మాన్. స్నేహితుల సాయంతో రకరకాల రికార్డుల కోసం కృషిచేశాడు. గడ్డంమీద సైకిల్‌ని మోస్తూ ఎక్కువ దూరం నడవడం, నిమిషంలో అత్యధిక కాగడాలను వెలిగించి ఆర్పేయడం, పోగో స్టిక్ మీద పరిగెత్తడం... ఇలా వరసబెట్టి ఏడు వందలకు పైగా రికార్డులను సృష్టించాడు. అత్యధిక రికార్డులు సాధించిన రికార్డునూ సొంతం చేసుకున్నాడు. అంతేకాదు, ప్రపంచంలోని అన్ని ఖండాలలోనూ రికార్డులు సృష్టించిన ఘనత కూడా అతడిదే.

పట్టు పట్టరాదు పట్టి విడువరాదు... అన్న వేమన పద్యం గుర్తొస్తోంది కదూ ఫర్మాన్ కథ చదువుతోంటే. ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలే కానీ ఏదీ ఎవరికీ అసాధ్యం కాదు మరి!

– డోటుకూరి నందిని



నాయకత్వ స్థానాల్లో మరింత ఎక్కువ మంది మహిళలను చూడాలి. సంప్రదాయ, మూస విధానాలను తోసిరాజని అన్నిరంగాల్లో స్త్రీలు రాణిస్తూ లింగసమానత్వాన్ని సాధించాలి... ఆ దిశగా కృషిచేసే అవకాశం ఉండటమే నాకు నిత్యం స్ఫూర్తినిస్తోంది.

– ఫిరోదియా మోత్వాని, సీఈవో, కైనెటిక్ గ్రీన్

ఈ పదీ ఉంటే...

మనిషి జీవితం సార్థకం కావాలంటే ఉండాల్సినవి ధనం, హోదా తదితరాలు కాదు. కానీ, దేశకాలాలకు అతీతంగా లోకమంతా జీవితం అంటే అవే అనుకుంటోంది. వాటిని సంపాదించడం కోసమే జీవితమంతా పరుగులు పెడుతున్నారు. ఆ క్రమంలో యుక్తాయుక్త విచక్షణను మర్చిపోతున్నారు. సత్యం, ధర్మం, నీతి, నడవడిక మొదలైన వాటికి సమాజంలో విలువ లేకుండా పోతోంది. సమాజం ప్రగతి సాధించినప్పుడు మానవ జీవన స్థితిగతులు మెరుగుపడాలి. సాంకేతిక అభివృద్ధితో జీవనశైలి సులభతరం కావాలి. కానీ, అందుకోసం నైతిక విలువలను పణంగా పెట్టరాదు. లోక ధర్మాలు శ్రుతి తప్పకూడదు. స్వార్థంతో మనిషి పతనం కాకుండా ఉండాలంటే కొన్ని నియమాలను పాటించకతప్పదు.

మనిషి నిర్వాణ పథం చేరుకోవడానికి భగవాన్ బుద్ధుడు- దానం, ధ్యానం, ఉపేక్ష, ప్రజ్ఞ, క్షమ, శీలం, సహనం, సత్యం, శౌర్యం, నిరపేక్ష అని దశ పారమితలను (పరిపూర్ణతలు) ఉపదేశించాడు. ప్రతి వ్యక్తీ ఉన్నంతలో కొంత దానం చేయడం



అంతర్యామి

అలవరచుకుంటే కలిగే తృప్తి, ఆనందం ఎందులోనూ లభించవు. సత్ప్రవర్తన, నైతికత మనిషి వ్యక్తిత్వానికి అలంకారాలవుతాయి. శీలసంపద మనిషిని ఉన్నతీకరిస్తుంది. ప్రాపంచిక సుఖాల పట్ల ఎంత అనాసక్తత పెంచుకుంటే అంతగా కోరికలను అదుపులో పెట్టుకోవచ్చు. దానివల్ల దుఃఖం తగ్గుతుంది. క్షమించడం వల్ల మనిషి ప్రశాంతతను పొందగలడు. పగ, కక్షలతో హింస తప్ప ఏమీ సాధించలేం. అలాగే మనిషిలో శౌర్య గుణం తప్పక ఉండాలి. దీనివల్ల ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం ఉండదు. స్వశక్తితో జీవించగలమనే ఆత్మవిశ్వాసం కలుగుతుంది.

అలాగే ధ్యానం అంటే- చేసే పనిమీద ఏకాగ్రత కలిగి ఉండటం విజయానికి తొలి మెట్టు అవుతుంది. ఉత్తమ జీవన విధానానికి ప్రజ్ఞ అంటే- జ్ఞానం చాలా ముఖ్యం. అది ఉన్నప్పుడే జీవితాన్ని సరైన ఎరుకతో తీర్చిదిద్దుకోగలరు. అందుకే బుద్ధిజీవులకు అపజయం ఆమడదూరంలో ఉంటుంది. ఎంత జాగ్రత్తగా ఉన్నా జీవితమన్నాక ఆటుపోట్లు తప్పవు. అటువంటి కష్ట సమయాల్లో ఓరిమి చూపాలి. సహనం లేకపోతే మనుషులను అశాంతి ఇట్టే ఆవరిస్తుంది. దృఢచిత్తంతో నిత్యం సత్యం పలికేవారి వల్ల లోకానికి మేలు జరుగుతుంది. తమ ప్రవర్తన మీద శ్రద్ధ కలిగినవారే సత్యమార్గంలో ముందుకు వెళ్లగలరు. ఎదుటివారు ఎటువంటి వారైనా మనం కొంత దయతో ప్రవర్తించాలి. చెడు చేసిన వారిపట్ల కూడా కరుణ చూపగలిగిన వారు మహోన్నతులు అవుతారు. అన్నిటికన్నా గొప్పది నిరపేక్ష. అంటే విడిచి పెట్టడం. మితిమీరిన కోరికలను, స్వార్థాన్ని, ఈర్ష్య అసూయలను, కోపం, పగ, అహంకారాలను విడిచిపెట్టాలి.

ఈ దశ పారమితలను జీవితాంతం పాటించాలి. అప్పుడే జీవనగమనంలో వచ్చిపడిన వేగం తగ్గి, తానేంటో తనకు బోధపడుతుంది. మనుషుల మధ్య అనురాగం పెరిగి ద్వేషం తగ్గుతుంది. సమస్త మానవాళి మంగళకరమై వర్ధిల్లుతుంది.

– డాక్టర్ బండి సత్యనారాయణ

సురవరం... జీవితమే ఒక విశ్వవిద్యాలయం!

తెలంగాణ పోరాట యోధుడైన పెదతండ్రి సురవరం ప్రతాపరెడ్డి తిరుగుబాటు భావజాలాన్ని సుధాకర్‌రెడ్డి పుణికి పుచ్చుకున్నారు. ప్రతాపరెడ్డి ప్రభావంతో సుధాకర్‌రెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దాంతో మరో పెదనాన్న రామచంద్రారెడ్డి ఇంట్లో ఉండి చదువుకున్నారు. ఇంట్లో ఉన్న విప్లవ సాహిత్యం చిన్నప్పటి నుంచే సుధాకర్‌రెడ్డిపై ప్రభావం చూపింది. 1957లో కర్నూలు బడిలో టీచర్ పాఠం చెప్పడానికి నల్లబోర్డు, చాక్‌పీసులు ఇవ్వాల్సిందేనంటూ తన 12వ ఏటనే పిల్లలందరినీ కూడగట్టారు. ఆ ఆందోళన కర్నూలులోని మిగతా పాఠశాలలకూ పాకింది. సురవరం 1960లో ఏఐఎస్ఎఫ్ కర్నూలు పట్టణం, తరవాత జిల్లా బాధ్యతలు స్వీకరించారు. 1962లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో పరీక్షల సంస్కరణలు చేపట్టాలని, రోజుకు ఒకటే డిగ్రీపరీక్ష నిర్వహించాలని, స్కాలర్‌షిప్స్ నేరుగా విద్యార్థికే ఇవ్వాలంటూ 62రోజుల పాటు ఉద్యమించారు. అప్పుడే తొలిసారిగా లాఠీదెబ్బలు తిని అరెస్టయ్యారు. సురవరం నేతృత్వంలో సాగిన పోరాటంతో విద్యార్థుల డిమాండ్లు నెరవేరాయి. దాంతో ఆయన ఇమేజ్ పెరిగింది. కళాశాల ఎన్నికల్లో యూనియన్ ప్రెసిడెంట్‌గా భారీ మెజార్టీతో నెగ్గారు.

యువతను కదంతొక్కించి...

సురవరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. న్యాయకళాశాలలో చేరిన కొత్తలోనే విద్యార్థి సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా గెలిచారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్తంగా ఉద్యమించారు. ఉపకార వేతనాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేపట్టారు. వివిధ రాష్ట్రాల్లో విద్యార్థులను కదం తొక్కించారు. లఖ్‌నవూ, కోల్‌కత్తా, దిల్లీ, పట్నా జైళ్లలో శిక్ష అనుభవించారు. 1972లో సీపీఐ యువజన విభాగం ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా యువతకు 18 ఏళ్లకు ఓటు హక్కు సాధించే ఉద్యమానికి నేతృత్వం వహించారు. దిల్లీ వీధుల్లో భారీ యువజన ర్యాలీలు నిర్వహించారు. తరవాత రాష్ట్రానికి తిరిగి వచ్చి సీపీఐలో క్రియాశీలక పాత్ర పోషించారు. కర్నూలు, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో భూపోరాటాలు, ప్రాజెక్టుల కోసం పాదయాత్రలు చేపట్టారు. విద్యుత్ ఉద్యమంలో భాగంగా బషీర్‌బాగ్‌లో జరిగిన కాల్పుల్లో తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో పలు నిర్బంధాలు ఎదుర్కొన్నారు. కమ్యూనిస్టు రాజకీయాలు కఠిన సవాళ్లతో కూడినవని తెలిసినా ఎన్నడూ విశ్రమించలేదు. వెనకడుగు వేయలేదు.

సోవియట్ యూనియన్ మొదలు మంగోలియా, అమెరికా, ఇటలీ, జపాన్ వరకు దాదాపు 40 దేశాల్లో పర్యటించారు. ఐరాస జనరల్ అసెంబ్లీలోనూ ప్రసంగించారు. ఫిడెల్ కాస్ట్రో, యాసర్ అరాఫత్ వంటి ప్రపంచ నేతలను కలవడం సురవరాన్ని మరింతగా రాటుదేల్చింది.

మూడు భాషల్లో అనర్గళంగా...

సురవరం మృదుభాషి. మితభాషి. కానీ, ఆయన ప్రసంగాలు పార్టీ శ్రేణులను ఉర్రూతలూగించేవి. తెలుగు, హిందీ, ఆంగ్లంలో అనర్గళంగా, ఆకర్షణీయంగా మాట్లాడేవారు. పడికట్టు పదాల్లేకుండా గంభీరస్వరంతో సాగే ఆయన ఉపన్యాసం కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేది.



సిద్ధాంతం లేని ఆచరణ గుడ్డిది.. ఆచరణ లేని సిద్ధాంతం గొడ్డుది అంటారు లెనిన్. కమ్యూనిస్టు ఆదర్శాలను నిబద్ధతతో పాటిస్తూ, వాటికి ఆచరణను జోడించిన నేత సురవరం సుధాకర్‌రెడ్డి. స్ఫూర్తికి ఆయన పర్యాయపదం. పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ఆయనొక ధిక్కార స్వరం. ఏఐఎస్ఎఫ్ కార్యకర్త నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకూ ఎక్కడ ఎలాంటి బాధ్యతల్లో ఉన్నా- సుధాకర్‌రెడ్డి నిత్యం ప్రజాక్షేమం కోసమే పరితపించారు.

సురవరం పైకి ఎంతో సున్నితంగా కనిపించినా, ఒక లీడర్‌గా చాలా దృఢంగా వ్యవహరించేవారు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో తెదేపాతో పొత్తులో కర్నూలు జిల్లా డోన్ నుంచి సీపీఐ అభ్యర్థిగా సురవరం పోటీ చేశారు. కాంగ్రెస్ దిగ్గజ నేత, నాటి సీఎం కోట్ల విజయభాస్కరరెడ్డి ఆయన ప్రత్యర్థి. అప్పట్లో డోన్‌లో ఫ్యాక్షనిజం చాలా తీవ్రంగా ఉండేది. సురవరం ఫ్యాక్షన్ గ్రామాల్లోకి వెళ్లి, ఫ్యాక్షనిస్టుల ఇళ్లముందే వ్యానుపై నిలబడి నిర్భీతితో ప్రసంగించేవారు. ఆయన ఉపన్యాసాలు ప్రజలు ఫ్యాక్షనిజానికి వ్యతిరేకంగా ఆలోచించేలా చేశాయి.

కార్యకర్తలతో మమేకం

హుందాతో కూడిన రాజకీయ పంథా సుధాకర్‌రెడ్డిని అజాత శత్రువుగా నిలిపింది. మాటల్లో సౌమ్యత, మనసులో ఆర్ద్రత, ఆచరణలో నిబద్ధత, కార్యకర్తల పట్ల ఆత్మీయత, వామపక్ష ప్రజాసంఘాలతో సౌహార్ద్రత సురవరాన్ని పార్టీలకు అతీతంగా అందరివాణ్ని చేశాయి. కార్యకర్తలు ఆయనను 'సార్' అని సంబోధిస్తే వారించేవారు. పేరు పెట్టి పిలవాలనీ, లేకపోతే 'కామ్రేడ్' అనాలని సూచించేవారు. తనను కలవడానికి వచ్చే కార్యకర్తలను కూర్చోబెట్టే మాట్లాడేవారు. పార్టీ విధాన నిర్ణయాలకు సంబంధించి సాధారణ కార్యకర్తలు రాసే లేఖలకు సైతం స్పందించేవారు. తానెంత పని ఒత్తిడిలో ఉన్నా ఆ లేఖలను చదివి స్వదస్తూరీతో బదులిచ్చేవారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవిలో, ఎంపీ హోదాలో ఉన్నా ఇద్దరు కుమారుల వివాహాలను కమ్యూనిస్టు పార్టీ సంప్రదాయాల ప్రకారం ఒకే వేదికపై నిరాడంబరంగా జరిపించారు. వాటికి నాటి సీఎం చంద్రబాబు నాయుడు, సీపీఐ అప్పటి ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ సాక్షులుగా సంతకాలు చేశారు.

నిత్య అధ్యయన శీలి

సురవరం 2012-19 మధ్య సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. చండ్ర రాజేశ్వరరావు తరవాత ఆ పదవికి ఎన్నికైన రెండో తెలుగు వ్యక్తిగా నిలిచారు. క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేశారు. కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. హిందీ రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు పాటుపడ్డారు. సైద్ధాంతిక వైరుధ్యం కలిగిన భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేశారు. కూటమి నిర్మాణంలో కాంగ్రెస్ వ్యూహాత్మక తప్పిదాలను, ఇతర పార్టీలను కలుపుకొని వెళ్లడంలో అలక్ష్యాన్ని నిర్మొహమాటంగా విమర్శించారు. దిల్లీ వాతావరణం సురవరం ఆరోగ్యాన్ని దెబ్బతీసింది. అయినప్పటికీ పార్టీ అవసరాల కోసం కొంత కాలం అలాగే పనిచేశారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో మరణించిన సురవరం చివరివరకూ ఆదర్శాలను వీడలేదు. తన భౌతికకాయాన్ని పరిశోధనల కోసం ఆసుపత్రికి దానం చేయాలంటూ జీవించి ఉండగానే కుటుంబానికి చెప్పారు. నేత్రదానమూ చేశారు. సురవరం నిత్య అధ్యయనశీలి. జీవితంలో ఆఖరి రోజు ఉదయం కూడా ఆయన ఆసుపత్రి పడకపై దినపత్రికలు చదివారు. సూత్రబద్ధ రాజకీయాలకు సురవరం జీవితం ఒక కొలమానం. ఆయన నడవడిక అధ్యయన గ్రంథం. రాజకీయం, అవకాశవాదం రెండూ పెనవేసుకుపోయిన ప్రస్తుత కాలంలో రాజకీయ ఆగమనాభిలాషులకు, ప్రగతిశీలవాదులకు సురవరం జీవితం ఒక విశ్వవిద్యాలయం.

– పోచిరాజు శ్రీరామ్

వుషులో ప్రణతి ప్రతిభ!

హాయ్ ఫ్రెండ్స్..! మీకు కబడ్డీ, ఖో-ఖో, క్రికెట్ లాంటి ఆటలన్నీ తెలుసు కదా! ఇంకా క్యారమ్స్, చెస్ లాంటివి కూడా ఆడి ఉంటారు. మరి.. వుషు పోటీలు తెలుసా? 'ఇదేదో వినడానికి వింతగా ఉందే?' అనుకుంటున్నారా! సరే అయితే ఈ కథనం చదివేయండి మరి!

వుషు అంటే మరేం లేదు నేస్తాలూ.. మనకు తెలిసిన చైనీస్ మార్షల్ ఆర్ట్స్ లాంటిదన్నమాట. ఇప్పుడు ఆ ఆట గురించి ఎందుకంటే.. కర్ణాటకలోని మైసూరుకు చెందిన జి.ప్రణతి అనే నేస్తం అందులో చాలా బాగా రాణిస్తోంది. తనకు పదకొండేళ్లు. అయిదో తరగతి చదువుతోంది. వాళ్లమ్మ సంగీత గృహిణి.. నాన్న గిరిధర్ ఫొటోగ్రాఫర్. చిన్నప్పటి నుంచే రకరకాల ఆటల పట్ల ఎక్కువ ఆసక్తి చూపించేదట. దాంతో అమ్మానాన్నలు వుషు శిక్షణలో చేర్పించారు. అందులో మంచి పట్టు సాధించి.. సబ్ జూనియర్ స్థాయిలో 27 కిలోల కంటే తక్కువ విభాగంలో కర్ణాటక ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తరవాత రాష్ట్రస్థాయిలో అయిదు సార్లు బంగారు పతకాలు




హాయ్! బుజ్జీ!!



సాధించింది తెలుసా నేస్తాలూ! ఏడేళ్ల వయసులోనే అంత ర్జాతీయ స్థాయిలో పతకాన్ని అందుకుంది. ఇటీవల జార్జియాలో జరిగిన వుషు పోటీల్లోనైతే మన దేశం తరఫున పోటీ పడి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. ఖేలో ఇండియా వుషు పోటీల్లో బంగారు, వెండి పతకాలు.. దక్కించుకుంది మన ప్రణతి. ఈ విభాగంలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించడం, బాగా చదువుకుని ఐఏఎస్ అధికారి అవ్వడమే తన లక్ష్యమట.

– ఇ.ఈరన్న



ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
మంగళవారం ఆగస్టు 26, 2025

పట్టిస్తుంది.. కట్టిస్తుంది..!

ఉల్లంఘనదారులపై డ్రోన్ నిఘా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే


శిరస్త్రాణం లేని వారిని ఇలా ఫొటో తీసి..

డ్రోన్లు... నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం తాగుతున్న వారిని ఆట కట్టించాయి. పోలీసుల కళ్లుగప్పి జూదమాడే వారిని వెంటాడి మరీ గుర్తించాయి. కోడి పందేల శిబిరాల గుట్టు రట్టు చేశాయి. తాజాగా ట్రాఫిక్ ఉల్లంఘనదారులను పట్టిస్తున్నాయి. పోలీసుల బారి నుంచి తప్పించుకున్నామనుకునే వారికి ఇక ముచ్చెమటలే. శిరస్త్రాణం లేకుండా జాలీగా.. రయ్ రయ్‌మని దూసుకుపోతామంటే కుదరదు. ఆకాశం నుంచి డ్రోన్ ఫొటో తీస్తుంది. రూ.1,035లు జరిమానా పంపిస్తుంది. విజయవాడ నగర పోలీసులు మరో కొత్త విధానానికి శ్రీకారం చుట్టారిలా.

ఉల్లంఘన	కేసులు
నో హెల్మెట్	88
వన్ వే ఉల్లంఘన	81
రాంగ్ పార్కింగ్	1
డేంజరస్ డ్రైవింగ్	2
బ్లాక్ ఫిల్మ్	1
సిగ్నల్ జంప్	1

6 ట్రాఫిక్ స్టేషన్ల పరిధిలోనూ.. జులై 31న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా.. విజయవాడ ట్రాఫిక్ పోలీసులకు 14 డ్రోన్లు అందించారు. ఆగస్టు 5 నుంచి వారు రంగంలోకి దిగిపోయారు. 6 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉల్లంఘనదారుల ఆట కట్టిస్తున్నారు. ఆకాశం నుంచి నిఘా ఉంచి ఉల్లంఘనదారుల ఫొటోలు తీస్తున్నారు. వాహనాల నంబరు ప్లేట్ల ఆధారంగా చలానాలు పంపిస్తున్నారు.

20 రోజుల్లోనే.. శిరస్త్రాణం లేకపోవడం, రాంగ్ పార్కింగ్, వన్‌వే ఉల్లంఘన, ప్రమాదకర డ్రైవింగ్ (ట్రిపుల్ రైడింగ్), బ్లాక్ ఫిల్మ్, సిగ్నల్ జంప్... వంటి వాటిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఒక్కో దానికి రూ.1,035లు చొప్పున జరిమానా విధిస్తున్నారు. ఆగస్టు 5 నుంచి 24 వరకు మొత్తం 174 కేసులు నమోదు కాగా.. ఉల్లంఘనదారులకు రూ.1.77 లక్షలు జరిమానా విధించారు.

ఆహ్లాద తీరం.. శుభ్రత దూరం



విజయవాడ నగరంలో పర్యాటక కేంద్రాల్లో ఒకటైన బెరంపార్కు లాంచ్ స్టేషన్ వద్ద ఇటీవల వరదలకు కొట్టుకొచ్చిన గుర్రపు డెక్కతో పాటు చెత్తా చెదారం పేరుకుపోయాయి. వరదల నేపథ్యంలో పర్యాటకుల కోసం పడవలను నడపడం లేదు. అయినప్పటికీ సాయంత్రం వేళల్లో సేద తీరడానికి వచ్చే సందర్శకులకు లాంచ్ స్టేషన్ వద్ద ఉన్న ఈ అపరిశుభ్ర పరిసరాలు కాస్తంత ఇబ్బందిగా ఉన్నాయి. పర్యాటకులు అధికంగా వచ్చే ఈ ప్రాంతంలో వీటిని తొలగిస్తే మంచిదని సందర్శకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.
-ఈనాడు, అమరావతి

పశ్చిమ బైపాస్‌పై.. సంక్రాంతికి రయ్.. రయ్..

ఎన్‌హెచ్-16పై ముమ్మరంగా అనుసంధాన పనులు

ఈనాడు, అమరావతి

పశ్చిమ బైపాస్‌పై పెద్ద పండగకు ప్రయాణం మొదలు కానుంది. ఆ దిశగా అధికారులు వడివడిగా పనులు చేపడుతున్నారు. ఓ వైపు ప్యాకేజీ-3లో హైటెన్షన్ టవర్ల మార్పిడి అంశంపై వారంలో స్పష్టత రానుండగా..మరో వైపు ప్యాకేజీ ల్యాండింగ్ పనులు సాగుతున్నాయి.

ఎన్‌హెచ్-16పై కాజ దగ్గర వెస్ట్ బైపాస్ ల్యాండింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే వాహనాలు అనుసంధాన ప్రాంతానికి రాకుండా సర్వీస్ రహదారి నుంచి మళ్లించి 100 మీటర్ల దూరం తర్వాత హైవే ఎక్కించారు. ఈ పనులు పూర్తి చేసిన తర్వాత గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను సైతం ఇలాగే డైవర్షన్ చేయనున్నారు. అనుసంధానం చేస్తున్న ప్రాంతంలో సర్వీస్ రహదారులను వేరు చేస్తూ, ప్రమాదాలకు తావు లేకుండా 230 మీటర్ల రక్షణ గోడ నిర్మాణం చేపట్టనున్నారు. బైపాస్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా ఎన్‌హెచ్16 మీదకు వెళ్లిపోతాయి. బైపాస్ నుంచి విజయవాడ వెళ్లే వారు యూటర్న్ తిరిగేందుకు అనువుగా, ప్రమాదాలు జరగకుండా చూసుకునేందుకు మరో రెండు వరుసలు రోడ్డు వేస్తారు. ఈ మొత్తం పనులు జరగడానికి మూడు నెలల వరకు సమయం పడుతుందని చెబుతున్నారు. తాజాగా కొండవీటి వాగు దగ్గర నీరు తరలించేందుకు 50 మీటర్ల మేర ఎన్‌హెచ్‌ని తవ్వేయగా రెండు వారాల్లో ఆ రహదారి మళ్లీ నిర్మించే పనులు పూర్తి చేస్తారు.


కాజ సమీపంలో పొక్లెయిన్‌తో నేల చదును చేస్తూ..

విద్యుత్తు టవర్ల సమస్య దాదాపు కొలిక్కి..

ఏడు నెలలుగా రైతులతో వచ్చిన విద్యుత్తు హైటెన్షన్ లైన్ల అలైన్‌మెంట్ వివాదం దాదాపు కొలిక్కి వచ్చింది. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ లైన్ల అలైన్‌మెంట్ మార్పు చేయాలన్న ప్రతిపాదనను ఎన్‌హెచ్ఏఐ విరమించుకుంది. పాత అలైన్‌మెంట్‌లోనే విద్యుత్తు టవర్ల ఎత్తు పెంచి రహదారి నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు కోరుతూ ప్రతిపాదనలు దిల్లీకి పంపారు. వారంలో అనుమతులు రానున్నాయి. అనుమతులు సైతం లాంఛనమే కావడంతో నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. ఈ పనులు సైతం డిసెంబరు చివరి కల్లా పూర్తి చేయనున్నారు.

✱ ప్యాకేజీ-1లో గుండుగొలను-కలపర్రు, ప్యాకేజీ-2 కలపర్రు-చినఆవుటపల్లి పనులు ఇప్పటికే పూర్తి చేశారు. ప్యాకేజీ-3 చినఆవుటపల్లి-గొల్లపూడి, ప్యాకేజీ-4 గొల్లపూడి-కాజ వరకు జరగాల్సిన పనులకు అడ్డంకులు దాదాపు పూర్తి చేశారు. దీంతో సంక్రాంతికి రహదారిపై ప్రయాణం మొదలవుతుందన్న లెక్క పక్కాగా కనిపిస్తోంది.

ఫైనల్ ఎంబీబీఎస్ ఫలితాలు విడుదల

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: జులైలో జరిగిన ఓల్డ్ రెగ్యులేషన్స్ ఎంబీబీఎస్ పార్ట్-1, పార్ట్-2 పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జాతీయ వైద్య కమిషన్, విశ్వవిద్యాలయం మార్గనిర్దేశకాల మేరకు గ్రేస్ మార్కులు కలిపిన తరువాతే ఫలితాలు విడుదల చేశామని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఎంబీబీఎస్ పార్ట్-2 ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 31వ తేదీ నుంచి ఇంటర్న్‌షిప్ మొదలవుతుందని చెప్పారు. రీటోటలింగ్ కోరే అభ్యర్థులు సబ్జెక్టుకు రూ.2000 చొప్పున 31వ తేదీలోగా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కొనసాగుతున్న కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్ : ప్రకాశం బ్యారేజీ వద్ద సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు క్రమేపీ వరద తగ్గింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 3,45,820 క్యూసెక్కులు రాగా, 3,28,125 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. రాత్రి 9 గంటలకు 2,99,403 రాగా, సముద్రంలోకి 2,81,000 క్యూసెక్కులు వదిలారు. కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు 18,403 క్యూసెక్కులు ఇస్తున్నారు.

ప్రపంచ రికార్డుకు సన్నద్ధం



బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా

అంశం: మట్టి గణపతుల తయారీ
వేదిక: ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం
సమయం: నేటి ఉదయం 9.30 నుంచి 10.30 వరకు

ఎన్టీఆర్ కలెక్టరేట్: వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించుకునేలా ప్రజలను జాగృతం చేయనున్నారు. ఈ క్రమంలో మట్టి, ఇతర ఎకో ఫ్రెండ్లీ గణేశ ప్రతిమల తయారీలో ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. 26వ తేదీ మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో సుమారు 5,000 పర్యావరణ హిత వినాయక ప్రతిమల తయారీని ఒకేసారి నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించి అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజలు తమ ఇళ్ల వద్దే మట్టి లేదా సహజ సిద్ధంగా లభ్యమయ్యే వాటితో వినాయక ప్రతిమలను తయారు చేసి, వాటి ఫొటోలను 'ఎన్టీఆర్ ఇగ్నైట్' యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. రకరకాల గింజలు, ఆకులు, కూరగాయలు వంటి వాటితో ప్రతిమలను తయారు చేస్తున్నారని, వీటి ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. జేసీ ఇలక్కియా, ఆర్డీవో కావూరి చైతన్య, పీసీబీ ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బార్లకు అరకొరగా దరఖాస్తులు

మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌ల మంజూరే కారణమా?

ఈనాడు, అమరావతి

బార్ల ఏర్పాటుకు సంబంధించి పిలిచిన నోటిఫికేషన్‌కు సోమవారం వరకు పెద్దగా స్పందన కనిపించలేదు. మంగళవారం సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు సమర్పించడానికి అవకాశం ఉంది. ఇప్పటికే మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌లను మంజూరు చేయడంతో బార్లను దక్కించుకునేందుకు వ్యాపారులు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదని తెలిసింది. ఈ మేరకు సోమవారం నగరంలో బార్ల యజమానుల సంఘం సమావేశం నిర్వహించినట్లు సమాచారం. దుకాణాలకు ఇచ్చినట్లుగా కమీషన్ లేకపోవడం, నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీయడం, వంటి నిబంధనలు తమకు భారమవుతాయని, నష్టాల బారిన పడడం ఖాయమని పలువురు అభిప్రాయపడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో చాలా తక్కువ దరఖాస్తులు వచ్చినట్లు భావిస్తున్నారు. చివరి రోజైన మంగళవారం ఎక్కువ మంది పోటీ పడే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

✱ ఎన్టీఆర్ జిల్లాలో ఓపెన్ కేటగిరీలో మొత్తం 130 బార్లకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. వీటిలో 117 బార్లు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోనే ఉన్నాయి. రాత్రి 11 గంటల సమయానికి 210 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 13 మంది దరఖాస్తు చేసుకున్నారు. కృష్ణా జిల్లాలో 39 బార్లకు దరఖాస్తులు పిలిచారు. తాడిగడప పురపాలిక పరిధిలో అత్యధికంగా 14 బార్లను నోటిఫై చేశారు. వీటికిగాను 108 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 14 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

బిడ్డను అమ్ముతామని.. మోసం

తెలంగాణ దంపతులకు.. విజయవాడలో టోకరా

ఈనాడు, అమరావతి
– విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

తెలంగాణలోని నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన సంతానం లేని దంపతులకు.. బిడ్డను ఇస్తామని నమ్మించి విజయవాడకు తీసుకొచ్చి మరీ ఓ ముఠా మోసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు దశల్లో రూ.4 లక్షలు వసూలు చేసి.. అనంతరం ముఠా సభ్యులు ఫోన్లను స్విచాఫ్ చేసి పరారయ్యారు. దీంతో మోసపోయామని గుర్తించిన బాధితులు.. సోమవారం కలెక్టర్, పోలీసు కమిషనర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు.

బాధితుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని బొడ్రాయి బజార్‌కు చెందిన దాసరి శివ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శివకు వరుసకు సోదరి అయిన తమ్మడగోని మౌనికకు సంతానం లేరు. ఈమె భర్త అశోక్. వీళ్లిద్దరూ పిల్లాడిని దత్తత తీసుకుందామనుకున్నారు. శివ తనకు పరిచయం ఉన్న కవిలి లక్ష్మణ్‌రెడ్డికి ఈ విషయం చెప్పాడు. విజయవాడలో ఓ వైద్యురాలు తెలుసని, నిబంధనల ప్రకారమే.. కలెక్టర్ ఆధ్వర్యంలోనే రిజిస్ట్రేషన్ చేసి మరీ పిల్లాడిని దత్తతకు ఇప్పిస్తానంటూ లక్ష్మణ్‌రెడ్డి చెప్పాడు. రూ.4 లక్షలు ఖర్చవుతుందనడంతో.. మౌనిక, అశోక్ అంగీకరించారు. అడ్వాన్స్‌గా రూ.2లక్షలు తీసుకుని, మిగతావి బాబుని ఇచ్చాక.. ఇవ్వండంటూ నమ్మించాడు.

విజయవాడకు పిలిపించి.. డబ్బులు తీసుకుని రెండు నెలలు దాటినా బిడ్డను ఇవ్వకపోవడంతో మౌనిక దంపతులు, శివ ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈనెల 18న వెంటనే బయలుదేరి విజయవాడకు రావాలని లక్ష్మణ్‌రెడ్డి చెప్పాడు. వచ్చే ముందు బుర్ర శ్రీలలిత పేరుతో ఉన్న నంబర్‌కు రూ.10 వేలు, బబ్బూరి శ్రీనివాస్ పేరుతో ఉన్న మరో నంబర్‌కు రూ.వెయ్యి డబ్బులు పంపించమని చెప్పాడు. వేశాక.. రూ.2 లక్షలు పట్టుకుని విజయవాడకు రమ్మన్నాడు. ఆరోజు సాయంత్రం 6గంటలకు విజయవాడకు చేరుకోగా.. పున్నమిఘాట్ వద్దకు రమ్మన్నాడు. అక్కడ మౌలాలి అనే వ్యక్తిని పరిచయం చేశాడు. అతనితో కలిసి రాత్రి 12 గంటలకు విజయవాడ కొత్తాసుపత్రి వద్దకు వీళ్లను తీసుకెళ్లాడు. అక్కడ ఫాతిమా అనే మహిళను మౌలాలి పరిచయం చేసి, వైద్యురాలనీ, బిడ్డను ఈవిడే ఇస్తుందని చెప్పాడు. రూ.2లక్షలు ఆమెకు ఇవ్వమని చెప్పారు. అలాగే ఇవ్వడంతో.. వాళ్లు అక్కడి నుంచి లోపలకు వెళ్లిపోయారు. ఉదయం 4గంటల సమయంలో మళ్లీ వచ్చి అందరూ మేల్కొని ఉన్నారనీ, బిడ్డను తీసుకురావడం సాధ్యం కాలేదని చెప్పింది. ఆ తర్వాత నుంచి లక్ష్మణ్‌రెడ్డితో సహా ముగ్గురి ఫోన్లు స్విచాఫ్ అయిపోయాయి.

ప్రమాదమైనా తలవంచాల్సిందే

ఇద్దరు యువకులను కాపాడిన శిరస్త్రాణం


ఆర్టీసీ బస్సు కిందకు వెళ్లిపోయిన ద్విచక్ర వాహనం


స్వల్పగాయాలతో బయటపడి..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నగరంలో త్రుటిలో పెను ప్రమాదం తప్పిపోయింది. యూటర్న్ తిరుగుతూ కింద పడిపోయిన ద్విచక్రవాహనం పైకి ఆర్టీసీ బస్సు దూసుకువెళ్లింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ శిరస్త్రాణాలు ధరించడంతో.. స్వల్ప గాయాలతో తప్పించుకున్నారు. ప్రమాదం తీరును చూసిన ప్రత్యక్ష సాక్షులు ఉలికిపాటుకు గురయ్యారు. శిరస్త్రాణం ధరించడం వల్లే ఇద్దరూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు.

ప్రమాదం జరిగిందిలా... బీదల మోహనకుమార్.. మరో యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. నగరంలోని వై కూడలి వద్ద యూ టర్న్ తీసుకుంటూ ముందు వెళుతున్న వ్యాన్‌కు తగిలారు. అదుపు తప్పి పడిపోయారు. ఎదురుగా... వేగంగా ఆర్టీసీ బస్సు వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం బస్సు ముందు చక్రం కిందకు వెళ్లిపోయింది. యువకులు ఇద్దరు వెనక్కి పడిపోయారు. వారు శిరస్త్రాణం ధరించి ఉండడంతో.. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శిరస్త్రాణాలు లేకపోతే తలలకు బలమైన గాయాలు అయ్యేవని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై బేగ్ తన సిబ్బందితో వచ్చి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. శిరస్త్రాణం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎస్సై పేర్కొన్నారు.

మట్టిమేలు తలపెట్టవోయ్!

ఇంటింటి గణపతిపై పర్యావరణ ప్రేమికుల దృష్టి

ఈనాడు, అమరావతి– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా చేసుకోవాలనే చైతన్యం గత కొన్నేళ్లలో విస్తృతంగా పెరిగింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో కొందరు పర్యావరణ ప్రేమికులు వేల సంఖ్యలో మట్టి గణపతి ప్రతిమలను తయారు చేసి పంపిణీ చేస్తున్నారు. ఏటా వీధుల్లో ఏర్పాటు చేసే పెద్ద విగ్రహాల కంటే ఇళ్లల్లో పూజించే లక్షల సంఖ్యలోని చిన్న ప్రతిమల వల్లే అధికంగా జల కాలుష్యం జరుగుతోందని వీరు గుర్తించారు. అందుకే ఇళ్లల్లో పూజించే ప్రతి విగ్రహం మట్టిదే అవ్వాలనే లక్ష్యంతో వీరు ముందుకు సాగుతున్నారు. వాటిని ఇంటికి సమీపంలోని చెరువుల్లో కలిపేస్తున్నా ఎలాంటి నష్టం ఉండడం లేదు.

పర్యావరణానికి.. 'ప్రయోజ'నం.. విజయవాడలో ప్రయోజ్ ఫౌండేషన్ ఇండియా ఐదేళ్ల నుంచి ఏటా వేల సంఖ్యలో మట్టి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేస్తోంది. మంగళవారం సాయంత్రం బెంజి సర్కిల్ ఆంజనేయస్వామిగుడి, పీవీపీ మాల్, ఇందిరాగాంధీ మైదానం, బుధవారం ఉదయం విద్యాధరపురం, కుమ్మరిపాలెం సెంటర్లలో పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు మణి పోలవరపు తెలిపారు.



మొగల్రాజపురంలో ఏటా పంపిణీ.. విజయవాడ మొగల్రాజపురం మొఘల్ ఫంక్షన్ హాల్ ఎదురు రోడ్డులోని రేణుక ఎన్‌క్లేవ్ వద్ద ఏటా బాల సుబ్రహ్మణ్య సాయిరామ్ అనే పర్యావరణ ప్రేమికుడి ఆధ్వర్యంలో ఏటా 500 మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ఆరంభిస్తామని తెలిపారు.



గణపతి కరిగి.. మొక్కగా పెరిగి.. వివేకానంద యూత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా ఎన్టీఆర్ జిల్లాలో పెద్ద సంఖ్యలో మట్టి ప్రతిమలు తయారు చేసి పంపిణీ చేస్తున్నారు. వీటిల్లో వినియోగించే మట్టిలో.. **పూల మొక్కల విత్తనాలు కలుపుతున్నారు.** పూజించిన తర్వాత వీటిని కుండీలు, ఇంటి ఆవరణలో ఎక్కడైనా నిమజ్జనం చేస్తే.. మొక్కలు పెరుగుతాయని సంస్థ వ్యవస్థాపకులు కృష్ణ ప్రసన్న ఛైట్ల తెలిపారు.

ఆరేళ్ల నుంచి వేల సంఖ్యలో.. ఉయ్యూరులో గత ఆరేళ్ల నుంచి డీజేఆర్ మెమోరియల్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో మట్టి ప్రతిమలు పంచుతున్నారు. ఈ ఏడాది 7వేల విగ్రహాలు సిద్ధం చేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు దండమూడి చౌదరి తెలిపారు. ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఈ విగ్రహాలు పంపిణీ చేస్తున్నారు.

రాజధాని గ్రామాల్లో

రూ.904 కోట్లతో మౌలిక వసతులు

ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ

ఈనాడు - అమరావతి; రాజధాని అమరావతిలో ఎల్పీఎస్ జోన్లలోని గ్రామాల్లో రూ.904 కోట్లతో మౌలిక వసతులు సమకూర్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ సోమవారం జీవో జారీ చేశారు. ఏడేళ్ల పాటు నిర్వహణకు, ఈపీసీ విధానంలో జోన్ల వారీగా టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం అనుమతించింది. మరో జీవోలో.. సీఆర్డీఏ ప్రాజెక్టు భవనానికి సంబంధించి ఆర్కిటెక్చరల్, అంతర్గత, ఇతర పనులకు వ్యయం చేసేందుకు రూ.160 కోట్లకు ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతి మంజూరు చేసింది. ఇంకో జీవోలో.. రాజధానిలో తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి మిగిలిన పనులు చేపట్టేందుకు రెండు ప్యాకేజీలకు రూ.411.53 కోట్లు, రూ.376.80 కోట్లు చొప్పున ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.



అర్జీలు పునరావృతమైతే అధికారులదే బాధ్యత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీల పరిష్కారంలో స్పష్టత ఉండాలని, ఇవి పునరావృతమైతే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అధికారులనుద్దేశించి మాట్లాడారు. ప్రజల నుంచి మొత్తం 187 అర్జీలు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు అధికంగా 53 వినతులు అందాయి. పోలీస్ 30, మున్సిపల్ 22, విద్య 18, పంచాయతీరాజ్ 10, ఆరోగ్య శాఖ 9, డీఆర్డీఏ 7, ఏపీ సీపీ డీసీఎల్, పౌరసరఫరాలకు అయిదేసి, విభిన్న ప్రతిభావంతులు, రిజిస్ట్రేషన్, సర్వే, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్‌కు నాలుగేసి, జలవనరులు, గిరిజన సంక్షేమం, వ్యవసాయ శాఖలకు రెండేసి, సాంకేతిక విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, బ్యాంకు, ఐసీడీఎస్, దేవాదాయ, సాంఘిక సంక్షేమ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అందాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనీస పింఛను రూ.9,000 ఇవ్వాల్సిందే


పీఎఫ్ కార్యాలయం వద్ద అమరయ్య శాస్త్రి, శ్రీనివాసరావు తదితరుల నిరసన

ఎన్టీఆర్ కలెక్టరేట్: కనీస పింఛను రూ.9,000లు చెల్లించాలని, ఆరు నెలలకు డీఏ ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్ల అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) ఉమ్మడి కృష్ణా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడ దుర్గాఅగ్రహారంలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. మెరుగైన వైద్య సౌకర్యం కల్పించడంతో పాటు, రైల్వేలో రాయితీ పాస్‌లను మంజూరు చేయాలని కోరారు. ఏపీఆర్‌పీఏ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎన్.అమరయ్యశాస్త్రి, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కోశాధికారి వి.రాజేశ్వరరావు తదితరులు నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ, డెయిరీ, ఏపీహెచ్ఎంఈఎల్, ఉయ్యూరు, చల్లపల్లి కేసీపీ, బీఈఎల్, సహకార, పత్రికారంగం, బ్యాంకింగ్, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఈపీఎఫ్ పింఛనర్లు పాల్గొన్నారు.

పాలిథిన్‌పై.. పారాహుషార్!

తిరుపతమ్మ సన్నిధిలో స్వచ్ఛ అడుగులు

న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవాలయంలో ప్లాస్టిక్ నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విజన్-2047లో భాగంగా సంయుక్త కమిషనర్, ఉప కమిషనర్, కమిషనర్ కేడర్‌లో ఉన్న ఆలయ ప్రాంగణాలను ప్లాస్టిక్ రహిత ప్రదేశాలుగా మార్చాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందులో భాగంగా ఉప కమిషనర్ కేడర్‌లో ఉన్న తిరుపతమ్మ దేవాలయంలో ప్లాస్టిక్ నిర్మూలనకు శ్రీకారం చుట్టారు.


మోదుగ ఆకుల్లో భోజనం చేస్తున్న భక్తులు

కాగిత సంచుల్లో ప్రసాదం: ఆలయంలో నిత్యం సుమారు 350 మందికి అన్నదానం చేస్తుంటారు. వీరికి గతంలో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ ప్లేట్లలో భోజనాలు వడ్డించేవారు. ప్రస్తుతం వాటి స్థానంలో మోదుగాకులను వినియోగిస్తున్నారు. త్వరలో అరటి ఆకులు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆకులతో తయారు చేసిన కప్పుల్లో ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలను పేపర్ కవర్లలో అందజేస్తున్నారు.

దుకాణాల్లో విక్రయాలను అరికట్టాలి.. ఆలయంలో పలు దుకాణాల్లో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నారు. కొబ్బరికాయలు, బొమ్మల దుకాణాలు, క్యాంటీన్‌లో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ కవర్లను భక్తులకు ఇస్తున్నారు. భక్తుల తాగునీటి అవసరాల కోసం ఆలయ ప్రాంగణంలో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఉన్నా సీసా నీళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. వీటిని కూడా అరికట్టాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉంది.

ప్లాస్టిక్ రహితానికే పెద్దపీట: కిశోర్‌కుమార్, ఈవో

ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్ని దుకాణాల్లో ఒకసారి వాడేసే ప్లాస్టిక్‌ను మళ్లీ వినియోగించరాదని వ్యాపారులకు నోటీసులు ఇచ్చాం. దేవస్థానం పరంగా అన్నిచోట్ల ప్లాస్టిక్ రహిత వస్తువులనే వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై విస్తృతంగా ప్రచారం చేస్తాం. ఇక్కడకు వచ్చే భక్తులు కూడా ప్లాస్టిక్ కవర్లను తీసుకురావద్దని కోరుతున్నాం.

డబ్బు కోసం వెతికితే.. గంజాయి దొరికింది

కృష్ణలంక, న్యూస్‌టుడే: బస్సులో డబ్బులు పోయినట్లు మహిళ చేసిన ఫిర్యాదుతో సోదాలు చేపట్టిన పోలీసులకు గంజాయి దొరికిన ఘటన పీఎన్‌బీఎస్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. టీఎస్‌ఆర్టీసీకి చెందిన బస్సు సోమవారం విజయవాడ బస్‌స్టేషన్ నుంచి హైదరాబాద్ బయలుదేరుతోంది. బ్యాగులో ఉండాల్సిన రూ.25 వేల నగదు కనిపించలేదని అందులో ప్రయాణిస్తున్న మహిళ ఆర్టీసీ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ భద్రతా సిబ్బంది సోదాలు చేపట్టారు. ఆ సమయంలో బస్సులోని ఓ ప్రయాణికుడు కంగారుపడుతున్న విషయాన్ని గమనించారు. అతడి సంచి కూడా తనిఖీ చేశారు. అందులో ఐదు కిలోల గంజాయి బండిల్స్ ఉన్నట్లు గుర్తించారు. కృష్ణలంక పోలీసులకు సమాచారం అందించగా నిందితుడిని అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎండీ రిజ్వాన్‌గా గుర్తించారు. ప్రస్తుతం అతడు ఒడిశా రాష్ట్రం కటక్ జిల్లా శాలిపూర్‌లో ఉంటున్నట్లు చెప్పాడు. గంజాయి ద్వారా అధికంగా సంపాదించవచ్చని ఒడిశాలో కొని హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపాడు. గంజాయితో సోమవారం విజయవాడ స్టేషన్‌లో రైలు దిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు బస్సెక్కినట్లు చెప్పాడు.

కరుణ కురవాలి.. కనుపాప మెరవాలి..

నెలలు నిండకుండా పుట్టిన బిడ్డకు తీవ్ర అనారోగ్యం ☆ సాయం కోసం వేడుకోలు

ఆ దంపతులు.. సంతానం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. రెండు సార్లు అబార్షన్. మూడోసారి గర్భం రావడంతో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. నెలలు నిండకుండా.. ఏడో నెలలోనే మగబిడ్డ జన్మించడంతో క్లిష్టమైన పరిస్థితి నెలకొంది. ఐసీయూలో రెండు నెలలు ఉంచి చికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. లేకలేక పుట్టిన బిడ్డ కోసం ఇంట్లో ఉన్న నగలు, బంగారం అమ్మేశారు. మరో నెలన్నర రోజులు ఐసీయూలో ఉండాలనడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. చిరుద్యోగం చేసే తండ్రి.. అంత ఖర్చు భరించలేక దాతల సాయం కోరుతున్నారు. సహృదయులు కనికరిస్తే బిడ్డను కాపాడుకుంటామంటూ చేతులు జోడించి వేడుకుంటున్నారు.
గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మర్రిపూడి శివసాయి రమణ.. ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటారు. విజయవాడలో పని చేసి.. ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆయన భార్య ప్రియాంక ఈ నెల 6న మగబిడ్డకు జన్మనిచ్చారు. అయితే 7వ నెలలో పుట్టిన చిన్నారి.. బరువు తక్కువగా ఉండడంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తాయి. లంగ్స్ పూర్తిగా ఏర్పడలేదు. పసికందును నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స చేయాలనడంతో హైదరాబాద్‌లోని ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో చేర్చారు. వైద్య ఖర్చుల కోసం ఇంట్లోని బంగారం అమ్మేశారు. స్నేహితులు, బంధువులు కొంత మేర సాయం చేశారు. ఇలా రోజుకు రూ.75వేల చొప్పున 16 రోజుల పాటు ఆసుపత్రి ఖర్చులు భరించారు. మరో నెలన్నర పాటు ఐసీయూలోనే ఉంచాలని వైద్యులు చెప్పారు. అంత ఖర్చు భరించలేక.. ఆ దంపతులు దాతల సాయం కోరుతున్నారు.


ఐసీయూలో చికిత్స పొందుతున్న చిన్నారి

పేరు : మర్రిపూడి శివసాయి రమణ
బ్యాంకు పేరు : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు
శాఖ : గురునానక్ కాలనీ, విజయవాడ
ఖాతా నెంబరు : 50100314409367
ఐఎఫ్‌సీ కోడ్ : HDFC0009062
ఫోన్ పే/ గూగుల్‌పే: 77992 25111

– విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే

డిమాండ్ల సాధనకు 15 నుంచి నిరసనలు


మాట్లాడుతున్న విద్యుత్తు ఉద్యోగుల సంఘం జేఏసీ ఛైర్మన్ కృష్ణయ్య, పక్కన కన్వీనర్ రాఘవరెడ్డి, కో ఛైర్మన్ శేషరెడ్డి తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పరిష్కారం లభించని నేపథ్యంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ ఎస్. కృష్ణయ్య అన్నారు. విజయవాడ గుణదలలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వైకాపా ప్రభుత్వ హయాంలో [illegible] గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక [illegible] తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలనే ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. కో ఛైర్మన్ కేవీ శేషరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఆందోళనలు చేస్తే అరెస్టులు చేసి కేసులు పెట్టారని, రివర్స్ పీఆర్సీని బహుమతిగా ఇచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా తమ సమస్యలపై దృష్టి పెట్టలేదని, మేనేజ్‌మెంట్ నుంచి ఎటువంటి స్పందన లేనందున వచ్చే నెల 15 నుంచి 22వ తేదీ వరకు [illegible] నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. [illegible] రించారు. జేఏసీ కన్వీనర్ ఎం. వీరరాఘవరెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్ డీఏలు, నగదు రహిత వైద్యం, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. తొలుత జేఏసీ నేతలు విద్యుత్తు సౌధలో ట్రాన్స్‌కో జేఎండీ చేకూరి కీర్తి, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబును కలిసి ఆందోళన కార్యక్రమాల నోటీస్ అందజేశారు.

యువ ఆంధ్రా కబడ్డీ లీగ్ విజేత అమరావతి క్రషర్స్


క్రాంతికుమార్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు సారథి, క్రీడాకారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక చెన్నుపాటి రామకోటయ్య నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో పదకొండు రోజులుగా జరిగిన 'యువ ఆంధ్రా కబడ్డీ లీగ్ టోర్నీ'లో అమరావతి క్రషర్స్ జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకోగా.. కర్నూలు నైట్స్ జట్టు రన్నరప్ ట్రోఫీ సొంతం చేసుకుంది. సూపర్-4లోని లీగ్‌లో చివరి రోజైన సోమవారం జరిగిన మ్యాచ్‌ల్లో అమరావతి క్రషర్స్ జట్టు.. కర్నూలు నైట్స్ జట్టుపై గెలుపొంది లీగ్‌లో అత్యధిక పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. ముందుగా జరిగిన మరో మ్యాచ్‌లో విజయనగరం నింజాస్ జట్టు.. వైజాగ్ కమెండోస్ జట్టుపై విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి తెదేపా నాయకుడు క్రాంతికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీ బహూకరించారు. ఆంధ్రా కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. అర్జునరావు, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ రన్నరప్ ట్రోఫీ అందజేశారు. ఆంధ్రా కబడ్డీ సంఘం కోశాధికారి ఎం. సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి కేవీ నాంచారయ్య, యువ కబడ్డీ సిరీస్ సీఈవో వికాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, 124, 195 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

దీపారాధన చేస్తుండగా ప్రమాదం.. వృద్ధురాలి మృతి

మైలవరం, న్యూస్‌టుడే: దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకోవడంతో మండలంలోని దాసుళ్లపాలేనికి చెందిన అప్పిడి పుల్లమ్మ(83) మరణించారు. గ్రామంలోని కుమారుని వద్ద ఉంటున్న ఆమె, సోమవారం ఇంట్లో దీపారాధన చేస్తుండగా ఆ మంట చీరకు అంటుకుంది. ఈ క్రమంలో కేకలేయడంతో, కుటుంబ సభ్యులు గమనించి తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు విజయవాడ సమాచారం అందినట్లు ఎస్సై కె.సుధాకర్ వివరించారు.

ప్రజా సంఘాల నాయకులపై కేసు కొట్టివేత

మధురానగర్, న్యూస్‌టుడే : కరోనా సమయంలో మద్యం దుకాణాలు తెరవద్దని ఆందోళన చేసిన ప్రజా సంఘాల నాయకులపై గత వైకాపా ప్రభుత్వం పెట్టిన కేసులను కొట్టివేశారు. గత ప్రభుత్వ పరిపాలనలో... ఐద్వా మహిళా నాయకులు డి. రమాదేవి, పి.శ్రీదేవి, కె.స్వరూపరాణి, సీఐటీయూ నాయకులు ఎ.వి.నాగేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, కేవీపీఎస్ నాయకులు ఆంధ్ర మాల్యాద్రి, ఇఫ్ట్యూ నాయకులు పోలారి, ప్రజా సంఘాల నేత కృష్ణమూర్తి తదితరులు బి.ఆర్.టి.ఎస్.రోడ్డు మధురానగర్ వంతెన వద్ద ఆందోళనకు దిగారు. దీనిపై గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును మంగళవారం న్యాయస్థానంలో కొట్టివేశారు. ప్రజా సంఘాల తరఫున న్యాయవాది రమేష్ వాదించారు.

మట్టి గణపతి ప్రతిమల ఉచిత పంపిణీ నేడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : వినాయక చవితి సందర్భంగా మహాత్మా గాంధీ రోడ్డు విజయ కృష్ణా సూపర్ బజార్ ఎదురుగా ఉన్న పైలట్ సర్వీస్ స్టేషన్ పెట్రోల్ బంక్‌లో మంగళవారం ఉచితంగా మట్టి గణపతి బొమ్మలు పంపిణీ చేస్తున్నట్లు మేనేజర్ కె. వెంకటప్పయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పంపిణీ చేయనున్నారు. ప్రజలు వినియోగించుకోవాలని బంక్ యజమానులు ఎం.వి.వి.సత్యనారాయణ, నందకిషోర్‌లు కోరారు.

పింఛను.. ఉద్యోగి హక్కు


ఐక్యత చాటుతున్న విద్యాసాగర్, లక్ష్మణరావు, రామకృష్ణ, సాయి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు


ప్లకార్డులతో నినదిస్తున్న ఉపాధ్యాయులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : సీపీఎస్‌తో ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, పాత పింఛను విధానం సాధించే వరకు తమ పోరాటం ఆగదని డీఎస్సీ- 2003 ఉపాధ్యాయుల ఫోరం స్పష్టం చేసింది. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించింది. ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో మహా ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 'పాత పింఛను మా హక్కు, ఇచ్చి తీరాల్సిందే' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ మాట్లాడారు. పింఛను ఉద్యోగి హక్కు అని, తప్పనిసరిగా ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు చేసే పోరాటాలకు ఏపీ ఎన్జీవో పూర్తి మద్దతిస్తుందని చెప్పారు. ఫోరం నాయకులు మోపిదేవి శివశంకరరావు, తుమ్ము నాగరాజు మాట్లాడుతూ.. 2004, సెప్టెంబరు 1 కంటే ముందే నోటిఫికేషన్ పొంది, ప్రభుత్వ జాప్యం వల్ల ఆలస్యంగా ఉద్యోగాల్లో చేరిన 7361 మంది ఉపాధ్యాయులు, 1821 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 1800 మంది ఇతర శాఖల ఉద్యోగులు మొత్తం 10,982 మందిని సీపీఎస్‌లో బంధించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు తాజా తీర్పు, కేంద్ర ప్రభుత్వ మెమో నంబరు-57 స్పష్టంగా పాత పింఛను హక్కు ఇస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సీపీఎస్‌ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి తదితరులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి, మాజీ ఎమ్మెల్సీలు ఎ.ఎస్.రామకృష్ణ, కె.ఎస్.లక్ష్మణరావు తదితరులు విచ్చేసి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాలాజీ, మిట్ట కృష్ణయ్య, భానుమూర్తి, కె.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, దాస్, ఒంటేరు శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్తు హర్షణీయం


వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, గోకరాజు గంగరాజు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరగా... వెంటనే స్పందించి మంజూరు చేయడం శుభపరిణామమని మంత్రి సత్యకుమార్ అన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏపీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని సమితి కార్యాలయంలో గణేష్ ఉత్సవ గీతాలు, వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడానికి సింగిల్ విండో విధానంలో ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. పర్యావరణహితంగా విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. రసాయనాలతో కూడిన పెద్ద విగ్రహాలను చెరువులు, నదుల్లో నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు. వినాయక విగ్రహాలకు ఎంతో విశిష్టత ఉందని, కొందరికి అవగాహన లేక హీరోలుగా పెడతారని.. అది మంచి పద్ధతి కాదన్నారు. మండపాల్లో అశ్లీల పాటలు, డ్యాన్సులు వేయడం సరికాదన్నారు. వాటిని కట్టడి చేయాలని, భక్తి పాటలు మాత్రమే ప్రదర్శించాలని మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో నాగలింగం శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఛాయాచిత్రాలతో మధురానుభూతి..

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : చిత్రాలు.. మధురానుభూతి కలిగిస్తాయని, అవి తరతరాలకు విజ్ఞాన వారధులని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విలువైన వనరుల సృష్టి జరగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షిస్తుంటారు, ఏది చేసినా వినూత్నంగా ఉండాలని ఆయన ప్రోత్సహిస్తుంటారని పేర్కొన్నారు. ఫొటోగ్రఫీ పోటీలతో ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించడంతో పాటు వారిలోని ప్రతిభను వెలికి తీయవచ్చని చెప్పారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలైన ఫొటోగ్రాఫర్లకు విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణితో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. నగదు, ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. చక్రపాణి మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో ఎన్నో సవాళ్లు ఉన్నా.. వాటిని ఎదుర్కొంటూ ఫొటోగ్రాఫర్లు ముందుకు వెళుతున్నారని, వృత్తి జీవితానికి వన్నె తెస్తున్నారని పేర్కొన్నారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఐపీఆర్వో కె.వి.రమణరావు, డీపీఆర్వో ఎస్.వి.మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ వేమూరి ప్రసాద్, ఫొటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు. ఛాయా చిత్ర ప్రదర్శన, పురాతన, అరుదైన కెమెరాలను అందరూ ఆసక్తిగా తిలకించారు.


కలెక్టర్ జి.లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ చక్రపాణి నుంచి అవార్డులు అందుకున్న 'ఈనాడు' ఫొటోగ్రాఫర్లు చల్లా మల్లికార్జున, దుర్గాప్రసాద్, మరిడయ్య, సంపత్‌కుమార్, సత్యనారాయణ

'ఈనాడు' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు.. ఈ ఛాయాచిత్ర పోటీల్లో ఐదుగురు ఈనాడు ఫొటోగ్రాఫర్లకు అవార్డులొచ్చాయి. తల్లికి వందనం, విద్య, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల విభాగంలో.. ఎంపీఎస్‌కే దుర్గాప్రసాద్, బి.మరిడయ్య, వై.వి.వి.సత్యనారాయణ, ఎం.సంపత్‌కుమార్‌కు బహుమతులొచ్చాయి. పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర, యోగాంధ్ర విభాగంలో.. చల్లా మల్లికార్జునకు, ఉత్తమ వార్తా చిత్రం విభాగంలో.. బి.మరిడయ్యకు బహుమతులు వచ్చాయి.

ఆస్తి వివాదాల ఫిర్యాదులే అధికం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరించారు. మొత్తం 75 ఫిర్యాదుల్లో.. భూ, ఆస్తి, నగదు లావాదేవీలు 46, మహిళా సంబంధ నేరాలు 6, కుటుంబ కలహాలు 5, కొట్లాట 2, మోసాలు 1, దొంగతనాలపై 1, ఇతర సమస్యలు 14 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపించి, సత్వరం పరిష్కరించాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు.


మహిళ సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

విజయ పాలకమండలి ఎన్నికలకు నామినేషన్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా పాల సమితి (విజయ డెయిరీ) పాలకమండలి సభ్యులను ఎన్నుకునేందుకు సోమవారం నామినేషన్లు స్వీకరించారు. ఏటా ముగ్గురు సభ్యుల పదవీ కాలం ముగుస్తుండటంతో ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. అర్జా వెంకటనగేష్, చెరుకూరి లోవయ్య, ఎన్ వాణిశ్రీల పదవీకాలం ఈ నెలతో ముగుస్తుంది. సాధారణ కేటగిరిలో పెడన మండలం, పెనుమల్లి గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు అర్జా వెంకటనగేష్, జగ్గయ్యపేట మండలం, భీమవరం గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు రామారావు, తిరువూరు మండలం, ముష్టికుంట్ల గ్రామ పాల సొసైటీ అధ్యక్షుడు గద్దె రంగారావు నామినేషన్లు దాఖలు చేశారు. మహిళా కేటగిరిలో చిట్యాల గ్రామ పాల సొసైటీ అధ్యక్షురాలు బోయపాటి సుశీల, విస్సన్నపేట మండలం, విస్సన్నపేట గ్రామ సొసైటీల అధ్యక్షురాలు నెక్కళపు వాణిశ్రీ నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో బోయపాటి సుశీల నామినేషన్‌ను ఎన్నికల అధికారి ఎల్.గురునాథం తిరస్కరించారు. ప్రస్తుతం నలుగురు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు 26వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఉంటుంది. మహిళా కేటగిరిలో ఒకరే బరిలో ఉండడంతో దాదాపు ఆమె గెలుపు ఖాయమైనట్లే. సెప్టెంబరు 2వ తేదీన జరిగే పోలింగ్‌లో 375 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని బరిలో ఉండే ముగ్గురిలో ఇద్దర్ని బోర్డు డైరెక్టర్లుగా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ప్లాట్ల ఖాళీ వ్యవహారం ఉద్రిక్తం

ఇళ్లు తొలగించేందుకు పొక్లెయిన్లతో వచ్చిన సొసైటీ సభ్యులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: జోజినగర్‌లో 42 ప్లాట్లు ఖాళీ చేయించే విషయంపై శ్రీలక్ష్మీ రమణ కోపరేటివ్ సొసైటీకి, ప్లాట్ల యజమానులకు న్యాయం చేయాలని మద్దతు నిలిచిన వారితో సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రూ.100 కోట్లు విలువచేసే స్థలాన్ని మజీద్ అనే వ్యక్తి 30 ఏళ్ల కిందట సొసైటీకి అమ్ముతున్నట్లు అగ్రిమెంట్ రాశాడు. అదే వ్యక్తి ఆ స్థలాన్ని 42 ప్లాట్లుగా విభజించి పలువురికి రిజిస్ట్రేషన్ చేశారు. ప్లాట్లు కొనుకున్న వ్యక్తులు ఇళ్లు కట్టుకున్నారు. 2014లో సొసైటీకి సంబంధించిన వ్యక్తులు స్థలం యజమానిపై కేసు వేశారు. ఆ తరువాత ప్లాట్ల యజమానులతో సంబంధం లేకుండా స్థల యజమానితో జరిగిన వివాదంలో కేసు గెలవడంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులతో ఇళ్లను తొలగించేందుకు సోమవారం పొక్లెయిన్లతో వచ్చారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు జలీల్‌ఖాన్, బొమ్మసాని సుబ్బారావు, వైకాపా నాయకులు వెలంపల్లి శ్రీనివాసరావు, పోతిన మహేష్, జనసేన నాయకులు, పలువురు కార్పొరేటర్లు తమ మద్దతుదారులతో అక్కడికి చేరుకున్నారు. సొసైటీకి చెందిన వ్యక్తులు కూడా పెద్ద సంఖ్యలో యువకులను తీసుకొచ్చారు. ఈ స్థలంలో రెండు దశాబ్దాలుగా ఇళ్లు కట్టుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిని ఎలా ఖాళీ చేయిస్తారని రాజకీయ పక్షాలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.


ప్లాట్ల యజమానులకు మద్దతుగా వైకాపా, సీపీఎం నాయకుల ధర్నా

నాయకుల మధ్య వాగ్వాదం

వైకాపా నాయకులు ఈ ఘటనకు కారణం జనసేన నాయకులేనని ఆరోపించడం.. ఐదేళ్లు భూకబ్జాలతో అంటకాగిన వైకాపా నాయకులు ఇప్పుడు నీతి సూత్రాలు చెబుతున్నారని జనసేన నాయకులు అనడంతో ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు ఇరువర్గాలను పక్కకు నెట్టివేయడంతో వివాదం సమసింది. ఇరువర్గాలతో పశ్చిమ ఏసీపీ దుర్గారావు మాట్లాడి.. 29న సుప్రీంకోర్టులో వచ్చే తీర్పునకు అనుగుణంగా శాంతి భద్రతలకు విఘాతం లేకుండా చర్యలు తీసుకోవడానికి సహకరించాలని కోరారు.

ధర వరలు

వంకాయలు-22, టమాటా-44, బెండ-26, పచ్చిమిర్చి-34, కాకర-24, బీర-32/40, క్యాబేజి-22, క్యారెట్-36/46, దొండ-22, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-26, దోస-18, సొర-18/16, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-26, అల్లం-50/90, మునగ-5/6, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-38, బీట్ రూట్-28, కీరదోస-34, బీన్స్-78, క్యాప్సికమ్-66, నిమ్మ (డజను)-30/24, కొత్తిమీర-12/24, (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.
- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

మైలవరం సర్పంచి చెక్ పవర్ రద్దు

మైలవరం, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ మైలవరం సర్పంచి జి.మంజుభార్గవి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం డీపీవో లిఖిత పూర్వక ఆదేశాలను సోమవారం పంచాయతీ కార్యదర్శి ఎండి రఫి, సర్పంచికి అందజేశారు. ఆమె స్థానంలో విజయవాడ డీఎల్పీవోకు చెక్ పవర్ అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. పంచాయతీలో సాధారణ ఎన్నికలకు ఏడాది ముందే, పలు పనుల నిర్వహణ విషయంలో సర్పంచి, కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ పంచాయతీలో 12వ వార్డు సభ్యుడు ఎం.చిట్టిబాబు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై ఏడాదిన్నర కిందటే విచారించిన అధికారులు, నిధులను పక్కదారి పట్టించినట్లు జిల్లా అధికారులకు నివేదించారు. దానిపై కోర్టును ఆశ్రయించగా, సర్పంచిపై చర్యలు తీసుకోవాలని సూచించినా, చర్యలు లేకపోవటంతో వార్డు సభ్యుడు మరోసారి గతంలోనే కోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం ఆదేశాలతో తాజాగా డీపీవో ఉత్తర్వులిచ్చారు. విచారణలో సుమారు రూ.10 లక్షలకు పైగా నిధులను పక్కదారి పట్టించినట్లు పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈల రాయితీలు విడుదల చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీ ఎంఎస్ఎంఈలకు రావాల్సిన రాయితీలు ప్రభుత్వం విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్ అసోసియేషన్ కన్వీనర్ ఈడ్పుగంటి అనార్‌బాబు కోరారు. సోమవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా రాయితీల విషయంలో జాప్యం జరుగుతోందని, అనేక యూనిట్లు మూతపడే పరిస్థితికి వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది పారిశ్రామికవేత్తలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి బ్యాంకు ఖాతాలు ఎన్‌పీఏలుగా మారాయని చెప్పారు. వేలాది కుటుంబాలు రోడ్డునపడ్డా.. కూటమి ప్రభుత్వం అశ్రద్ధ వహిస్తోందని విమర్శించారు. ఏపీఎస్ ఆర్టీసీ హయ్యర్ బసెస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు నిలిపివేయడం వల్ల చాలా కుటుంబాలు రోడ్డునపడతాయని చెప్పారు. పెండింగ్‌లోని రూ.650 కోట్ల రాయితీలను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు నాగకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ప్రతిభ చాటితే పతకాలు సొంతం



మైలవరం: బహుమతులు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయుడు

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు నిర్వహించే పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటడం ద్వారా పతకాలను సాధించవచ్చని, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని స్థానిక గౌతమ్ పాఠశాల కరస్పాండెంట్ గొల్లపూడి సురేష్, ప్రధానోపాధ్యాయుడు రమేష్ పేర్కొన్నారు. ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం ఆ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో గాళ్ల హర్షిత(10వ), కె.రిషితకుమార్(9వ), బి.గోపాలకృష్ణ రాఘవ్(8వ)లు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు.

సృజనకు పోటీలు దోహదం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగివున్న సృజన శక్తులను వెలికి తీసేందుకు ఈనాడు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని విస్సన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ హెచ్.ఎం ఆర్ శోభారాణి అన్నారు. 'చంద్రయాన్ నుంచి ఏఐ వరకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశ ప్రయాణం' అనే అంశంపై స్థానిక హైస్కూల్‌లో జరిగిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో షేక్ తబుస్సుమ్(10వ), కోత యోమకేసి(9వ), త్రిపురం శైలజ(10వ)లు విజేతలుగా నిలవగా ప్రధానోపాధ్యాయురాలు ఆర్.శోభారాణి, ఉపాధ్యాయులు జి.కాత్యాయని, ఎన్.మోహనరెడ్డి, బి.సూర్యనారాయణ బహుమతులు అందజేశారు.



విస్సన్నపేట : విజేతలతో హెచ్‌ఎం ఆర్ శోభారాణి, ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

◆ పట్టణంలోని 16వ వార్డు తంగెళ్లబీడులోని డ్రైనేజీలో మట్టి, మురుగు నిల్వ ఉండి దుర్గంధం వస్తోందని స్థానికులు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించి సిబ్బందితో దగ్గరుండి శుభ్రం చేయించారు.



పనులు పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్..

◆ పట్టణ పరిధి 14వ వార్డులో డ్రైనేజీ మురుగుతో నిండి దుర్వాసన వస్తోందని స్థానికులు అబ్బూరి ఫిర్యాదు చేయగా శానిటరీ అధికారి స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

కళ్లజోళ్ల పంపిణీ

జి.కొండూరు: ఇటీవల లయన్స్‌క్లబ్ కొండపల్లి ఆధ్వర్యంలో కట్టుబడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శిబిరంలో 20 మంది విద్యార్థినీ, విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరమని వైద్యులు గుర్తించగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా చైర్‌పర్సన్ కృష్ణారెడ్డి, రాజశేఖర్, సభ్యుడు ఎ.నాగిరెడ్డి, హెచ్‌ఎం తెలజ పాల్గొన్నారు.

పూజలందుకున్న భోళాశంకరుడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: భాద్రపద మాసం సోమవారం సందర్భంగా గంపలగూడెం, ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లోని శివాలయాల్లో అర్చకులు శివలింగాలకు విశేష పూజలు నిర్వహించారు. కొత్తపల్లి సమీప కట్లేరు వాగు గోపాలస్వామి మడుగు ఒడ్డున ఉన్న ఉమాగౌరీశంకరుని ఆలయంలో అర్చకులు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. మేడూరు, పెనుగొలను, గోసవీడు, కంభంపాడు, తిరువూరులోని ఆలయాల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు.



కొత్తపల్లి గుడిలో..

చిట్టి చేతులతో.. మట్టి గణపతి

ఈనాడు..ఈటీవీ ఆధ్వర్యంలో విద్యార్థులతో మట్టి ప్రతిమల తయారీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్రాంతి పాఠశాల కరస్పాండెంట్ మురళీమోహన్

కొండపల్లి, న్యూస్‌టుడే: భావి తరాలకు వారధులైన విద్యార్థులు పర్యావరణ రక్షణకు కృషి చేయాలని క్రాంతి పాఠశాల కరస్పాండెంట్ వి.మురళీమోహన్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ-మట్టి గణపతుల తయారీ అవగాహన కార్యక్రమాన్ని ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో కొండపల్లి క్రాంతి పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు దేశ సంస్కృతి, సంప్రదాయాల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడంతో పాటు అందులో దాగి ఉన్న శాస్త్రీయతను గుర్తించి పాటించాలన్నారు. వినాయక పూజతో పాటు వాటి ఆకృతిలో శాస్త్రీయత దాగి ఉన్న సంగతి గ్రహించాలన్నారు. ఈ విగ్రహాల తయారీలో కొంత కాలంగా అనేక మార్పులు వచ్చాయని అవన్నీ కాలుష్య కారకాలుగా మారాయన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు అనేక కృత్రిమమైన రంగులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారన్నారు. వాటిని నీళ్లలో నిమజ్జనం చేయడం వల్ల నీరు, గాలి కాలుష్యమవుతున్నాయని చెప్పారు. అందుకు విద్యార్థులందరూ సొంతగా మట్టితో గణనాథుని ప్రతిమలను తయారు చేయాలన్నారు. సహజసిద్ధంగా, అందుబాటులో ఉన్న వస్తువులతో పూజాదికాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులతో మట్టి వినాయకులను తయారుచేయించారు. కార్యక్రమంలో పూర్వ సర్పంచి అమ్మాజీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ విలువ తెలిసింది



రంగు, రంగుల విగ్రహాలతో కాకుండా మెత్తని మట్టితో సొంతగా వినాయకుడిని తయారు చేయడం బాగుంది. వివిధ బొమ్మలను కొనుగోలు చేసి పూజ చేయడం వల్ల కలిగే పర్యావరణానికి మంచి జరుగుతుందని తెలిసింది. ఇక నుంచి మట్టి ప్రతిమలతోనే వినాయక పూజలు చేస్తాం. మా ఇంటి వద్ద కూడా విషయాన్ని తెలియజేసి మట్టి ప్రతిమలను అందరికీ అందిస్తా.

\- ఇట్టా ఆదిలక్ష్మి, పదో తరగతి

ఎంతో ఆనందంగా ఉంది



పండుగ సమయంలో వినాయకుడి విగ్రహాలను కొనేవాళ్లం. ఈ సారి సొంతగా మట్టితో చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ రోజు పాఠశాలలో మూడు బొమ్మలు తయారు చేశాను. పండగ రోజు నాటికి మరిన్ని బొమ్మలను తయారు చేసి మట్టి బొమ్మలనే వాడాలని అందరికీ చెబుతూ వాటిని ఇంటి దగ్గర స్నేహితులకు అందజేస్తా.

-కె.శక్తిస్వరూప్, పదో తరగతి

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్వడం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో గల తోలుకోడు ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామ్మోహన్ రావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మూడు గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. దేవాదాయ శాఖ కార్యాలయం ప్రాంతం, వాసవి మెడికల్ కాంప్లెక్స్, ల్యాంకోకాలనీ ప్రాంతం, డింబర్ డిపోలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెరటి తోటలు పెంచుకోండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పెరటి తోటలు పెంచుకొని మంచి పౌష్టికాహారం తినడం వల్ల కుటుంబంలోని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండవచ్చని తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం రెడ్డిగూడెం వెలుగు కార్యాలయంలో 1500 మంది డ్వాక్రా గ్రూపు సభ్యులకు 11రకాలు కూరగాయ విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీలతో సమావేశం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం మండలంలో పర్యటించారు. అనంతరం స్థానిక సత్తుపల్లి రోడ్డులోని కేఎంఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమై ఔత్సాహికులైన సభ్యులతో కన్వీనర్ల కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంజయ్ మెహతా, సంజయ్ గోయల్, పైలా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాలకు అనుమతులివ్వాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గణేష్ మండపాల ఏర్పాటు, నిమజ్జనాలకు ఎటువంటి ఆంక్షలు లేకుండా అనుమతులు అనుమతులు ఇవ్వాలని భాజపా గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి రాజు అన్నారు. కమిటీ సభ్యులు ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో సోమవారం పర్యటించి గణేష్ మండపాలను సందర్శించి పర్యవేక్షించారు. కార్యక్రమంలో రఘునాథ రెడ్డి, యుగంధర్, భవాని, మూర్తి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలుంటే స్టార్టప్‌లకు అవకాశం



విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రారంభిస్తున్న కళాశాల విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ప్రిన్సిపల్ రవి తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తే కొత్తగా స్టార్టప్‌లు ప్రారంభించుకునేందుకు అవకాశం కలుగుతుందని కళాశాల విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా అన్నారు. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విద్యార్థులు క్లీన్‌క్విక్ పేరిట వాషింగ్ మెషిన్‌లో ఉపయోగించే లహరి మ్యాటిక్ లిక్విడ్, విజిల్ డిటర్జెంట్ పౌడర్, విక్ డిష్‌వాష్ లిక్విడ్, సిడ్ పేరిట ఫినాయిల్ ఉత్పత్తులను తయారు చేయగా సోమవారం మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయంలో ఆవిష్కరించి, విద్యార్థులను అభినందించారు. ఆవిష్కాంధ్రా 2025 కార్యక్రమంలో భాగంగా తమ విద్యార్థులు ఉత్పత్తులను తయారు చేసినట్లు ప్రిన్సిపల్ ఇళ్లా రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో జేడీ సి.కృష్ణ, అకడమిక్ గైడెన్స్ అధికారి సీహెచ్ తులసి, ఉప ప్రిన్సిపల్ పి.రంగారావు, కెమిస్ట్రీ విభాగాధిపతి వి.ఫణికుమార్, ఐక్వాక్ కోఆర్డినేటర్ బి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

తెదేపా గ్రామ నాయకులపై వేటు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కొందరు నాయకులు తెదేపా ముసుగులో వైకాపాకు కోవర్టులుగా పని చేస్తున్నందున వారిని పార్టీకి దూరంగా ఉంచుతున్నట్లు తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, తెదేపా మండలాధ్యక్షుడు మానుకొండ రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి తెలిపారు. మండలంలోని తోటమూల పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.. లింగాల సర్పంచి కిరణ్ వేణుగోపాలరెడ్డి, తునికిపాడుకు చెందిన మల్లవరపు చైతన్య, రాజవరానికి చెందిన అబ్బూరి సతీష్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. దుందిరాలపాడుకు చెందిన ఇమ్మడి నరసింహారావును తెదేపాలో చేర్చుకోకపోయినా తెదేపాకు చెందిన వ్యక్తినని ప్రచారం చేసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ నలుగురికి తెదేపాతో ప్రమేయం లేదని, పార్టీ కార్యక్రమాలకు రానీయకూడదని నిర్ణయించామన్నారు. వారిపై చర్యల నిమిత్తం పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామన్నారు. నాయకులు కె.నగేష్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ, బాలయ్య, మధు, కె.రాంబాబు, అమరేంద్ర, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శివాలయం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక సత్తుపల్లి రోడ్డులో గల శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి దేవాలయం(శివాలయం) చైర్మన్‌గా వెంపటి శ్రీకృష్ణ జనార్దన్ రావు, కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని చైర్మన్‌కి జ్ఞాపికను బహూకరించి అభినందించారు. ఆలయ అర్చకులతో పాటు, దేవాదాయ శాఖ అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులతో అక్రమాలకు చెక్



కొండపల్లి: అర్హులకు స్మార్ట్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం స్మార్ట్ కార్డులను రూపొందించిందని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముందుగా వృద్ధులు, దివ్యాంగులకు, అనంతరం మండల ప్రజలందరికీ సచివాలయ, రెవెన్యూ సిబ్బంది కార్డులు అందజేస్తారన్నారు. పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, నాయకులు జంపాల సీతారామయ్య, అక్కల రామ్మోహనరావు పాల్గొన్నారు.

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: రేషన్ కార్డుదారుల సౌలభ్యం కోసమే కూటమి ప్రభుత్వం స్మార్ట్‌కార్డుల పంపిణీ చేపట్టిందని ఎమ్మెల్యే శ్రీనివాసరావు పేర్కొన్నారు. గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లో సోమవారం ఆయన రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురపాలిక కమిషనర్ కె.నిర్మల, మానుకొండ రామకృష్ణ, సీహెచ్.రాజేశ్వరరావు, కె.పుల్లమ్మ, ఆర్.లక్ష్మీ అనిత, తహసీల్దారు ఉదయభాస్కర్, ఎం.శ్రీనివాసరావు బి.పీక్లానాయక్‌లు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం పట్టణంలో, పొందుగల, కీర్తిరాయునిగూడెం తదితర గ్రామాల్లో నాయకులు లితీష్, వెంకట నారాయణ, బాలకృష్ణ, కరీం, శ్రీనివాసరావు, దొండపాటి రాము తదితరులు పాల్గొని అందజేశారు.



తిరువూరు: శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో

జి.కొండూరు, న్యూస్‌టుడే: కుంటముక్కలలో ఎంపీటీసీ సభ్యురాలు సందిపాము జయలక్ష్మీ, సొసైటీ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి, మండల పార్టీ కార్యదర్శి లంకా రామకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రెడ్డిగూడెంలో తహసీల్దార్ జె.సుశీలాదేవి, తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వర రెడ్డి పాల్గొని అందించారు. విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివనాగరాజు పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: జక్కంపూడికాలనీలో విజయవాడ వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేటలోని బీజేఆర్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీహెచ్ ప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, కంభంపాటి బద్రీనాథ్ పాల్గొన్నారు.

అదృశ్యమైన స్వీపర్ ఆచూకీ లభ్యం



జి.కొండూరులో తహసీల్దార్ కార్యాలయంలో కుటుంబసభ్యులతో చిరంజీవి

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక పీహెచ్‌సీలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న మంద చిరంజీవి ఈ నెల 21వ తేదీ గురువారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె కుటుంబసభ్యులు, బంధువులు పీహెచ్‌సీలో యూడీసీ శ్రీనివాసరావు వేధింపుల కారణంగా కనిపించకుండా పోయిందని పీహెచ్‌సీ ముందు రెండు రోజులపాటు నిరసన తెలుపగా డీఎంహెచ్‌వో సుహాసిని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అనంతరం జి.కొండూరు పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలించగా చిరంజీవి ఆచూకీని సోమవారం మధ్యాహ్నం తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పీహెచ్‌సీ సమీపంలో గుర్తించారు. వెంటనే ఆమెను మైలవరం సీఐ కార్యాలయానికి తరలించి స్టేట్‌మెంట్ రికార్డు చేసి జి.కొండూరు తహసీల్దార్ సమక్షంలో ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆమె ఇచ్చిన వివరణలో యూడీసీ శ్రీనివాసరావు తనను ఏమి అనలేదని రూ.85 వేలు వేతన బకాయి ఉండగా రూ.25 వేలు చెల్లించడం, ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా రెగ్యులర్ చేయకపోవడం, కుటుంబసభ్యులు తక్కువ వేతనానికి పనిచేయడం ఏమిటని ప్రశ్నించడంతో తీవ్ర మనోవేదన చెంది ఇంటి నుంచి వెళ్లానని తెలిపారు.

రెండో దఫాలో నానో ఎరువులే వాడాలి

మైలవరం, న్యూస్‌టుడే: రైతులు పంట పొలాలకు రెండో దఫాలో నానో యూరియా, నానో డీఏపీలను మాత్రమే వాడాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు సూచించారు. స్థానికంగా ఉన్న పలు ఎరువుల దుకాణాలను సోమవారం తహసీల్దార్ అబ్దుల్ దరియా, మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి, ఏఎస్‌ఐ సర్వేశ్వరరావులతో కలిసి తనిఖీలు చేశారు. ఆయా దుకాణాల్లో అమ్మకాలు, నిల్వల వివరాలు, ఈ పోస్ నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గరిష్ఠ చిల్లర ధరలకే ఎరువులు అమ్మాలని, దుకాణాల ఎదుట ధరల పట్టికలను ప్రదర్శించాలని పేర్కొన్నారు.



ఎరువుల గోదాములో తనిఖీ చేస్తున్న అధికారులు

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



చెవుటూరులో గోడప్రతుల ప్రదర్శన

జి.కొండూరు, న్యూస్‌టుడే: జాతీయ ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణ దినం పురస్కరించుకుని సోమవారం స్థానిక పీహెచ్‌సీ, చెవుటూరు పాఠశాలలో అవగాహన కల్పించారు. వ్యాధి రాకుండా చేపట్టవలసిన చర్యలను ఉమ్మడి కృష్ణా జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారి వెంకటేశ్వర్లు, జి.కొండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రసన్నరాణి విద్యార్థులకు వివరించారు. బడ్డీ దుకాణాల్లో దొరికే ప్యాకెట్ చిప్స్, నల్ల ఉప్పు కలిగిన ఫాస్ట్ ఫుడ్ నిషేధించాలని, శుద్ధి చేసిన జలాలను మాత్రమే తాగాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు డీసీ ఛైర్మన్ ఉమ్మడి వెంకటస్వామి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నివసించే వివాహిత మహిళ సయ్యద్ నూర్జహాన్ బేగం(30) సోమవారం సాయంత్రంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. ఆమె భర్త మదార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా ఆమె ఇంటి వద్దనే ఉంటోంది. సోమవారం అతను విధులకు వెళ్లగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వారికి పాప, బాబు ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని, వేరే ప్రాంతంలో ఉన్న భర్తకు సమాచారం అందించినట్లు వెల్లడించారు.

వెంకట రాయుడు కన్నుమూత

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: మైలవరం నియోజకవర్గంలో పరోక్ష రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి నాటి నేతలకు అత్యంత సన్నిహితుడైన నాయకుడు గుంటుపల్లికి చెందిన చెరుకూరి వెంకట రాయుడు (90) వృద్ధాప్యంతో సోమవారం మృతి చెందారు. ఆనాటి జిల్లా నేతలు చనమోలు వెంకట్రావు, కోమటి భాస్కరరావు, పిన్నమనేని కోటేశ్వరరావు తదితరులతో కలిసి జిల్లా కాంగ్రెసు పార్టీలో వివిధ బాధ్యతల్లో పనిచేసి గుంటుపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఆయన సతీమణి జయవాణి గ్రామ సర్పంచిగా, ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు అధ్యక్షురాలుగా చేశారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం ఆయన తెదేపా పరోక్ష రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరించి శాసనసభ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తెదేపా విజయానికి కృషి చేశారని తెదేపా గ్రామ నాయకులు చెబుతున్నారు. ఈయనకు భార్య ఇద్దరు సంతానం ఉన్నారు.

తాతకుంట్ల మాజీ సర్పంచి మృతి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తాతకుంట్ల గ్రామ మాజీ సర్పంచి కట్టా ధర్మారావు (62) అనారోగ్య సమస్యలతో మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి తెదేపా నాయకులు నివాళులర్పించారు.



అంతరిక్ష విజ్ఞానంలో అడుగులు ఎలా?

వినీల ఆకాశపుటంచులకు చేరి గగన విహారం చేయాలంటే కోర్సుల ఊతం కావాలి. ఈ రంగంలో రాకెట్ స్పీడ్‌లో దూసుకువెళ్లాలంటే అంతరిక్ష విజ్ఞానంపై పట్టు సాధించాలి. మిలమిల మెరిసే తారల మధ్య చంద్రయానం, సూర్యగ్రహ పరిశీలన చేయాలంటే మౌలికమైన విజ్ఞాన శాస్త్రాలను మథించాలి!



అంతరిక్ష యాత్రలను వీక్షిస్తూ మురిసిపోవడంతో పాటు వాటి వెనుక మూల సూత్రాలుంటాయని గుర్తించాలి. వ్యోమగాముల విజయసంకేతాల ఆవల కఠోర తపస్సును తలపించే సాధన దాగి ఉంటుంది. విశ్వ రూపం చూపిస్తున్న అంతరిక్ష విపణి పరిమాణాన్ని చూసి విస్తుపోవడం కంటే దానిని ఒడిసిపట్టుకునేందుకు రూపొందుతున్న వాణిజ్య వ్యూహాలపై దృష్టి పెట్టాలి. స్థూలంగా చెప్పాలంటే ఏ లక్ష్యాన్ని అందుకోడానికైనా అభిరుచి మాత్రమే ఉంటే చాలదు. దాన్ని ఆచరణలోకి తీసుకొచ్చేందుకు పట్టుదల దీక్ష అవసరం.

మూడు సబ్జెక్టులు

సుదూర గ్రహాంతరాళాల ఆనుపానులు గ్రహించాలంటే.. సైన్స్- టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమెటిక్స్... వీటి పాఠ్యాంశాల పరిజ్ఞానాన్ని ప్రయోగశాలలో మథనం చేసి వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు చేయగలగాలి.

- పన్నెండో తరగతి నుంచే వీటికి పునాది పడాలి. ఇంకా ముందు చూపు ఉంటే మేలే. పదో తరగతి నుంచే మౌలిక సబ్జెక్టులను లోతుగా అధ్యయనం చేయాలి.
- తర్వాత ఏరోస్పేస్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఫిజిక్స్, మేథమెటిక్స్.. బ్యాచిలర్స్ డిగ్రీల్లో ఏదో ఒకదాన్ని నిజమైన ఆసక్తితో.. థియరీ, ప్రాక్టికల్స్‌ను శోధించే దృక్పథంతో అధ్యయనం చేయాలి.
- ఇవే సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీకి కొనసాగింపుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే పట్టు పెరుగుతుంది. పరిశీలన సామర్థ్యం విశాలమవుతుంది. కొత్త ఆలోచనలు పురివిప్పుతాయి.
- అంతరిక్ష యాత్రలు, పరిశోధనలపై విశేషమైన ఆసక్తి ఉండి ఇంజినీరింగ్ చేయలేకపోయినా ఈ రంగంలో అవకాశాలున్నాయి. బీఎస్సీ ఫిజిక్స్, మేథమెటిక్స్ లేదా ఆస్ట్రానమీ చేసినా అంతరిక్ష పరిశోధన క్షేత్రాల్లో అడుగు పెట్టవచ్చు. వీటిలోనే పీజీ చేసి విజ్ఞాన పరిధిని విశాలం చేసుకోగలిగితే... మిగతా విద్యా నేపథ్యాలున్న వారితో సమానంగా చోటు సంపాదించుకోవచ్చు.

అంతరిక్ష విజ్ఞాన విద్యాసంస్థలు

ఫిజిక్స్, మేథమెటిక్స్ వంటి మౌలిక సబ్జెక్టులు, ఏరోనాటికల్, ఏరోస్పేస్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సులు చేసేందుకు దేశవ్యాప్తంగా అవకాశాలున్నాయి. అయితే అంతరిక్ష విజ్ఞానంతో మానవ వనరులు తయారుచేయాలన్న లక్ష్యంతో అవతరించిన కొన్ని విద్యాసంస్థల్లో శిక్షణ పొందితే ఈ రంగంలో ప్రవేశించేందుకు అవకాశాలు సులభమవుతాయి.

● **ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ- తిరువనంతపురం**



అంతరిక్ష విజ్ఞానంపై విద్యాబోధన చేస్తున్న విశిష్ట సంస్థ. విద్యార్థి ఆసక్తిని బట్టి అంతరిక్ష విజ్ఞానంపై కొన్ని ప్రత్యేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. చదువయ్యాక సంబంధిత ఉద్యోగానికీ ఇక్కడ అవకాశాలు బాగుంటాయి.

● **ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలు (ఐఐటీలు)**

ఇస్రో, నాసాలోని వివిధ ప్రవేశస్థాయి (ఎంట్రీ లెవెల్) హోదాలకు దారితీసే ఏరోస్పేస్ ఇంజినీరింగ్ సహా వివిధ కోర్సులను ప్రత్యేకంగా ఐఐటీ ముంబయి, ఐఐటీ కాన్పూర్, ఐఐటీ చెన్నైలు అందిస్తున్నాయి. ఈ కోర్సులు చేయడం ద్వారా ఈ రంగానికి అవసరమైన విజ్ఞాన క్షేత్రాల్లో నిష్ణాతులు కావచ్చు.

● **ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్- బెంగళూరు**



ఇస్రోతో పటిష్ఠమైన అనుబంధం ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అంతరిక్ష విజ్ఞానంలో పరిశోధన, అన్వేషణ ప్రధానాంశాలుగా కోర్సులు ఆఫర్ చేస్తోంది.

● **బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బిట్స్)**

స్పేస్ ఇంజనీరింగ్, రాకెట్ విజ్ఞానంపై ఈ సంస్థలో కొన్ని ప్రత్యేక కోర్సులున్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలోని ఈ కోర్సుల ద్వారా అంతరిక్ష పరిశోధనల రంగంలో చోటు సాధించవచ్చు.

ఈ విద్యా సంస్థల్లో తగిన కోర్సులు ఎంచుకుని ముందుకు వెళ్లడం ఒక మార్గం. భారతీయ అంతరిక్ష రంగం, నాసా లాంటి విదేశీ అంతరిక్ష సంస్థల్లో ఉజ్వలంగా ప్రకాశించే పొజిషన్లను ముందుగానే తెలుసుకొని వాటికి ఏ కోర్సులు అవసరమో... ఆ దిశగా శిక్షణ పొందడం మరో దారి. ఎంచుకునే మార్గాలేమైనా.. ఎన్ని అవరోధాలెదురైనా వెనుదీయని ఆసక్తే అంతరిక్ష రంగానికి చేర్చే నిజమైన వ్యోమనౌక.

మేనేజ్‌మెంట్ నిపుణులకూ ఛాన్స్

అంతరిక్ష రంగంలో సాంకేతిక పరమైన పొజిషన్లు, అవకాశాలే కాకుండా మేనేజ్‌మెంట్ పరంగానూ ద్వారాలు తెరుచుకుంటున్నాయి. ముఖ్యంగా అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తూ నియంత్రణలను సడలించడంతో వందలాది స్టార్టప్స్‌తో పాటు బడా కంపెనీలు దృష్టి పెడుతున్నాయి.

అమెరికాలో వాణిజ్య దిగ్గజం ఎలాన్ మస్క్ అంతరిక్ష రంగంలో భారీ పెట్టుబడులు పెడుతుండటం భారతీయ వాణిజ్య సంస్థలకు ఉత్తేజం కలిగిస్తున్నాయి. ఈ రంగంలో పెట్టుబడులు దేశ ప్రతిష్ఠను గగనతలంలో నిలపడంతో పాటు వ్యాపారపరంగా గట్టి ప్రయోజనాన్ని కల్గిస్తాయని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో...

- మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ లాంటి బ్రాంచీలతో బీటెక్ పూర్తిచేసి ఆపై మంచి సంస్థల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్ పీజీ చేసిన యువతకు అవకాశాలు మరింత మెరుగ్గా ఉంటాయి.
- స్పేస్ ఎక్స్‌ప్లొరేషన్ (అంతరిక్ష అన్వేషణ)లో భారీ ప్రాజెక్టుల నిర్వహణకు సాంకేతిక సామర్థ్యంతో పాటు మేనేజ్‌మెంట్ మెలకువలు తెలిసినవారికి కంపెనీలు పెద్ద పీట వేస్తాయి.





- యస్.వి. సురేష్ సంపాదకుడు, ఉద్యోగ సోపానం

బీ స్కూళ్లకు మరో మార్గం.. జాట్!

దేశంలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షల్లో క్యాట్ తర్వాత ముఖ్యమైంది.. జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్టు (జాట్). దీన్ని జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది. ఈ పరీక్ష స్కోరుతో దేశంలో పేరున్న ఎన్నో బిజినెస్ స్కూళ్లలో ఎంబీఏ/పీజీడీఎంల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చే విద్యా సంవత్సరంలో కోర్సుల్లో ప్రవేశానికి ఎక్స్‌ఏటీ–2026 ప్రకటన వెలువడింది.

భారత్‌లోని టాప్-10 బీ స్కూళ్లలో జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎక్స్ఎల్ఆర్ఐ), జంషెడ్‌పూర్ ఒకటి. దీంతోపాటు జేవియర్ అనుబంధ సంస్థల్లో ఎంబీఏ/పీజీడీఎం కోర్సులో ప్రవేశానికి ఎక్స్‌ఏటీ రాయడం తప్పనిసరి. వివిధ ఐచ్ఛికాలతో జేవియర్ సంస్థల్లో మేనేజ్‌మెంట్ కోర్సులు.. జంషెడ్‌పూర్, చెన్నై, ముంబయి, బెంగళూరు, రాంచీ, భువనేశ్వర్, దిల్లీల్లో అందిస్తున్నారు. ఎక్స్‌ఏటీ స్కోరు, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలతో ప్రవేశం లభిస్తుంది. మేటి సంస్థల్లో చదువు పూర్తిచేసుకున్నవారు.. ప్రాంగణ నియామకాల్లో ఆకర్షణీయ వేతనాలతో బహుళజాతి సంస్థల్లో కొలువులు సొంతం చేసుకుంటున్నారు.



ఇవీ కోర్సులు

పీజీడీఎం: బిజినెస్ మేనేజ్‌మెంట్(బీఎం), హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(హెచ్ఆర్ఎం), జనరల్ మేనేజ్‌మెంట్(జీఎం), ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, వెంచర్ క్రియేషన్ (ఐఈవీ). వీటిని ఫుల్‌టైం రెసిడెన్షియల్ విధానంలో అందిస్తున్నారు. అలాగే పీజీ పూర్తిచేసుకున్నవారు, ప్రొఫెషనల్ కోర్సులు చదివినవాళ్లు, పని అనుభవం ఉన్నవారికోసం ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం) కోర్సు నాలుగేళ్ల వ్యవధితో నడుపుతున్నారు.

ప్రవేశం కల్పించే కొన్ని ప్రసిద్ధ సంస్థలు

దేశవ్యాప్తంగా 250కి పైగా సంస్థలు ఎక్స్‌ఏటీ స్కోరుతో మేనేజ్‌మెంట్ పీజీ/పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి అనుమతిస్తున్నాయి.

ఎక్స్ఎల్ఆర్ఐ- జంషెడ్‌పూర్, జేవియర్ యూనివర్సిటీ- భువనేశ్వర్, ఐఎంటీ ఘజియాబాద్, హైదరాబాద్, నాగ్‌పూర్, దుబాయ్. ఐఎంఐ- న్యూదిల్లీ, టాప్మీ మణిపాల్, జిమ్ గోవా, గ్రేట్ లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్- చెన్నై/గురుగ్రామ్, లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్- చెన్నై, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్, ఐఎఫ్ఎంఆర్, ఐఐఆర్ఎం, మైకా అహ్మదాబాద్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్- పుణే, పండిట్ దీన్‌దయాళ్ ఎనర్జీ యూనివర్సిటీ- గాంధీనగర్, విట్ వెల్లూరు, విజ్ఞాన జ్యోతి- హైదరాబాద్.

ఆన్‌లైన్ పరీక్ష

దీని వ్యవధి 3 గంటలు. ఇందులో రెండు భాగాలుంటాయి.

- పార్ట్-1లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, డెసిషన్ మేకింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటికి 170 నిమిషాలు కేటాయించారు. సెక్షన్లవారీ సమయ నిబంధన లేదు. అభ్యర్థులు నచ్చిన సెక్షన్ నుంచి పరీక్ష ప్రారంభించుకోవచ్చు. ఒక విభాగం నుంచి మరో విభాగానికి వెళ్లిపోవచ్చు.
- పార్ట్-2లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు అడుగుతారు. వ్యవధి 10 నిమిషాలు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. తప్పు జవాబుకూ పావు మార్కు తగ్గిస్తారు. జనరల్ నాలెడ్జ్ విభాగంలో రుణాత్మక మార్కులు లేవు. ఇందులో సాధించిన స్కోరు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు పరిగణనలోకి తీసుకోరు. ఎక్స్‌ఏటీ-2026లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్‌లో 26, డెసిసన్ మేకింగ్‌లో 21, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో 28, జనరల్ నాలెడ్జ్ 20 ప్రశ్నలు ఉంటాయి.

పాత ప్రశ్నపత్రాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అలాగే టాపర్స్ సూచనలూ అందుబాటులో ఉంచారు. జనరల్ నాలెడ్జ్ స్కోరు ఎక్స్ఎల్ఆర్ఐ, జంషెడ్‌పూర్ ఒక్కటే పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ విభాగంలో 8 ప్రశ్నలు స్టాటిక్ జీకే, మిగిలిన 12 కరెంట్ అఫైర్స్‌లో ఉంటాయి. పరీక్షపై అవగాహన కోసం మాక్ టెస్టు రాసుకోవచ్చు.

అర్హత: ఏదైనా డిగ్రీ. ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2200.
దరఖాస్తుకు చివరి తేదీ: 05.12.2025
పరీక్ష తేదీ: 04.01.2026
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, కర్నూలు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
వెబ్‌సైట్: https://xatonline.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

వాలెంటీరింగ్
సంస్థ: డ్యులాప్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: బ్రాండింగ్, మార్కెటింగ్ స్ట్రాటజీస్ స్టైపెండ్: రూ.5,000-10,000
☛ https://shorturl.at/TFbwO

గ్రోత్ అండ్ సేల్స్ మేనేజర్
సంస్థ: వీకడే నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, లీడ్ జనరేషన్, సేల్స్, సేల్స్ మేనేజ్‌మెంట్, సేల్స్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.15,000-20,000
☛ https://shorturl.at/fuGe5

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 19

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: ఏ అండ్ ఎం గ్రాఫికల్ ప్రొడక్షన్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000-13,000
☛ https://shorturl.at/NmMMj

బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్
సంస్థ: కోడింగ్ జూనియర్
నైపుణ్యాలు: ఏపీఐస్, సీఎస్ఎస్, డాకెట్, గిట్, గోలాంగ్, మాంగోడీబీ, మైఎస్‌క్యూఎల్, రియాక్ట్, రెస్ట్ ఏపీఐ, ఎస్‌క్యూఎల్, టైప్‌స్క్రిప్ట్
స్టైపెండ్: రూ.15,000-20,000
☛ https://shorturl.at/EphqP

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్
సంస్థ: సిద్ధివినాయక క్రియేటివ్ ల్యాబ్స్
నైపుణ్యాలు: బ్లాగింగ్, కంటెంట్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, పింటరెస్ట్, సెర్చ్‌ఇంజిన్, సోషల్‌మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, కాపీ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్ టూల్స్, డిస్‌ప్లే యాడ్స్, ఫేస్‌బుక్ యాడ్స్, ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్, మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, యూట్యూబ్ యాడ్స్
స్టైపెండ్: రూ.5,000
☛ https://shorturl.at/Hybr8

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 12

ఏ బ్రాంచి ఎంచుకోవాలి?

టీజీ ఈఏపీసెట్‌లో 4000 ర్యాంక్ వచ్చింది. మరోపక్క గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు కూడా ప్రిపేర్ కావాలనుకుంటున్నా. కాలేజీ నుంచే సన్నద్ధతకు ఏ బ్రాంచి మేలు? - సి. హర్షిణి





■ ఇంజినీరింగ్ కళాశాలలో చేరడానికి ముందే గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల సన్నద్ధత గురించి ఆలోచించడం అభినందనీయం. మీరు భవిష్యత్తులో రాయాలనుకొంటున్న ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు ఏదైనా సబ్జెక్టులో డిగ్రీ పూర్తి చేయడం కనీస విద్యార్హత. మూడు సంవత్సరాల బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏలతో పాటు నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కానీ, ఏదైనా బ్రాంచితో ఇంజినీరింగ్ డిగ్రీ కానీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడవచ్చు. ఇంజినీరింగ్‌లో ఏ బ్రాంచి తీసుకున్నా కానీ సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు అర్హులవుతారు. ఒకవేళ గ్రూప్స్ పరీక్షల్లో విజయం సాధించలేకపోతే మెరుగైన ఉపాధి కోసం పేరున్న కళాశాల నుంచి పొందిన ఇంజినీరింగ్ డిగ్రీ ఉపయోగపడుతుంది.

ఇంజినీరింగ్‌లో ఏ బ్రాంచి తీసుకోవాలనేది పూర్తిగా మీ ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ ఇంజనీర్ ఉద్యోగాల కోసం సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచీలు ఉపయోగపడతాయి. ప్రైవేటు ఉద్యోగాలకు కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఏఐ, ఎంఎల్ లాంటి బ్రాంచీలు చదవవచ్చు. ఇంజినీరింగ్‌తో పాటు పోటీ పరీక్షల సన్నద్ధత కూడా చేయాలనుకొంటే.. ఆసక్తి ఉన్న సబ్జెక్టుకు సంబంధించిన బ్రాంచి చదివితే మేలు. అప్పుడు ఆ సబ్జెక్టు త్వరగా అర్థం చేసుకొని పోటీ పరీక్షలకు కూడా సన్నద్ధమవ్వడానికి కొంత సమయం కేటాయించవచ్చు.

మీరు 2025లో ఇంజినీరింగ్‌లో చేరితే 2029 వరకు అంటే నాలుగేళ్లు (దాదాపుగా 1400 రోజులు) అందుబాటులో ఉంటాయి. ఈ వ్యవధిలో రోజుకు సగటున రెండు గంటలపాటు పోటీ పరీక్షలమీద దృష్టి పెడితే కనీసం 2800 గంటలపాటు సన్నద్ధతకు అవకాశం ఉంటుంది. కానీ చాలామంది సమయపాలన సరిగా చేసుకోకపోవడం వల్ల ఇంజినీరింగ్‌లో, పోటీ పరీక్షల్లో కూడా విజయం సాధించలేకపోతున్నారు.

ఇంజినీరింగ్‌లో ఏ బ్రాంచి కూడా కఠినం కాదు. అలా అని ఏదీ తేలికా కాదు. ఏ బ్రాంచి ఎంచుకున్నా అంకితభావం, నిరంతర కృషి, పట్టుదల అవసరం. ఇష్టమున్న బ్రాంచిని నచ్చిన కళాశాలలో చదివి ఇంజినీరింగ్‌తో పాటు పోటీ పరీక్షలకు కూడా సన్నద్ధం అవ్వండి. ఇంజినీరింగ్‌లో కనీసం 70 శాతం మార్కులు, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు పొందేలా ప్రణాళిక తయారు చేసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఏఏఐలో 976 జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ).. 976 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీచేయనుంది. ఇంజినీరింగ్ డిగ్రీ, గేట్ స్కోరుతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగానుభవం అవసరం లేదు.



మొత్తం ఖాళీల్లో.. జూనియర్ ఎగ్జిక్యూటివ్- జేఈ (ఆర్కిటెక్చర్)-11, జేఈ (సివిల్)-199, జేఈ (ఎలక్ట్రికల్)-208, జేఈ (ఎలక్ట్రానిక్స్)-527, జేఈ (ఐటీ)-31 ఉన్నాయి.

ఎంపిక ఇలా

ఇంజినీరింగ్, 2023/2024/2025 గేట్ స్కోరుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి సంవత్సరం చదువుతున్నవారూ దరఖాస్తు చేయొచ్చు. దరఖాస్తులో తెలిపిన వివరాల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేస్తారు. ఈ వివరాలను వెబ్‌సైట్‌లో ప్రచురిస్తారు. కాల్ లెటర్లను అభ్యర్థుల ఈమెయిల్ ఐడీకి పంపుతారు. తాజా సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

దరఖాస్తు వెరిఫికేషన్ సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించాలి. ఇందు కోసం అదనపు సమయాన్ని అనుమతించరు. ఈ దశలోనే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న అభ్యర్థులు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను సమర్పించాలి. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేయరు. ధ్రువపత్రాల పరిశీలన, గేట్ స్కోర్, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత ప్రింటవుట్‌ను భద్రపరుచుకోవాలి. దరఖాస్తు కాపీని పోస్టులో పంపనవసరం లేదు. గేట్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను కచ్చితంగా తెలపాలి.

జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రానిక్స్) పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు ఆరు నెలల శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో మూలవేతనంతో పాటు ఇతర అలవెన్సులూ చెల్లిస్తారు. ఈ అభ్యర్థులు ఏఏఐలో మూడేళ్లపాటు పనిచేస్తామని బాండ్ రాయాలి. ఎంపికైనవారిని దేశంలో ఎక్కడైనా నియమించే అవకాశం ఉంటుంది.

ముఖ్యాంశాలు

అర్హత: ఆర్కిటెక్చర్/ సివిల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ టెలికమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ ఐటీ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజినీరింగ్). 2023/2024/2025 గేట్ స్కోరు.
వయసు: 27 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు ఐదేళ్లు, ఏఏఐ ఉద్యోగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలు/ ఏఏఐలో ఏడాది అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసినవారికి ఫీజు లేదు.
వేతనం: నెలకు రూ.40,000-1,40,000. మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులూ ఉంటాయి.
దరఖాస్తు ప్రారంభ తేదీ: 28.08.2025
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.09.2025
వెబ్‌సైట్: www.aai.aero

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ బోర్డులో 615 పోస్టులు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలెక్షన్ బోర్డు వివిధ విభాగాలు, లోకల్, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థల్లో 615 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ స్టాటిస్టికల్ క్లర్క్: 11 ✦ అసిస్టెంట్ పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్: 78 ✦ మేసన్: 58 ✦ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్: 02 ✦ జూనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ (ఎలక్ట్రిక్): 06
✦ టెక్నికల్ సూపర్‌వైజర్ (రేడియాలజీ): 09
✦ బైలిఫ్: 14 ✦ నాయబ్ తహసీల్దార్: 01
✦ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్: 09
✦ సీనియర్ ఇన్వెస్టిగేటర్: 07 ✦ ప్రోగ్రామర్: 02
✦ సర్వేయర్: 19 ✦ కన్జర్వేషన్ అసిస్టెంట్: 01
✦ అసిస్టెంట్ సూపరింటెండెంట్: 95 ✦ స్టెనోగ్రాఫర్: 01
✦ అసిస్టెంట్ లైబ్రేరియన్: 01
✦ జూనియర్ కంప్యూటర్ ఆపరేటర్: 01
✦ చీఫ్ అకౌంటెంట్: 01 ✦ అసిస్టెంట్ ఎడిటర్: 01
✦ కేర్‌టేకర్: 114 ✦ ఫారెస్ట్ గార్డ్: 52

మిగతా పోస్టుల కోసం నోటిఫికేషన్ చూడవచ్చు.
అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
వయసు: స్టాటిస్టికల్ క్లర్క్, అసిస్టెంట్ పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఫారెస్ట్ గార్డ్‌లకు 18 నుంచి 27 ఏళ్లు, మేసన్‌కు 20 నుంచి 32 ఏళ్లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు 30 ఏళ్లు ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.09.2025
దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, పీఈటీ, డాక్యుమెంట్ వెరిఫికేషన్‌తో.

మరో 334 ఖాళీలు

దిల్లీలోని సబార్డినేట్ సర్వీస్ సెలక్షన్ బోర్డు వివిధ విభాగాల్లో 334 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ కోర్ట్ అటెండెంట్: 295 ✦ కోర్ట్ అటెండెంట్ (ఎస్): 22
✦ కోర్ట్ అటెండెంట్ (ఎల్): 01
✦ రూమ్ అటెండెంట్ (హెచ్): 13
✦ సెక్యూరిటీ అటెండెంట్: 03

అర్హత: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి పదో తరగతి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.09.2025
వెబ్‌సైట్: https://dsssb.delhi.gov.in/recruitment

ఎన్టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

ఎన్టీపీసీ లిమిటెడ్ 15 ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (హ్యూమన్ రిసోర్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, డిప్లొమా లేదా ఎంబీఏతో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 09.09.2025 నాటికి 29 ఏళ్లు.
వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

20 ఫిజిషియన్‌లు

ఎన్టీపీసీ లిమిటెడ్ 20 ఫిజిషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి ఎండీ/డీఎన్‌బీతో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** 37 ఏళ్లు.
వేతన శ్రేణి: నెలకు రూ.70,000 - రూ.2,00,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://careers.ntpc.co.in/recruitment/

అప్రెంటిస్‌షిప్

ఎన్ఆర్ఎస్‌సీలో...

హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) వివిధ విభాగాల్లో 96 అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, సివిల్, మెకానికల్, లైబ్రరీ సైన్స్.
✦ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 11
✦ డిప్లొమా అప్రెంటిస్: 55
✦ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (జనరల్ స్ట్రీమ్): 30
అర్హత: పోస్టును అనుసరించి బీటెక్/బీఈ, డిగ్రీ, డిప్లొమా.
స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.09.2025
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో.
వెబ్‌సైట్: https://www.nrsc.gov.in/nrscnew/Career_ApplyOnline.php

వసుంధర

vasundhara@eenadu.in

పుట్టెడు లాభాల పుట్టగొడుగు...



సాధారణంగా వర్షాకాలంలో మష్రూమ్స్ ఎక్కువగా దొరుకుతాయి. ఇవి రుచిలోనూ, పోషకాల్లోనూ నాన్‌వెజ్‌కి పోటీనిస్తుంటాయి. అందుకే, సూపర్‌ఫుడ్ జాబితాలో చేరిపోయాయి. పోషకాహార లేమితో బాధపడే మహిళలు... వీటిని డైట్‌లో చేర్చుకుంటే మేలు అంటున్నాయి అధ్యయనాలు. మరి ఇంకెన్ని ప్రయోజనాలున్నాయో తెలుసా!

- పుట్టగొడుగుల్లోని యాంటీఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్... యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్‌గా పనిచేస్తాయి. వీటిలో ఫైబర్, పొటాషియం అధికంగా ఉంటాయి. పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండెకు మేలు చేస్తుంది. అంతేకాదు, ఇందులోని బీటా గ్లూకాన్స్ కొలెస్ట్రాల్‌నీ అదుపులో ఉంచుతాయి. మష్రూమ్స్ సుమారు 92 శాతం నీటిని కలిగి ఉండటం వల్ల డీహైడ్రేషన్ సమస్య ఎదురు కాదు.
- ఎముకల్ని దృఢంగా మార్చే కాల్షియం, డి విటమిన్‌లతో పాటు వ్యాధినిరోధకశక్తిని పెంచే ప్రొటీన్ పుట్టగొడుగుల్లో పుష్కలంగా లభిస్తాయి. అంతేకాదు, ఇందులో ఉండే ఎర్గోథియోనిన్ అనే యాంటీఆక్సిడెంట్‌కి... రొమ్ము క్యాన్సర్ కణాలతో పోరాడే శక్తి ఉందట.
- పుట్టగొడుగుల్లో హైపోగ్లైసమిక్ లక్షణాలు తక్కువ. కాబట్టి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అమాంతం పెరగవు. పైగా పెరిగే గ్లూకోజ్‌ను తగ్గిస్తుంది కూడా. కాబట్టి మధుమేహం ఉన్నవారు వారానికి కనీసం రెండుసార్లు తిన్నా మంచిదే. వీటిల్లో ఇనుమూ అధికంగా ఉంటుంది. ఇది మహిళల్లో రక్తహీనత సమస్య రానివ్వదు. పోషకాహారలోపాన్నీ తగ్గిస్తుంది.

మీకు తెలుసా?



మేరీ వాన్ బ్రిటన్ బ్రౌన్... హోమ్ సెక్యూరిటీ సిస్టమ్ అయిన మొదటి సీసీటీవీని కనిపెట్టారీమె. ఆమె నివసించే ప్రాంతంలో పోలీసు భద్రత తక్కువగా ఉండటం, దాంతో అధిక నేరాలు జరుగుతుండటంతో ఈ దిశగా ఆలోచించారట. 1969లో దీనికి పేటెంట్ పొందారు. ఈ సిస్టమ్... తరవాత కాలంలో ఆధునిక హోమ్ సెక్యూరిటీ సిస్టమ్ డెవలప్‌మెంట్‌కు పునాది వేసింది.

వీళ్ల బోధనకు... జాతీయ అవార్డు!

నల్లబోర్డుపై సుద్దముక్కతో చెప్పే పాఠం కంటే ఉదాహరణలతో వివరిస్తే పిల్లలు చక్కగా నేర్చుకుంటారు. ప్రశ్నలడిగి జవాబు చెప్పమనేకంటే వస్తువులు, ఆకృతుల సహకారంతో వివరించమంటే ప్రతి ఒక్కరూ ముందుకొస్తారు... అందుకే దీన్నే మా బోధనా విధానంగా మార్చుకున్నాం అంటారు ఈ ఉపాధ్యాయురాళ్లు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికైన ఈ ఇద్దరితో వసుంధర మాట్లాడగా...



గూగుల్ డాక్యుమెంటరీ చేసింది: మాదాబత్తుల తిరుమల శ్రీదేవి

మాది తగరపువలస. బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హోమ్‌సైన్స్, ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ పూర్తి చేశా. డిగ్రీ తర్వాత ఐటీడీఏలో ఏడాదిపాటు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్‌గా పనిచేశా. తర్వాత డీఎస్సీ రాసి టీచరుగా ఉద్యోగంలో చేరా. గత 24 ఏళ్లుగా ఉపాధ్యాయవృత్తిలో కొనసాగుతున్నా. ప్రస్తుతం భీమిలిలోని పండిట్ నెహ్రూ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నా.

సాంకేతికతతో...

కొవిడ్‌కు ముందు జీవీఎంసీ, గూగుల్ ఫ్యూచర్ క్లాస్‌రూమ్ ఇనిషియేటివ్‌లు సంయుక్తంగా విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలు పెంచేందుకు విశాఖలోని 147 పాఠశాలల్లో క్రోమ్ బుక్స్, గూగుల్ వర్క్ స్పేస్‌లు అమలు చేశాయి. పిల్లలకు అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటికి కేడీపీఎం హైస్కూల్‌లో పనిచేస్తున్నా. విద్యార్థులకు సాంకేతికత చేరువ చేయడంతో వారికి అన్ని సబ్జెక్టుల్లో గ్రేడ్‌లు 15 శాతం పెరిగాయి. తర్వాత ఏడాది స్కూల్‌లో ప్రవేశాలు సగటున 12 శాతం పెరిగాయి. అప్పట్లోనే విద్యార్థులకు కాగితరహిత పరీక్షలు నిర్వహించాం. ఇక్కడి ఫలితాలను చూసి దేశంలోని మిగిలిన స్మార్ట్‌సిటీల్లోనూ ఈ ప్రాజెక్టును, మా బోధన విధానాన్ని అమలు చేశారు. దీన్ని మెచ్చిన గూగుల్ మాపై ప్రత్యేక డాక్యుమెంటరీ తయారుచేసింది.



ప్రాజెక్టులెన్నో...

మా విద్యార్థులతో జల, వాయు కాలుష్యంపై ఇప్పటికే ఎన్నో ప్రాజెక్టులు చేయించాం. అందులో విశాఖ లాసన్స్‌బే కాలనీలో వర్షపు నీటిని ఒడిసిపట్టి, భూగర్భ జలాలు పెంపొందించడానికి చేసిన ఆక్వాకాన్ ప్రాజెక్టు ఒకటి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ఆ ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో అయిదో స్థానం లభించింది. యూఎన్‌డీపీ సాయంతో క్లౌడ్‌బరస్ట్‌పైన అవగాహన కల్పించాం.

కుటుంబ సభ్యులు, తోటి ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు సాగుతున్నా. తొలుత అవార్డుకు దరఖాస్తు చేయలేదు. అన్ని ప్రాజెక్టులు చేసి ఎందుకు చేయకూడదని సహోద్యాయులు ప్రశ్నించారు. వారు ప్రోత్సహించడంతో.. ముందడుగు వేశా.

నేను జీవశాస్త్రం బోధిస్తుంటా. మూస పద్ధతిలో పాఠాలు చెబితే ఎవరూ ఆసక్తి చూపరు. అందుకే, ఉదాహరణలతో చెబుతున్నాం. వివిధ ప్రాజెక్టులు చేయిస్తూ వారిలో ఆసక్తి పెంచుతున్నాం. మారుతున్న కాలంతో పాటు బోధన విధానాలూ మారాలి. సాంకేతిక సాయమూ అవసరమే. మేం తరగతి గదుల్లో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టూల్స్(ఐసీటీ)ను వినియోగిస్తున్నాం. దీని ఫలితంగానే... ఏటికేడు ఫలితాలు మెరుగుపడుతున్నాయి. గతంతో పోలిస్తే మా దగ్గర ప్రవేశాలు 21 శాతం పెరిగాయి. విద్యార్థుల సంఖ్య ఎక్కువై ఒక్కోసారి చేర్చుకోలేమని చెప్పాల్సి వస్తోంది. పాఠశాలలో క్రమశిక్షణ, బోధన విధానాలు చూసి ఇక్కడ చేరేందుకు వివిధ మార్గాల్లో సిఫార్సు చేయించుకుంటారు. మా పిల్లలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతుల్నీ సాధిస్తున్నారు. ఏ ఉపాధ్యాయురాలికైనా ఇంతకు మించిన సంతృప్తి ఉంటుందా!

– కేతిరెడ్డి రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

అవార్డులు కొత్తేమీ కాదు: మారం పవిత్ర

నాకు సైన్స్‌పై ప్రేమ కలగడానికీ, ఎన్నో పురస్కారాలు అందుకోవడానికీ సైన్స్ టీచర్లే కారణం. నా విద్యార్థులకీ అలా సబ్జెక్టు మీద ఆసక్తి కలిగేలా బోధించాలనుకున్నా. నేను జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిని. సూర్యాపేట జిల్లా, పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నా. సాంకేతికతను ఉపయోగించి ప్రయోగాల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నా. సత్ఫలితాలూ సాధిస్తున్నా. 2009లో రామన్నగూడెం యూపీఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా నా ప్రయాణం మొదలైంది. 2023లో బదిలీపై పెన్‌పహాడ్ జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చా. 6 నుంచి 10 తరగతుల విద్యార్థుల కోసం కార్డు, బోర్డు గేమ్స్‌తో పాటు ప్రత్యేకంగా తక్కువ ఖర్చుతో బోధన అభ్యసన సామగ్రిని తయారుచేస్తా. వాటితో ఆడిస్తూ పాఠ్యాంశాలపై అవగాహన పెంచుతున్నా. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో నిర్వహిస్తున్న సైన్స్ పోటీలు, ఇన్‌స్పైర్, నేషనల్ చిల్డ్రన్స్ కాంగ్రెస్, అగస్త్య, అన్వేష, జిజ్ఞాస వంటి పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నా. తరగతి గదిలో వినూత్నంగా అవలంబిస్తున్న బోధనాభ్యసన ప్రక్రియ ఫలితాలతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించా. దీంతో సెమినార్లలో మాట్లాడే అవకాశాలొచ్చాయి. జీవశాస్త్ర పాఠ్యాంశాల్లో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణనీ ఇస్తున్నా. నేను తయారుచేసిన 13 రకాల ఎగ్జిబిట్లను జాతీయ స్థాయి పోటీల్లో ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దీక్ష పోర్టల్‌లో 99 వీడియో పాఠాలను అప్‌లోడ్ చేశా. ఇన్నేళ్లలో 'విక్రమ్ సారాబాయ్ టీచర్ సైంటిస్ట్' సహా ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నా. తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికవ్వడం నా పట్టుదలకి ఓ గుర్తింపు. నా చిన్నప్పుడే నాన్న చనిపోతే అమ్మే మమ్మల్ని పెంచింది. ఆమె కష్టం వృథా పోవొద్దని కష్టపడి చదివా. పెళ్లైనా కొనసాగించి టీచరయ్యా. సైన్స్ నేర్చుకోవడానికీ, దానిపై ఇష్టం పెంచుకోవడానికీ మా మాస్టార్లే కారణం. వాళ్ల బాటలో నడిచి కష్టమని భావించే సైన్సు పట్ల పిల్లల్లో ఇష్టాన్ని పెంచాలనుకున్నా. అందుకోసమే నా ప్రయోగాలన్నీ. అవన్నీ ఫలించి విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తుండటం నాకు ఎక్కువ ఆనందాన్నిచ్చే అంశం.



- రమేశ్, సూర్యాపేట

ఆ కుక్కర్‌తో ప్రమాదమే!



ఏది కొనేటప్పుడైనా ఆడవాళ్లు ఏం చూస్తారు? ఎక్కువకాలం మన్నుతుందా అనే కదా! అలా అని చెప్పి కుక్కర్‌నీ కొన్ని సంవత్సరాలుగా వాడుతున్నారా? అయితే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్టే అని చెబుతున్నారు నిపుణులు. ముఖ్యంగా రీసైకిల్డ్ మెటల్‌తో చేసినవి ఎన్నో అనారోగ్యాలు తెచ్చిపెడతాయి. ఇవి ఆహారంలోకి సీసాన్ని విడుదల చేస్తాయి. ఇది దీర్ఘకాలంలో శరీరంలోకి చేరితే... మెదడు, మూత్రపిండాలు, ఎముకలే కాదు నరాలపైనా దుష్ప్రభావాలను చూపెడుతుంది. పిల్లల్లో నేర్చుకోవడంలో ఇబ్బందులు, పెద్దవారిలో మతిమరపు, దీర్ఘకాలిక వ్యాధులకూ కారణమవుతుంది. కాబట్టి, ఎంత బాగా పనిచేస్తున్నా పాత, గీతలుపడ్డ కుక్కర్లను వాడొద్దు. బదులుగా స్టీలు, అయొనైజ్‌డ్ అల్యూమినియం కుక్కర్లను ఎంచుకుంటే మేలు. అలాగే మెటల్ వాటిల్లో ఆమ్ల గుణాలున్న అంటే టొమాటో, చింతపండు వంటివి ఉన్న ఆహారాల్ని ఈ పాత్రలో ఎక్కువసేపు ఉంచొద్దు. కొత్తవాటిని కొనేటప్పుడూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్), ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికేషన్ ఉందా అనేది గమనించుకోండి. ప్రేమగా, అందరికీ నచ్చినవి వండటమే కాదు. ఆరోగ్యంగా అందిస్తున్నామా అన్నదీ చూసుకోవాలి. అప్పుడే మీరు, మీ కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండగలరు. మరి గమనించుకోండి. పాతవి ఉంటే ఇకనైనా మార్చేయండి.

బంగారం - వెండి

25న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,620	93,450	1,19,822
విజయవాడ	1,00,210	93,050	1,19,800
ప్రొద్దుటూరు	1,02,050	93,890	1,18,500
రాజమహేంద్రవరం	1,01,660	93,150	1,21,000
విశాఖపట్నం	1,01,150	93,500	1,25,126
తమిళనాడు	-----	93,050	1,31,000

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

పల్లె నుంచి ఆసియా క్రీడలకి!

మారుమూల పల్లె అమ్మాయి. ఆటలకు ఖర్చు చేసేంత స్తోమతా లేదు. అయినా కూతురు సాధించగలదని నమ్మాడా తండ్రి. ఆయన నమ్మకాన్ని నిజం చేస్తూ ఏషియన్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌కి ఎంపికైంది... మిట్టపల్లి రిత్విక!



రిత్విక



నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని మారుమూల గ్రామం బినోల, రిత్విక వాళ్లది. నాన్న ప్రకాష్ ప్రైవేటు ఉద్యోగి. అమ్మ ప్రమీల. అక్క రిషిక, తన చదువులకోసమే సొంతూరు వదిలి నిజామాబాద్‌కి వచ్చింది వాళ్ల కుటుంబం. ఇద్దరిని స్విమ్మింగ్ శిక్షణలో చేర్చారు. నిజానికి రిత్వికకి మొదట్లో ఈతమీద ఆసక్తి లేదు. కానీ నాన్న ప్రోత్సహించారు. 2017లో రాష్ట్రస్థాయిలో పతకం సాధించాక ఈతపై ఆసక్తి పెరిగిందామెకి. బటర్‌ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్ విభాగాల్లో రాణిస్తుండటంతో మెరుగైన శిక్షణ అవసరమన్నారు స్థానిక శిక్షకుడు. దీంతో వీళ్ల కుటుంబం హైదరాబాద్‌కి మారింది. ఇక్కడ శిక్షణతో రిత్విక మరింత మెరుగైంది. రాష్ట్ర, జాతీయస్థాయుల్లో 88 పతకాలు అందుకుంది. ఈమె ప్రతిభను గమనించిన భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ యూనివర్సిటీ ఆమెకు డిగ్రీలో ఉచిత సీటు ఇచ్చింది. బీకాం మొదటి సంవత్సరం పూర్తిచేసుకున్న రిత్విక చదువుతోపాటు ఈతలోనూ రాణిస్తోంది. దీంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) గత ఏడాది ఈమెను ఎంపిక చేసి, శిక్షణనిస్తోంది. ఈ ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీల్లో 50మీ. బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం సాధించింది. బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ విశ్వవిద్యాలయాల ఛాంపియన్‌షిప్‌లో దేశానికి ప్రాతినిధ్యం కూడా వహించింది. తాజాగా 'ఏషియన్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్-2025'లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది. అహ్మదాబాద్‌లో నిర్వహిస్తోన్న ఈ పోటీలు సెప్టెంబరు చివర్లో ప్రారంభమవుతాయి. దీనికోసం స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే శిక్షణ శిబిరానికి వెళ్లింది రిత్విక. 'మాకోసమే నాన్న పొలాన్ని కౌలుకి ఇచ్చి చిన్న చిన్న వ్యాపారాలు చేశారు. హైదరాబాద్ వచ్చి ఉద్యోగంలో చేరి మరీ మాకు ఈతలో శిక్షణనిప్పించారు. శాయ్‌కి ఎంపికయ్యే వరకూ తలకు మించిన భారమైనా కొనసాగించారు. అందుకే నాన్న కష్టానికి తగిన ఫలితం అందించాలన్న దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నా' అంటోంది 18ఏళ్ల రిత్విక. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరింతగా రాణించాలన్నది ఆమె కల.

– ఆడెపు శ్యామ్‌సుందర్, నిజామాబాద్

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

మా బిడ్డని పిచ్చిది అంటున్నాడు!

మా అమ్మాయికి అయిదేళ్ల క్రితం పెళ్లి చేశాం. ఏడాదికి పాప పుట్టింది. తర్వాత అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తుంటే కొంత ముట్టచెప్పాం. కానీ, తర్వాత నుంచి ఆమెని మాతో కలవనివ్వడం లేదు. మొన్న పెద్దమనుషుల సాయంతో బలవంతంగా ఇంట్లోకి వెళ్తే... మానసికంగా కుంగిపోయి ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేశాం. అయితే అల్లుడు మా అమ్మాయి పిచ్చిదనే ముద్ర వేస్తున్నాడు. తనకి న్యాయం జరిగేదెలా? – ఓ సోదరి

ఎన్నిచట్టాలు చేసినా గృహహింస నుంచి స్త్రీలకు విముక్తికలగడం లేదు. మీ అల్లుడు అదనపు కట్నం అడిగినప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేసి ఉండాల్సింది. మీ అమ్మాయిని కలవనివ్వకుండా ఇంట్లో బంధించి ఉంచారని తెలిసినప్పుడే తనని బయటకు తీసుకురావాల్సింది. బాగా ఆలస్యం చేశారు. ముందు వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేయండి. సమస్య ఎదురైనప్పుడు ఆడపిల్లలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు ఇస్తేనే ఇలాంటి వాళ్లకు అడ్డుకట్ట వేయొచ్చు. మీ అమ్మాయి పిచ్చిదని వాళ్లు ముద్ర వేస్తే అది నిజం అయిపోదు. తనతో గృహహింస చట్టం కింద కూడా ఫిర్యాదు చేయించండి. హిందూ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్-13 ప్రకారం విడాకులకు దరఖాస్తు చేయమనండి. తాను పడ్డ మానసిక, శారీరక క్షోభని బయటపెట్టి అతడి క్రూరత్వాన్ని నిరూపించండి. అయితే, ముందుగా తనకి వైద్య చికిత్స ఇప్పించండి. వరకట్న నిషేధ చట్టం... వరకట్న వేధింపుల్ని క్రిమినల్‌కేసులుగా పరిగణిస్తుంది. అలానే, హిందూ మ్యారేజ్ యాక్ట్‌లోని సెక్షన్- 25 కింద మీ బిడ్డ పడ్డ మానసిక, శారీరక క్షోభకు, మీరు ఇచ్చిన డబ్బు, నగలు వెనక్కు తీసుకోవడంతోపాటు శాశ్వత పరిహారం కూడా పొందవచ్చు. మీ ఆరోపణలన్నీ నిరూపించగలిగితే వేధించిన అందరికీ జైలు శిక్ష తప్పదు.

ఫిర్యాదు చేస్తే పరువుపోతుందా?

నేను ఓ ప్రైవేట్ కంపెనీలో 7 ఏళ్లుగా పని చేస్తున్నా. 2 ఏళ్ల క్రితం నాభర్త నుంచి విడిపోయా. అప్పటి నుంచి మా సెక్షన్ అధికారి లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబుదాం అంటే నా పరువు, ఉద్యోగం ప్రమాదంలో పడతాయని వెనక్కి తగ్గా. కానీ, ఇక నావల్ల కావడం లేదు. ఫిర్యాదు ఇవ్వాలనుకుంటున్నా. ఏం చేయాలి? – ఓ సోదరి

మీ సమస్య ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్ ఎట్ వర్క్‌ప్లేస్ (పోష్) కిందకి వస్తుంది. ఈ చట్ట ప్రకారం ఆఫీసుల్లో ఒక ఇంటర్నల్ కమిటీ ఏర్పాటుచేయాలి. ఇందులో ఒక మహిళా సభ్యురాలు ఉండాలి. ముందు మీరు పనిచేసే సంస్థలో అలాంటిది ఏమైనా ఉందేమో తెలుసుకుని వారికి ఫిర్యాదు చేయండి. శరీరాన్ని అసభ్యంగా తాకడమే కాదు సైగలు చేసినా, ఆన్‌లైన్, ఫోన్‌ల ద్వారా అశ్లీల చిత్రాలు పంపించినా, చూపించినా, మాట్లాడినా... కోరిక తీర్చమని బలవంతం చేసినా వేధింపుల కిందే లెక్క. అంతేకాదు, మీరు ఫిర్యాదు చేశాక అతడి దగ్గర పనిచేయకుండా వేరే డిపార్ట్‌మెంట్‌కి బదిలీ చేయమని అడగొచ్చు. ఒకవేళ మీ ఆఫీసులో ఇంటర్నల్ కమిటీ లేకపోతే అక్కడికి దగ్గర్లోని లోకల్ కంప్లయింట్ అథారిటీకి లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయొచ్చు. వాళ్లు తగిన చర్య తీసుకోకపోతే క్రిమినల్ కేసు ఫైల్ చేయవచ్చు. ఇంటర్నల్ కమిటీ మీ కంప్లయింట్‌ను 6 నెలల్లోగా పరిష్కరిస్తుంది. అయితే, మీ దగ్గర తగిన ఆధారాలు ఉండాలి. ముందుగా ఆ రుజువులు సంపాదించడానికి ప్రయత్నించండి. మీరు ఫిర్యాదు చేశాక అతడిని పిలిపించి వార్నింగ్ ఇవ్వడం ద్వారా సమస్య పరిష్కారానికి ప్రయత్నించొచ్చు. ఇక ఆలస్యం చేయడం మంచిది కాదు. మీ మౌనాన్ని అతడు అలుసుగా తీసుకునే ప్రమాదం ఉంది. ధైర్యంగా ఫిర్యాదు చేయండి.

బిడ్డ ఎదుగుదలకు... కోత అడ్డు!



సాధారణ కాన్పు లేదా సిజేరియన్... ఏ విధానం ద్వారా జన్మనిచ్చినా బిడ్డపై అమ్మ ప్రేమ మారదు. కానీ... మారిన జీవనశైలి, రకరకాల అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు కోత కాన్పులు ఎక్కువయ్యాయి. అయితే, ఈ ఆధునిక ప్రసూతి పద్ధతుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నాయి మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ తాజా అధ్యయనాలు. సహజకాన్పులో శిశువు, తల్లి గర్భాశయ ముఖద్వారం నుంచి బయటకు రావటం వల్ల ఈ మైక్రోబ్స్‌కు ఎక్స్‌పోజ్ అవుతుంది. కానీ, ఈ ఆధునిక విధానాల్లో యాంటీబయాటిక్స్ ఉపయోగించటం, సీ సెక్షన్ ప్రసవాలు చేయటం వల్ల తల్లులు, నవజాత శిశువుల్లో మైక్రోబయోమ్ వ్యవస్థ అస్తవ్యస్తం అవుతుంది అంటున్నారు శాస్త్రవేత్తలు. ఈ మైక్రోబ్స్ లేదా మైక్రో ఆర్గానిజమ్స్ శిశువుల మెదడు ఎదుగుదలనూ ప్రభావితం చేయగలవట. ప్రత్యేకించి ఒత్తిడి, సామాజిక ప్రవర్తనతోపాటు ముఖ్యమైన శరీర విధులను నియంత్రించే మెదడు ప్రాంత ఎదుగుదలపై సానుకూల ప్రభావం చూపిస్తాయట. నిజానికి ఈ సూక్ష్మజీవులు శిశువు పుట్టిన తర్వాత నుంచే కాదు, గర్భంలో ఉన్నప్పటినుంచే మెదడు ఎదుగుదలపై ప్రభావం చూపిస్తాయట. కాబట్టి, శిశువు ఆరోగ్యకర ఎదుగుదలకు ఇవి కీలకమనీ, సాధ్యమైనంత మేర ఆధునిక ప్రసవ పద్ధతులకు దూరంగా ఉండాలనీ చెబుతున్నారు నిపుణులు.





చెవులకు ఎంతందమో!

నగా నట్రా

ఎంతందంగా తయారైనా చెవులకు సరైన ఆభరణం పెట్టకపోతే నిండుదనం రాదు. అందుకే ఈతరం ఆడపిల్లలు వీటి ఎంపిక విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొత్త ఫ్యాషన్లను ఎంచుకోవడంలో ముందుంటున్నారు. తాజాగా వారిని 'స్టాక్డ్ ఇయర్ పియర్సింగ్' మెప్పిస్తున్నాయి. ఇంతకీ ఇదేంటనేగా మీ సందేహం. నగ పెట్టుకునేందుకు చెవికి రెండు కంటే ఎక్కువ చోట్ల కుట్టించుకోవడమే! పాశ్చాత్య దేశాల్లో ఎంతో పాపులర్ అయిన ఈ స్టైల్ ఇప్పుడు మన అమ్మాయిల మనసూ దోచేస్తోంది. అలాగని ఇది మనకి కొత్తా కాదు. 60వ దశకంలో మనదేశంలోని చాలా ప్రాంతాల్లో మహిళల సంప్రదాయ ఫ్యాషన్. కాలక్రమంలో మరుగైన ఇది ఇప్పుడు ఊపిరిలూదుకుని ఆధునికత అద్దుకుంటోంది. వివిధ ఆకృతుల్లో తెల్ల రాళ్లు, వజ్రాలతో తయారుచేసిన ఇవి ధరించినవారిని తళుక్కుమనేలా చేస్తాయనడంలో సందేహమే లేదు. సమంత, నయనతార... వంటి తారలూ ఈ ఫ్యాషన్‌పై మనసు పారేసుకున్నవారే అలాగని మీరు అసురక్షిత పద్ధతులను ఎంచుకునేరు... ప్రమాదంలో పడతారు. నిపుణుల సాయంతో కొత్తగా ఆకట్టుకోండి మరి.



సమయం లేదా మెట్లెక్కండి..!



గంటల తరబడి కూర్చుని చేసే ఉద్యోగాలు... ఊపిరిపీల్చుకోనివ్వని ఒత్తిడి... ఇంటికి వచ్చేసరికి అలసట... వ్యాయామం చేసే తీరిక ఎక్కడ దొరుకుతుంది? ఇదేగా మీ ప్రశ్న... అయితే మీకు సమాధానం దొరికేసింది. మీ రోజువారి పనుల్లో భాగంగానే స్టెయిర్ ఛాలెంజ్ తీసుకోండి. మీ ఇంట్లో, ఆఫీసులో... ఇంకెక్కడైనా సరే! ఉన్న మెట్లను వాడుకోవడమే ఈ ట్రెండ్. దీనికి జిమ్ మెంబర్‌షిప్ అక్కర్లేదు, ప్రత్యేక పరికరాలు కొనక్కర్లేదు. పైగా తక్కువ సమయంలోనే ఎక్కువ ఫలితమూ సాధించొచ్చంటారు వ్యాయామ నిపుణులు. కాస్త అలవాటు పడ్డాక సరదాగా స్టెయిర్ స్ప్రింట్స్, డబుల్ స్టెప్ క్లైంబ్స్, స్టైర్ జంప్స్ వంటివీ ప్రయత్నించొచ్చు. ఇవి శరీర కింది భాగంలోని కండరాల బలాన్నీ, గుండె పనితీరు సామర్థ్యాన్నీ పెంచుతుందట. అయితే, ఏదీ ఒకేసారి చేయొద్దు. ముఖ్యంగా మోకాళ్ల నొప్పులు, గుండె సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహామీదే ఫిట్‌నెస్ ప్లాన్ ఏర్పాటు చేసుకోవాలి.

ఈనాడు

బైక్ రైడర్లుగా వెయ్యి మంది మహిళలు: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ర్యాపిడో భాగస్వామ్యంతో వెయ్యి మందికి పైగా మహిళా రైడర్లకు ఉపాధి కలగడం సంతోషాన్ని ఇస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈవీ వాహనాలు కొనుగోలు చేసేందుకు మహిళలకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని ఎక్స్ వేదికగా సోమవారం వెల్లడించారు. "స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం గొప్ప విజయం. రవాణా ప్రణాళిక అంటే కేవలం ప్రయాణం కాదు..ఇది అవకాశం. గౌరవం. ముమ్మాటికీ ఇది మంచి ప్రభుత్వం" అని లోకేశ్ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఫారం నెం. 7

(చట్టం నెం.30/2013లోని సెక్షన్ 19(1) మరియు రూలు 25(1) ప్రకారం)

రూఢీ ప్రకటన

ఆర్.సి.ఎల్7(జి1), 2086/2022 Date: 21-08-2025
Gazette. No. 46/KST/2025 Dt. 21-08-2025

క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన కృష్ణా జిల్లా గన్నవరం మండలం వెదురుపావులూరు గ్రామములో గల య. 1.971 సెంట్లు భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా రోడ్ ఓవర్ బ్రిడ్జి పనుల నిమిత్తము అవసరమై వున్నదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున భూమి అవసరమైనట్లుగా కృష్ణా జిల్లా కలెక్టరు గారు చట్టములోని నిర్మాణము కొరకు భూమి అవసరమైనట్లుగా కృష్ణా జిల్లా కలెక్టరుగారు అవసరమని అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన కృష్ణా జిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున సదరు భూముల యందు ఆసక్తి గల వ్యక్తులు ఎవ్వరూ ఎట్టి అభ్యంతరములను దాఖలు చేయనందున చట్టం 30/2013 లోని సెక్షన్ 15 ప్రకారము విచారణ మీదట మరియు సూపరింటెండెంట్ ఇంజనీర్, (ఆర్&బి) సర్కిల్, విజయవాడ వారు భూసేకరణకు అవసరమగు పైకము మొత్తము జమ చేసియున్నందున సంతృప్తిచెందిన వారై కృష్ణా జిల్లా కలెక్టరుగారు చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013)లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.

దిగువ షెడ్యూలులో పేర్కొనిన యు.1.971 సెంట్లు భూమి, చట్టం 30/2013 (కేంద్ర చట్టం 30/2013)లోని సెక్షన్ 19(1) ప్రకారము అనగా రోడ్ ఓవర్ బ్రిడ్జి పనుల నిమిత్తము అవసరమై వున్నదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, భూమి అవసరమైనట్లుగా కృష్ణా జిల్లా కలెక్టరు గారు చట్టములోని నిర్మాణము భూమి అవసరమైనట్లుగా కృష్ణా జిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించుచున్నారు.

షెడ్యూలు

ప్రాజెక్టు పేరు : రోడ్ ఓవర్ బ్రిడ్జి పనుల నిమిత్తము భూ సేకరణ అధికారి & రెవిన్యూ డివిజినల్ అధికారి గుడివాడ వారు ఏర్పాటు చేయుటకు.

జిల్లా: కృష్ణా మండలము: గన్నవరం గ్రామము: వెదురుపావులూరు

క్రమ సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	యల్.పి. యం.నెం.	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	ప్రాథమిక ప్రకటన యందు భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం. As per R.S.No.	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం. As per LPM	భూమి యొక్క వివరణ మాగాణి / మెట్ట	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	పరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడముల వివరాలు
1.	502/8	6585	0.99	0.04	0.038	WET	కాకాని మహేశ్వరరావు	2842	6657	2835	6584	NILL
2.	515/3	6657	0.17	0.01	0.01	WET	కొమ్మినేని వెంకటేశ్వరరావు	6585	6596	2835	6656	NILL
3.	515/3	6596	0.17	0.01	0.009	WET	కొమ్మినేని శివ నాగేశ్వరరావు	6657	6622	2835	6595	NILL
4.	515/3	6622	0.35	0.02	0.017	WET	కడియాల పార్వతి	6596	6645	2835	6621	NILL
5.	515/4	6645	0.375	0.015	0.017	WET	గుంటూరు వెంకట సుబ్బారావు	6622	6660	2835	6644	NILL
6.	515/4	6600	0.1875	0.0075	0.016	WET	షేక్ జయలానీ	6645	6698	2835	6599	NILL
7.	515/4	6600	0.1875	0.0075	0.016	WET	షేక్ జయలానీ	6645	6698	2835	6599	NILL
8.	515/7	6598	0.16	0.005	0.007	WET	ఉంగుటూరు వెంకటేశ్వరరావు	6660	6655	2835	6597	NILL
9.	515/7	6655	0.10	0.005	0.003	WET	ఉంగుటూరు సాంబశివరావు	6598	6602	2835	6654	NILL
10.	515/7	6602	0.008	0.005	0.003	WET	ఉంగుటూరు గీతాంజలి	6655	6604	2835	6601	NILL
11.	515/7	6604	0.35	0.01	0.013	WET	ముక్కామల వీరయ్య	6602	6653	2824	6603	NILL
12.	518/1	6653	0.50	0.01	0.01	WET	కొండపాటూరు వెంకట రత్న శ్రీనివాస్	6604	6643	2824	6652	NILL
13.	518/1	6643	0.50	0.01	0.007	WET	కొండపాటూరు సురేష్	6653	6641	2824	6642	NILL
14.	518/2	6641	0.89	0.015	0.005	WET	కొండపాటూరు శ్రీనివాసరావు	6643	6639	2824	6640	NILL
15.	518/2	6639	0.89	0.015	0.003		కొండపావులూరు శ్రీశైలం	6641	6637	2824	6638	NILL
16.	519/1	6637	1.93	0.01	0.005	WET	బత్తుల విద్యావతి	6639	6635	2824	6636	NILL
17.	519/2	6635	1.59	0.015	0.007	WET	వాగంటిపాటి సత్యనారాయణ	6637	6658	2824	6634	NILL
18.	720	6658	2.00	0.02	0.016	DRY	అర్జా వెంకట సూర్య ప్రకాశరావు	4701	6659	6659	6593	NILL
19.	721/1	6605	1.00	0.08	0.086	DRY	బండి సుధారాణి సజ్జా క్రాంతి	4702	6606	6593	6613	NILL
20.	721/1	6593	1.39	0.04	0.042	DRY	అర్జా రామానుజయ్య	4702	6594	6658	6605	NILL
21.	722	6613	2.48	0.25	0.257	DRY	మాదల రాధాకృష్ణ	4703	6612	6605	6612	NILL
22.	723	6614	1.05	0.125	0.133	DRY	కొమ్మినేని సాంబశివరావు	2815	6610	6615	4641	NILL
23.	723	6610	0.235	0.215	0.233	DRY	అర్జా కోటేశ్వరరావు	6614	6608 6607	6611	6609	NILL
24.	723	6608	0.24	0.105	0.10	DRY	అర్జా శ్రీనివాసరావు	6610	6607	6633	6607	NILL
25.	723	6633	0.585	0.26	0.259	DRY	వేమకొమ్మ వెంకట మురళీకృష్ణ	6632	4703	6630 6631	6608 6607	NILL
26.	723	6630	0.585	0.07	0.05	DRY	వేమకొమ్మ వెంకట మురళీకృష్ణ మరియు వేమకొమ్మ వెంకట సాయిరామ్	6629	6631	6627	6633	NILL
27.	723	6627	0.50	0.03	0.02	DRY	కాకాని మహేశ్వరరావు	6626	6628	6624	6630	NILL
28.	723	6624	0.50	0.025	0.02	DRY	కాకాని విజయకుమారి	6625	6623	6650	6627	NILL
29.	723	6650	1.00	0.03	0.03	DRY	అరిగల ఝాన్సీ	6649	6651	6647	6624	NILL
30.	723	6647	0.75	0.015	0.02	DRY	కొమ్మినేని వెంకటశివరావు	6646	6648	6583	6650	NILL
31.	723	6583	0.75	0.015	0.02	DRY	కొమ్మినేని నాగరాజు	6581	6582	6579	6647	NILL
32.	723	6579	0.85	0.03	0.04	DRY	తాడి సరళ కుమారి	6578	6580	6576	6583	NILL
33.	723	6576	0.35	0.015	0.02	DRY	కొమ్మినేని రాంబాబు	6575	6577	6587	6579	NILL
34.	724/2	6587	2.04	0.11	0.11	DRY	సత్యం జగదీష్	6586	6588	6586	6576	NILL
35.	734/1	6589	4.00	0.075	0.069	DRY	గరిమెళ్ళ విమల	2785	6591	6590	2824	NILL
36.	734/2	6591	1.44	0.14	0.132	DRY	కడియాల కనకదుర్గ	6589	2814	6592	2824 2816	NILL
37.	739	6616	1.00	0.075	0.073	DRY	గుంటూరు నాగలక్ష్మి	6618	6619	6617	2835	NILL
38.	739	6619	1.00	0.075	0.072	DRY	దావులూరు నాగసుధారాణి	6616	2785	6620	2835	NILL
			TOTAL	1.99	1.971							

భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజినల్ అధికారి, గుడివాడ కార్యాలయము నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించుకొనవచ్చును.

బొగ్గు గనులు, యినుపరాయి, పలకరాయి లేదా యితర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో రోడ్ ఓవర్ బ్రిడ్జి పనులు నిర్మాణము నిమిత్తము అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వటగాని, తొలగించుటగాని చేయవలెను. భూ సేకరణ నోటిఫికేషన్ ప్రాంతంలలో ఆర్ & ఆర్ విచారణను సెక్షన్ 16 క్రింద నిర్వహించడమైనది మరియు విచారణ అనంతరము ఆర్ & ఆర్ ఎన్‌టైటిల్‌మెంట్స్‌కు అర్హత గల ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు లేవని రూఢీ చేయడమైనది మరియు కుటుంబము ప్రాజెక్ట్ ప్రభావిత లేవని రూఢీ చేయడమైనది.


సం/- డి.కె. బాలాజీ, I.A.S.,
కలెక్టర్, కృష్ణా

ఏ యాంటీబయాటిక్ వాడాలి?


- సూచించే పరికరం సిద్ధం
- 3 గంటల్లోనే ఫలితం!
- ఐఐటీ మద్రాస్ రీసెర్చ్‌పార్క్ పరిశోధకుల ఆవిష్కరణ



పరిశోధక బృందం



ఎలక్ట్రోకెమికల్ మైక్రోఫ్లూయిడ్ డివైజ్ నమూనా



పరీక్ష విధానం ఇలా..

ఈనాడు, చెన్నై: రోగుల్లోని బ్యాక్టీరియా, వైరస్‌లను నిరోధించేందుకు వాడే మందుల ప్రభావం క్రమంగా తగ్గిపోతోంది. ఫలితంగా ఇన్ఫెక్షన్లు పెరిగి ఆ తీవ్రత కాస్తా మరణాలకు దారితీస్తోంది. ఈ తీవ్రతను యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అంటున్నారు. రోగ కారకాల్ని గుర్తించేందుకు చేసే పరీక్షలు, వాటి పరికరాలు ఖరీదుతో కూడుకొని ఉంటున్నాయి. ఇందుకు పరిష్కారం చూపాలని డబ్ల్యూహెచ్‌వో సైతం పలు సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో ఐఐటీ మద్రాస్ రీసెర్చ్‌పార్క్ పరిశోధకులు కొత్త ఆవిష్కరణ చేశారు. తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చేలా, రోజుల తరబడి కాకుండా 3గంటల్లోనే పరీక్షల ఫలితాన్నిచ్చే పరికరాన్ని ఆవిష్కరించారు. రీసెర్చ్‌పార్క్ టెక్నాలజీ ఇన్నోవేషన్ డైరెక్టర్ శరణ్య గోపాలకృష్ణన్, రీసెర్చ్ స్కాలర్ దీక్షా మాల్, వైబీజీ వర్మ ఇన్‌స్టిట్యూట్ చైర్ ప్రొఫెసర్ సుబ్రమణియం పుష్పవనం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రిచా కర్మాకర్ తదితరులు ఆవిష్కర్తలుగా ఉన్నారు.

చిప్ ఆధారంగా పరీక్షలు

రోగి శరీరంలో ఉన్న బ్యాక్టీరియా తీవ్రతను గుర్తించడం, దానికి తగ్గ యాంటీబయాటిక్స్ వాడటం వైద్యరంగంలో చాలా కీలకం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 'కల్చర్' వంటి పరీక్షా పద్ధతుల ద్వారా ఫలితాలు వచ్చేందుకు 48-72 గంటల సమయం పడుతోంది. ఈ పరీక్షల్ని సులభతరం చేస్తూ తమ పరిశోధన సాగిందని వారంటున్నారు. తమ ఆవిష్కరణను చిప్ ఆధారిత 'ఎలక్ట్రోకెమికల్ మైక్రోఫ్లూయిడ్ డివైజ్' అని పిలుస్తున్నట్లు వివరించారు. యాంటీమైక్రోబియల్ ససెప్టిబిలిటీ టెస్ట్ కోసం దీన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

- రోగి నమూనాల్ని పరికరంలోని మైక్రోఫ్లూయిడ్ ఛానల్ నుంచి పంపి.. అందులో బ్యాక్టీరియా ఉద్ధృతిని పెంచేలా అవసరమైన పోషకాల్ని అందించి చిప్‌లో అమర్చిన స్క్రీన్ ప్రింటెడ్ కార్బన్ ఎలక్ట్రోడ్స్ సాయంతో వాటి ప్రభావాన్ని గుర్తించేలా డిజైన్ చేశామని తెలిపారు.
- ఈ పరికరంలో బ్యాక్టీరియా ఉద్ధృతి పెంచక ముందు, ఆ తర్వాత రీడింగ్‌ల ఆధారంగా రోగికి ఎలాంటి యాంటీబయాటిక్ మందులు ఇవ్వాలో వైద్యులు తెలుసుకోవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు. పరీక్ష ఫలితాలను 3 గంటల్లోనే గుర్తించవచ్చని చెబుతున్నారు.
- ప్రయోగాలు పూర్తయ్యాక ఈ పరికరం ఇప్పుడున్న పరీక్ష పరికరాలతో పోల్చితే బాగా తక్కువకే అందుబాటులోకి వచ్చే అవకాశముందని ప్రొఫెసర్ సుబ్రమణియం పుష్పవనం తెలిపారు. తీవ్రతను అనుసరించి చిన్న క్లినిక్‌ల్లోనూ, గ్రామీణ వైద్యశాలల్లోనూ వాడొచ్చని వివరించారు. పెద్ద ఆసుపత్రుల్లో ఐసీయూల్లో తీవ్ర జబ్బుతో పోరాడుతున్న రోగులకు ఇదెంతో కీలకంగా మారబోతోందని పేర్కొన్నారు.

డీఎస్సీ ఆప్షన్లపై వైకాపా విష ప్రచారం

తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: డీఎస్సీ ఆప్షన్లపై వైకాపా నేతలు విష ప్రచారం చేస్తూ అర్హత పొందిన అభ్యర్థుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మండిపడ్డారు. తప్పుడు ప్రచారాల్ని నమ్మొద్దని అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. 15 రోజుల్లో నియామకపత్రాలు అందజేసే క్రమంలో ఇలాంటి విమర్శలు సరికాదన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం వైకాపా అధినేత జగన్, సాక్షి మీడియాకు కంటగింపుగా ఉంది. పరీక్షకు ముందే పోస్టుల ప్రాధాన్యతల్ని అభ్యర్థులు ఎంపిక చేసుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని గందరగోళం సృష్టిస్తున్నారు' అని భూమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో 11 వేల మందికి సీట్ల కేటాయింపు

ఈనాడు, అమరావతి: విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25% కోటా కింద ఉచిత ప్రవేశాలకు విద్యార్థులకు కేటాయించిన సీట్ల జాబితాను సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం విడుదల చేశారు. మొదట మూడు కిలోమీటర్ల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు కేటాయించగా.. ప్రస్తుతం ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 12 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. గతంలో సీట్ల కేటాయింపు జరగని వారితో కలిపి ప్రస్తుతం 11,702 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 31లోపు పాఠశాలల్లో చేరాలని సూచించారు. ఈ గడువులోపు చేరకపోతే సీటు రద్దవుతుందని ఎస్పీడీ తెలిపారు.

ఒక్కరోజే గడువు... 9 బార్‌లకే నాలుగేసి దరఖాస్తులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నూతన బార్‌ల లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారమే చివరి రోజు. మొత్తం 840 బార్లను నోటిఫై చేసి దరఖాస్తులు ఆహ్వానించగా సోమవారం సాయంత్రం 7 గంటల వరకూ కేవలం 57 బార్‌లకు 90 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మిగతా వాటికి ఒక్కటీ రాలేదు. నూతన పాలసీ ప్రకారం ప్రతి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే వాటిలోంచి లాటరీ తీసి లైసెన్సుదారును ఎంపిక చేస్తారు. సోమవారం సాయంత్రం వరకూ కేవలం 9 బార్‌లకు మాత్రమే 4, అంతకంటే ఎక్కువ దరఖాస్తులొచ్చాయి. అయితే మొత్తం 1972 మంది ప్రాసెసింగ్ రుసుము రూ.10 వేలు చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారని.. వీరంతా మంగళవారం దరఖాస్తు చేస్తారని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

జీరో సర్వీస్‌తోనూ అంతర్ జిల్లా బదిలీలు

నిబంధనను సడలించిన పాఠశాల విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల అర్హత నిబంధనను సవరిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు కనీసం రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేయాలని మొదట్లో పెట్టిన నిబంధనను సడలించింది. దీంతో జీరో సర్వీసు ఉన్న వారు సైతం అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న వారు పరస్పరం, స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 జులై 31లోపు పదవీవిరమణ చేసే వారు అంతర్ జిల్లా బదిలీలకు అనర్హులుగా విద్యాశాఖ పేర్కొంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈనెల 27వరకు స్వీకరిస్తారు. ఆ తర్వాత ఎంఈఓ, డీఈఓ, డైరెక్టర్ కార్యాలయాల్లో పరిశీలన ఉంటుంది. జీరో సర్వీసుతో అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం కల్పించడంపై ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ జయమంగళ పిటిషన్‌పై విచారణ 30కి వాయిదా

వివరాలు సమర్పించాలని మండలి ఛైర్మన్ తరఫు న్యాయవాదికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్సీ పదవికి గతేడాది నవంబర్ 23న రాజీనామా చేస్తూ శాసనమండలి ఛైర్మన్‌కు లేఖ సమర్పించానని, దానిపై చట్టప్రకారం తగిన ఉత్తర్వులు ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ జయమంగళ వెంకటరమణ దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. మండలి ఛైర్మన్ నుంచి రాతపూర్వక వివరాలు తీసుకొని కోర్టు ముందు ఉంచాలని శాసనమండలి కార్యదర్శి, ఛైర్మన్ తరఫు న్యాయవాది గింజుపల్లి సుబ్బారావును ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. వైకాపా తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికైన ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గానికి చెందిన జయమంగళ వెంకటరమణ పదవికి రాజీనామా చేయడంతో పాటు ఆ పార్టీని వీడిన విషయం తెలిసిందే. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు గతేడాది నవంబర్ 23న ఛైర్మన్‌కు లేఖ ఇచ్చారు. తొమ్మిది నెలలు దాటినా ఛైర్మన్ దానిని తిరస్కరించడమో, ఆమోదించడమో చేయలేదని హైకోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. నిర్ణయం తీసుకోవాల్సిన రాజ్యాంగ బాధ్యత మండలి ఛైర్మన్‌పై ఉందని, తన రాజీనామా లేఖపై తగిన ఉత్తర్వులిచ్చేలా ఆదేశించాలని కోరారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎన్.అశ్వనీకుమార్ వాదించారు.



ఒక్క నిర్ణయం జీవితాన్ని మార్చేస్తుంది!

మీ జీవితంలో మార్పు వచ్చేది.. క్యాలెండర్‌లో నెల మారితేనో, సంవత్సరం మారితేనో కాదు! సాకులు వెతకడం మానుకున్న క్షణం నుంచే.. మీరు కోరుకుంటున్న సానుకూల మార్పు మొదలవుతుంది. సోమరితనాన్ని వీడి మీరు తీసుకునే ఒకే ఒక్క కఠిన నిర్ణయం మీ జీవితాన్ని మేలి మలుపు తిప్పగలదు.

– అనికా బివా, కాపీరైటర్

రఘురామపై కేసు కొట్టేసిన సుప్రీంకోర్టు

- తనపై దాడి చేశారని 2022లో కేసు పెట్టిన ఏపీ కానిస్టేబుల్
- కొట్టేయవచ్చంటూ తాజాగా అఫిడవిట్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజుపై ఆయన ఎంపీగా ఉండగా 2022 జులైలో ఎస్.ఫారూఖ్ బాషా అనే ఏపీ పోలీస్ కానిస్టేబుల్ పెట్టిన క్రిమినల్ కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది. తాను ప్రస్తుతం హైదరాబాద్‌కు 350 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతపురంలో విధుల్లో ఉన్న కారణంగా హైదరాబాద్‌కు వచ్చి ఆ కేసును కొనసాగించలేనని, అందువల్ల దాన్ని కొట్టేయొచ్చని సదరు కానిస్టేబుల్ అఫిడవిట్ దాఖలు చేశారు. దాన్ని పరిగణనలోకి తీసుకొన్న జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం.. రఘురామకృష్ణరాజు, ఆయన కుమారుడు భరత్‌తోపాటు, ఇతర సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ సోమవారం ఉత్తర్వులిచ్చింది. 2022 జూన్‌లో హైదరాబాద్‌లోని తన ఇంటిపై అప్పటి వైకాపా ప్రభుత్వం కానిస్టేబుల్ ద్వారా నిఘా పెట్టిందంటూ రఘురామకృష్ణరాజు, ఆయన కుమారుడు భరత్, భద్రతా విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి అతన్ని పట్టుకొని తెలంగాణ పోలీసులకు అప్పగించారు. దీంతో కానిస్టేబుల్ ఫారూఖ్ బాషా రఘురామకృష్ణరాజు తదితరులు తనపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తన ఫిర్యాదును పట్టించుకోకుండా తమపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారంటూ రఘురామకృష్ణరాజు హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 4న కేసు విచారణకు వచ్చినప్పుడు కానిస్టేబుల్ తరఫు న్యాయవాదులు ప్రతివాది తన కేసును కొనసాగించదలచుకోవడం లేదని ధర్మాసనానికి చెప్పారు. ఆ మేరకు అఫిడవిట్ దాఖలు చేయాలంటూ ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. సోమవారం జరిగిన విచారణలో కానిస్టేబుల్ ఫారూఖ్ బాషా కేసు ఉపసంహరించుకుంటున్నట్లు అఫిడవిట్ దాఖలు చేశారని ఆయన తరఫు న్యాయవాది చెప్పారు. జస్టిస్ విజయ్ బిష్ణోయ్ జోక్యం చేసుకుంటూ 'ఇదివరకు మీరు దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఫొటోలు, ఇతర రత్రా విషయాలు పొందుపరిచారు కదా? ఎప్పుడు మనసు మార్చుకున్నారు' అని ప్రశ్నించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తి ప్రభుత్వం కోసం పనిచేయాల్సి ఉంటుంది కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నారని న్యాయవాది బదులిచ్చారు. దీంతో ధర్మాసనం కానిస్టేబుల్ పెట్టిన కేసును కొట్టేసింది.

న్యాయం గెలిచింది: రఘురామ



ఈనాడు, దిల్లీ: వైకాపా హయాంలో ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్‌పై ఒత్తిడి తెచ్చి తనపై పెట్టించిన తప్పుడు కేసును సుప్రీంకోర్టు కొట్టేయడం పట్ల ఏపీ శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు సంతోషం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు న్యాయం గెలిచిందన్నారు. స్పీకర్ల సదస్సుకు హాజరుకావడానికి దిల్లీకి వచ్చిన ఆయన సోమవారం ఇక్కడ ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నమోదైన తప్పుడు కేసులపై తాను సుప్రీంకోర్టు వరకు వచ్చి పోరాడానన్నారు. తన వాదనల్లో న్యాయం ఉన్నందున ధైర్యంగా సుప్రీంకోర్టుకు వచ్చి పోరాడి గెలిచి బయటపడ్డానని చెప్పారు. వైకాపా హయాంలో తనను కస్టడీలో వేధించిన కేసులో డీఐజీ ర్యాంకు స్థాయి అధికారి సునీల్ నాయక్, ఏడీజీ సునీల్‌కుమార్‌లు తెర వెనుక ఉన్నారని, పోలీసులు కోర్టుల్లో దాఖలు చేసిన అఫిడవిట్లలోనూ వీరి పాత్ర గురించి ఉందని చెప్పారు. సునీల్‌నాయక్ బిహార్ వెళ్లిపోయి అరెస్టు కాకుండా అక్కడి హైకోర్టు నుంచి రక్షణ తెచ్చుకున్నారన్నారు. ఏపీ పోలీసులు ఎన్నిసార్లు విచారణకు పిలిచినా ఆయన గైర్హాజరవుతున్నందున బెయిల్ రద్దు కోసం అక్కడి కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు.

ఐపీఎస్ విభుకృష్ణ ఏపీ క్యాడర్‌కు బదిలీ

ఈనాడు, అమరావతి: అగ్ముట్ (అరుణాచల్ ప్రదేశ్-గోవా-మిజోరం-కేంద్రపాలిత ప్రాంతాలు) క్యాడర్‌కు చెందిన 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విభుకృష్ణను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఏపీ క్యాడర్‌కు బదిలీ చేసింది. ఆయన సతీమణి ఆర్. సుష్మిత 2023 బ్యాచ్ ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారిణి. దీంతో ఆయన్ను స్పౌజ్ కోటాలో ఏపీ క్యాడర్‌కు బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సూళ్లూరుపేటలోనూ అరుణ నేర సామ్రాజ్యం

- నాటి వైకాపా ఎమ్మెల్యే సంజీవయ్య సహకారం!



సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ గోపురంపై కలశాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో నాటి ఎమ్మెల్యే సంజీవయ్యతో కలిసి పాల్గొన్న అరుణ. చిత్రంలో మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఆలయ అప్పటి ఛైర్మన్ బాలచంద్రారెడ్డి తదితరులు

ఈనాడు డిజిటల్, తిరుపతి: లేడీ డాన్ నిడిగుంట అరుణ సెటిల్‌మెంట్లు, దందాలు తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోనూ బయటపడుతున్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన ఆమె.. పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసులతో కలిసి తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించినట్లు వెలుగులోకి వచ్చింది. వైకాపా హయాంలో నాటి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో సన్నిహితంగా మెలిగిన అరుణ.. భార్యాభర్తల గొడవలపై గెస్ట్‌హౌస్‌ల్లో, లాడ్జీల్లో పంచాయితీలు చేసి వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఆమె 2024 సార్వత్రిక ఎన్నికల్లో సూళ్లూరుపేట నుంచి అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. సంజీవయ్య, అరుణ నాయుడుపేట మండలం పండ్లూరులోని ఓ హోటల్‌లో గదులు అద్దెకు తీసుకుని ఎన్నికల ప్రచారం తీరుతెన్నులను పర్యవేక్షించారని తెలిసింది. ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే వారిక్కడ మకాం వేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ కేంద్రంలో ఆమె తరఫున చీఫ్ ఏజెంట్‌గా సూళ్లూరుపేట ఎంపీపీ, వైకాపా నేత అల్లూరు అనీల్‌రెడ్డిని నాటి ఎమ్మెల్యే సంజీవయ్య నియమించారని తెలిసింది. ఈ అనీల్‌రెడ్డి క్రికెట్ బెట్టింగ్ కేసులో నిందితుడు. బెంగళూరు బెట్టింగ్ డాన్ కిరణ్‌సింగ్‌కు సన్నిహితుడిగా ముద్ర ఉంది. అప్పటి నెల్లూరు ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ఇతడి బృందాన్ని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఆ తర్వాత కూడా ఈ ముఠా గంజాయి, గుట్కా వ్యాపారాలు చేసేదని ఆరోపణలున్నాయి.

తెదేపా కార్యాలయ స్థలం లీజు 99 ఏళ్లకు పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన పురపాలకశాఖ

ఈనాడు, అమరావతి: గుంటూరు అరండల్‌పేటలోని తెదేపా కార్యాలయ స్థలం లీజు 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టౌన్ సర్వే నంబరు 826లోని 2,954 చదరపు గజాల స్థలాన్ని ఇది వరకే లీజుకు తీసుకుని జిల్లా కార్యాలయాన్ని ఆ పార్టీ నిర్వహిస్తోంది. 2016 జులై 21న రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవో 340 ప్రకారం లీజు 99 ఏళ్లకు పెంచాలన్న తెదేపా జిల్లా అధ్యక్షుడి ప్రతిపాదనలను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రభుత్వానికి పంపారు. వీటిని పరిశీలించిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ...ఎకరా స్థలానికి లీజు రూ. వెయ్యిగా నిర్ణయించి 99 ఏళ్లకు పెంచింది.

తాకట్టు బంగారాన్ని బ్యాంకులు వాపసు ఇవ్వాల్సిందే!

తేల్చిచెప్పిన తెలంగాణ వినియోగదారుల కమిషన్

ఈనాడు, హైదరాబాద్: మన దేశంలో బంగారం అంటే బరువుకు సంబంధించిన అంశం కాదు.. మనోభావాలతో ముడిపడిందని తెలంగాణ వినియోగదారుల కమిషన్ వ్యాఖ్యానించింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు బంగారం తాకట్టు పెట్టుకుని అప్పులు ఇస్తుంటాయని, రుణం తిరిగి చెల్లించిన తరువాత బంగారాన్ని వాపసు చేయాల్సిన బాధ్యత వాటిపై ఉంటుందని తెలిపింది. హైదరాబాద్‌కు చెందిన ఎం.ఆర్.రాజేశ్వరి యూకో బ్యాంకు పటాన్‌చెరువు బ్రాంచి నుంచి 1998లో 79 గ్రాముల బంగారం తాకట్టుపెట్టి రూ.20 వేల రుణం తీసుకున్నారు. 2000 ఏప్రిల్‌లో బ్యాంకులో దోపిడీ జరగడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు ప్రకారం 55 గ్రాముల నగలను 2007లో అందజేసింది. సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు వెలువరించాక మిగిలింది ఇస్తామంటూ వాయిదాలు వేస్తుండటంతో 2020లో జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదుచేయగా పూర్తిగా బంగారాన్ని వాపసు చేయాలని లేదంటే మార్కెట్ ధరతోపాటు నష్టపరిహారంగా రూ.10 వేలు, ఖర్చుల కింద మరో రూ.5 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పును సవాల్‌చేస్తూ యూకో బ్యాంకు దాఖలుచేసిన అప్పీలుపై రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌ఛార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్, వి.వి.శేషుబాబులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరించింది. సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నామన్న బ్యాంకు వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. బంగారాన్ని పూర్తిగా వాపసు చేయాల్సిందేనంటూ జిల్లా కమిషన్ ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ యూకో బ్యాంకు అప్పీలును కొట్టివేసింది.

క్రిప్టో కరెన్సీని వెనక్కి రప్పించారు!

ఈనాడు, హైదరాబాద్: విదేశీ ఖాతాలో ఉన్న క్రిప్టో కరెన్సీని వెనక్కు రప్పించి బాధితుడికి అప్పగించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో విజయం సాధించింది. సాధారణంగా క్రిప్టో కరెన్సీ జాడ గుర్తించడమే కష్టం. దాన్ని స్వాధీనం చేసుకోవడం మరింత కష్టం. అయినప్పటికీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు విదేశీ సంస్థలను ఒప్పించి మరీ ఈ ఘనత సాధించారు. ఈ మేరకు బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సోమవారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రెండేళ్ల క్రితం మ్యాట్రిమోనీ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అతనికి ఈ ఏడాది జనవరి 18న నందితారెడ్డి పేరుతో ఒక రిక్వెస్ట్ వచ్చింది. తర్వాత ఇద్దరూ వాట్సప్ ద్వారా పరిచయం పెంచుకున్నారు. ఈక్రమంలో తాను క్రిప్టో కరెన్సీ నిపుణురాలని చెప్పిన ఆమె భారీ లాభాలు ఆశ జూపి బాధితుడితో వివిధ సంస్థల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతను రూ.40,30,000 పెట్టుబడి పెట్టారు. దీనికిగాను రూ.2 కోట్ల లాభం వచ్చినట్లు చూపించినా ఉపసంహరించడానికి 5% పన్ను, 10% విదేశీమారక ఫీజు, ప్రీ డిపాజిట్ ఫండ్, ఇతర ఫీజులు వంటివాటి పేరుతో భారీగా గుంజి చివరకు మనీ లాండరింగ్ కారణంగా ఖాతా బ్లాక్ అయిందని చెప్పింది. ఇలా వివిధ దశల్లో బాధితుడు మొత్తం రూ.87,58,356 నష్టపోగా ఇందులో 2,703 అమెరికా డాలర్ల విలువైన క్రిప్టో కరెన్సీ కూడా ఉంది. తనకు జరిగిన మోసంపై బాధితుడు ఈ ఏడాది జూన్ 12న ఫిర్యాదుచేశారు. విచారించిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు క్రిప్టో సైబర్ ఇన్వెస్టిగేటర్ల సాయంతో బాధితుడి క్రిప్టో కరెన్సీ చైనా దేశస్థుడైన జియాంగ్ చువాన్స్‌వాన్‌కు చెందిన ఓకేఎక్స్ అనే ఎక్స్ఛేంజిలోని క్రిప్టోవాలెట్‌కు వెళ్లినట్లు గుర్తించారు. ఆ ఎక్స్ఛేంజికి నోటీసులు ఇచ్చి జప్తుచేసిన అధికారులు రూ.2.38 లక్షల విలువైన క్రిప్టో కరెన్సీని న్యాయస్థానం ద్వారా బాధితుడికి అందించారు. ఇందుకు కృషిచేసిన అధికారులు కృష్ణమూర్తి, రంగారెడ్డిలను శిఖా గోయల్ అభినందించారు.

ఏడు అడుగులు..
చర్నకోలతో మూడు దెబ్బలు



పెళ్లంటే.. పచ్చని పందిళ్లు, మామిడి తోరణాలు, తలంబ్రాలు, మంగళవాయిద్యాల నడుమ మూడు ముళ్లు, ఏడు అడుగులు మొత్తం కలిపి పురోహితుల వేదమంత్రాల సాక్షిగా పూర్తవుతుంది. అయితే వైఎస్సార్ కడప జిల్లాలోని బూచుపల్లె వంశీయుల పెళ్లిలో వీటితో పాటు చర్నకోలతో పెళ్లి కుమారుడిని మూడు దెబ్బలు కొట్టిన తర్వాతే వివాహం పూర్తయినట్లు భావిస్తారు. వరుడు.. వధువు మెడలో తాళి కట్టగానే ఆలయంలోని బొట్టుబు సుద్దుల వర్గీకలతో కొట్టే ఆచారం ఉంది. వందల ఏళ్ల క్రితం బూచుపల్లె వంశీయులు గంగమ్మ ఆలయం నుంచి ఓ పెట్టెను ఇంటికి తీసుకొచ్చారు. ఆ తర్వాత పెట్టెను తెరిచి చూడగా ఐదు వర్ణాల లాలు కనిపించాయి. వెంటనే ఆలయంలోకి వెళ్లి.. తప్పు జరిగిందని, క్షమించమని అమ్మవారిని వేడుకున్నారు. గంగమ్మ ప్రత్యక్షమై మీ వంశీయుల వివాహ సమయాల్లో వరుడికి చర్నకోలతో మూడు దెబ్బలు కొట్టాలని ఆదేశించారు. ఆ ఆచారాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. జిల్లాలోని బద్వేలు, తొండూరు, ఐనగలూరు, లోమడ, బూచుపల్లె, బోడివారిపల్లె, మల్లేల, అగడూరు, సంతకొవ్వూరు గ్రామాల పరిధిలో బూచుపల్లె వంశీయుల కుటుంబాలు వెయ్యికి పైగా ఉన్నాయి. - న్యూస్‌టుడే, లింగాల, తొండూరు

ఈ పామాయిల్ బేకరీలకు..



మనకు తెలియని మరో పామాయిల్ ఉందండోయ్! దానిపేరే పామ్ కెర్నల్ ఆయిల్. ఆయిల్‌పామ్ కాయల తొక్క నుంచి పామాయిల్ ఉత్పత్తి చేస్తారు. లోపల ఉండే గింజల నుంచి పామ్ కెర్నల్ ఆయిల్ తయారవుతుంది. దీన్ని బేకరీల్లో బిస్కట్లు తదితర తినుబండారాల తయారీ, సబ్బులు, షాంపూలు వంటి సౌందర్య ఉత్పత్తుల్లో ఉపయోగిస్తారు. రాష్ట్రంలో పామాయిల్ ఉత్పత్తి కోసం ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటల్లో రెండు కర్మాగారాలు నడుస్తున్నాయి. అప్పారావుపేట కర్మాగారంలో పామ్ కెర్నల్ నూనె ఉత్పత్తికి మరో కర్మాగారాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం ఇక్కడ ఏటా 30 వేల టన్నుల గింజల నుంచి సుమారు 5 వేల టన్నుల పామ్ కెర్నల్ నూనె వస్తోంది. ఈ గింజల పైపొట్టును యంత్రంతో తొలగిస్తారు. లోపల ఎండుకొబ్బరిలా కనిపించే చిన్న గింజ ఉంటుంది. అదే పామ్ కెర్నల్ నూనెకు ముడిసరుకు. శుద్ధి చేశాక ఈ నూనె మార్కెట్‌లో టన్నుకు రూ. 1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షల ధర పలుకుతోంది. నూనె తీయగా వచ్చిన ముద్ద (కేక్)ను పశువులు, చేపల ఆహారం, సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగిస్తారు. పైపొట్టును మస్కిటో కాయిల్స్, అగర్‌బత్తీల తయారీకి వాడతారు. - న్యూస్‌టుడే, దమ్మపేట

బొజ్జ గణపయ్య... బుజ్జాయిల నేస్తం!

గణేశచతుర్థి... పిల్లలకు ఎంతో ఇష్టమైన పండుగ. బొజ్జ గణపయ్య ప్రతిమ తయారీ, అలంకారం, పత్రి పూజ, నైవేద్యాలు... ఇలా ప్రతి ఒక్కదాంట్లో ఎంతో ఇష్టంగా పాల్గొంటారు. అందులోనుంచి ఎన్నో నేర్చుకుంటారు. విఘ్నేశ్వరుడి పూజకోసం చేసే ప్రతి పనీ ఒక్కో నైపుణ్యమే. కళల్ని పరిచయం చేస్తుంది. శాస్త్రీయ అంశాల్ని అధ్యయనం చేయిస్తుంది. సామాజిక సంబంధాల్ని మెరుగుపరుస్తుంది. కానీ ఆధునిక జీవనశైలి పండుగ రూపాన్నే మార్చేస్తోంది. అందులోని పరమార్థం పక్కదోవ పట్టేలా చేస్తోంది. అలాకాకుండా ఉండాలంటే తల్లులు తమ బాల్యాన్ని గుర్తు తెచ్చుకోవాలి. దగ్గరుండి పిల్లలతో ఇవన్నీ చేయించాలి..!



-వసుంధర డెస్క్

ప్రతిమతో...

పండుగ రెండుమూడు రోజుల ముందే మొదలయ్యేది పిల్లల హడావుడి. మార్కెట్లో విగ్రహాలున్నా... ప్రతి ఇంట్లోనూ కళాకారులు పుట్టుకొస్తారు. బంకమట్టి తెచ్చి వినాయకుడిని చేసేవారు. లంబోదరుడికి తొండం పెడుతున్నా, మూషిక వాహనాన్ని తయారుచేస్తున్నా వాళ్లలో ఎన్నో సందేహాలు. అందరు దేవుళ్లలా వినాయకుడు ఎందుకు లేడు? ఎలుకపై ఎలా వెళతాడంటూ బోలెడు సందేహాలు. అందుకోసం పురాణ కథలన్నీ శ్రద్ధగా వినేవాళ్లు కొందరైతే, చదివి తెలుసుకునే గడుగ్గాయిలు మరికొందరు. ఆపై ప్రతిమకి పసుపూ కుంకుమలతోనే రంగుల్ని అద్దుతూ తమలోని సృజనకు తామే మురిసిపోయేవారు. వాటికి చక్కగా పూసలూ దారాలతోనే నగల్నీ అలంకరించేవారు. అంటే వాళ్లలో ఓ శిల్పి, చిత్రకారుడు ఉన్నట్లేగా.

పత్రి సేకరణతో...

వినాయకుడి పూజలో పత్రి ప్రాధాన్యం తెలిసిందే. మాచీ పత్రం, బదరీపత్రం... ఇలా ఒక్కో రకం పత్రి కోసం ఒక్కోచోటికి పిల్లలే వెళ్లేవారు. పెరట్లో పక్కింట్లో గుడిలో బడిలో పొలాల్లో ఆ మొక్కలకోసం వెతికేవారు. అవి తెచ్చే క్రమంలో ఆ చెట్టు ఆకులూ కాయలూ ఫలాలూ బెరడూ... వంటి వాటిల్లోని ఔషధ విలువలన్నీ పరిచయమయ్యేవి. మొక్కల రకాలు తెలిసేవి. ఒకరకంగా ఇదంతా వృక్ష శాస్త్ర అధ్యయనమే. ఈ సేకరణలో కొన్ని ఎత్తుగా ఉన్న చెట్లు ఎక్కాలి. మరికొన్ని చెట్లు ముళ్లతో ఉంటాయి. అలాంటివి కోయడంలో శ్రమ, ఓపిక, నేర్పు కావాలి. ఇవన్నీ ఏ కౌన్సెలింగ్ లేకుండానే వచ్చేవి. వీటితోపాటు సమస్య పరిష్కార నైపుణ్యాలూ తెలిసేవి. పాములు, కీటకాల బారిన పడకుండా ఎలా జాగ్రత్తపడాలో నేర్చుకునేవారు. అందుకే పత్రి సేకరణ... అనేక నైపుణ్యాలతో కూడిన అభ్యాసం.

అలంకరణతో...

గజాననుడికి గొడుగు పడుతున్నట్టుగా కట్టే పాలవెల్లిని శుభ్రం చేసి పసుపు కుంకుమ బొట్టు పెట్టి మామిడాకులు, రకరకాల పండ్లు పూలతో ఇష్టంగా అలంకరించేవారు. నిండుగా ఉన్న ఆ పాలవెల్లిని చూసుకున్నప్పుడు కలిగే ఆనందం... ఏ గ్యాడ్జెట్లో కొలవగలం? ఈ చిన్ని చిన్ని అలంకరణలతోనే ప్రతి పనీ సృజనాత్మకంగా చేయడం అలవడుతుంది. పూజలో భాగంగా పాలవెల్లిలో పుస్తకాలు ఉంచి, ఆ తరవాత వాటిని తీసుకుని పసుపుతో శ్రీ అని, స్వస్తిక్ గుర్తునో రాసుకునే సంప్రదాయం వల్ల దైవంపట్ల విశ్వాసంతోపాటు బాగా చదవాలన్న తపన చిన్నప్పుడే నాటుకునేది.

పూజతో...

మంత్రోచ్చారణతో ఆ లంబోదరుడిని స్తుతించడమే కాదు, ఒక్కో మంత్రం చదువుతూ పూలూపత్రులతో పూజించడంవల్ల ఏకాగ్రత, సహనం... వంటివి ఒంటబడతాయి. గణేశుడు గుణశీలి, విజ్ఞానవంతుడే కాదు, తెలివికి మరోపేరు. అందుకే ఆయన పుట్టుక, విఘ్నాధిపత్యం, శమంతకమణి... వంటి కథలన్నీ వినడంతో తల్లిదండ్రులపట్ల చూపించాల్సిన భక్తి ప్రపత్తులు, వినయం, గౌరవం, సమయస్ఫూర్తి... వంటివన్నీ చెప్పకనే తెలిసేవి. పూజయ్యే వరకూ ఏమీ తినకుండా నిష్ఠగా దీక్షగా చేసే ఉపవాసంతో మంచి ఫలితం కోసం నిరీక్షణ తప్పదన్నదీ అర్థమయ్యేది.


విందుభోజనంతో...

ఉండ్రాళ్లు, గారెలు, బూరెలు, పులగం, పప్పు బెల్లం, పచ్చిపులుసు... ఇలా పండుగ భోజనాన్ని పిల్లలంతా కలిసి పంక్తిలో కూర్చుని విస్తరిలో తినడం అనిర్వచనీయ అనుభూతిని ఇస్తుంది. ఆ తరవాత ఒక్కొక్కరి ఇంటికీ వెళ్లి, వాళ్ల వినాయకుడినీ దర్శించుకుని అక్షతలు వేసుకోవడం, సాయంత్రం గుడిలోనో వీధి మండపంలోనో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం... సమాజంలో కలవడం తెలిసేది.

నిమజ్జనంతో...

మట్టి గణపతిని పత్రితో సహా చెరువులోనో బావిలోనో కలపడం ద్వారా ప్రకృతి నుంచి వచ్చింది ఏదయినా మళ్లీ అక్కడికే చేరుతుందన్నదీ తెలుస్తుంది. అప్పుడైనా ఇప్పుడైనా చిన్నారుల ప్రపంచం ఎంతో అందమైనది. చూసిందే నేర్చుకుని, అనుకరించే తత్వం. పండుగల పేరుతో ఆడంబరాల్నే అలవాటుచేస్తారో పర్యావరణంపట్ల ప్రేమను కలిగిస్తూ... నైపుణ్యాల్నే నేర్పిస్తారో... ఆలోచించండి!


కవర్ పేజీ.. బాగుంది గురూజీ!



ఈనాడు ఆదివారం అనుబంధంలో వచ్చే స్ఫూర్తినిచ్చే వందల కవర్‌పేజీ కథనాలను సేకరించారు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు పవన్‌కుమార్. వాటన్నింటినీ బైండింగ్ చేసి భద్రపరిచారు. ఎప్పటికీ చెక్కు చెదరకుండా ఉండేందుకు ప్రతి పేజీని పారదర్శకమైన ఓ ప్లాస్టిక్ కవర్‌లో ఉంచారు. వారింటికెళ్తే ముందు గదిలో టేబుల్ పైన ఏరికోరి సేకరించిన ఈ విజ్ఞాన భాండాగారం ఉంటుంది. దానిని తీసుకొని ఒక్కో పేజీ తిప్పితే ఎందరో విజేతల ప్రస్థానం కనిపిస్తుంది. అద్భుతాలు సృష్టించిన ఆవిష్కర్తలు ఒక్కచోటే కళ్ల ముందు కదులుతారు. గత పదేళ్లలో 'ఈనాడు' ఆదివారం అనుబంధంలో వచ్చిన అన్ని కథనాలు తన దగ్గర ఉన్నాయని వీలున్నప్పుడల్లా వాటిని తిరగేసి చదువుతుంటే ఓ టానిక్‌లా పనిచేస్తుందని పవన్ చెబుతున్నారు. తాను పనిచేసే పాఠశాలలోని పిల్లలకు, గ్రామంలోని యువతకు ఈ కథనాల గురించి చెబుతానని, వారితో చదివిస్తానని పేర్కొన్నారు. -న్యూస్‌టుడే, మామడ



చిన్నికృష్ణుడి కమతంలో..
అష్టాదశ వరి వంగడాలు



వరిలో విభిన్న, అరుదైన వంగడాలను సాగుచేసే రైతుగా గుర్తింపు పొందిన నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రైతు చిన్న గంగారాం అలియాస్ చిన్ని కృష్ణుడు ఈ ఖరీఫ్ సీజన్‌లో మరో ప్రత్యేకత చాటారు. శివారు గూపన్‌పల్లిలోని తన వ్యవసాయ భూమిలో.. 12 గుంటల్లో 'సుదర్శన చక్రం' ఆకృతిలో 18 రకాల వరి వంగడాలు సాగు చేస్తున్నారు. ఇందులో అరుదైన నవారా, గోవింద్ బోగ్, తిరునల్వేలినాథన్, గంగా రుబీ రెడ్ రైస్, తోయిమల్లి, నల్ల కొండెం, కచిరాజ్ సాల్, లుసిరి, పొక్కార్, సోనాచూర్, రక్తశాలి, హస్తినా బాస్మతి, చమత్కార్, కులాకర్, చిట్టి ముత్యాలు, థాయ్‌లాండ్ జాస్మిన్, బంగారు గులాబీ రకాలున్నాయి. – ఈనాడు, నిజామాబాద్

అక్షరాలకు ఆలయం



గిరిజనులు ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పాటిస్తుంటారు. అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని సతివాడ పంచాయతీ నూకాలమ్మగూడలో సవర తెగకు చెందిన గిరిజనులు అక్షరాలకు ఆలయం నిర్మించారు. వారి మాతృభాష సవర లిపిలోని అక్షరాలనే దైవంగా కొలుస్తూ, పూజలు చేస్తున్నారు. ఒడిశాలోని గజపతి జిల్లా మర్చిగూడలో 1936లో ఆ రాష్ట్రానికి చెందిన మంగ్రై గమాంగో, మాలర్ మడియార్‌లు తొలుత సవర భాషకు 24 అక్షరాలతో లిపి రూపొందించి 'అక్షరబ్రహ్మ' పేరిట ఆలయం కట్టారు. అనంతరం సవరలు నివసించే అన్ని ప్రాంతాల్లో పర్యటించి దీన్ని వాడుకలోకి తీసుకొచ్చారు. వీరి స్ఫూర్తితో భామిని మండలం నూకాలమ్మ గూడలో సవర కరువయ్య 1995-96లో అక్షర బ్రహ్మ గుడి నిర్మించారు. ఇక్కడ ప్రతి గురువారం ప్రత్యేక పూజలు చేస్తారు. మండల వాసులతోపాటు ఒడిశా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కార్తిక మాసంలో దీక్షలు చేపడతారు. 'ఇటీవలే సవర భాషలో పుస్తకాలను రూపొందించి ప్రచురిస్తున్నాం. ఈ భాషను అధికారికంగా గుర్తించాలి' అని సవర కరువయ్య కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భామిని

మనిషికో మెనూ!

ఎన్ఐఎన్ తాజా సిఫారసులు

మా ఇంట్లో...
రెండేళ్ల చింటూగాడు...
బడికి వెళ్లే నేను, చెల్లి...
కాలేజీకి వెళ్లే విజయ్ అన్న.
అమ్మ, నాన్న... ఇంకా నానమ్మ, తాతయ్య...
ఇంతమందిమి ఉన్నాం.
మరి మా రోజువారీ మెనూ...
ఉదయాన్నే ఇడ్లీ... పూరీ...
మధ్యాహ్నం అన్నం... కూర... పెరుగు...
రాత్రి అన్నం... పుల్కాలు... కూర...
ఇలా ఉంటోంది...
మరి ఇది సరిపోతుందా...
అని బన్నూకి అనుమానం?
ఈ అనుమానం సమంజసమేనా?

...సమంజసమే అంటున్నాయి జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)లు. మనిషి ఆరోగ్యంలో ఆహారానిది కీలక పాత్ర. వయస్సు, శారీరక స్థితి, చేసే శ్రమను బట్టి పోషకావసరాలు మారుతూ ఉంటాయి. దానికి అనుగుణంగా ఆహారం తీసుకోవాలి. సాధారణంగా మన ఇళ్లలో ఒకే రకమైన ఆహారం తీసుకుంటాం. ఇది ఇంటి సభ్యుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఎన్ఐఎన్ చెబుతోంది. ముఖ్యంగా కుటుంబాల్లోని వృద్ధులు, పిల్లలు, గర్భిణుల అవసరాల ప్రాతిపదికన ఆహారం అందడం లేదని పేర్కొంది. ఆరోగ్యకర జీవనానికి వివిధ వయసుల వారికి ఆహార సిఫారసులను జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) తన తాజా నివేదికలో పేర్కొంది.



ఎవరికి.. ఎంత శక్తి? (క్యాలరీల్లో)

వయస్సు	మొత్తం
60 (పురుష)	1740
60 (మహిళ)	1530
50 (పురుష)	2080
50 (మహిళ)	1660
యువత	3000

గర్భిణులకు 2,020, పాలిచ్చే స్త్రీలకు 2,245 క్యాలరీల చొప్పున శక్తి అందాల్సి ఉంటుంది.

ప్రస్తుతం: ఈ మొత్తం క్యాలరీల్లో 50–55% కార్బోహైడ్రేట్ల నుంచి, 10–15% ప్రొటీన్ల నుంచి, 20–30% కొవ్వుల నుంచి లభిస్తాయి.

ఎన్ఐఎన్ సిఫారసు: మొత్తం క్యాలరీల్లో 45 శాతం చిరుధాన్యాల నుంచి, 5 శాతం పప్పులు, బీన్స్, మాంసం నుంచి.. మిగిలినవి గింజలు, కూరగాయలు, పండ్లు, పాల నుంచి అందాలి.

- ఈనాడు, హైదరాబాద్


వీగన్ ఫర్నిచర్






వీగన్ ఫర్నిచర్ గురించి విన్నారా.. లేదంటే ఇవిగో వీటిని చూడండి.. పనికిరాని దుస్తులు, బూట్లతో తయారైన ఫర్నిచర్ ఇది.. బూజు, నాచుతో రూపొందించిన ఇంట్లోని వస్తువులివి. కలప, తోలు తదితరాల వినియోగంపై పర్యావరణవేత్తల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ రంగంలో సుస్థిరత సాధించడానికి తయారీదారులు సరికొత్తగా ఆలోచిస్తున్నారు. వాడిపారేసిన దుస్తులు, జీన్స్, బూట్ల సోల్‌ల నుంచి అందమైన ఫర్నిచర్ తయారీకి శ్రీకారం చుట్టారు. పుట్టగొడుగుల బూజుతో కుర్చీల తయారీ, సముద్రపు నాచు నుంచి వీగన్ లెదర్ సోఫాల వంటివీ రూపొందిస్తున్నారు. పారిశ్రామిక వ్యర్థాలతోనూ ప్రయోగాలు చేస్తున్నారు. బూట్ల కంపెనీలో గ్రైండ్ అయిన రబ్బర్‌ను, బూట్ల పాత సోల్‌లను ఉపయోగించి కుర్చీలు, బల్లలను రూపొందిస్తున్నారు. రబ్బర్లు, ప్లాస్టిక్, పాదరక్షల వేస్ట్, రీసైకిల్ చేసిన దుస్తులను ఇందుకు వినియోగిస్తున్నారు. పోలండ్ సంస్థ ఒకటి.. జనపనార, ప్లాంట్ బేస్డ్ బంకతో డైనింగ్ టేబుల్‌ను తయారుచేసింది. దీనిని కలపకు ప్రత్యామ్నాయంగా పేర్కొంటోంది. – ఈనాడు ప్రత్యేక విభాగం

రష్యా.. ఉక్రెయిన్ యుద్ధంలో
వలతంత్రం



జాలర్లు వల వేసి చేపలు పడతారు. ఉక్రెయిన్ సైనికులూ అదే పనిచేస్తున్నారు. కానీ చేపలు పట్టడానికి కాదు, డ్రోన్లను అడ్డుకోవడానికి. మూడున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్లను కూడా భారీగా ప్రయోగిస్తోంది. వీటిని అడ్డుకోవడం ఆ దేశానికి పెద్ద సమస్యగా మారింది. ఇవి కీలక సైనిక స్థావరాలకు భారీగా నష్టం కలిగిస్తున్నాయి. వీటిని నిరోధించడానికి ఉక్రెయిన్ రకరకాల ప్రయత్నాలు చేసింది. ఎలక్ట్రానిక్ జామర్లను ఉపయోగించింది. అయితే ఈ మధ్య రష్యా ప్రయోగిస్తున్న కొత్త తరహా డ్రోన్లను ఈ జామర్లు కూడా అడ్డుకోలేకపోతున్నాయి. దీంతో చేపల వలలను వినియోగించాలని నిర్ణయించింది. చాలా పట్టణాల్లో వీటిని ఏర్పరిచింది. ముఖ్యంగా సైనిక వాహనాలు తరచూ తిరిగే రహదారులపై, చిన్న చిన్న సైనిక యూనిట్లు ఉన్న చోట ఈ వలలను వాడుతున్నారు. ఇవి డ్రోన్ల నుంచి 100 శాతం రక్షణ ఇవ్వకపోయినా, చాలా సందర్భాల్లో అడ్డుకుంటున్నాయని, మంచి ఫలితాలనే ఇస్తున్నాయని ఉక్రెయిన్ సైనికాధికారులు చెబుతున్నారు. ఆసక్తికరమేంటంటే.. యుద్ధం తొలినాళ్లలో ఉక్రెయిన్ ప్రయోగించే డ్రోన్లను అడ్డుకోవడానికి ఈ వలలను తొలిసారి రష్యానే ఉపయోగించింది. ఇప్పుడు నీవు నేర్పిన విద్యే నీరజాక్ష అన్నట్లు ఉక్రెయిన్ వాడటం ప్రారంభించింది.

పాఠం చెప్పలేదు..
బుర్రలోకి ఎక్కించేశారు..





పంచ కట్టుకుని సోమవారం పాఠశాలకు వచ్చారు మంచిర్యాల జిల్లా మందమర్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు భీంపుత్ర శ్రీనివాస్. ఈ రోజు వినాయకచవితి కాదు.. ఏమిటీ వేషధారణ అని అంతా అనుకుంటున్నా.. ఆయన క్లాసు తీసుకోవడానికి 5వ తరగతి విద్యార్థుల గదికి వెళ్లారు. అప్పటికే ఆశ్చర్యంగా చూస్తున్న విద్యార్థులు.. సార్ చొక్కా తీసేసరికి.. లోపల ఉన్న మరో చొక్కాను చూసి అవాక్కయ్యారు. ఆ చొక్కా మానవ శరీర భాగాలను ముద్రించి ఉంది. తర్వాత మాస్టారు పంచను కూడా తీసేయగా.. లోపల ఉన్న ప్యాంట్‌పై ఆయా శరీరభాగాలు ముద్రించి ఉన్నాయి. అనంతరం ఉపాధ్యాయుడు బోధన ప్రారంభించారు. మానవ శరీర అవయవాలు ఎలా ఉంటాయి.. ఎక్కడ ఉంటాయి.. వాటి పనితీరు.. ఒక్కో అవయవం మరో అవయవంపై ఆధారపడి ఎలా పనిచేస్తుందో కళ్లకు కట్టినట్టు చూపిస్తూ బోధించడంతో విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. పాఠాన్ని.. ఇట్టే గుర్తుండిపోయేలా బోధించేందుకు ఈ డ్రస్సును ప్రత్యేకంగా సిద్ధం చేయించుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. – న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం

భక్తుల కోసం ద్విరూప దర్శనం



సాధారణంగా శివాలయాల్లో ఒక పానవట్టంపై ఒక శివలింగమే చూస్తుంటాం. కానీ పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం తంపటాపల్లి గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర - శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ఒకే పానవట్టంపై రెండు శివలింగాలు, ఎదురుగా రెండు నందీశ్వరుల విగ్రహాలు దర్శనమిస్తాయి. ఇలా రెండు లింగాలు, రెండు నందులు ఉండడం అరుదైన విషయం. గ్రామానికి చెందిన కొమ్మూరు కుటుంబ సభ్యులు గ్రామస్థుల సహకారంతో 2012లో ఈ దేవస్థానాన్ని నిర్మించారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వస్తుంటారు. – న్యూస్‌టుడే, పాలకొండ



ఛాంపియన్స్


చికిత

తండ్రి స్వప్నం.. తనయ సాకారం

తండ్రికి ఆర్చరీ అంటే ఇష్టం. విల్లు ఎక్కుపెట్టి బాణాలు సంధిస్తూ.. దేశానికి పతకాలు అందించాలని కలగన్నాడు. కానీ వసతులు లేవు.. ప్రోత్సాహం అంతకన్నా లేదు! తనయ మాత్రం ఆగలేదు. ఊళ్లో పొలంలోనే సాధన చేసింది. గడ్డి వామే లక్ష్యంగా బాణాలు సంధించింది. మొక్కవోని పట్టుదల.. ఏకాగ్రతతో పతకాలపై గురిపెట్టింది. భారత్‌లో ఎవరూ సాధించని విధంగా ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్ కాంపౌండ్ విభాగంలో బంగారు పతకం సొంతం చేసుకుంది. తండ్రి స్వప్నాన్ని సాకారం చేసిన ఆ తనయ.. తానిపర్తి చికిత.

ఈనాడు – హైదరాబాద్

ప్రయాణం ఎంత దూరమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభం అవుతుందనడానికి చికిత నిదర్శనం. తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఆమె ఇప్పుడు భారత కాంపౌండ్ ఆర్చరీలో సరికొత్త సంచలనం. కెనడాలో ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో ఆమె చరిత్ర సృష్టించింది. ఫైనల్లో యెరిన్ పార్క్ (కొరియా), సెమీస్‌లో పౌలా డయాజ్ (స్పెయిన్), క్వార్టర్స్‌లో ప్రీత్ కౌర్ వంటి అగ్రశ్రేణి క్రీడాకారిణులను మట్టికరిపించింది. ఆమె ప్రపంచ విజేతగా నిలవడానికి తొలి అడుగు వారి గ్రామంలోనే పడింది. తాను సాధించలేనిది తన కూతురు సాధించాలని ఆశపడ్డ శ్రీనివాసరావు.. చికిత ఆరేళ్ల వయసున్నప్పుడు ఆర్చరీ నేర్పించాలని భావించాడు. కానీ వారి గ్రామంలో ఆర్చరీకి సంబంధించిన ఎలాంటి వసతులు లేవు. శ్రీనివాసరావు నిరాశ చెందలేదు. చికిత ఏకాగ్రత కోసం యోగా.. ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి కరాటే నేర్పించాడు. యోగాపై పట్టుసాధించిన చికిత.. కరాటేలో బ్లాక్‌బెల్ట్ కూడా సొంతం చేసుకుంది. కుమార్తె ప్రతిభపై నమ్మకం రాగానే శ్రీనివాసరావే కోచ్ అవతారం ఎత్తాడు. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ దుకాణంలో ఆర్చరీకి సంబంధించిన విల్లు, బాణాలు, ఇతర పరికరాలు కొనుగోలు చేశాడు. గ్రామంలోని తమ పొలంలోనే ఆర్చరీ సాధనకు శ్రీకారం చుట్టాడు. వరి కోతలయ్యాక మిగిలిన గడ్డివామునే లక్ష్యంగా ప్రాక్టీస్ చేయించాడు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆకట్టుకున్న చికిత.. రెండేళ్ల లోనే జాతీయ స్థాయికి చేరుకుంది. జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీలో వ్యక్తిగత విభాగంలో రజతం, మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్యం కైవసం చేసుకుంది. ఆర్చరీ ప్రయాణంలో తెలంగాణ అమ్మాయి సాధించిన మొదటి జాతీయ పతకాలు ఇవే.

2022లో సోనీపత్‌లోని భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) ఆర్చరీ అకాడమీలో చోటు లభించడం చికిత కెరీర్‌లో కీలక మలుపు. సహజ ప్రతిభావంతురాలైన ఆమెను అక్కడి కోచ్‌లు, మెంటార్‌లు మరింతగా సాన బెట్టారు. ఆమెలోని అత్యుత్తమ ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చారు. ఫలితమే 2023 గోవా జాతీయ క్రీడల్లో చికితకు స్వర్ణం. అదే ఏడాది జాతీయ సీనియర్ ఆర్చరీలో 2 రజతాలు, జాతీయ జూనియర్ టోర్నీలో రెండు కాంస్యాలతో ఆమె సత్తా చాటింది. ఈ ఏడాది ప్రపంచకప్‌లోనూ మెరిసింది. షాంఘైలో జరిగిన టోర్నీలో టీమ్ విభాగంలో రజత పతకం దక్కించుకుంది. ఆసియా గ్రాండ్‌ప్రిలో టీమ్ విభాగంలో కాంస్యం సాధించిన చికిత.. వ్యక్తిగత కేటగిరీలో నాలుగో స్థానంలో నిలిచింది. తాజా యూత్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. విమానయాన సిబ్బంది సమ్మె కారణంగా పోటీలకు కొన్ని గంటల ముందు చికిత బృందం కెనడా చేరుకుంది. ప్రయాణ బడలిక తీరకముందే పోటీల్లో బరిలో దిగాల్సి వచ్చింది. అయినా అగ్రశ్రేణి క్రీడాకారిణుల్ని ఓడించి చికిత పసిడి సొంతం చేసుకుంది. ఎక్కడో సుల్తాన్‌పూర్‌లో మొదలుపెట్టి.. కెనడాలో అత్యున్నత శిఖరాలను అందుకోవడం వరకు సాగిన చికిత ప్రయాణం స్ఫూర్తిదాయకం.


నీరూ


ఇషా సింగ్

నీరూ స్వర్ణ గురి

ఇషా బృందానికి కాంస్యం ● ఆసియా షూటింగ్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. మహిళల ట్రాప్‌లో నీరూ దండ పసిడితో మెరవగా.. 25 మీటర్ల పిస్టల్‌లో హైదరాబాద్ అమ్మాయి ఇషా సింగ్‌తో కూడిన టీమ్ కాంస్యం సాధించింది. ఫైనల్లో నీరూ 43 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మరో భారత షూటర్ ఆషిమా కాంస్యం గెలిచింది. 29 పాయింట్లతో ఆమె మూడో స్థానాన్ని సాధించింది. బాసిల్ రే (ఖతార్, 37) రజతాన్ని సొంతం చేసుకుంది. నీరూ, ఆషిమా, ప్రీతి (319)లతో కూడిన భారత జట్టు టీమ్ స్వర్ణంతో మెరిసింది. పురుషుల ట్రాప్‌లో వివేక్ (45 పాయింట్లు) రజతం గెలుచుకున్నాడు. బి యింగ్ (చైనా, 47) స్వర్ణం.. చెన్ పెంగ్‌యూ (చైనా, 35) కాంస్యం నెగ్గారు. మహిళల 25 మీటర్ల పిస్టల్‌లో స్టార్ షూటర్ మను బాకర్‌కు నిరాశ ఎదురైంది. ఫైనల్లో మను 25 పాయింట్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. క్వాలిఫికేషన్లో 588 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన ఇషా సింగ్ ఫైనల్లో తడబడింది. 18 పాయింట్లే సాధించి ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. టీమ్ విభాగంలో ఇషా సింగ్, మను బాకర్, సిమ్రన్‌ప్రీత్ (1749)లతో కూడిన భారత బృందం కాంస్యం గెలుచుకుంది. జూనియర్ కేటగిరీలో 25 మీటర్ల పిస్టల్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. పాయల్ ఖత్రి (36) స్వర్ణం సాధించగా.. నామ్య కపూర్ (30), తేజస్విని (27) రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు.

గణేశ్ బృందానికి పసిడి


గణేశ్

నాయుడుపేట, న్యూస్‌టుడే: ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నం పసిడి పతకం గెలిచాడు. కెనడాలో జరిగిన టోర్నీలో గణేశ్, కుశాల్, నితిన్‌లతో కూడిన భారత బృందం అండర్-21 కాంపౌండ్ పురుషుల టీమ్ విభాగంలో అగ్రస్థానంలో నిలిచింది. అండర్-19 మహిళల విభాగంలో శార్వరి షిండే కూడా పసిడి సాధించింది. ఈ టోర్నీలో భారత్ నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించింది.


మీరాబాయి చాను

కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్స్

మీరాబాయికి స్వర్ణం

అహ్మదాబాద్: భారత అగ్రశ్రేణి వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను పునరాగమనంలో అదరగొట్టింది. రికార్డు బద్దలు కొడుతూ కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం గెలుచుకుంది. ఏడాది విరామం తర్వాత బరిలోకి దిగిన ఆమె సోమవారం మహిళల 48కేజీ విభాగంలో 193 కిలోలు ఎత్తి విజేతగా నిలిచింది. ఇది ఛాంపియన్‌షిప్ రికార్డు. గత రికార్డు కన్నా 14 కిలోలు ఎక్కువ. చాను స్నాచ్‌లో 84 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలు ఎత్తింది. మలేసియాకు చెందిన ఇరెన్ హెన్రీ (161కేజీ) రజతం నెగ్గగా.. వేల్స్ అమ్మాయి నికోల్ రాబర్ట్స్ (150) కాంస్యం సాధించింది. జూనియర్ విభాగంలో సౌమ్య దాల్వీ పసిడి పతకం గెలుచుకుంది. పురుషుల 60కేజీ విభాగంలో రిషికంత సింగ్ స్వర్ణం గెలుచుకున్నాడు. అతడు 271 కిలోలు (120+151) ఎత్తాడు.

యుఎస్ ఓపెన్

మెద్వెదెవ్‌కు షాక్

● తొలి రౌండ్లోనే ఇంటిముఖం
● క్విటోవా కూడా

జకోవిచ్, సబలెంకా ముందంజ


మెద్వెదెవ్

న్యూయార్క్: డానియల్ మెద్వెదెవ్‌కు షాక్.. యుఎస్ ఓపెన్లో ఈ రష్యా స్టార్ తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టాడు. పదమూడో సీడ్ మెద్వెదెవ్ 3-6, 5-7, 7-6 (7-5), 6-0, 4-6తో బెంజమిన్ బోంజి (ఫ్రాన్స్) చేతిలో కంగుతిన్నాడు. ఈ పోరులో ఆరంభం నుంచే మెద్వెదెవ్ తడబడ్డాడు. వరుస తప్పిదాలతో తొలి రెండు సెట్లను చేజార్చుకున్నాడు. మూడో సెట్లోనూ 4-5తో ఓటమి అంచున నిలిచాడు. ఈ స్థితిలో మ్యాచ్ పాయింట్ మీద ఉన్న బోంజి ఏకాగ్రత చెదిరింది. మెద్వెదెవే ఇందుకు కారణం. ఒక ఫొటోగ్రాఫర్ మ్యాచ్‌కు అంతరాయం కలిగించాడనే కారణంతో అంపైర్.. బోంజికి మళ్లీ తొలి సర్వ్ చేసే అవకాశాన్ని ఇచ్చాడు. కోపంతో ఊగిపోయిన మెద్వెదెవ్ అభిమానులను రెచ్చగొడుతూ నిరసన వ్యక్తం చేశాడు. దీంతో ఆరు నిమిషాలపైనే మ్యాచ్ ఆగిపోయింది. ఆ సెట్‌ను బోంజి టైబ్రేకర్‌లో చేజార్చుకున్నాడు. అదే దూకుడుతో నాలుగో సెట్లో 6-0తో గెలిచిన మెద్వెదెవ్ స్కోరు సమం చేశాడు. నిర్ణయాత్మక అయిదో సెట్లో బోంజి పుంజుకున్నాడు. మెద్వెదెవ్‌కు షాకిస్తూ విజయాన్ని అందుకున్నాడు. మ్యాచ్ ఓడిపోవడంతో ఈ రష్యా ఆటగాడు రాకెట్ విరగొట్టి అసహనాన్ని వ్యక్తం చేశాడు. మ్యాచ్‌లో ఆరుసార్లు సర్వీస్ కోల్పోయిన అతడు.. 64 అనవసర తప్పిదాలతో ఓటమి కొనితెచ్చుకున్నాడు.

జకోవిచ్ ముందుకు: రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్‌పై గురిపెట్టిన నొవాక్ జకోవిచ్ (సెర్బియా) శుభారంభం చేశాడు. తొలి రౌండ్లో ఈ ఏడో సీడ్ ఆటగాడు 6-1, 7-6 (7-3), 6-2తో లియార్నర్ తియాన్ (అమెరికా)ను ఓడించాడు. రెండో సెట్లో మాత్రమే ప్రత్యర్థి నుంచి 38 ఏళ్ల జకోవిచ్‌కు గట్టిపోటీ ఎదురైంది. మ్యాచ్‌లో నొవాక్ ఏడు ఏస్‌లతో పాటు 26 విన్నర్లు కూడా కొట్టాడు. అమెరికా కుర్రాళ్లు టేలర్ ఫ్రిట్జ్, షెల్టన్ కూడా రెండో రౌండ్ చేరారు. షెల్టన్ 6-3, 6-2, 6-4తో ఇగ్నాసియో బజ్ (పెరూ)పై నెగ్గగా.. ఫ్రిట్జ్ 7-5, 6-2, 6-3తో నవా (అమెరికా)పై గెలిచాడు. నోరి (బ్రిటన్), డామ్ (అమెరికా), నకషిమా (అమెరికా), మెన్సిచ్ (చెక్), డేవిడోవిచ్ (స్పెయిన్), రిండర్‌కిచ్ (ఫ్రాన్స్) తొలి రౌండ్ దాటారు.


సబలెంకా

క్విటోవా ఔట్: మాజీ నంబర్‌వన్ పెట్రా క్విటోవా తొలి రౌండ్లోనే ఇంటి ముఖం పట్టింది. మహిళల సింగిల్స్‌లో ఆమె 1-6, 0-6తో డైన్ పారీ (ఫ్రాన్స్) చేతిలో కంగుతింది. ఈ పోరులో ప్రత్యర్థి ధాటికి క్విటోవా ఏమాత్రం నిలవలేక పోయింది. 12 గేముల్లో కేవలం ఒక్కటే గెలిచి చిత్తుగా ఓడిపోయింది. 21 అనవసర తప్పిదాలు చేసిన క్విటోవా.. అయిదుసార్లు సర్వీస్ కోల్పోయి ఓటమి కొనితెచ్చుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ సబలెంకా (బెలారస్) వేట మొదలుపెట్టింది. తొలి రౌండ్లో ఈ టాప్ సీడ్ ప్లేయర్ 7-5, 6-1తో మసరోవా (స్విట్జర్లాండ్)ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ఆమె 2 ఏస్‌లతో పాటు 20 విన్నర్లు కొట్టింది. బార్బరా క్రెజికోవా (చెక్) 6-3, 6-2తో ఎంబాకో (కెనడా)పై గెలిచి ముందంజ వేసింది. నాలుగో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) 6-0, 6-4తో మయర్ షరీఫ్ (ఈజిప్ట్)పై గెలిచింది. ఏడో సీడ్ పావోలిని (ఇటలీ), పదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా), బెన్సిచ్ (స్విట్జర్లాండ్), అజరెంకా (బెలారస్), ఒస్టాపెంకో (లాత్వియా) తొలి రౌండ్ అధిగమించారు. పావోలిని 6-2, 7-6 (7-4)తో అయావా (ఆస్ట్రేలియా)పై.. నవారో 7-6 (11-9), 6-3తో వాంగ్ (చైనా)పై నెగ్గారు. బెన్సిచ్ 6-3, 6-3తో జాంగ్ (చైనా)ను ఓడించింది. అజరెంకా 7-6 (7-0), 6-4తో ఇనో (అమెరికా)పై.. ఒస్టాపెంకో 6-4, 6-3తో జియూ (చైనా)పై నెగ్గారు.

అమ్మో.. టెస్టు క్రికెట్


రోహిత్

ముంబయి: టెస్టు క్రికెట్ ఎంతో సవాలుతో కూడుకున్న ఫార్మాట్ అని రోహిత్ శర్మ అభిప్రాయపడ్డాడు. శక్తిని హరించే ఈ ఫార్మాట్లో ఆడేందుకు ఎంతో సహనం, సన్నద్ధత అవసరమని అతనన్నాడు. 2022 నుంచి గత ఏడాది చివర్లో ఆస్ట్రేలియా పర్యటన వరకు 24 టెస్టుల్లో భారత జట్టును నడిపించిన రోహిత్.. కొన్ని నెలల కిందటే సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టెస్టు క్రికెట్ సవాళ్ల గురించి అతను ఓ కార్యక్రమంలో మాట్లాడాడు. "ఆటలో మనగలగాలంటే సుదీర్ఘ సమయం నిలబడగలగాలి. ముఖ్యంగా టెస్టు క్రికెట్ అయిదు రోజులు సాగే ఫార్మాట్. మానసికంగా అది కఠిన సవాలు విసురుతుంది. మన శక్తిని హరించేస్తుంది. అయితే క్రికెటర్లందరూ ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడడం ద్వారా ఆ సవాలును తట్టుకునేలా తయారవుతారు. ముంబయి క్లబ్ క్రికెట్లో రెండు, మూడు రోజుల మ్యాచ్‌లు ఆడడం ద్వారా యుక్త వయసులోనే సవాలుకు తగ్గట్లు తయారయ్యాం. అయితే కెరీర్ ఆరంభంలో ఆటను సరదాగా, ఆస్వాదిస్తూ ఆడేవాళ్లం. కానీ వయసు విభాగాలను దాటాక సీనియర్ ఆటగాళ్లను, కోచ్‌లను కలిసినపుడు మ్యాచ్‌లకు సన్నద్ధత ఎంత కీలకమో అర్థమవుతుంది. అంతకుముందు వరకు దాని ప్రాధాన్యం తెలియదు. టెస్టుల కోసమైతే సన్నద్ధత మరింత ఎక్కువ అవసరం. అయిదు రోజుల ఆటలో ఎప్పటికప్పుడు తాజాగా ఉండేలా సిద్ధం కావాలి. అదే సమయంలో ఎంతగా సన్నద్ధమైనప్పటికీ.. మ్యాచ్‌లో ఎదురయ్యే సవాళ్లకు తగ్గట్లుగా అప్పటికప్పుడు స్పందించాల్సి ఉంటుంది. ఒత్తిడి సమయాల్లో సరైన నిర్ణయం తీసుకోవాలి" అని రోహిత్ పేర్కొన్నాడు.

రెజ్లర్ నేహాపై వేటు


నేహా

దిల్లీ: బరువు నిర్వహణలో సమస్యలు ఎదుర్కొంటున్న నేహా సాంగ్వాన్‌పై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) వేటువేసింది. సీనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ జట్టు నుంచి నేహాను తప్పించిన డబ్ల్యూఎఫ్ఐ.. ఆమెపై రెండేళ్ల నిషేధం విధించింది. గతవారం బల్గేరియాలో అండర్-20 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అధిక బరువు కారణంగా నేహా అనర్హతకు గురయింది. 59 కేజీల విభాగంలో బరిలో దిగాల్సి ఉండగా.. ఆమె 600 గ్రాములు ఎక్కువ బరువు ఉండటంతో అనర్హత తప్పలేదు. దీంతో ఈ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఈ టోర్నీలో భారత మహిళల జట్టు ఏడు పతకాలు సాధించి రన్నరప్‌గా నిలిచింది. కచ్చితంగా పతకం గెలిచే అవకాశమున్న నేహా అనర్హతకు గురవడం టీమ్ ఛాంపియన్‌షిప్ అవకాశాలపై తీవ్రంగా ప్రభావం చూపింది. 140 పాయింట్లతో భారత్ రన్నరప్‌గా నిలవగా.. జపాన్ (165) అగ్రస్థానం సాధించింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో రెండో స్థానంలో నిలిచిన సారిక మలిక్‌ను నేహా స్థానంలో భారత జట్టుకు ఎంపిక చేశారు. సెప్టెంబరు 13 నుంచి 21 వరకు క్రొయేషియాలో ఈ మెగా టోర్నీ జరగనుంది.

లక్ష్య ఔట్

నంబర్‌వన్ చేతిలో ఓటమి

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్


లక్ష్యసేన్

పారిస్: ప్రతిష్ఠాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి రోజు నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లోనే ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు షి యు క్వితో తలపడ్డ లక్ష్యసేన్.. తన శక్తికి మించి పోరాడినా, ఓటమి తప్పలేదు. 54 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో లక్ష్య 17-21, 19-21తో ఓడిపోయాడు. మ్యాచ్ ఆరంభంలో లక్ష్య చేసిన తప్పిదాలను సొమ్ము చేసుకున్న షి యు 10-6 ఆధిక్యంలోకి దూసుకెళ్లినప్పటికీ.. గొప్పగా పుంజుకున్న భారత షట్లర్ విరామ సమానికి 11-11తో స్కోరును సమం చేశాడు. కానీ మళ్లీ షి యు 14-11తో పైచేయి సాధించాడు. 14-16తో లక్ష్య ప్రత్యర్థికి చేరువయ్యే ప్రయత్నం చేసినా.. గేమ్‌ను దక్కించుకోలేకపోయాడు. రెండో గేమ్ హోరాహోరీగా మొదలైంది. స్కోరు 5-5తో సమమైంది. ఈ దశలో దూకుడు పెంచిన షి యు.. 14-9తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. లక్ష్య పోరాడడంతో 14-17తో అంతరం కొంచెం తగ్గింది. ఒక దశలో లక్ష్య 18-19తో ప్రత్యర్థికి మరింత సమీపంగా రావడంతో ఉత్కంఠనెలకొంది. కానీ ఆఖర్లో వరుస తప్పిదాలు గేమ్‌తో పాటు మ్యాచ్‌ను లక్ష్యకు దూరం చేశాయి. ఈ విజయంతో లక్ష్యపై ముఖాముఖి రికార్డులో 4-1తో షి యు పైచేయి సాధించాడు. మరోవైపు మహిళల డబుల్స్‌లో రుతుపర్ణ-శ్వేతపర్ణ జోడీ 12-21, 11-21తో గాబ్రియెలా-స్టెఫానీ జంట చేతిలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. రెండు గేమ్‌ల్లోనూ ప్రత్యర్థి జోడీనే పూర్తి ఆధిపత్యం చలాయించింది. ఇంకో తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రుతి-ప్రియ ద్వయం 17-21, 16-21తో మార్గోట్ లాంబర్ట్ -క్యామిలీ పోగ్నంట్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడింది.

కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ అన్వేషణ

దిల్లీ: డ్రీమ్ 11 వైదొలగడంతో బీసీసీఐ కొత్త స్పాన్సర్ వేటలో పడింది. అయితే వచ్చే నెల ఆసియాకప్ లోపు స్పాన్సర్ ఖరారయ్యే అవకాశం కనిపించట్లేదు. డబ్బుతో ముడిపడి ఉన్న అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధిస్తూ ప్రభుత్వం కొత్త చట్టం తేవడంతో డ్రీమ్ 11.. టీమ్‌ఇండియా టైటిల్ స్పాన్సర్‌గా కొనసాగరాదని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. డ్రీమ్ 11తో ఒప్పందం ముగిసిన విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించాడు. "మేం వాళ్లతో కొనసాగలేం. కొత్త స్పాన్సర్ కోసం అన్వేషిస్తున్నాం. ఆ ప్రక్రియ కొనసాగుతోంది" అని చెప్పాడు. భారత జాతీయ జట్లకు స్పాన్సర్‌గా ఏడాదికి రూ. 358 కోట్లతో డ్రీమ్ 11.. బీసీసీఐతో ఒప్పందం చేసుకుంది. అది ముగియడానికి ఇంకా ఏడాది సమయముంది. అయితే అర్ధంతరంగా ఒప్పందం నుంచి వైదొలిగినా డ్రీమ్ 11పై బోర్డు చర్యలు తీసుకునే అవకాశం లేదు. మరో గేమింగ్ సంస్థ మై11సర్కిల్ కూడా ఐపీఎల్ స్పాన్సర్‌గా వైదొలిగే అవకాశముంది. అయిదేళ్లకు గాను ఏడాదికి రూ. 125 కోట్లతో మై11సర్కిల్ ఒప్పందం చేసుకుంది.

నేషన్స్‌కప్‌నకు గుర్‌ప్రీత్ సారథ్యంలో..

బెంగళూరు: గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు సారథ్యంలోని భారత జట్టు ఈనెల 29న ఆరంభమయ్యే నేషన్స్ కప్‌లో బరిలో దిగబోతోంది. ఈ టోర్నీలో ఆడే జట్టును కోచ్ ఖాలిద్ జమీల్ సోమవారం వెల్లడించాడు. ఈ ఎంపికకు ముందు జరిగిన శిబిరంలో స్టార్ ప్లేయర్ సునీల్ ఛెత్రికి స్థానం దక్కలేదు. అతడు నేషన్స్ కప్ జట్టులోనూ లేడు. 29న ఆతిథ్య తజికిస్థాన్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న భారత్... సెప్టెంబర్ 1న ఇరాన్‌తో, 4న అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది. "సునీల్ ఛెత్రిని మించిన ప్లేయర్ భారత్‌లో లేడు. అతడు అందుబాటులో ఉంటే.. కచ్చితంగా జట్టులో ఉంటాడు. దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన దిగ్గజం అతడు" అని కోచ్ జమీల్ అన్నాడు. **భారత్ జట్టు:** గుర్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), అమరీందర్, హృతిక్, రాహుల్, రోషన్, అన్వర్, సందేశ్, చింగ్లెన్‌సనా సింగ్, రాల్టే, మహ్మద్ ఉవాయ్, నిఖిల్, సురేశ్, డానిష్ ఫారూఖ్, జేక్సన్, ఆషిక్, ఉదాంతా సింగ్, బోరిస్, మహేశ్‌సింగ్, ఇర్ఫాన్, మన్‌వీర్, జితిన్, చాంగ్తే, విక్రమ్‌ప్రతాప్.


జమీల్


ప్రజ్ఞానంద

రెండో స్థానంలో ప్రజ్ఞానంద

సెయింట్ లూయిస్: సింక్వెఫీల్డ్ కప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద వరుసగా అయిదో గేమ్‌ను డ్రాగా ముగించాడు. ఆరో రౌండ్లో అతడు డుడా (పోలెండ్)తో పాయింట్ పంచుకున్నాడు. ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో అరోనియన్ (అమెరికా)తో కలిసి రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానా 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. మరోవైపు ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ కూడా తన గేమ్‌ను డ్రాగా ముగించాడు. అతడు ఫిరౌజా (ఫ్రాన్స్)ను నిలువరించాడు. గుకేశ్ (3).. వెస్లీ సో (అమెరికా), శామ్యూల్ సేవియన్ (అమెరికా), ఫిరౌజా, లాగ్రేవ్ (ఫ్రాన్స్)లతో కలిసి నాలుగో స్థానంలో ఉన్నాడు.

దివంగత క్రికెటర్ల కుటుంబాలకు బీసీసీఐ సాయం

బెంగళూరు: దివంగత క్రికెటర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) నిర్ణయించింది. ఇందుకు బీసీసీఐ అనుమతి కూడా లభించింది. చనిపోయిన క్రికెటర్ భార్య లేదా భర్తకు ఒకసారి పరిష్కారం కింద రూ.లక్ష చొప్పున ఈ సాయం అందుతుంది. టెస్టు ప్లేయర్లను మినహాయించి ఐసీఏ సభ్యులైన క్రికెటర్లకే ఇది వర్తిస్తుంది. ప్రాథమికంగా దీని కింద 50 మంది కుటుంబాలకు సాయం అందనున్నట్లు తెలిసింది.

ఈడీ దాడి.. గోడదూకిన ఎమ్మెల్యే


పోలీసుల అదుపులో ఎమ్మెల్యే జీబన్ కృష్ణ సాహా

కోల్‌కతా: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన ఇంటిపై దాడి చేయబోతోందని తెలుసుకున్న ఒక ఎమ్మెల్యే.. ఇంటి ప్రహరీగోడ దూకి పారిపోవడానికి ప్రయత్నించిన సంఘటన పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా బుర్వన్‌లో జరిగింది. ఎమ్మెల్యేను వెంబడించి ఓ పొలంలో పట్టుకున్నామని ఈడీ అధికారులు తెలిపారు. పాఠశాల నియామకాల్లో అవకతవకలకు సంబంధించి బుర్వన్‌లోని టీఎంసీ ఎమ్మెల్యే జీబన్ కృష్ణ సాహా ఇంటితోపాటు ఆయన సమీప బంధువుల ఇళ్లల్లో సోదాలు జరిపామని వారు పేర్కొన్నారు. సాక్ష్యాధారాలను ధ్వంసం చేసే ఉద్దేశంతో ఎమ్మెల్యే తన మొబైల్ ఫోన్లను ఇంటి సమీపంలోని నీటిగుంటలో విసిరేశారన్నారు. అయితే తమ అధికారులు రెండు ఫోన్లను వెలికితీసి వాటిని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జీబన్ కృష్ణ సాహాను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

జలపాతం కాదు.. వరదలతో ఏర్పడిన గొయ్యి



జైపుర్: గతకొన్ని రోజులుగా కుంభవృష్టిగా కురుస్తున్న వర్షాలకు రాజస్థాన్‌లో భారీ వరదలు పోటెత్తాయి. సుర్వాల్ జలాశయం పొంగి పొర్లడంతో రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపుర్ గ్రామంలో 2 కిలోమీటర్ల మేర గొయ్యి ఏర్పడి జలపాతాన్ని తలపిస్తోంది. పొలాల మీదుగా నీరు ప్రవహించి జదవత గ్రామాన్ని ముంచెత్తడంతో విధ్వంసం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. సవాయ్ మాధోపుర్‌లో 2 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పు, 55 అడుగుల లోతున బిలం ఏర్పడడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయన్నారు.

నక్సలిజం మరో 20 ఏళ్లు సాగడానికి

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పే కారణం

- మరోసారి ధ్వజమెత్తిన అమిత్‌షా



ఈనాడు, దిల్లీ: అభివృద్ధికి, సంక్షేమానికి అడ్డంకిగా మారిన మావోయిస్టుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి గిరిజనులు ఏర్పాటు చేసుకున్న సల్వాజుడుంని రద్దుచేసి.. కొన ఊపిరితో ఉన్న నక్సలిజం మరో రెండు దశాబ్దాలు కొనసాగడానికి దోహదం చేసింది ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పేనని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి ఆరోపించారు. సోమవారం ఏఎన్‌ఐ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్య చేశారు. "జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నక్సల్ అనుకూలమని నేను ప్రత్యేకంగా చెప్పలేదు. ఆదివాసీల ఆత్మరక్షణకోసం ఉన్న వ్యవస్థను ఆయన సమాప్తం చేశారు. దానివల్లే నక్సలిజం మరో రెండు దశాబ్దాలకు పైగా సాగింది. అది ఆయన తీర్పేనని సుప్రీంకోర్టు రికార్డులే చెబుతున్నాయి. నక్సల్స్ కారణంగా దెబ్బతిన్న పాఠశాలల్లో సీఆర్పీఎఫ్, ఇతర భద్రతా బలగాలు ఉంటే రాత్రికి రాత్రి ఉత్తర్వులు జారీచేసి వారిని బయటికి పంపించేశారు. ఆ సమయంలో భద్రతా దళాలపై చాలాచోట్ల దాడులు జరిగాయి. కచ్చితంగా ఆ తీర్పుతో మావోయిస్టులకు రక్షణ లభించింది. దేశభద్రతపై ఎంపీలు ఆలోచించాల్సి ఉంది' అని చెప్పారు. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉండటం మైనస్ పాయింటేమీ కాదన్నారు. తమిళనాడు ఎన్నికల్లో ఖాతా తెరవడానికే ఆ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారనడంలో నిజంలేదన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామాకు అనారోగ్యమే ప్రధానకారణమని అమిత్ షా పేర్కొన్నారు.

గాజాలో పాత్రికేయులపై ఆగని దాడులు

ఇజ్రాయెల్ క్షిపణికి ఐదుగురి బలి

డెయిర్ అల్-బలా: గాజాలో మారణహోమం కొనసాగుతోంది. ఖాన్ యూనిస్‌లోని నాసెర్ ఆసుపత్రిపై సోమవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 20 మంది మృతిచెందారు. వీరిలో ఐదుగురు పాత్రికేయులు. ఇజ్రాయెల్-హమాస్ మధ్య పోరు మొదలైనప్పటి నుంచి గాజాలో పనిచేస్తున్న మహిళా జర్నలిస్టు మరియం (33) మృతుల్లో ఉన్నారు. ఆమె ఏపీ వార్తా సంస్థకు సేవలందిస్తున్నారు. తమ జర్నలిస్టులు కూడా ప్రాణాలు కోల్పోయారని రాయిటర్స్, అల్-జజీరా, మిడిల్ ఈస్ట్ ఐ వార్తా సంస్థలు తెలిపాయి. దక్షిణ గాజాలో నాసెర్ అతి పెద్ద ఆసుపత్రి. దాడిని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. పాత్రికేయులను లక్ష్యంగా చేసుకోలేదని, సంబంధం లేని వ్యక్తులకెవరికైనా హాని కలిగితే క్షమాపణలు చెబుతున్నామని తెలిపింది. ఇదొక విషాదకరమైన దుర్ఘటనగా ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు.

మోదీ డిగ్రీ వ్యవహారం వ్యక్తిగతం

- వెల్లడించాల్సిందేనన్న సీఐసీ ఆదేశాలను పక్కనబెట్టిన దిల్లీ హైకోర్టు



దిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ వివరాలను వెల్లడించాల్సిందేనని దిల్లీ విశ్వవిద్యాలయానికి (డీయూ) కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) గతంలో ఇచ్చిన ఆదేశాలను దిల్లీ హైకోర్టు పక్కనబెట్టింది. అది వ్యక్తిగత సమాచారమవుతుందని, అందులో ప్రజా ప్రయోజనం ఉందనడాన్ని తోసిపుచ్చింది. సీఐసీ ఆదేశాలను సవాలు చేస్తూ డీయూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఏడాది ఫిబ్రవరి 27నే వాదనలు ముగిశాయి. దానిపై తీర్పును జస్టిస్ సచిన్ దత్తా సోమవారం వెలువరించారు. ప్రజలకు ఆసక్తి ఉండటం, ప్రజా ప్రయోజనం వేర్వేరని ఆయన అభిప్రాయపడ్డారు. 'సమాచార హక్కు (ఆర్టీఐ) కింద చేసిన దరఖాస్తుల్లో సమాజ హితం, ప్రజా ప్రయోజనం లేవు. ఒక వ్యక్తికి డిగ్రీలో వచ్చిన గ్రేడ్లు, జవాబు పత్రాలు వ్యక్తిగత సమాచారం కిందకే వస్తాయి. ఆర్టీఐలో ఈ తరహా అంశాలకు రక్షణ ఉంది' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. 'ఆర్టీఐ కింద విద్యార్హతలను తెలుసుకోవడానికి గట్టి కారణమేదీ లేదు. అంతేకాకుండా రాజ్యాంగ పదవులను చేపట్టడానికి ఎటువంటి విద్యార్హతలను చట్టంలో పేర్కొనలేదు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి తన వ్యక్తిగత అంశాల గోప్యత విషయంలో తన హక్కును కోల్పోరు' అని స్పష్టం చేసింది.

■ ఈ తీర్పు అసమగ్రంగా ఉందని కాంగ్రెస్ అభిప్రాయపడింది. ప్రతి ఒక్కరి డిగ్రీ వివరాలు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడు.. ప్రధాని డిగ్రీని రహస్యంగా ఉంచాల్సిన అవసరమేముందని ప్రశ్నించింది.

యూపీఎస్ నుంచి ఎన్‌పీఎస్‌కూ మారొచ్చు

ఒక్కసారే అవకాశం: కేంద్రం

దిల్లీ: కొత్తగా రూపొందిన ఏకీకృత పింఛను పద్ధతి (యూపీఎస్) ఎంచుకున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు జాతీయ పింఛను విధానానికి(ఎన్‌పీఎస్) మారేందుకు అవకాశం కల్పిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం ప్రకటన వెలువరించింది. ఈ 'వన్‌టైం వన్‌వే' సదుపాయం ఉద్యోగులకు ఒక్కసారి మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఏప్రిల్ 1, 2025 నుంచి కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చిన యూపీఎస్ పద్ధతిని జులై 20 నాటికి ఎంచుకున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 31,555కు చేరింది. ఈ పింఛను పద్ధతిని ఎంచుకునేందుకు చివరి తేదీ సెప్టెంబరు 30. కాగా యూపీఎస్ నుంచి నేషనల్ పింఛను సిస్టం(ఎన్‌పీఎస్)కు మారే చివరి అవకాశం కల్పించే వన్ టైం, వన్‌వే పథకాన్ని కేంద్ర ఉద్యోగులందరికీ వర్తింపజేస్తున్నట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. "యూపీఎస్ పద్ధతి ఎంచుకున్న ఉద్యోగులు ఆ పద్ధతి నుంచి మారేందుకు తమ పదవీవిరమణ తేదీకి ఏడాది ముందువరకూ గానీ, స్వచ్ఛంద పదవీ విరమణకు 3 నెలల ముందుగానీ తమ నిర్ణయాన్ని తెలియజేయవచ్చు" అని పేర్కొంది.

తావి నది వరదలపై పాక్‌ను అప్రమత్తం చేసిన భారత్

ఇస్లామాబాద్: భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత సింధూ నదీజలాల ఒప్పందం నిలిచిపోయినప్పటికీ, జమ్మూకశ్మీర్‌లోని తావి నదిలో వరదలు వచ్చే అవకాశముందని పాకిస్థాన్‌ను భారత్ అప్రమత్తం చేసింది. అయితే వరదల గురించి ఈ హెచ్చరికను సింధు నదీ జలాల ఒప్పంద కమిషనర్ ద్వారా కాకుండా దౌత్యమార్గాల్లో చేరవేశామని విదేశీ వ్యవహారాల శాఖ సోమవారం వెల్లడించింది. మే నెలలో ఇరుదేశాల వివాదం తర్వాత ప్రధాన సంప్రదింపు ఇదేనని పేర్కొంది.

అమిత్ షా ప్రకటనపై 18 మంది

మాజీ న్యాయమూర్తుల ఆక్షేపణ

దిల్లీ: 2011నాటి 'సల్వాజుడుం' తీర్పునకు సంబంధించి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాచేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని 18 మంది విశ్రాంత న్యాయమూర్తులు సోమవారం పేర్కొన్నారు. వ్యక్తిగతంగా అవమానపరిచే వ్యాఖ్యలు చేయడం మానాలని వారు హితవు పలికారు. మావోయిస్టులపై పోరాటంలో గిరిజన యువకుల్ని ప్రత్యేక పోలీసు అధికారులుగా ఉపయోగించుకున్న "సల్వాజుడుం" దళం.. చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధమైనదని.. దాన్ని రద్దుచేయాలని జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, జస్టిస్ ఎస్.ఎస్.నిజ్జర్‌తో కూడుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం 2011 జులైలో తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై దేశంలోనే ఉన్నతమైన రాజకీయ పదవిలో ఉన్న వ్యక్తి పక్షపాతంతో కూడుకున్న వ్యాఖ్యలు చేయడం న్యాయమూర్తులపై చెడు ప్రభావం చూపుతుందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ మదన్ బి.లోకుర్ తదితరులతో కూడిన 18 మంది న్యాయమూర్తుల బృందం పేర్కొంది. వివిధ హైకోర్టుల్లో పనిచేసి రిటైరైన న్యాయమూర్తులు సి.ప్రవీణ్ కుమార్, ఎ.గోపాల్ రెడ్డి తదితరులతో పాటు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు ముగ్గురు ఈ ప్రకటనపై సంతకాలు చేశారు.



వారాంతం దాకా మోయాల్సిన భారంగా చూడొద్దు

వారాంతం వరకూ తప్పనిసరి పరిస్థితుల్లో మోయాల్సిన భారంగా పనిని చూడకండి. ఉద్యోగం/పనిని అర్థవంతమైనదిగా భావించి శ్రమించకపోతే.. వారాంతాలే కాదు, ఎన్ని సెలవులొచ్చినా మీరు ఆస్వాదించలేరు. మీ జీవితం అర్థవంతమైనదిగా ఉండాలంటే.. అర్థవంతమైన పనిని, ఇష్టపడుతూ చేయాల్సిందే.

– టేలిన్ జాన్ సిమండ్స్, డిజిటల్ క్రియేటర్

పటేల్, బిర్సా ముండా, వాజ్‌పేయీ జయంత్యుత్సవాలకు కమిటీలు

దిల్లీ: దేశ మొదటి హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, గిరిజనుల ఆరాధ్యుడు బిర్సా ముండా 150వ జయంత్యుత్సవాలతో పాటు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతిని నిర్వహించడానికి ప్రధాని మోదీ అధ్యక్షతన 3 ఉన్నత స్థాయి కమిటీలను ఏర్పాటుచేస్తూ సోమవారం గెజిట్ నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఈ ఏడాది అక్టోబరు 31న పటేల్, నవంబరు 15న బిర్సా ముండాల 150వ జయంత్యుత్సవాలు జరగనున్నాయి. డిసెంబరు 25న వాజ్‌పేయీ శత జయంతి జరగనుంది. పటేల్‌పై వేసిన కమిటీలో 124 మంది, వాజ్‌పేయీపై కమిటీలో 128 మందిని నియమించారు. ఇందులో మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధాన మంత్రి, లోక్‌సభ స్పీకర్, 23 మంది కేంద్ర మంత్రులు, 20 మంది గవర్నర్లు, 21 మంది ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులున్నారు.


■ పటేల్‌పై కమిటీలో తెలుగు రాష్ట్రాల గవర్నర్లు జస్టిస్ అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్ వర్మ, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సీనియర్ పాత్రికేయుడు ఎ.సూర్యప్రకాశ్ ఉన్నారు.

■ వాజ్‌పేయీపై కమిటీలో ఒడిశా, త్రిపుర, గోవా గవర్నర్లు కంభంపాటి హరిబాబు, నల్లు ఇంద్రసేనారెడ్డి, అశోక్ గజపతిరాజు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, భాజపా నాయకుడు రామ్ మాధవ్‌లను నియమించారు.

నిషేధిత ప్రసంగాలకు

ప్రాథమిక హక్కులు వర్తించవు

- ఇన్‌ఫ్లుయెన్సర్ల కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య



దిల్లీ: వ్యాపార, నిషేధిత ప్రసంగాలు ప్రాథమిక హక్కుల పరిధిలోకి రావని సుప్రీంకోర్టు పేర్కొంది. దివ్యాంగులు, అరుదైన జన్యుపరమైన రుగ్మతలతో బాధపడుతోన్న వారిని అపహాస్యం చేసేలా మాట్లాడిన ఐదుగురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ షోలలో, పాడ్‌కాస్టులలో బేషరతుగా క్షమాపణలను ప్రసారం చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ ధర్మాసనం ఆదేశించింది. మనసు నొప్పించిన స్థాయి కంటే పశ్చాత్తాప స్థాయి ఎక్కువగా ఉండాలని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమ వేదికలపై దివ్యాంగులను అపహాస్యం చేసిన ఇన్‌ఫ్లుయెన్సర్లకు జరిమానా విధించే అంశాన్ని తదుపరి విచారణ సమయంలో పరిశీలిస్తామని వెల్లడించింది. "వివిధ వర్గాల వారిపై వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి" అని ధర్మాసనం సూచించింది. ఈ ఒక్క ఉదంతానికే పరిమితం కాకుండా భవిష్యత్తు సవాళ్లను దృష్టిలో ఉంచుకొని సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి పరిహాసాలను నిరోధించేందుకు కేంద్రం నిబంధనలు, మార్గదర్శకాలను రూపొందించాలని ఆదేశించింది.

సనాపై బాంబుల వర్షం


సనాలో ఉవ్వెత్తున ఎగసిన మంటలు

సనా: యెమెన్ రాజధాని సనా లక్ష్యంగా ఆదివారం ఇజ్రాయెల్ చేసిన వైమానిక దాడుల్లో ఆరుగురు మృతి చెందారు. 86 మందికి గాయాలయ్యాయి. ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. తాము అసర్ చమురు క్షేత్రం, హిజాజ్ పవర్ ప్లాంట్ లక్ష్యంగా దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. గత 22 నెలలుగా హమాస్‌కు మద్దతుగా హూతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన దాడుల్లో 10 ఇజ్రాయెలీ యుద్ధ విమానాలు రాజధాని సనాలోని కీలక ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించాయి.

ముడి చమురు ఎక్కడ చౌకగా దొరికితే అక్కడే కొంటాం

- రష్యాలో భారత రాయబారి వినయ్ కుమార్ స్పష్టీకరణ



మాస్కో: ముడి చమురు ఎక్కడ చౌకగా దొరికితే అక్కడే కొంటామని రష్యాలో భారత రాయబారి వినయ్ కుమార్ స్పష్టం చేశారు. రష్యా నుంచి ముడి చమురును కొంటున్నందున భారత్‌పై అదనంగా మరో 25 శాతం దిగుమతి సుంకాన్ని విధించాలనే అమెరికా నిర్ణయం అన్యాయమని అభిప్రాయపడ్డారు. అమెరికా విధించిన అదనపు సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో రష్యా ప్రభుత్వ వార్తా సంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. దేశంలోని 140 కోట్ల మందికిపైగా భారతీయులకు ఇంధన భద్రతను కల్పించడంపైనే భారత్ దృష్టిపెట్టిందని తెలిపారు. రష్యాసహా పలు దేశాలతో భారత్ కలిసి పని చేసినందువల్లే అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్ నిలకడగా ఉందని గుర్తు చేశారు. దేశంలోని రైతులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాలను ప్రభుత్వం రక్షించి తీరుతుందని స్పష్టం చేశారు. తమ పెట్రోలియం ఉత్పత్తులను కొనాలని భారత్ ఎవరిపైనా ఒత్తిడి చేయబోదని, ఇష్టం ఉన్నవారు కొనొచ్చని, ఇష్టం లేనివారు కొనకపోయినా ఇబ్బంది లేదని తేల్చి చెప్పారు. భారత్‌లోని రిఫైనరీల్లో తయారయ్యే పెట్రోలియం ఉత్పత్తులను ప్రస్తుతం ఐరోపా దేశాలు, అమెరికా కొంటున్నాయని తెలిపారు. భారత్‌పై ట్రంప్ విధించిన అదనపు సుంకాలను ఆయన తప్పుబట్టారు. ఈ నిర్ణయాన్ని అహేతుకం, అన్యాయం, పక్షపాత చర్యగా పేర్కొన్నారు.

రష్యాలో భారత కార్మికులకు డిమాండ్



మాస్కో: రష్యాలో భారత కార్మిక శక్తికి డిమాండ్ పెరుగుతోంది. రష్యా కంపెనీలు.. ముఖ్యంగా యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోని సంస్థలు భారతీయులను నియమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అక్కడి భారత రాయబారి వినయ్ కుమార్ తెలిపారు. "రష్యాలో కార్మిక కొరత ఉంది. ఈ క్రమంలోనే స్థానిక చట్టాలను అనుసరించి కంపెనీలు భారతీయులను నియమించుకుంటున్నాయి. ఇక్కడికి వచ్చిన వారిలో ఎక్కువ మంది నిర్మాణ, వస్త్ర రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో భారతీయులకు డిమాండ్ పెరుగుతోంది" అని ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో వినయ్ కుమార్ సోమవారం వెల్లడించారు. రష్యాలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు భారతీయ కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో.. పాస్‌పోర్టుల పొడిగింపు వంటి కాన్సులర్ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, బ్రిటన్ తదితర పాశ్చాత్య దేశాలు వలసలపై ఆంక్షలు విధిస్తున్న వేళ.. ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అధికారిక వివరాల ప్రకారం.. ఇక్కడి పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మిక కొరతను తీర్చడానికి ఈ ఏడాది చివరికల్లా నిపుణులైన 10 లక్షల మంది భారత కార్మికులను తీసుకోవాలని మాస్కో వ్యూహకర్తలు భావిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి.

యూపీలో ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రక్కు

11 మంది మృతి, 40 మందికి గాయాలు

బులంద్‌శహర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌శహర్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున యాత్రికులతో నిండిన ట్రాక్టర్‌ను ఒక ట్రక్కు ఢీకొనడంతో 11 మంది మృతిచెందారు. 40 మంది గాయపడ్డారు. బులంద్‌శహర్-అలీగఢ్ సరిహద్దులో అరనియా వద్ద ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ట్రాలీలో 61



మంది యాత్రికులు కాస్‌గంజ్ జిల్లాలోని రఫాత్‌పుర్ గ్రామం నుంచి రాజస్థాన్‌లోని జహర్ పీర్‌కు తీర్థయాత్రకై వెళ్తున్నారు. ప్రమాద బాధితుల్ని తక్షణం ఆస్పత్రులకు తరలించామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేస్తూ ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతులు ఒక్కొక్కరికీ రూ 2 లక్షల చొప్పున వారి కుటుంబాలకు పరిహారం అందిస్తామని ప్రకటించారు.

దిల్లీ సీఎంను కత్తితో పొడవాలనుకున్న నిందితుడు

విచారణలో వెల్లడి

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి చేసిన నిందితుడు సకారియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీభాయ్(41) తొలుత ఆమెను కత్తితో పొడవాలని పథకం వేసుకున్నట్లు తెలిపాడు. రాజేశ్‌భాయ్‌ని విచారించగా.. పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. "దిల్లీలో వీధి కుక్కలను తరలించాలని నేను చాలాసార్లు అభ్యర్థించా. దీని గురించి సీఎం పట్టించుకోకపోవడంతోనే ఆమెపై దాడి చేయాలని నిర్ణయించుకున్నా. సీఎం అధికారిక నివాసానికి వెళ్లడానికి ముందు సుప్రీంకోర్టుకు వెళ్లా. న్యాయస్థానం బయట భద్రతను చూసి అక్కడి నుంచి వచ్చేశా. అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లా. తొలుత ఆమెను కత్తితో పొడవాలని పథకం వేశా కానీ, భద్రత ఎక్కువగా ఉండటం చూసి కత్తిని బయటే పడేశా" అని నిందితుడు సకారియా విచారణలో చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

రేఖా గుప్తాకు మునుపటి భద్రత..

ఈ ఘటన కారణంగా ఇటీవల సీఎం రేఖా గుప్తాకు సీఆర్పీఎఫ్ జవాన్లతో కల్పించిన జడ్ కేటగిరీ భద్రతను అధికార వర్గాలు తొలగించాయి. మునుపటిలాగే దిల్లీ పోలీసులు ఆమెకు భద్రత కల్పిస్తారని సోమవారం వెల్లడించాయి.

ఓట్లను దొంగిలించే ప్రభుత్వం యువతను పట్టించుకోదు



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆరోపణ

దిల్లీ: రామ్‌లీలా మైదానంలో నిరసన తెలుపుతున్న స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ) అభ్యర్థులపై లాఠీఛార్జి జరిగిందని ఆరోపిస్తూ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సోమవారం తీవ్రంగా విమర్శించింది. ఓట్లు దొంగిలించి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వానికి యువత భవిష్యత్తు గురించి ఆందోళన లేదని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. 'శాంతియుతంగా నిరసనలు చేస్తున్న ఉపాధ్యాయులు, ఎస్‌ఎస్‌సీ విద్యార్థులపై లాఠీఛార్జి చేయడం సిగ్గుచేటు, ఇది పిరికి ప్రభుత్వ లక్షణం. హక్కులు, న్యాయాన్ని డిమాండ్‌చేసిన యువతపై లాఠీఛార్జ్ చేశారు. మోదీ ప్రభుత్వానికి దేశ యువత, వారి భవిష్యత్తు గురించి ఏమాత్రం పట్టింపులేదని స్పష్టమవుతోంది. ఎందుకంటే ఈ ప్రభుత్వం ప్రజల ఓట్లతో కాదు వాటిని దొంగిలించి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు భయపడాల్సిన సమయం కాదు. ధైర్యంగా పోరాడాల్సిన సమయం" అని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. దీనిపై మరో కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ కూడా స్పందించారు. "పరీక్షల్లో రిగ్గింగ్, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు, పేపర్ లీకేజీలతో దేశవ్యాప్తంగా యువత ఇబ్బంది పడుతున్నారు. భాజపా పాలనలో నియామక ప్రక్రియ, పరీక్షల్లో అవినీతి యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది' అని ప్రియాంక పేర్కొన్నారు. పరీక్షలు మెరుగ్గా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎస్‌సీ విద్యార్థులు, అభ్యర్థులు ఆదివారం రామ్‌లీలా మైదానంలో నిరసనలు చేపట్టారు. అయితే వీరిపై లాఠీఛార్జి చేశారన్న ప్రతిపక్షాల వాదనను పోలీసులు తోసిపుచ్చారు.

రాహుల్ గాంధీ అబద్ధాల కోరు: ఫడణవీస్

ముంబయి: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ 'వరుస అబద్ధాల కోరు'గా అభివర్ణించారు. భాజపా 'ఓట్ల చోరీ'కి పాల్పడిందన్న ఆరోపణను ఆయన తోసిపుచ్చారు. ప్రతిపక్ష నేతలు ఈ అబద్ధాలను తమకు తాము నమ్మబలుకుతున్నారని సోమవారం ఆయన విలేకరులతో అన్నారు. 'రాహుల్ గాంధీ వరుస అబద్ధాల కోరని ముందే చెప్పాను. ఆయన నిరంతరం అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారు. కొందరు మహారాష్ట్ర నాయకులు రాహుల్ చెబుతున్నది నిజమని అకస్మాత్తుగా నమ్మడం ప్రారంభించారు. ఇది బాధాకరం. అబద్ధపు సమాచారానికి ఒక ప్రాతిపదిక అంటూ ఉండదు. అబద్ధాలతో నిర్మించే కోట కూలిపోతుంది. ఓట్లు గెలవాలంటే ముందు ప్రజల నమ్మకాన్ని సాధించాలి. ఇది గ్రహించనప్పుడు వారు తమకు తాము అబద్ధాలు చెప్పుకొన్నట్టే లెక్క'' అని ఫడణవీస్ విమర్శించారు.



'లాల్ బాగ్చా రాజా' గణపతి రూపమిదే..

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహారాష్ట్ర రాజధాని ముంబయి నగరంలో కొలువుదీరే 'లాల్ బాగ్చా రాజా' గణేశుడి రూపాన్ని నిర్వాహకులు ఆవిష్కరించారు. 1934 నుంచి లాల్‌బాగ్చా మార్కెట్‌లో ఈ గణనాథుడి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయి. పలు రంగాలకు చెందిన రాజకీయ, సినీ ప్రముఖులు స్వామివారిని దర్శించుకుంటారు.

మావోయిజం వైపు మొగ్గు చూపిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి: భాజపా

పట్నా, దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 'సల్వాజుడుం'పై ఇచ్చిన తీర్పు మావోయిజం పట్ల ఆయన మొగ్గును ప్రతిబింబించిందని భాజపా సీనియర్ నాయకుడు రవి శంకర్ ప్రసాద్ సోమవారం ఆరోపించారు. "భారత్‌లో ఉపరాష్ట్రపతి పదవి రెండో అతి పెద్ద అధికారిక హోదా. ఆ పదవికి ఎంపికయ్యే వ్యక్తి ఆలోచనా విధానమేమిటన్నది దేశ ప్రజలకు తెలియడం ఎంతో ముఖ్యం. జస్టిస్ సుదర్శన్ రెడ్డి 2011లో వెలువరించిన "సల్వాజుడుం" తీర్పు ఆయన మావోయిజం పట్ల సానుభూతి, మొగ్గు కలిగి ఉన్నారనడానికి సూచిక" అని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. "హోం మంత్రి అమిత్ షా సరైన వ్యాఖ్యే చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిర్ణయం మావోయిజంపై పోరాటాన్ని దెబ్బతీసింది. ఇప్పుడు ఆయనే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలుచున్నారు" అని భాజపా నేత అన్నారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతును వ్యతిరేకించిన నక్సల్ బాధితులు

ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి కాంగ్రెస్, ఇతర విపక్ష ఎంపీలు మద్దతు పలకడంపై ఛత్తీస్‌గఢ్‌లోని కొందరు నక్సల్ బాధితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఆయా ఎంపీలకు ఓ లేఖ రాశారు. సల్వాజుడుంను రద్దు చేయాలంటూ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డితో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం 2011 జులైలో ఇచ్చిన తీర్పుతో మావోయిస్టు హింస పెచ్చరిల్లిందని వారు అందులో ఆరోపించారు. సల్వా జుడుంను కనుక నిషేధించి ఉండకపోతే చాలాకాలం క్రితమే నక్సలిజం అంతరించిపోయి ఉండేదని కాంకేర్‌లోని చార్‌గావ్ మాజీ ఉపసర్పంచ్ సియారాం రాంటెకె లేఖలో పేర్కొన్నారు.

దిల్లీలో ఇకపై నేరుగా మొబైల్‌కే సమన్లు

దిల్లీ: న్యాయవ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీఎన్‌ఎస్‌ఎస్ సమన్లు, వారెంట్ సేవ నియమాలు 2025 నోటిఫై చేసి, డిజిటల్ కోర్టు నోటీసుల జారీ ప్రారంభించింది. అంటే ఇకపై కోర్టు సమన్లు, వారెంట్లు సాంప్రదాయ పద్ధతిలో కాకుండా, డిజిటల్ మార్గాల ద్వారా నేరుగా ప్రజలకు చేరవేస్తారు. సింపుల్‌గా చెప్పాలంటే వాట్సప్, ఈ-మెయిల్స్‌కు కోర్టు నోటీసులు పంపిస్తారు. దీని వల్ల ప్రభుత్వానికి సమయం, ఖర్చులు ఆదా కానున్నాయి. లీగల్ నోటీసులను డిజిటల్‌గా అందించడం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, న్యాయవ్యవస్థ సకాలంలో, మరింత విశ్వసనీయంగా పనిచేయడానికి వీలు ఏర్పడుతుంది.

101 బీబీఏ, బీసీఏ కళాశాలలు ఏవీ?

డిగ్రీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో కనిపించని వైనం

ఈనాడు, అమరావతి: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో బీబీఏ, బీసీఏ కోర్సులకు సంబంధించి 101 కళాశాలలను చేర్చలేదు. దీంతో వాటిల్లో చేరాలనుకుంటున్న విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది నుంచి బీబీఏ, బీసీఏ కోర్సులు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) పరిధిలోకి వెళ్లాయి. ఏఐసీటీఈ నుంచి అనుమతుల జాబితా సాంకేతిక విద్యా శాఖకు వస్తుంది. ఆయా కళాశాలలకు అనుబంధ గుర్తింపును విశ్వవిద్యాలయాలు ఇస్తున్నాయి. ప్రవేశాల ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఉన్నత విద్యా మండలి చేపడుతోంది. గతేడాది వరకు కళాశాలలకు వర్సిటీలు అనుబంధ గుర్తింపు ఇవ్వగానే నేరుగా కౌన్సెలింగ్‌కు అనుమతించేవారు. ఇప్పుడు బీబీఏ, బీసీఏ కోర్సుల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా 394 కళాశాలలకు ఏఐసీటీఈ అనుమతులివ్వగా.. ఇప్పటివరకు 293 కళాశాలలకు మాత్రమే వర్సిటీల నుంచి అనుబంధ గుర్తింపులు వచ్చాయి. వీటిని మాత్రమే కౌన్సెలింగ్‌కు అనుమతించారు.

అటు ప్రభుత్వానికి.. ఇటు మండలికి..

ఏఐసీటీఈ నుంచి వచ్చిన 101 కళాశాలల జాబితాను సాంకేతిక విద్యా శాఖ ప్రభుత్వ అనుమతి కోసం పంపింది. ఇదే జాబితాను సోమవారం రాత్రి ఉన్నత విద్యా మండలికి కూడా పంపింది. వీటికి వర్సిటీల నుంచి అనుబంధ గుర్తింపు వస్తేనే కౌన్సెలింగ్‌కు అనుమతిస్తామని ఉన్నత విద్యా మండలి చెబుతోంది. ప్రభుత్వానికి పంపిన దస్త్రానికి అనుమతి వస్తేనే దాన్ని వర్సిటీలకు పంపాలని సాంకేతిక విద్యాశాఖ భావిస్తోంది.

■ ఈ ఏడాది డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలకు రెండు విధానాలు పాటిస్తున్నారు. విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో వెబ్ ఐచ్ఛికాలు ఇచ్చుకోవచ్చు. లేదంటే కళాశాలలకు వెళ్లి ఐచ్ఛికాలు పెట్టించుకోవచ్చు. దీనికోసం కళాశాలలకు లాగిన్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం 101 కళాశాలల్లోని బీబీఏ, బీసీఏ కోర్సులకు లాగిన్లు లేకుండా పోయాయి.

■ డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ మంగళవారంతో ముగుస్తుంది. ఆయా కళాశాలల జాబితాను కౌన్సెలింగ్‌లో చేర్చకపోతే విద్యార్థులకు ఎంపిక పరిమితంగా మారనుంది.

■ మొత్తం 1,17,558 మంది విద్యార్థులు కౌన్సెలింగ్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా, 1,13,299 మంది ఫీజు కట్టారు. 51,495 మంది దరఖాస్తులు సమర్పించారు. 15,510 మంది 53,997 వెబ్ ఐచ్ఛికాలు పెట్టారు. కళాశాలల నుంచి ఒక్కరు కూడా ఐచ్ఛికాలు నమోదు చేయించుకోలేదు.

50 ఏళ్లుగా ప్రేక్షకులను మెప్పిస్తున్న బాలకృష్ణ

పవన్‌కల్యాణ్ అభినందనలు

ఈనాడు, అమరావతి: నట జీవితంలో 50 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకుని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్న హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 'ఎక్స్' వేదికగా సోమవారం అభినందనలు తెలియజేశారు. "నందమూరి తారకరామారావు వారసుడిగా, బాల నటుడిగా తెలుగు చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టారు. జానపదాలు, కుటుంబ కథా చిత్రాలు, యాక్షన్ చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు. ఆయన మరిన్ని సంవత్సరాలు తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా" అని పేర్కొన్నారు.

28 నుంచి డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

ఈనాడు, అమరావతి: డీఎస్సీలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మరోసారి వాయిదా పడింది. ఈ ప్రక్రియ గురువారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. అభ్యర్థులు వారి లాగిన్ ఐడీల ద్వారా మంగళవారం మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కాల్ లెటర్లలోని సూచనలను కచ్చితంగా పాటించాలని, తీసుకువెళ్లాల్సిన అన్ని సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యే ముందు వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

అధికార భాషా సంఘానికి మండలి వెంకటకృష్ణారావు పేరు

ఈనాడు, అమరావతి: అధికార భాషా సంఘం పేరును 'మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం'గా మారుస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఎం కార్యాలయాల్లో ప్రేమ పెళ్లిళ్లు చేసుకోవచ్చు

తమిళనాడు రాష్ట్ర కమిటీ వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులోని సీపీఎం కార్యాలయాల్లో ప్రేమ పెళ్లిళ్లు చేసుకోవచ్చని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. తమిళనాడులో పరువు హత్యలు జరుగుతున్న నేపథ్యంలో వాటిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం స్పందించారు. కులాంతర వివాహాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు లేవన్నారు. ప్రేమికుల కోసం మార్క్సిస్టు కార్యాలయాలు తెరచి ఉంటాయని తెలిపారు. కులాంతర వివాహాలు చేసుకోవాలనుకునే ప్రేమికులు ఇకపై రాష్ట్రంలోని తమ పార్టీ కార్యాలయాల్లో చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆ రూ.3,500 కోట్లు ఎలా దారి మళ్లాయ్?

- పట్టిక రూపంలో వివరాలు సమర్పించండి
- నిందితుల జాబితాలోని సంస్థల ప్రతినిధుల వివరాలివ్వండి
- సిట్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ముడుపుల ద్వారా కొల్లగొట్టిన రూ.3,500 కోట్లను ఎలా దారి మళ్లించారో.. ఓ పట్టిక రూపంలో వివరాలు సమర్పించాలని విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సిట్‌ను ఆదేశించింది. ఫోరెన్సిక్ నివేదికలూ పొందుపరచాలని నిర్దేశించింది. నిందితుల జాబితాలోని సంస్థలకు సంబంధించిన ప్రతినిధులు, వారి హోదాల వివరాలన్నింటినీ సమగ్రంగా ఇవ్వాలని సూచించింది. ఈ కేసులో జులై 19న సిట్ దాఖలు చేసిన ప్రాథమిక అభియోగపత్రంలోని పలు అంశాలపై మరింత స్పష్టత, సమాచారం కోరుతూ, అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఏసీబీ కోర్టు సిట్‌కు సోమవారం మెమో జారీ చేసింది. మొత్తం 21 అంశాలను అందులో ప్రస్తావించింది. మూడు రోజుల్లోగా ఈ వివరాలు సమర్పించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. ప్రధానాంశాలివీ..

■ ఈ కేసులో 1988 నాటి అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు ఎలా వర్తిస్తాయి? ఆ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం ప్రాసిక్యూషన్ కోసం కాంపిటెంట్ అథారిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా ప్రధాన నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేయటం ఎలా అర్హమైనది? వీటిపై వివరణలు ఇవ్వండి.

* సీఆర్‌పీసీ 161, 164 సెక్షన్ల కింద ఎంతమంది సాక్షుల్ని విచారించారు? ఆ జాబితా సమర్పించండి.

■ దర్యాప్తు ఇంకా పెండింగ్‌లో ఉందని అభియోగపత్రంలో పేర్కొన్నారు. కానీ, ఇది ప్రాథమిక అభియోగపత్రమా? చివరిదా? అని ఎక్కడా పేర్కొనలేదు. ఆ సమాచారమివ్వండి.

■ ఈ కేసులో ముప్పిడి అవినాష్‌రెడ్డి (ఏ-7), బూనేటి చాణక్య (ఏ-8) టి.ఈశ్వర్‌కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9), షేక్ సైఫ్ అహ్మద్ (ఏ-10), ఓల్విక్ మల్టీవెంచర్స్ (ఏ-11), క్రిపాటి ఎంటర్‌ప్రైజెస్ (ఏ-12), నైస్నా మల్టీవెంచర్స్ (ఏ-33), ట్రిప్పెర్ ఎంటర్‌ప్రైజెస్ (ఏ-14), విక్సో ఎంటర్‌ప్రైజెస్ (ఏ-15) వారి ప్రమేయం, పాత్రపై నిర్దిష్టమైన వివరాలు అభియోగపత్రంలో పొందుపరచండి. వీరిలో కొందరు నిందితుల్ని ఎందుకు అరెస్టు చేయలేదో కారణాలు తెలియజేయండి. నిందితుల్లో ఎవరెవరికి ఏ సెక్షన్ వర్తిస్తుందో విడిగా ఇవ్వండి.

■ ఇప్పటివరకూ మొత్తం ఎంతమంది నిందితులు అరెస్టయ్యారు? ఎవరెవరు ఎప్పటి నుంచి జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు? అనే సమాచారాన్ని సమర్పించండి.

మద్యం ముడుపుల చేరవేతలో చెవిరెడ్డి కీలక సూత్రధారి

- దర్యాప్తు కీలక దశలో ఉంది.. నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దు
- బెయిల్ పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేసిన సిట్



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో ముడుపుల చేరవేతలో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కీలక సూత్రధారి అని, అతనికి బెయిల్ ఇవ్వొద్దని సిట్ పేర్కొంది. మధ్యంతర, రెగ్యులర్ బెయిళ్ల కోసం చెవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం ఏసీబీ కోర్టులో ఈమేరకు కౌంటర్ దాఖలు చేసింది. ముడుపులకు సంబంధించి దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని, ఈ దశలో నిందితుడికి బెయిల్ ఇస్తే ఆటంకం కలుగుతుందని అభ్యంతరం తెలిపింది. మధ్యంతర బెయిల్‌పై మంగళవారానికి, రెగ్యులర్ బెయిల్‌పై సెప్టెంబరు 2కు న్యాయాధికారి విచారణను వాయిదా వేశారు. వెన్ను నొప్పి తీవ్రంగా ఉందని ప్రకృతి చికిత్స కోసం అనుమతించాలని చెవిరెడ్డి సోమవారం మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ జరగనుంది.

■ రిమాండ్ పొడిగింపు కోసం చెవిరెడ్డిని కోర్టుకు తీసుకొచ్చి, తిరిగి తీసుకెళ్లే సమయాల్లో తన ప్రవర్తనతో పోలీసులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని, వర్చువల్ విధానంలో హాజరుపరిచేందుకు అనుమతివ్వాలని గత వారం సిట్ అధికారులు మెమో దాఖలు చేశారు. దీనిపై ఆయన ఇబ్బందులకు గురి చేయరని చెవిరెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు ఇచ్చిన హామీపత్రాన్ని న్యాయాధికారి పరిగణనలోకి తీసుకుని, సిట్ మెమోను తోసిపుచ్చారు.

■ హైదరాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల జమకు సంబంధించి నిందితుడు రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌పై తదుపరి విచారణ ఈనెల 28వ తేదీకి వాయిదా పడింది.

వైద్యారోగ్యంలో వినూత్న ఆవిష్కరణల వేదిక 'బ్రెయిన్'

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో భాగంగా ఏర్పాటు
- అంతర్జాతీయ బయోడిజైన్ నిపుణులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ



ఆసియా–పసిఫిక్ బయో డిజైన్ అలయెన్స్‌కు చెందిన విదేశీ వైద్య నిపుణులతో సచివాలయంలో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తదితరులు

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ (బ్రెయిన్) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అమరావతిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో అంతర్భాగంగా బ్రెయిన్ కార్యకలాపాలుంటాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ, స్థానిక నైపుణ్యాలను సమన్వయం చేయడం ద్వారా ప్రజారోగ్య రంగంలో గణనీయమైన మార్పులు తెస్తుందని వెల్లడించారు. సచివాలయంలో సోమవారం ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్‌కు చెందిన వేర్వేరు దేశాల వైద్య నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏఐ, మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసియా- పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్, అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ సంయుక్త భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా 'బ్రెయిన్' దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా ఇది పనిచేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా మెడికల్ టెక్నాలజీ రంగంలో కొత్త స్టార్టప్‌లతో పాటు పరిశోధకులు, నిపుణులకు ప్రోత్సాహం లభిస్తుందని సీఎం తెలిపారు.

స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో ఒప్పందాలు

ఆస్ట్రేలియా, అమెరికా, ఇజ్రాయెల్, జపాన్, సింగపూర్, తైవాన్, ఐర్లాండ్ తదితర దేశాలకు చెందిన వైద్య నిపుణులు ఆయా దేశాల్లో బయోడిజైన్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ, మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ కలపాలతో పాటు ప్రొఫెసర్ అనురాగ్ మైరల్ (స్టాన్‌ఫోర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్), డాక్టర్ యోనా వైస్‌బచ్ (ఆసియా పసిఫిక్), కెవిన్ ఫ్లెగర్ (ఆస్ట్రేలియా), యూరియోన్ కొబయాషి (జపాన్), జేమ్స్ చియెన్, హియాట్సింగ్ (తైవాన్), మార్క్ చాంగ్ (సింగపూర్) తదితరులు తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలకు సాంకేతిక పరిష్కారాలపై చర్చించారు. వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, సాంకేతికత బదిలీ, స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర విభాగాల్లో సహకారంపై ప్రపంచ నిపుణులు- ఏపీ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా, ఎయిమ్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం జరిగింది. దీంతో భారత్ బయోడిజైన్, బయోడిజైన్ ఆస్ట్రేలియాలు ఉమ్మడిగా పని చేయనున్నాయి. వైద్యారోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, విద్యార్థులకు ప్రత్యేక కోర్సులను నిర్వహించేలా ఇది సహకరించనుంది.

డీజీనెర్వ్ సెంటర్ సేవల విస్తరణ

'రాష్ట్రంలో ప్రజారోగ్య సేవల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతున్నాం. పీహెచ్‌సీలతో ఏరియా ఆస్పత్రులను అనుసంధానించాం. చిత్తూరు జిల్లా కుప్పంలో టాటా-గేట్స్ ఫౌండేషన్‌లతో కలిసి డీజీనెర్వ్ సెంటర్ ఏర్పాటుచేశాం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా దీని సేవలు విస్తరిస్తామ'ని సీఎం చంద్రబాబు వెల్లడించారు. విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ ఆధునిక వైద్య పరికరాల తయారీలో కీలకంగా ఉందని గుర్తుచేశారు. సమావేశంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కమిషనర్ వీరపాండియన్, ఈడీబీ సీఈవో సాయికాంత్‌వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సభలో చర్చలతోనే సమస్యలకు పరిష్కారం

- ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడి సందేశం



ఈనాడు, దిల్లీ: 'కేవలం రాజ్యాంగ ముసాయిదాపై చర్చించడానికే రాజ్యాంగ నిర్మాణ సభ మూడేళ్లలో 165 రోజులు సమావేశమైంది. అంటే ఒకే అంశంపై సగటున ఏటా 50 రోజుల పాటు చర్చ జరిగింది. నేడు చర్చించాల్సిన అంశాలు వేలల్లో ఉన్నా, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సమావేశాలు ఏటా 20 రోజుల కంటే తక్కువే జరుగుతున్నాయి. ఇది ఆరోగ్యకర ధోరణి కాదు. కనీసం 60 రోజులైనా శాసనసభను సమావేశ పరిచేలా స్పీకర్లంతా వారి ప్రభుత్వాలను ఒప్పించాలి' అని ఏపీ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. రెండు రోజుల పాటు దిల్లీలో జరిగిన అఖిల భారత స్పీకర్ల సదస్సులో ఆయన తన ప్రసంగ పాఠాన్ని ఉంచారు. 'చట్టసభలు ఎక్కువ రోజులు పని చేస్తేనే ప్రజాసమస్యలపై విస్తృత చర్చ జరిగి, పరిష్కారాలు లభిస్తాయి. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలి భారతీయ ప్రెసిడెంట్‌గా పనిచేసిన విఠల్‌భాయ్ పటేల్ వల్లే రాజ్యాంగంలో ఆర్టికల్ 98, 187 వచ్చాయి. తద్వారా శాసన వ్యవస్థకు స్వతంత్ర సచివాలయాలు ఏర్పడ్డాయి. ఇప్పటికీ చాలా రాష్ట్రాల శాసనసభలకు ఆర్థిక, క్రియాత్మక స్వయం ప్రతిపత్తి లేదు. దీన్ని పరిష్కరించాలి' అని పేర్కొన్నారు. 'చట్టసభల్లో చర్చలకు ఉన్న శక్తిని విఠల్‌భాయ్ పటేల్ అర్థం చేసుకున్నారు. కానీ, నేడు అర్థవంతమైన చర్చలను వెనక్కినెట్టి, అరుపులు, నినాదాల వల్లే ఎక్కువ లాభం ఉంటుందని భావించే పరిస్థితి వచ్చింది'' అని ఆవేదన వ్యక్తంచేశారు.

ఎమ్మెల్యేలు సభకు రాకపోవడం సరికాదు: రఘురామకృష్ణరాజు

శాసనసభ్యులు సభకు రాకపోవడం సరికాదని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు విలేకర్లతో పేర్కొన్నారు. సభ్యులంతా సభకొచ్చి ప్రజలు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. స్పీకర్ల సదస్సులో శాసనసభల సమావేశాల పనిదినాల పెంపుపై చర్చ జరిగిందని, వచ్చేనెల 11, 12, 13 తేదీల్లో బెంగళూరులో జరిగే సదస్సులో దీనిపై ఓ ప్రతిపాదన చేయనున్నట్లు చెప్పారు. శాసనసభ సమావేశాలు ఏటా పెద్ద రాష్ట్రాల్లో 60 రోజులు, చిన్న రాష్ట్రాల్లో 40 రోజులపాటు జరిగేలా చట్టసవరణ చేయాల్సిన అవసరంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. 'ఏపీ అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబర్ 18 నుంచి పది రోజుల పాటు జరిగే అవకాశముంది. ఇన్నాళ్లూ రాని సభ్యులు కూడా ఆ సమావేశాలకు రావాలి. ప్రజలకు ప్రాతినిధ్యం వహించాల్సిన సభ్యులు.. శాసనసభకు రాకపోతే వారిని ప్రజలు చట్టసభల సభ్యుల్లాగా చూడరన్న నిజం గ్రహించాలి. గైర్హాజరైన వారి సభ్యత్వాన్ని రద్దు చేయడానికి ప్రత్యేకంగా బిల్లు అక్కర్లేదు. వరుసగా 60 రోజులపాటు సమావేశాలకు గైర్హాజరైన వారి సభ్యత్వం ఆటోమేటిక్‌గా రద్దవుతుందని రాజ్యాంగం చెబుతోంద'ని రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు.

బిహార్‌లా మిగతా రాష్ట్రాల్లోనూ ఓట్ల తొలగింపునకు కుట్ర

- ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ సీపీఐ ఇన్ ఆంధ్రప్రదేశ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డి.రాజా, కె.నారాయణ తదితరులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీపీఐ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. ఆయనపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ విధానాల కారణంగా ఎన్నడూ లేని విధంగా దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదకర స్థితిలోకి వెళ్లిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీని కేంద్ర ప్రభుత్వం తన గుప్పెట్లో పెట్టుకుని దేశ ప్రజల ఓటుహక్కును కాలరాస్తోందని విమర్శించారు. బిహార్‌లో లక్షల ఓట్లు తొలగించారని.. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లోనూ ఇదే విధానం అవలంబించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. బిహార్‌లో జరిగిన ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 21 నుంచి 25 వరకు చండీగఢ్‌లో సీపీఐ 25వ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ బలోపేతంతోనే అధికారం

గ్రామస్థాయిలో పార్టీని విస్తరించి బలోపేతం చేస్తే రానున్న రోజుల్లో రాజకీయ అధికారం సీపీఐదేనని డి.రాజా పేర్కొన్నారు. ఒంగోలులో జరుగుతున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పార్టీ సభ్యత్వం మరింత పెరగాలని.. ప్రతి ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థులు పోటీ చేయాలని సూచించారు. పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు భాజపాతో జట్టు కట్టి రాష్ట్రానికి ఎన్ని నిధులు రాబట్టారో చెప్పాలని డిమాండు చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలతోపాటు పక్కాగృహాలు మంజూరు చేయాలని డిమాండు చేశారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కూడా మాట్లాడారు.

తిరుమలేశుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట జస్టిస్ ఎ.హరిహరనాథశర్మ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మ సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు తెస్తాం

- జీవనోపాధిగా చేసుకునేవారి సంఖ్య పెంచుతాం
- ఏపీ చేనేత, హస్తకళల గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్ల



గాంధీ బునకర్ మేళాను ప్రారంభిస్తున్న సుచిత్ర ఎల్ల. చిత్రంలో రేఖారాణి తదితరులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో చేనేత కార్మికులు చేస్తున్న కళాత్మక ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడానికి వినూత్న విధానాలు అమలు చేస్తామని ఏపీ చేనేత, హస్తకళల గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్ల పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ చేనేత ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ 'గాంధీ బునకర్ మేళా' (జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన)ను ఆమె సోమవారం విజయవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సుచిత్ర ఎల్ల మాట్లాడుతూ.. "మన రాష్ట్రంలో 34 రకాల చేనేత క్లస్టర్లు ఉన్నాయి. వీటి ఉత్పత్తులను మెరుగుపరచడం, వైవిధ్యభరితమైన ఉత్పత్తుల తయారీతో పాటు నాణ్యత, బ్రాండింగ్ పెంపొందించడం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపై దృష్టి పెట్టాం. ఈ మార్పుల ద్వారా చేనేతను జీవనోపాధిగా చేసుకునేవారి సంఖ్య పెంచుతాం. జాతీయ స్థాయిలోనే కాక అంతర్జాతీయ సంస్థలు సైతం ఇక్కడి చేనేత ఉత్పత్తులను తమ దగ్గరకు తీసుకురావాలని కోరుతున్నాయి. చేనేత, హస్త కళాకారుల ప్రతిభ ఇక్కడితో ఆగిపోకుండా చిరకాలం ఉండేలా చర్యలు చేపడతాం. చేనేత, హస్తకళల ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను ప్రజలంతా వినియోగించడం వల్లే వాటికి ప్రాచుర్యం వస్తుంది. జాతీయ స్థాయిలో చేనేత ఉత్పత్తుల ప్రతిభా అవార్డుల్లో రాష్ట్ర చేనేత కార్మికులు ప్రతిభ చూపారు. మొత్తం 30 అవార్డులు ఇవ్వగా 10 మనవాళ్లకే రావడం గర్వకారణం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ కమిషనర్ జి.రేఖారాణి తదితరులు పాల్గొన్నారు. సెప్టెంబరు 7 వరకు ఈ మేళా నిర్వహిస్తారు.

పింఛన్ల తొలగింపుపై నిలదీయాలి..

- బాధితులకు అండగా నిలబడాలి
- వైకాపా సీనియర్ నేతలతో జగన్ భేటీలో చర్చ!

ఈనాడు, అమరావతి: పింఛన్ల తొలగింపునకు వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని నిలదీసే కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని వైకాపా నిర్ణయించింది. సోమవారం పార్టీ సీనియర్ నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ తాడేపల్లిలోని తన నివాసంలో భేటీ అయ్యారు. పింఛన్ల తొలగింపు అంశం చర్చకు వచ్చినపుడు... క్షేత్రస్థాయిలో పరిస్థితులను నేతలు జగన్ ముందు ప్రస్తావించారు. బాధితులకు అండగా నిలవాలి, దీనిపై పార్టీ తరఫున పోరాటం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంపైనా నేతల అభిప్రాయాలను జగన్ తీసుకున్నారు. ఆ కార్యక్రమం స్థాయిలోనే పింఛన్ల తొలగింపుపైనా పోరాటం చేయాలని సూచించారు.

■ దివ్యాంగుల పట్ల ప్రభుత్వం అత్యంత క్రూరంగా వ్యవహరిస్తోందని వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. పునఃపరిశీలన పేరుతో అర్హుల్లో ఏ ఒక్కరి పింఛనైనా సెప్టెంబరు 1న తొలగిస్తే ఊరుకునేది లేదన్నారు. సోమవారం ఆయన తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. 'కొత్త పింఛన్లు ఇవ్వకపోగా లక్షల్లో దివ్యాంగుల పింఛన్లను రద్దు చేశారు. భారం తగ్గించుకోవాలని దివ్యాంగుల పొట్టకొట్టడం దుర్మార్గం. పింఛన్లు తొలగించారని తెలిసి కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. వారి మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి' అని అన్నారు.

జిందాల్‌కు ఇనుప ఖనిజ అన్వేషణ లైసెన్స్

- ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం
- ఓబుళాపురం వద్ద 1,327 హెక్టార్ల అటవీ ప్రాంతంలో అన్వేషణ

ఈనాడు, అమరావతి: జిందాల్ సంస్థకు చెందిన సౌత్ వెస్ట్ మైనింగ్ లిమిటెడ్‌కు ఓబుళాపురం వద్ద 1,327 హెక్టార్ల అటవీ ప్రాంతంలో ఇనుప ఖనిజ అన్వేషణకు కాంపోజిట్ లైసెన్స్ మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం, హిర్దేహాళ్ గ్రామాలు, బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామ పరిధిలోని మించేరి రక్షిత అటవీ ప్రాంతంలో ఖనిజాన్వేషణకు ఈ లైసెన్స్ మంజూరు చేశారు. ఈ కాంపోజిట్ లైసెన్స్ మంజూరుకు 2023 మార్చిలో టెండర్లు పిలిచారు. అక్కడ తవ్వితీసే ఖనిజం విక్రయించే సమయంలో ఉన్న ధరలో 10 శాతం ప్రభుత్వానికి చెల్లించేలా రిజర్వ్ ధర ఖరారు చేశారు. ఈ-వేలంలో సౌత్ వెస్ట్ మైనింగ్ లిమిటెడ్ సంస్థ 12.60 శాతం చెల్లిస్తామని కోట్ చేసి, బిడ్ దక్కించుకుంది. దీనికి ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 27న ఎల్‌వోఐ జారీ చేసింది. ఆ సంస్థ ఐదేళ్లలో బోర్లు వేసి, ఖనిజాన్వేషణ చేయాలి. ఎంత ఇనుప ఖనిజం ఉందో గుర్తించాక.. ఖనిజం లభించే ప్రాంతానికి లీజు మంజూరు చేయాలని కోరుతుంది.

ఉద్దేశపూర్వకంగా ఖనిజాన్వేషణ చేయని ఏపీఎండీసీ!

■ ఈ 1,327 హెక్టార్లను తొలుత 2015లో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి ప్రభుత్వం రిజర్వ్ చేసింది.

■ అక్కడ బోర్లు తీసి, ఎంత ఇనుప ఖనిజ నిల్వలున్నాయో ఏపీఎండీసీ అధ్యయనం చేయాల్సి ఉంది.

■ 70 చోట్ల బోర్లు వేయాలని భావించారు. దీనికోసం అటవీ భూముల్లోకి వెళ్లేలా రహదారులు వేసేందుకు 17 హెక్టార్లు అవసరమైంది. ఈ అటవీ భూమికి పరిహారంతోపాటు వేరొకచోట ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలి. ఇందుకు తొలుత ఏపీఎండీసీ సిద్ధమైనప్పటికీ, తర్వాత పట్టించుకోకుండా వదిలేసింది.

■ కేంద్ర నిబంధనల ప్రకారం ఐదేళ్లలో ఖనిజాన్వేషణ చేయలేకపోతే దాని కాంపోజిట్ లైసెన్స్ రద్దవుతుంది. దీంతో తనకు రిజర్వ్ చేసిన భూములను 2023 ఫిబ్రవరిలో ఏపీఎండీసీ ప్రభుత్వానికి సరెండర్ చేసింది.

■ అప్పటి వరకు ఏపీఎండీసీ ఉద్దేశపూర్వకంగానే ఖనిజాన్వేషణ చేయకుండా, చివరకు సరెండర్ చేసిందనే విమర్శలొచ్చాయి.


■ తర్వాత టెండర్లు పిలిస్తే.. జిందాల్‌కు చెందిన సౌత్‌వెస్ట్ మైనింగ్ లిమిటెడ్ కాంపోజిట్ లైసెన్స్ దక్కించుకుంది.

185 ఒప్పంద వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్యశాఖలో ఒప్పంద పద్ధతిలో 185 వైద్యుల పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక బోర్డు సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్రంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లు, టెలి మెడిసిన్ హబ్‌లలో అవసరమైన 155 వైద్యాధికారుల పోస్టులను ఎంబీబీఎస్ అర్హతతో భర్తీచేయనున్నారు. 30 మంది స్పెషలిస్టు వైద్యుల పోస్టులు, టెలి మెడిసిన్ హబ్‌లలో అవసరమైన 13 జనరల్ మెడిసిన్, మూడు గైనకాలజీ, డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లలో 14 చిన్న పిల్లల వైద్యుల పోస్టులను ఈ ప్రకటన ద్వారానే భర్తీ చేస్తారు. అర్హులైన అభ్యర్థుల నుంచి సెప్టెంబరు 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.

EENADU Vol: 52, Issue: 17 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

షుగర్ మందు వారానికోసారి



కొన్నేళ్లుగా మధుమేహ చికిత్సల్లో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఇన్సులిన్ ఒక్కటే కాకుండా, గ్లూకగాన్ లైక్ పెప్టైడ్-1 (జీఎల్‌పీ-1) అనే కొత్తరకం ఇంజెక్షన్ మందులు ఆపద్బాంధవుడిలా ఉపయోగ పడుతున్నాయి. వీటిని వారానికి ఒకసారి తీసుకుంటే చాలు. మందు మోతాదులనూ నెలకు ఒకసారే మార్చుకోవచ్చు. ఇవి గ్లూకోజును మాత్రమే కాదు.. మధుమేహంతో ముడిపడిన దుష్ప్రభావాలనూ తగ్గిస్తుండటం గమనార్హం. బరువును తగ్గించటమూ అదనపు ప్రయోజనం. దీంతో కొందరు ఊబకాయం తగ్గటానికీ వాడుతున్నారు. అయితే వీటితో కొన్ని దుష్ప్రభావాలు లేకపోలేదు. కాబట్టి ఆచితూచి వాడటం, తగు జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.



డా॥ పి.వి.రావు
మధుమేహ నిపుణులు
డయాబిటీస్ రిసెర్చ్ సెంటర్
హైదరాబాద్

జీఎల్‌పీ మందులు ఇన్సులిన్ విడుదలను ఇనుమడింప జేయటం, గ్లూకగాన్ ఉత్పత్తి నియంత్రించటం, ఆకలి తగ్గించటం, పేగుల్లోంచి ఆహారాన్ని నెమ్మదిగా ఖాళీ చేయటం ద్వారా గ్లూకోజు అదుపులో ఉండేలా చూస్తాయి. ఇంతకుముందు మనదగ్గర డ్యులాగ్లుటైడ్ ఒక్కటే ఉండేది. ఇటీవల సెమాగ్లుటైడ్, టిరిజెపటైడ్ సైతం వచ్చాయి. ఇవి వెంటనే వాడకంలోకి రావటం విశేషం. మరో రెండు మూడేళ్లలో కాగ్రిలినిటైడ్, రెటాట్రుటైడ్ వంటివీ వచ్చే అవకాశముంది. జీఎల్‌పీ ఇంజెక్షన్లతో మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే ప్రపంచదేశాల ఆరోగ్య మార్గనిర్దేశాలలో ఇవీ భాగమయ్యాయి. మధుమేహం బయటపడినప్పటి నుంచే వీటిని ఆరంభించాలని భావిస్తున్నారు కూడా.

ఒక్క గ్లూకోజే కాదు

మధుమేహ చికిత్స ప్రధాన ఉద్దేశం దీర్ఘకాల వాపుప్రక్రియ (క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్)తో తలెత్తే ముప్పు కారకాలను తగ్గించటం. రక్తంలో గ్లూకోజు ఒక్కటే కాదు.. దీని కన్నా శరీర బరువు, రక్తపోటు, రక్తంలో కొవ్వు పదార్థాలు (కొలెస్ట్రాల్, ఎల్‌డీఎల్, ట్రైగ్లిజరైడ్లు, లైపో ప్రోటీన్ ఎ) మన ఆరోగ్యాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. యూరిక్ ఆమ్లం, హోమోసిస్టిన్, వాపు ప్రక్రియను ప్రేరేపించే సైటోకైన్స్ (కొవ్వు కణాలు, తెల్ల రక్త కణాలను తయారుచేసేవి) కూడా తక్కువవేమీ కావు. ఇలా మనకు తెలిసిన, తెలియని ఎన్నో ముప్పు కారకాలను జీఎల్‌పీ మందులు తగ్గిస్తుండటం గమనార్హం. మరో ముఖ్య ఉపయోగం- రక్తంలో గ్లూకోజు మామూలుగా ఉన్నా.. ఆ మాటకొస్తే అసలు మధుమేహమే లేకపోయినా కూడా వీటిని వాడుకునే వీలుండటం. ఎందుకంటే ఇవి గ్లూకోజును ఉండాల్సిన పరిమాణం కన్నా తగ్గించవు. అంటే కొన్ని మధుమేహ మందులతో తలెత్తే హైపోగ్లైసీమియా (గ్లూకోజు మరీ తక్కువకు పడిపోవటం) వీటితో రాదన్నమాట. అందువల్ల మధుమేహం లేనివారిలోనూ దీర్ఘకాల వాపు ప్రక్రియతో కలుగుతున్న ఆరోగ్య సమస్యల నివారణ, చికిత్సలకూ ఈ మందులను వాడుకోవచ్చు.



దుష్ప్రభావాలతో జాగ్రత్త

జీఎల్‌పీ మందులతో ప్రయోజనాలే కాదు, కొన్ని దుష్ప్రభావాలూ ఉంటున్నాయి. వీటితో కొందరికి ఛాతీలో, కడుపులో మంట, తేన్పులు, వికారం, అప్పుడప్పుడూ వాంతులు, కడుపు నొప్పి, పొట్ట ఉబ్బరం, అజీర్ణం, విరేచాలు అవటం లేదా మల బద్ధకం లాంటి ఇబ్బందులు పొడసూపొచ్చు. అలాగని అంతగా భయపడాల్సిన పనిలేదు. డాక్టర్ల సలహాతో తగు మందులు వాడుతూ, ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే తొలి రెండు, మూడు నెలల్లోనే వీటిని తగ్గించుకోవచ్చు. జీఎల్‌పీ మందుల మోతాదులను తెలుసుకొని, ఆయా వ్యక్తులకు అనుగుణంగా సవరించుకోవటమూ మేలు చేస్తుంది. సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్ అయితే 0.25 మి.గ్రా. నుంచి 2.4 మి.గ్రా. వరకు.. టిరిజెపటైడ్‌ను 2.5 మి.గ్రా. నుంచి 15 మి.గ్రా. వరకూ ఇవ్వచ్చు. వీటిని ముందు కొద్ది మోతాదులో ఆరంభించి, ప్రతి నెలా కొద్దికొద్దిగా పెంచుతూ మందు మోతాదులను నిర్ణయించాల్సి ఉంటుంది. సరిపడిన మోతాదుల్లో నెలల తరబడి ఇంజెక్షన్లు వాడుకున్నా పెద్దగా ఆరోగ్య సమస్యలేమీ ఉండవనే చెప్పుకోవచ్చు.

జీర్ణక్రియ వ్యత్యాసాలతోనూ..

అందరిలోనూ.. ముఖ్యంగా మన భారతీయుల్లో ఆహారం ఒకేలా జీర్ణమవదు. ఎవరికివారే ప్రత్యేకం. మధ్యవయసువారిలో, వృద్ధుల్లో వ్యత్యాసాలు మరీ ఎక్కువ. దీనికి చిన్నప్పటి ఆహార అలవాట్లు, మనకు అందుబాటులో ఉండే, లేని ఆహారాలు ఒక కారణమైతే.. మిగతా దేశాల్లో లేనంత జన్యు వైవిధ్యం మరో కారణం. జీఎల్‌పీ మందులు తీసుకునేవారిలో ఇదే ప్రాధాన్యత సంతరించుకుంటోంది. అందుకే వీటి మోతాదు సురక్షిత (సేఫ్టీ), తట్టుకునే సామర్థ్యం (టోలరేబిలిటీ), దుష్ప్రభావాల (యాడ్‌వర్స్ ఈవెంట్స్) మీద భారతీయులపై ప్రత్యేకంగా ప్రయోగ పరీక్షలు నిర్వహించి శాస్త్రవేత్తలు పూర్తి సమాచారాన్ని సేకరించారు. ఏయే పదార్థాలు ఎవరికి సరిపోతున్నాయో, అదే ఆహారం ఎవరికి సమస్యలను సృష్టిస్తుందో అనేది ఎవరికివారే తెలుసుకోవటానికి కొన్ని మార్గదర్శకాలు, సూచనలూ చేశారు.

ఇవి మనలోనే ఎక్కువ

జీఎల్‌పీ మందుల ప్రతికూల ప్రభావాలు ప్రత్యేకించి మన భారతీయుల్లోనే కనిపిస్తుండటం గమనార్హం. జీర్ణాశయం, చిన్నపేగు, పెద్దపేగుల్లో ఇవి మరింత ఎక్కువగా తలెత్తుతున్నాయి. దీనికి చాలావరకూ మన ఆహార అలవాట్లే కారణం. ఉప్పు, కారం, పులుపు, వేపుళ్లు (నూనెలో ముంచి వేయించేవి, ఒకసారి వండిన తర్వాత మళ్లీ మళ్లీ వేడి చేసి తినేవి), మసాలాలను మనమే ఎక్కువగా వాడుతుంటాం. మన వంట దినుసులతో, మన పద్ధతుల్లో వండిన ఇలాంటి ఆహారాన్ని జీఎల్‌పీ మందులు వెంటనే జీర్ణం కాకుండా అడ్డుకుంటాయి. జీర్ణాశయంలో, పేగుల్లో గంటల తరబడి నిల్వ ఉండేలా చేస్తాయి. వీటితో పెద్దగా ఇబ్బందేమీ ఉండదు గానీ ఇంజెక్షన్ తీసుకున్న రోజు, మర్నాడు కొంత చికాకు.. ఇంటా బయటా పనులు చేసుకోవటంలో కొన్ని సమస్యలు తలెత్తొచ్చు. ఇవి వారంలో అన్ని రోజులు ఉండకపోవచ్చు కూడా. కారం, వేపుళ్లు, మసాలాలతో పాటు ఉప్పు, పులుపూ తగ్గించుకుంటే వీటిని చాలావరకూ నివారించుకోవచ్చు.

కొన్ని ఆరోగ్య సమస్యలు

అరుదే అయినా జీఎల్‌పీ మందులతో కొన్ని తీవ్ర సమస్యలు తలెత్తొచ్చు. దీర్ఘకాలంగా అజీర్ణం, మలబద్ధకం మూలంగా పేగుల్లో అడ్డంకి తలెత్తొచ్చు. దీంతో కడుపు నొప్పి, ఉబ్బరం వేధించొచ్చు. ఆహారం ఎక్కువసేపు పేగుల్లోనే ఉండిపోవటం వల్ల అది కుళ్లిపోయి బ్యాక్టీరియా వంటి సూక్ష్మక్రిముల సంఖ్య పెరగొచ్చు. ఫలితంగా పొట్టలో చెడు వాసనతో కూడిన వాయువులు చేరి, పోషకాహార లోపానికి దారితీయొచ్చు.

● థైరాయిడ్ గ్రంథిలో కణితులు, క్లోమం వాపు, పిత్తాశయంలో రాళ్లు, కిడ్నీ రాళ్లు, చూపు దెబ్బతినటం తలెత్తొచ్చు.

● మత్తుమందులు వాడి పెద్ద శస్త్రచికిత్సలు చేసే సమయంలో జీర్ణంకాని ఆహారం పొట్టలోంచి నోటిలోకి వచ్చి, ఊపిరితిత్తుల్లోకి వెళ్లొచ్చు (రిగర్జిటేషన్). ఇది ప్రాణాపాయం కలిగించొచ్చు.

● డాక్టర్ సలహా మేరకు ఆరు నెలలకోసారి రక్త, స్కాన్, కంటి పరీక్షలు చేయించుకుంటే ప్రమాదకర సమస్యల్ని ముందే గుర్తించి చికిత్స చేయటానికి అవకాశముంటుంది.

ఇవీ జాగ్రత్తలు

● కడుపులో మంట, తేన్పులు, తిన్న ఆహారం గొంతులోకి ఎగదన్నుకు రావటం, వికారం, వాంతులతో ఇబ్బంది పడేవారు– ఒకసారి ఎక్కువగా తినకుండా, రెండు మూడు సార్లు కొద్దికొద్దిగా తినాలి. తొందర పడకుండా నెమ్మదిగా నమిలి తినాలి. ఎక్కువ నూనె వాడొద్దు. వేపుళ్లు, చట్నీలు, పచ్చళ్ల వంటివి మానెయ్యాలి. సిగరెట్టు, మద్యం, శీతల పానీయాలు (కార్బొనేటెడ్) పూర్తిగా మానెయ్యటమే మంచిది. మంట, తేన్పులు తగ్గటానికి డాక్టర్ల సలహాతో హెచ్ 2 బ్లాకర్ లేదా ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్ రకం మందులు వాడుకోవచ్చు. మరీ ఎక్కువగా వికారం లేదా వాంతులు ఉంటే ఒండన్సెట్రాన్ వంటి స్వల్పకాలిక యాంటీఎమెటిక్స్ వేసుకోవచ్చు.

● జీర్ణాశయం, పేగుల కదలికలు మందగించటం వల్ల మలబద్ధకం గలవారు– ఆహారంలో తగినంత పీచు పదార్థం ఉండేలా చూసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి. సిలియం, డోకుసేట్ సోడియం, పాలిథిలీన్ గ్లైకాల్ వంటి మందులు వాడితే మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. అయితే అప్పుడప్పుడూ ఎక్కువసార్లు మలవిసర్జనకూ వెళ్లాల్సి రావచ్చు. నీళ్ల విరేచనాలయ్యే అవకాశం తక్కువే గానీ రోజుకు మూడు నాలుగు సార్లు మలవిసర్జన అవుతుంటే లోపరమైడ్ వాడుకోవచ్చు. డాక్టర్ల సలహా తీసుకొని వీటిని ముందుగానే ఇంట్లో ఉంచుకోవటం మంచిది.

మధుమేహ సమస్యలు తగ్గుముఖం

మధుమేహ చికిత్స పద్ధతుల్లో రక్తనాళాలు, నాడీ సమస్యలను అరికట్టటానికి చాలా ప్రాధాన్యమిస్తారు. గుండెపోటు, గుండె వైఫల్యం, పక్షవాతం, కిడ్నీ జబ్బు, పాదాల వేళ్లు కుళ్లిపోవటం (గ్యాంగ్రీన్), అరికాళ్లలో మంట, పాదాల్లో తిమ్మిర్లు, కాళ్ల నొప్పులు (న్యూరోపతీ) నివారించటానికీ జీఎల్‌పీ మందులు తోడ్పడుతున్నాయనీ పరిశోధనల్లో నిరూపితమైంది. మధుమేహం ఉన్నా, లేకపోయినా కాలేయంలో కొవ్వు పేరుకోవటం (ఫ్యాటీ లివర్), కాలేయ క్యాన్సర్ ముప్పు, నిద్రలో కాసేపు ఊపిరి ఆగటం (స్లీప్ అప్నియా), నడి వయసులోనే మతిమరుపు (షార్ట్ మెమరీ లాస్, అల్జీమర్స్ మొదటి దశ), యుక్తవయసు మహిళల్లో అండాశయాల్లో నీటి తిత్తులు (పీసీఓడీ) వంటి సమస్యలకూ వీటితో మంచి ఫలితం కనిపిస్తున్నట్టు తేలటం గమనార్హం.

పీచు అవసరమే గానీ..

ఒకింత విరుద్ధంగా అనిపించినా జీఎల్‌పీ మందులతో జీర్ణ సమస్యలు గలవారు ఆహారపరంగా ప్రత్యేకించి మరికొన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. పీచు పదార్థం ఎక్కువగా తీసుకుంటే కొందరికి జీర్ణక్రియ నెమ్మదించి చాలారకాల చెడు వాయువులు (గ్యాస్) పొట్టలో విడుదలవ్వచ్చు. తినే సమయంలో నీళ్లు తాగితే గాలి ఎక్కువగా కడుపులోకి చేరి పొట్ట ఉబ్బొచ్చు. తేలికగా జీర్ణంకాని గింజలు, క్యాబేజీ, గోబీ, బ్రోకలీ వంటివి.. పచ్చి కాయగూరలు, సలాడ్‌లు, కఠిన పిండి పదార్థాలతో కూడిన తృణధాన్యాలూ అజీర్ణ సమస్యకు దారితీయొచ్చు. పాలలోని లాక్టోజ్ పడనివారికి జీర్ణ సమస్యలు మరింత ఎక్కువ కావొచ్చు. కాబట్టి ఇలాంటి వాటిపై జాగ్రత్త అవసరం.


వ్యాయామమూ ముఖ్యమే



జీఎల్‌పీ మందులు వాడేవారిలో కొన్ని నెలల తర్వాత ఎముకలు పలుచగా (ఆస్టియోపీనియా), కండరాలు బలహీనంగా (సార్కోపీనియా) అవ్వచ్చు. వీటి నివారణకు వారానికి కనీసం రెండు రోజులైనా కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయాలి. అలాగే వీళ్లు ఆహారంలో మాంసకృత్తులు ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు ఒక కిలో శరీర బరువుకు 1.3 గ్రాముల ప్రోటీన్ అవసరం. శాకాహారులు ఆహారంతో లభించే మాంసకృత్తులు చాలకపోతే ప్రోటీన్ పొడర్లు తీసుకోవచ్చు.

మీ ఎల్‌డీఎల్ ఎంత?

చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) రక్తనాళాల్లో పూడికలు ఏర్పడేలా చేస్తుంది. గుండెపోటు, పక్షవాతం ముప్పు పెంచుతుంది. అందుకే దీన్ని మితిమీరకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. సాధారణంగా ఆరోగ్యవంతుల్లో ఎల్‌డీఎల్ 100ఎంజీ/డీఎల్ కన్నా తక్కువగా ఉండాలని డాక్టర్లు చెబుతుంటారు. అదే గుండెజబ్బులు గలవారికైతే 70ఎంజీ/డీఎల్‌కు మించకుండా చూసుకోవటమే



మంచిది. వీరిలో ఇది ఎంత తక్కువుంటే అంత ఎక్కువగా గుండెకు మేలు చేస్తున్నట్టు జామా పత్రికలో ప్రచురితమైన అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి. ప్రతి 39 ఎంజీ/డీఎల్ తగ్గదలతో గుండెపోటు ముప్పు సుమారు 20% వరకూ తగ్గినట్టు పరిశోధకులు గుర్తించారు. అంటే గుండెజబ్బు బాధితుల్లో ఎవరైనా ఎల్‌డీఎల్‌ను 70 నుంచి 31కి తగ్గించుకోగలిగితే తీవ్ర గుండెపోటు ప్రమాదం 20% తగ్గుతుందన్నమాట. ఇది 20 ఎంజీ/డీఎల్ వరకు తగ్గినా కాలేయం అస్తవ్యస్తం కావటం, కండరాల నొప్పులు, కొత్తగా మధుమేహం రావటం, రక్తస్రావం వంటి తీవ్ర దుష్ప్రభావాలేవీ కనిపించకపోవటం గమనార్హం.

భావోద్వేగాలూ సాంక్రమికమే!

ఎదుటివారు బాధపడుతుంటే మనమూ బాధపడతాం. దీన్ని ఒకరకంగా సాంక్రమిక భావోద్వేగం అనొచ్చు. ఇదేమీ చెడ్డది కాదు. కానీ రోజువారీ జీవితంలో, పనుల్లో అడ్డంకి కలిగిస్తుంటే మాత్రం ఆలోచించాల్సిందే. ఇది ఇతరులతో సంబంధ బాంధవ్యాలనూ ప్రభావితం చేయొచ్చు. ఇతరుల భావోద్వేగాలను, ప్రవర్తలను అనుసరించటం మనకు పుట్టుకతోనే అబ్బిన విద్య. ఎదుటివారి శరీర భంగిమ, ముఖ కవళికల వంటి వాటికి సరిపోయే మాట, సైగలతో స్పందించటం ద్వారానే మనం నేర్చుకోవటం మొదలెడతాం. ఎవరైనా ఆవలిస్తే మనకూ ఆవలింతలు వస్తుంటాయి కదా. ఇదీ అలాంటిదే. ఎవరైనా నవ్వుతున్నట్టు కనిపిస్తే మనమూ నవ్వుతుంటాం. అరిస్తే మనమూ అరుస్తాం. అదీ మనం ప్రతిస్పందించాల్సిన అవసరం లేకపోయినా. ఇలా చుట్టు పక్కలవారి ప్రవర్తనలను తేలికగా అనుసరిస్తుంటాం. సానుకూల దృక్పథం గలవారు దగ్గరలో ఉంటే మనమూ అలాగే ప్రవర్తిసాం. ప్రతికూల భావాలు, విచారం గలవారుంటే మనమూ దాన్నే అనుకరిస్తుంటాం. కాబట్టి సానుకూల దృక్పథం, ఆలోచనలు గలవారితో మెలగటం ఎంతైనా మంచిది. కొన్నిసార్లు ఇతరుల పట్ల జాలి, సానుభూతి చూపాల్సిన అవసరం ఏర్పడినా త్వరగా దాన్నుంచి బయటపడే నేర్పును అలవరచుకోవాలి.

నడుంనొప్పికి నడక మందు

నడుంనొప్పికి రకరకాల కారణాలే ఉండొచ్చు. ఇది తరచూ తిరగబెడుతుంటుంది కూడా. దీని విషయంలో చాలామందికి ఉపయోగపడే పరిష్కారం ఒకటుంది. అది చాలా తేలికైంది కూడా. ఏంటని అనుకుంటున్నారా? నడక! ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమేనని చెబుతున్నారు ఆస్ట్రేలియా పరిశోధకులు. రోజూ నడవటం ద్వారా నడుం నొప్పి తిరగబెట్టకుండా చూసుకోవచ్చని గుర్తించారు మరి. వారానికి 80 నుంచి 130 నిమిషాలు.. అంటే రోజుకు కేవలం 11 నుంచి 18 నిమిషాల సేపు నడిచినా నొప్పి తగ్గుతున్నట్టు తేలింది. నడుం నొప్పితో బాధపడుతున్నవారిని ఆరేళ్ల పాటు పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించారు. నడుం నొప్పి తిరగబెట్టటమనేది తొలిసారి అయిన గాయం నుంచి సంభవిస్తుంటుంది. వెన్నెముక స్థిరంగా ఉండటానికి తోడ్పడే కండరాల తీరు మారటం దీనికి కారణమవు తుంటుంది. విశ్రాంతి, నొప్పి మందుల వంటివి నొప్పి తగ్గటానికి తోడ్పడినా మళ్లీ తిరగబెడుతుంటుంది. దీంతో చాలామంది కదలటానికి భయపడుతుంటారు. దీంతో ఎముకలకు అంటుకొని ఉండే కండరాల ఆకృతులు మరింత దెబ్బతింటూ వస్తాయి. కదలికల ద్వారా దీన్ని నివారించుకోవచ్చు. ఇక్కడే నడక ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

పెద్దయ్యాకా ఉబ్బసం

ఉబ్బసాన్ని (ఆస్థమా) చాలావరకూ బాల్యంలో మొదలయ్యే సమస్యగానే భావిస్తుంటాం. కానీ ఇది కొన్నిసార్లు పెద్దయ్యాకా ఆరంభం కావొచ్చు. చిన్ననాటి ఆస్థమా లక్షణాలు పెరుగుతున్నకొద్దీ తగ్గుముఖం పట్టొచ్చు. పూర్తిగా వెనక్కు మళ్లొచ్చు కూడా. కానీ 'పెద్ద' ఉబ్బసం తీరే వేరు.

సాధారణంగా 20 ఏళ్లు పైబడ్డాక మొదలయ్యే దాన్ని పెద్దవారి ఆస్థమాగా భావిస్తారు. ఇవీ చిన్నప్పటి ఉబ్బసం లక్షణాలనే కలిగుంటాయి. కాకపోతే పెద్దవారిలో ఇవి తీవ్రంగా ఉంటాయి. చికిత్సలకూ అంత త్వరగా లొంగకపోవచ్చు. దీనికి ఒక కారణం- పెద్దవారు ఉబ్బసం లక్షణాలను నిర్లక్ష్యం చేయటం. ఆయాసం, దగ్గు వంటి వాటికి ఇతరత్రా జబ్బులు కారణం కావొచ్చని భావిస్తుండటం. దీంతో ఉబ్బసాన్ని గుర్తించటం, నిర్ధారించటం ఆలస్యమవుతుంది. ఫలితంగా ఊపిరితిత్తుల పనితీరు తగ్గుతూ వస్తుంటాయి. అందువల్ల ఆయాసం, దగ్గు, పిల్లికూతల వంటి లక్షణాలు కనిపిస్తుంటే ఆస్థమా కావొచ్చేమోనని అనుమానించి, డాక్టర్‌ను సంప్రదించటం మంచిది.



ప్రేరకాలు, జీవనశైలి అంశాలు

పెద్దయ్యాక ఆస్థమా ముప్పు పెరగటంలో రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి.

● కుటుంబంలో ఎవరికైనా ఉబ్బసం ఉన్నట్టయితే వచ్చే అవకాశముంది.

● సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చటం. ఇతరులు వదిలిన పొగను పీల్చినా ప్రమాదమే.

● అధిక బరువు, ఊబకాయం మూలంగా ఊపిరితిత్తుల పనితీరులో మార్పులు, వాపుప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ఎక్కువగా ఉండటం.

● మహిళల్లో గర్భం ధరించినప్పుడు, నెలసరి నిలిచినప్పుడు తలెత్తే హార్మోన్ల మార్పులూ ఉబ్బసాన్ని ప్రేరేపించొచ్చు.

● దుమ్ము, ధూళి, పుప్పొడి వంటివి పడకపోవటమూ ఆస్థమాకు బీజం వేయొచ్చు.

● తీవ్ర శ్వాసకోశ సమస్యలు, మాదక ద్రవ్యాలు, కొన్నిరకాల మందులూ ఉబ్బసానికి కారణం కావొచ్చు.

క్యాన్సర్‌పై ఎంఆర్‌ఎన్‌ఏ బాణం

ముున్ముందు క్యాన్సర్లకు సార్వత్రిక టీకా అందుబాటులోకి రానుందా? ప్రయోగాత్మక ఎంఆర్‌ఎన్‌ఏ టీకా అలాంటి ఆశలే రేకెత్తిస్తోంది. ఇది రోగనిరోధకశక్తిని తట్టిలేపి, కణితుల నిర్మూలనకు తోడ్పడుతున్నట్టు ఎలుకలపై చేసిన పరిశోధనలో తేలింది.



ఏదో ఒక కణితి ప్రొటీన్‌ను కాకుండా మొత్తంగా రోగనిరోధక వ్యవస్థనే పునరుత్తేజితం చేసి క్యాన్సర్లను బలహీన పరుస్తుండటం ఎంఆర్‌ఎన్‌ఏ టీకా ప్రత్యేకత. దీనికి ఇమ్యూన్‌థెరపీ మందులను జత చేయగా.. మొండి కణితులూ కుంచించుకుపోవటం గమనార్హం. కొన్ని ఎలుకల్లోనైతే కేవలం టీకానే క్యాన్సర్లను నిర్మూలించటం మరింత విశేషం. మెసెంజర్ ఆర్‌ఎన్‌ఏను పొట్టిగా ఎంఆర్‌ఎన్‌ఏ అని పిలుచుకుంటారు. కణితి కణాలతో పాటు అన్ని కణాల్లోనూ ఉండే ఇది ప్రొటీన్ ఉత్పత్తికి నమూనాగా తోడ్పడుతుంది. ఇక్కడే ఎంఆర్‌ఎన్‌ఏ క్యాన్సర్ టీకా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇప్పటివరకూ, క్యాన్సర్ టీకా అభివృద్ధికి రెండు పద్ధతులను అనుసరిస్తున్నారు. ఒకటి- క్యాన్సర్‌తో బాధపడుతున్న చాలామందిలో వ్యక్తమైన లక్ష్యాన్ని గుర్తించటం. రెండు- ఆయా క్యాన్సర్ బాధితుల్లోనే వ్యక్తమయ్యే లక్ష్యాల మీదే పనిచేసే టీకా తయారుచేయటం. తాజా అధ్యయనం విప్లవాత్మకమైన మూడో విధానానికి దారిచూపిస్తోంది. ప్రత్యేకించి క్యాన్సర్‌ను లక్ష్యంగా చేసుకోవటానికి బదులు బలమైన రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపించటం దీని ఉద్దేశం. ఇలా ఇది బలమైన క్యాన్సర్ నిరోధక ప్రతిచర్యను వెలికి తీస్తుంది. దీంతో ఇమ్యూన్‌థెరపీ మందులతో కణితుల మీద దాడి చేయటం సాధ్యమవుతుంది. కాబట్టే ఎక్కువమందికి ఉపయోగపడుతుంది.

నీళ్ల విరేచనాలు తక్షణమా? దీర్ఘకాలమా?

వానాకాలంలో వాగులు, వంకలు పొంగి పొర్లటం వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఎక్కువ. ఇది కొన్నిసార్లు నీళ్ల విరేచనాలకు (డయేరియా) దారితీయొచ్చు. చాలామంది అప్పుడప్పుడూ వీటి బారినపడుతూనే ఉంటారు. సాధారణంగా చికిత్స తీసుకున్నా, తీసుకోకపోయినా ఒకట్రెండు రోజుల్లో విరేచనాలు తగ్గుతాయి. కొందరికివి తీవ్రంగానూ పరిణమించొచ్చు. కొందరు దీర్ఘకాలంగానూ నీళ్ల విరేచనాలతో ఇబ్బంది పడుతుంటారు కూడా.



ఏడాది లోపు పిల్లల్లో, 65 ఏళ్లు పైబడిన వృద్ధుల్లో నీళ్ల విరేచనాలను తేలికగా తీసుకోవద్దు. వీరికి విరేచనాలతో ఒంట్లో నీటిశాతం తగ్గే (డీహైడ్రేషన్) ముప్పు ఎక్కువ. కొన్ని లక్షణాలతో దీన్ని గుర్తించొచ్చు.
☛ మూత్రం రంగు గాఢంగా మారటం. ☛ దాహం ఎక్కువగా వేయటం. ☛ కళ్లు లోపలికి పీక్కు పోవటం. ☛ చర్మం సాగే గుణం తగ్గటం. వేళ్లతో పట్టుకొని చర్మాన్ని పైకి లాగి వదిలితే, అలాగే ఉండిపోవటం.

ఇవి ఉంటే తీవ్రం

నీటి శాతం తగ్గటంతో పాటు వాంతులవుతుంటే మరింత ప్రమాదం. ఎందుకంటే వాంతుల మూలంగా తీసుకున్న ద్రవాలు బయటకు పోతుంటాయి. తీవ్రమైన జ్వరం, తల తిప్పటం, సొమ్మసిల్లటం, మలంలో రక్తం పడటం వంటివి కనిపించినా తీవ్రంగానే పరిగణించాలి. ఏ వయసువారికైనా మూడు రోజులైనా విరేచనాలు తగ్గకపోతే గృహ వైద్యం, చిట్కాలను పక్కనపెట్టి వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

ఇతరత్రా కారణాలు

కలుషిత ఆహారం, నీరు, ఇన్‌ఫెక్షన్లు మాత్రమే కాదు.. కొన్ని ఇతరత్రా కారణాలూ దీర్ఘకాల విరేచనాలకు దారితీయొచ్చు.

● టీ, కాఫీలోని కెఫీన్‌కు విసర్జన కలిగించే గుణముంటుంది. అందువల్ల ఇవీ నీళ్ల విరేచనాలకు కారణం కావొచ్చు. కెఫీన్‌తో కూడిన శీతల పానీయాలూ ఇలాంటి ప్రభావమే చూపిస్తాయి.

● చక్కెరకు బదులు కొన్ని పదార్థాలు, పానీయాల్లో సార్బిటాల్, మ్యానిటాల్, ల్యాక్టులోజ్, పెద్దమొత్తంలో ఫ్రక్టోజ్ కలుపుతుంటారు. వీటిని శరీరం శోషించుకోకపోవటం వల్ల పేగుల కదలికలు వేగంగా సాగుతాయి.

● కొందరికి కొన్నిరకాల పదార్థాలు పడవు. వీటిని జీర్ణం చేసుకోలేరు. ఉదాహరణకు- పాలు, గోధుమలను విచ్ఛిన్నం చేసే ఎంజైమ్‌లు అసలే లేకపోయినా, ఇవి తగినంతగా లేకపోయినా ఇబ్బంది కలిగిస్తుంది. ఇలాంటి ఆహారం పేగుల్లో ఎక్కువసేపు ఉండిపోతుంది. ఇది నీటిని ఆకర్షించి విరేచనాలు కలగజేయొచ్చు. ఈ సమస్య పుట్టుకతోనే ఉండొచ్చు లేదా తర్వాత అయినా తలెత్తొచ్చు.

● మద్యం కూడా పేగుల కదలికలను పెంచి, విరేచనాలకు కారణం కావొచ్చు. తరచూ మద్యం తాగుతుంటే పెద్దపేగులోని జిగురు పొర చికాకుకు గురవతుంది. వాపు ప్రక్రియ మొదలై దెబ్బతింటుంది. ఫలితంగా మంచి, చెడు బ్యాక్టీరియా మధ్య సమతుల్యత లోపిస్తుంది. వాచిన జిగురుపొర నీటిని గ్రహించుకోలేదు. ఇవన్నీ విరేచనాలు కలిగేలా చేస్తాయి.

కొన్నిసార్లు యాంటీబయాటిక్స్

నీళ్ల విరేచనాలకు కొన్నిసార్లు స్పష్టమైన కారణాలుండొచ్చు. ఉదాహరణకు బయటి తిండి.. ముఖ్యంగా వీధుల్లో అమ్మేవి తినటం, కలుషిత నీరు తాగటం వల్ల విరేచనాలు పట్టుకోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో జ్వరం, కడుపు నొప్పిని తగ్గించే మాత్రలతో పాటు యాంటీబయాటిక్ మందులూ అవసరమవుతాయి. ఓఆర్‌ఎస్ పొడి గానీ ఉప్పు, పంచదార గానీ కలిపిన నీళ్లు గానీ తరచూ తాగటం తప్పనిసరి.

అవసరమైతే పరీక్షలు

దీర్ఘకాలంగా విరేచనాలు పట్టుకున్నా, నెల పాటు విడవకుండా రోజుకు 3-4 సార్లు విరేచనాలు అవుతున్నా పరీక్షలు అవసరమవుతాయి. సాల్మోనెల్లోసిస్ వంటి బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ లేదా పేగుల్లో అమీబా వంటి పరాన్నజీవులు దీనికి కారణం కావొచ్చు. దీర్ఘకాలం యాంటీబయాటిక్, క్యాన్సర్ మందులు వాడటం వల్ల పేగు బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతినటంతోనూ విరేచనాలు పట్టుకోవచ్చు. మధుమేహం వంటి కొన్ని జీవనశైలి జబ్బుల్లో నాడులు దెబ్బతినటమూ వీటికి దోహదం చేయొచ్చు. హైపర్‌థైరాయిడిజమ్‌కు చికిత్స తీసుకోకపోయినా పేగుల కదలికలు ఎక్కువై విరేచనాలు ఇబ్బంది పెట్టొచ్చు. వీటిని గుర్తించటానికి పరీక్షలు తోడ్పడతాయి. సమస్యను గుర్తించి, చికిత్స తీసుకుంటే విరేచనాలూ తగ్గుతాయి.

పేగుపూతతో జాగ్రత్త

కొందరికి సీలియాక్ జబ్బు లేదా పేగుపూత (ఐబీఎస్) మూలంగానూ దీర్ఘకాల విరేచనాలు వేధించొచ్చు. పాల పదార్థాలు లేదా గోధుమలోని గ్లుటెన్ వంటివి పడకపోవటం దీనికి కారణం కావొచ్చు. కొన్నిసార్లు మలబద్ధకం, విరేచనాలు మార్చి మార్చి ఇబ్బంది పెట్టొచ్చు. అంటే కొద్దిరోజులు మలబద్ధకం, మరికొన్ని రోజులు విరేచనాలు తలెత్తొచ్చు. వీటితో పాటు కడుపు నొప్పి, కడుపు ఉబ్బరమూ ఉండొచ్చు. ఈ లక్షణాలు విడవకుండా వెంటాడుతూ వస్తుంటాయి కూడా. సుమారు 10-15% మంది పేగుపూతతో బాధపడుతున్నారని అంచనా. కొందరికి దీని లక్షణాలు వంశపారంపర్యంగానూ ఉండొచ్చు. దీన్ని పూర్తిగా నయం చేసే చికిత్స ఏదీ లేకపోవటం గమనార్హం. పాలు, పెరుగు, ఛీజ్, గోధుమ వంటివి తీసుకున్నప్పుడు విరేచనాలు ఎక్కువతున్నట్టు అనిపిస్తే వాటికి దూరంగా ఉండటం మేలు చేస్తుంది. నిత్య జీవనంలో కొన్ని మార్పులు చేసుకోవటం ద్వారా పేగుపూతను నియంత్రణలో ఉంచుకోవచ్చు.

● పేగుపూత గలవారు నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలి. రోజుకు కనీసం 3-4 లీటర్ల నీళ్లు తాగాలి.

● కెఫీన్ పరిమితం చేసుకోవాలి. టీ, కాఫీ, శీతల పానీయాలు తాగొద్దు.

● మద్యం జోలికి వెళ్లొద్దు.

● క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వారానికి కనీసం 150 నిమిషాల సేపు ఒక మాదిరి వ్యాయామం అవసరం.

● యోగా, ధ్యానం, ప్రాణాయామ పద్ధతులతో మానసిక ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవాలి.

● డాక్టర్ సూచించిన మందులు వాడుకోవాలి.

పండగల వేళ.. ఉద్యోగాల కళ



'సీజనల్' నియామకాల్లో ఇ-కామర్స్ సంస్థలు

ఈనాడు, హైదరాబాద్: దేశంలో పండగల సీజన్ ప్రారంభం కానుంది. చాలామంది కొనుగోళ్లకు ఇదే సరైన సమయంగా చూస్తుంటారు. దీనికి అనుగుణంగా ఇటు దుకాణాలతో పాటు, ఇ-కామర్స్ సంస్థలూ సీజనల్ ఉద్యోగులను నియమించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. దసరా, దీపావళి సందర్భంగా ఆన్‌లైన్ షాపింగ్‌కు గిరాకీ పెరుగుతుందన్న విషయం తెలిసిందే. ఈ గిరాకీకి తగినట్లుగా ఇ-కామర్స్ సంస్థలు లక్షలాది తాత్కాలిక ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. డెలివరీ (ఏజెంట్లు), వేర్‌హౌస్ (సహాయకులు), వినియోగదారుల సేవా కేంద్రం (సపోర్ట్ ఉద్యోగులు) తదితర విభాగాల్లో ఈ సీజనల్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. 2025లో ఈ ఉద్యోగాల సంఖ్య 15-20 శాతం పెరుగుతుందని అంచనా.

✦ అమెజాన్ ఈ పండగల సీజన్‌లో 1.5 లక్షల మందికి పైగా తాత్కాలిక ఉద్యోగులను తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ✦ ఫ్లిప్‌కార్ట్ కొత్తగా 2.2 లక్షల మందిని తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

✦ మీషో, జియోమార్ట్‌లు దాదాపు 3 లక్షల మందికి పైగా ఉద్యోగులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోబోతున్నట్లు తెలిపాయి.

1.19 కోట్లకు గిగ్ వర్కర్లు!

ఇవే కాకుండా క్విక్ కామర్స్ విభాగంలోనూ ప్రస్తుతం డెలివరీ ఏజెంట్లకు గిరాకీ పెరిగింది. జెప్టో, బ్లింకిట్ వంటి కంపెనీలూ ఆర్డర్ల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. 2025లో గిగ్ వర్కర్ల సంఖ్య 1.19 కోట్లకు చేరుకోవచ్చని అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 19.1 శాతం అధికమని నివేదికలు చెబుతున్నాయి.

చిన్న నగరాలు, పట్టణాల్లోనూ

ఈ ఏడాది గిగ్ వర్కర్ల నియామకాల్లో కొత్త పోకడలు కనిపిస్తున్నాయి. రెండు, మూడో శ్రేణి నగరాలు, చిన్న పట్టణాల్లోనూ గిరాకీ పెరుగుతుండటంతో ఇ-కామర్స్ సంస్థలు అక్కడ తాత్కాలిక ఉద్యోగులను తీసుకుంటున్నాయి. డార్క్ స్టోర్, ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాల్లో పనిచేసేందుకు మహిళా ఉద్యోగులనూ తీసుకుంటున్నాయి. ముఖ్యంగా పండగల సీజన్‌లో మహిళలను నియమించుకోవడం పెరిగింది. ఇందులో కొంతమందిని సీజన్ తర్వాతా సంస్థలు కొనసాగిస్తున్నాయి.

సిబ్బంది కోసం ఆశ్రయ్

ఇ-కామర్స్ సంస్థలకు కీలకమైన డెలివరీ సిబ్బంది కోసం అమెజాన్ సరికొత్త ఏర్పాటు చేసింది. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) భాగస్వామ్యంతో దేశ వ్యాప్తంగా 40 ప్రాంతాల్లో కొత్త 'ఆశ్రయ్' కేంద్రాలను ప్రారంభించింది. డెలివరీ ఏజెంట్లు పనిచేసే సంస్థతో నిమిత్తం లేకుండా ఎవరైనా వీటిని వినియోగించుకోవచ్చు. ఇందులో వారికోసం పలు సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని, విశ్రాంతి తీసుకునేందుకు వీలుంటుందని పేర్కొంది. ప్రస్తుతం 13 నగరాల్లో 65 కేంద్రాలున్నాయని, ఏడాది చివరికి వీటి సంఖ్య 100కు చేరుతుందని వెల్లడించింది.

గత ఏడేళ్లలో రెట్టింపైన మహిళల ఉద్యోగ రేటు

కార్మిక శాఖ గణాంకాలు

దిల్లీ: మన దేశంలో గత ఏడేళ్లలో మహిళల ఉద్యోగ రేటు దాదాపు రెట్టింపైంది. 2017-18లో 22 శాతంగా ఉన్న ఉద్యోగ రేటు.. 2023-24లో 40.3 శాతానికి చేరిందని కార్మిక శాఖ సోమవారం వెల్లడించింది. ఇదే సమయంలో నిరుద్యోగ రేటు 5.6 శాతం నుంచి 3.2 శాతానికి తగ్గింది. '2047 కల్లా వికసిత్ భారత్‌లో భాగంగా దేశంలోని ఉద్యోగాల్లో మహిళల వాటా 70 శాతానికి చేర్చడమే లక్ష్యమని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం.. మహిళా ఉద్యోగుల భాగస్వామ్య రేటు గణనీయంగా పెరిగిందని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ రేటు 96% వృద్ధి చెందగా.. పట్టణాల్లో ఇది 43% అధికమైంది.

✦ మహిళా పట్టభద్రుల్లో ఉద్యోగ రేటు 2013లోని 42 శాతం నుంచి 2024లో 47.53 శాతానికి చేరింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన మహిళల్లో ఉద్యోగ రేటు 34.5 శాతం నుంచి 40 శాతానికి పెరిగింది.

✦ ఇండియా స్కిల్స్ నివేదిక 2025 ప్రకారం.. 2024లో భారత పట్టభద్రులకు ఉద్యోగ రేటు 51.2 శాతం కాగా.. 2025లో ఇది దాదాపు 55 శాతానికి చేరనుంది.

✦ సంఘటిత రంగంలో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నట్లు పింఛను నిధి సంస్థ ఈపీఎఫ్‌ఓ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఏడేళ్లలో సంఘటిత రంగంలోకి 1.56 కోట్ల మంది మహిళలు వచ్చి చేరారు.

ఈనాడు బిజినెస్

హైదరాబాద్‌లో ఎం-నౌ సేవలు

ఈనాడు, హైదరాబాద్: దుస్తులు, ఇతర ఉత్పత్తుల ఇ-కామర్స్ సంస్థ మింత్రా తన స్పీడ్ డెలివరీ సేవ ఎం-నౌను హైదరాబాద్‌కు విస్తరిస్తున్నట్లు తెలిపింది. దీనిద్వారా 30 నిమిషాల్లోనే 500 పైగా బ్రాండ్‌ల నుంచి 8 వేలకు పైగా ఉత్పత్తులను అందించనుంది. ఇప్పటికే బెంగళూరు, ముంబయి, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇది అందుబాటులో ఉంది. హైదరాబాద్‌లో పెరుగుతున్న వినియోగదారుల అవసరాలను తీర్చేందుకు ఎం-నౌ దోహదం చేస్తుందని సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ షారన్ పైస్ తెలిపారు. మింత్రా డార్క్ స్టోర్ ఆధారిత ఫుల్‌ఫిల్‌మెంట్ మోడల్ ద్వారా వేగంగా డెలివరీ చేస్తామని పేర్కొన్నారు.

ఓయో విలువ రూ.61,000-70,000 కోట్లు!

నవంబరులో ఐపీఓకు దరఖాస్తు

దిల్లీ: అంతర్జాతీయ ట్రావెల్ టెక్ సంస్థ ఓయో నవంబరులో ఐపీఓ ముసాయిదా పత్రాలు దాఖలు చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సంస్థ విలువను 7-8 బిలియన్ డాలర్లు (సుమారు రూ.61,000-70,000 కోట్లు)గా లెక్కించి ఈ ఐపీఓకు రాబోతున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదనపై వచ్చే వారంలో బోర్డును సంప్రదించనున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. యాక్సిస్ బ్యాంక్, సిటీ బ్యాంక్, గోల్డ్‌మ్యాన్ శాక్స్, ఐసీఐసీఐ బ్యాంక్, జేఎం ఫైనాన్షియల్, జెఫ్రీస్ వంటి సంస్థలతో గత కొన్ని నెలలుగా సంప్రదింపులు జరిపిన సాఫ్ట్ బ్యాంక్.. మార్కెట్ సెంటిమెంటును అంచనా వేసి, నవంబరులో ముసాయిదా పత్రాలు దాఖలు చేయాలనుకుంటోందని తెలిసింది. ఓయో వాటాదార్లలో అతి పెద్ద వాటాదారుగా సాఫ్ట్ బ్యాంక్ ఉన్న సంగతి తెలిసిందే.

జీఎస్‌కే ఫార్మా నుంచి గైనకాలజికల్ కేన్సర్ల ఔషధాలు

ఈనాడు, హైదరాబాద్: జీఎస్‌కే (గ్లాక్సోస్మిత్‌క్లైన్) ఫార్మాసూటికల్స్ గైనకాలజికల్ కేన్సర్ల చికిత్స విభాగంలో అడుగుపెట్టింది. జెంపెర్లి (దోస్టార్లిమ్యాబ్), జెజులా (నిరపారిబ్) ఔషధాలను మనదేశంలో విడుదల చేసింది.



తీవ్రమైన ఎండోమెట్రియల్ కేన్సర్ బాధితులకు సెకండ్ లైన్ చికిత్స కోసం మనదేశంలో అనుమతించిన పీడీ-1 ఇమ్యునోథెరపీ ఔషధం జెంపెర్లి కావడం గమనార్హం. ఇదే విధంగా అండాశయ కేన్సర్‌లో అన్ని రకాలైన బయోమార్కర్‌లకు ఫస్ట్ లైన్ మోనోథెరపీగా జెజులా ఔషధాన్ని గుర్తించారు. మనదేశంలో మహిళల్లో గైనకాలజికల్ కేన్సర్ వ్యాధుల తీవ్రత పెరుగుతోంది. ఈ తరహా కేన్సర్లకు సమర్థమైన చికిత్సలను తాము ఆవిష్కరిస్తున్నట్లు జీఎస్‌కే ఇండియా ఎండీ భూషణ్ అక్షికర్ వివరించారు. స్థానికంగా ప్రత్యేక ఔషధాల శ్రేణిని విస్తరించడానికి తాము కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మనదేశంలో 50 ఏళ్ల వయసు పైబడిన మహిళల్లో గైనకాలజికల్ కేన్సర్ల ముప్పు పెరుగుతోందని జీఎస్‌కే ఇండియా మెడికల్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెండ్ షాలినీ మీనన్ అన్నారు. దీనికి తగిన పరిష్కారాలను ఆవిష్కరిస్తున్నామన్నారు.

హైదరాబాద్‌లో 'హిల్టన్' రెండో హోటల్

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సమీపంలో ఏర్పాటు



ఈనాడు, హైదరాబాద్: హిల్టన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ హైదరాబాద్‌లో మరో హోటల్‌ను ఏర్పాటు చేయనుంది. 'హిల్టన్ హైదరాబాద్ గచ్చిబౌలి' పేరుతో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సమీపంలో దీన్ని ప్రారంభించనుంది. 304 గదులతో 2029 జనవరి నాటికి ఇది అందుబాటులోకి వస్తుంది. శ్రీవెంకటేశ్వర హోటల్స్ అండ్ కన్వెన్షన్ భాగస్వామ్యంతో ఈ హోటల్‌ను నెలకొల్పుతున్నట్లు హిల్టన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ వెల్లడించింది. ఈ సంస్థ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో హిల్టన్ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్ అండ్ స్పా అనే పేరుతో త్వరలోనే ఒక హోటల్‌ను ప్రారంభించనున్న విషయం తెలిసిందే. ఐటీ, బయోటెక్నాలజీ రంగాల్లో ఎంతో వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో తమ రెండో హోటల్ అందుబాటులోకి రానుందని హిల్టన్ దక్షిణాసియా సీనియర్ ఉపాధ్యక్షుడు జుబిన్ సక్సేనా అన్నారు. ఈ హోటల్లో రెస్టారెంట్లు, ఎగ్జిక్యూటివ్ లాంజ్, బిజినెస్ సెంటర్, స్పా, బాల్ రూమ్స్‌లాంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు.

భారత రుణ రేటింగ్‌లో మార్పుల్లేవ్: ఫిచ్



దిల్లీ: భారత సార్వభౌమ రుణ రేటింగ్‌ను 'బీబీబీ-' వద్ద యథాతథంగా ఫిచ్ రేటింగ్స్ ఉంచింది. బలమైన వృద్ధి, విదేశీ రుణాల లభ్యతతో భవిష్యత్ స్థిరంగా ఉండొచ్చని అంచనా వేసింది. భారత్‌పై అమెరికా ప్రతిపాదించిన 50 శాతం సుంకాల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన దేశ వృద్ధి 6.5 శాతానికి స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని తెలిపింది. 'పోటీ దేశాలతో పోలిస్తే భారత భవిష్యత్ అంచనాలు బలంగా ఉన్నాయి. గత రెండేళ్లలో ఆర్థిక జోరు నెమ్మదించినప్పటికీ మెరుగ్గానే ఉంది' అని ఫిచ్ పేర్కొంది. అత్యంత తక్కువ పెట్టుబడి రేటింగ్‌గా 'బీబీబీ-'ను ఇస్తారు. ఈ నెల ప్రారంభంలో భారత రుణ రేటింగ్‌ను 'బీబీబీ'కి ఎస్ అండ్ పీ పెంచిన విషయం తెలిసిందే. గత 18 ఏళ్లలో భారత రేటింగ్‌ను ఎస్ అండ్ పీ పెంచడం ఇదే మొదటిసారి. మరో అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మార్నింగ్ డీబీఆర్ఎస్ కూడా ఈ ఏడాది మేలో భారత రేటింగ్‌ను బీబీబీకి పెంచింది. నిర్మాణాత్మక సంస్కరణలను ఇందుకు కారణంగా తెలిపింది.

ఔషధాలన్నింటికీ ఒకే జీఎస్‌టీ రేటు!

కేంద్ర ప్రభుత్వానికి ఫార్మాగ్జిల్ సూచన

ఈనాడు, హైదరాబాద్: తుది ఔషధాలు (ఫార్ములేషన్లు), ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్)పై ఒకే జీఎస్‌టీ రేటు ఉండాలని ఫార్మాగ్జిల్ (ఫార్మాసూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్) కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం తుది ఔషధాలపై 12 శాతం జీఎస్‌టీ, ఏపీఐ ఔషధాలపై 18 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు.



తుది ఔషధాలను 5 శాతం జీఎస్‌టీ శ్లాబుకు మార్చి ఏపీఐ ఔషధాలను 18 శాతం జీఎస్‌టీలో కొనసాగిస్తే ఔషధ తయారీ సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటాయని, మూలధన నిధులపై ఒత్తిడి పెరుగుతుందని ఫార్మాగ్జిల్ వైస్‌ఛైర్మన్ భవిన్ మెహతా తెలిపారు. ఫార్ములేషన్లు, ఏపీఐ ఔషధాలకు ఒకే జీఎస్‌టీ రేటు వర్తింపజేయడమే దీనికి పరిష్కారమని పేర్కొన్నారు. జీఎస్‌టీ రీఫండ్ ఆలస్యం అయితే ఆ మొత్తంపై వడ్డీ చెల్లించాలని, రీఫండ్ వచ్చే లోపు ఆయా సంస్థల అవసరాలకు రుణసదుపాయం కల్పించాలని సూచించారు. ఈ మార్పులతో మన దేశంలో ఆరోగ్య రంగం వృద్ధి బాటపడుతుందని అభిప్రాయపడ్డారు. జీఎస్‌టీ శ్లాబు రేట్లను 5, 18 శాతానికి మార్చాలనే ప్రతిపాదన ఉన్న విషయం విదితమే.

ఎన్‌మొబిలిల్‌కు 6 మి.డాలర్ల నిధులు

ఈనాడు, హైదరాబాద్: సప్లై చైన్ టెక్నాలజీ సేవల్లో నిమగ్నమై ఉన్న అంకుర సంస్థ, ఎన్‌మొబిలిల్‌కు సిరీస్-ఏ ఫండింగ్ కింద 6 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.52.51 కోట్లు) నిధులు లభించాయి. సోరిన్ ఇన్వెస్ట్‌మెంట్స్ సారథ్యంలో మరికొన్ని ఇతర పెట్టుబడి సంస్థలు ఈ నిధులు సమకూర్చాయి. ఏఐ టెక్నాలజీ సామర్థ్యాన్ని పెంచుకోవడం, అంతర్జాతీయ మార్కెట్లకు విస్తరించడం, అదనపు సిబ్బందిని నియమించడానికి ఈ నిధులు కేటాయించనున్నట్లు ఈ సంస్థ వివరించింది. ఎన్‌మొబిలిల్‌ను రవి బులుసు, నంద కిషోర్, వెంకట మాగంటి 2015లో ప్రారంభించారు. డిమాండ్ అంచనా, పంపిణీ ప్రణాళిక, పూర్తిస్థాయి పర్యవేక్షణతో కూడిన సప్లై చైన్ సేవలను ఈ సంస్థ అందిస్తోంది. దీనికి ఏఐ టెక్నాలజీని వినియోగిస్తోంది.

అదానీ గ్రీన్ ఎనర్జీ రేటింగ్ పెంపు

దిల్లీ: అదానీ గ్రీన్ ఎనర్జీ రేటింగ్‌ను 'ఏఏ-' నుంచి 'ఏఏ/స్థిరత్వం'గా మెరుగుపరుస్తున్నట్లు కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ వెల్లడించింది. మార్కెట్‌లో అగ్రస్థానం, బలమైన నిర్వహణ సామర్థ్యాలు, నిర్వహణ, ఆర్థిక అంశాలు ఇందుకు దోహదం చేసినట్లు పేర్కొంది. జూన్ 30 నాటికి అదానీ గ్రీన్ ఎనర్జీ నిర్వహణలో 15.8 గిగావాట్‌గా ఉంది. ఇందులో 70 శాతం సౌర, 13 శాతం పవన, 17 శాతం హైబ్రిడ్ ఆస్తులు ఉన్నాయి.

కోడి గుడ్లు

26న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	540
గోదావరి	535
విశాఖపట్నం	535
చిత్తూరు	558


వృద్ధిని విస్మరించడం లేదు: ఆర్‌బీఐ గవర్నర్



ముంబయి: టారిఫ్ అనిశ్చితులు, భౌగోళిక సమస్యల కారణంగా తలెత్తిన సవాళ్లను ఎదుర్కొనేందుకు కార్పొరేట్లు, బ్యాంకులు కలిసికట్టుగా పెట్టుబడులకు ఊతమివ్వాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. వృద్ధి అంశాలను ఆర్‌బీఐ విస్మరించడం లేదని స్పష్టం చేశారు. వార్షిక ఫిబాక్ కార్యక్రమంలో మాట్లాడుతూ 'ప్రస్తుతం అమెరికా, భారత వాణిజ్య ప్రతినిధులపై ఆశావహంగా ఉన్నాం. వీటి నుంచి వచ్చే నిర్ణయంతో దేశీయ ఆర్థిక వ్యవస్థపై టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చు' అని పేర్కొన్నారు. మన ఆర్థిక వ్యవస్థలో కొన్ని వర్గాలపై ఒత్తిడి పడితే రంగం ఆధారిత సాయం అందిస్తామని మల్హోత్రా హామీ ఇచ్చారు. ద్రవ్యోల్బణం, వృద్ధి పరిస్థితులను పరిగణనలోకి తీసుకునే ద్రవ్యపరపతి విధానం ఉంటుందన్నారు.

ఎం అండ్ ఏ రుణాలకు ఆర్‌బీఐని సంప్రదిస్తాం

ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి



ముంబయి: నమోదిత సంస్థల విలీనాలు, కొనుగోళ్ల (ఎం అండ్ ఏ)కు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ఆర్‌బీఐ అనుమతిని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) కోరనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. వినియోగం పెంచడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందని, సామర్థ్యాల విస్తరణ కోసం పెట్టుబడులను ప్రారంభించాల్సిందిగా ప్రైవేట్ రంగాన్ని ఆయన కోరారు. నమోదిత సంస్థ కొనుగోళ్లు పారదర్శకంగా ఉంటాయని, వాటాదార్ల అనుమతి ఉంటుందని, దీంతో ముందుగా వీటితో ప్రారంభించడానికి ఆర్‌బీఐకు అధికారికంగా విజ్ఞప్తి చేయనున్నట్లు వివరించారు. ప్రస్తుతం కార్పొరేట్ రంగం మూలధన వ్యయాలను అంతర్గత సమీకరణలు, ఈక్విటీ, డెట్ మార్కెట్ నుంచి తీసుకుంటోందన్నారు.

ఇండస్‌ఇండ్ ఎండీ, సీఈఓగా రాజీవ్ ఆనంద్ బాధ్యతల స్వీకరణ




దిల్లీ: ప్రైవేట్ రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఎండీ, సీఈఓగా రాజీవ్ ఆనంద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల ప్రారంభంలో ఆయన నియామకానికి బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది. ఆగస్టు 25 నుంచి మూడేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారని ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో బ్యాంకు పేర్కొంది. ఈ ఏడాది మార్చిలో బ్యాంకులో ఆర్థిక అవకతవకలు వెలుగులోకి వచ్చిన తర్వాత, ఆర్‌బీఐ ఆదేశాల మేరకు కార్యకలాపాల నిర్వహణ నిమిత్తం ఒక కమిటీని బోర్డు ఏర్పాటు చేసింది. ఆనంద్, యాజమాన్య బృందం, బోర్డు కలిసి పనిచేస్తుందని బ్యాంక్ ఛైర్మన్ సునీల్ మెహతా తెలిపారు.

బీఓఎంలో తగ్గనున్న ప్రభుత్వ వాటా

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో దఫా నిధుల సమీకరణ తర్వాత 25% కనీస ప్రజా వాటా నిబంధనలను పాటించగలమని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) ఎండీ, సీఈఓ నిధు సక్సేనా ధీమా వ్యక్తం చేశారు. మరోసారి వాటా విక్రయం ద్వారా మూలధన నిధుల లభ్యత, ప్రభుత్వ వాటా తగ్గేందుకు వీలు పడుతుందన్నారు. ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ నిర్వహించిన ఫిబాక్ 2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం.. బ్యాంకు దాదాపు రూ.2000-2500 కోట్లు సమీకరిస్తే.. ప్రభుత్వ వాటా 75 శాతం దిగువకు చేరుతుంది. ప్రస్తుతం బీఓఎంలో ప్రభుత్వానికి 79.6 శాతం వాటా ఉంది. 2026 ఆగస్టు 1కి 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనను అందుకోవాల్సిందిగా 5 ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆర్థిక శాఖ ఇప్పటికే ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలకు 2026 ఆగస్టు వరకు సెబీ సమయం ఇచ్చింది.

ఏఐతో బ్యాంకింగ్‌లో మార్పులొస్తాయ్

- సగం హోదాలకు పునర్నిర్వచనం ఇవ్వాల్సిందే
- ఐటీ వ్యయాలు పెరిగినా.. ఉత్పాదకత కొంతే: బీసీజీ నివేదిక



ముంబయి: కృత్రిమ మేధ(ఏఐ) కారణంగా ఉద్యోగాలపై ప్రభావం పడుతుందన్న ఆందోళనల మధ్య బ్యాంకింగ్ రంగంలో ఏఐ ప్రభావంపై బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. భారతీయ బ్యాంకింగ్ రంగంలో సగం హోదాల్లో పూర్తి మార్పు రానుంది. ఆ నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు..

✦ బ్యాంకులు తమ ఐటీ వ్యయాలను దాదాపు అయిదింతలు పెంచినా కూడా ఉత్పాదకతలో ప్రయోజనాలు పరిమితంగానే ఉన్నాయి.

✦ భారత బ్యాంకుల వాస్తవ ఉత్పాదకత ప్రయోజనాలు కేవలం 1 శాతంగానే కనిపించాయి. అంతర్జాతీయ బ్యాంకులతో పోలిస్తే ఈ విషయంలో భారత బ్యాంకులు వెనకబడి ఉన్నాయి.

✦ ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ఏఐని అందిపుచ్చుకోవడం వల్ల బ్యాంకులకు మద్దతు లభించొచ్చు. చాలా బ్యాంకులు ఇప్పటికే అటువంటి టూల్స్‌ను అందిపుచ్చుకుంటున్నాయి.

✦ బ్యాంకులు ఈ కొత్త తరం సాంకేతికతలను ధైర్యంగా అందిపుచ్చుకుంటే 35-50 శాతం ఉద్యోగాల్లో భారీ మార్పులు కనిపించొచ్చు. అయితే అందుకు తమ వ్యయ నిర్మాణాల నుంచి బయటకు రావాల్సి ఉంటుంది.

✦ ఐటీ వంటి రంగాల్లో ఏఐ వల్ల ఉద్యోగాలకు సవాళ్లు వచ్చినట్లుగానే బ్యాంకుల్లోనూ నికర ఉద్యోగుల వృద్ధి తగ్గింది. సాంకేతికత నేపథ్యంలో పాత హోదాలను కొత్త వాటితో భర్తీ చేయడానికి బ్యాంకులు ప్రాధాన్యం ఇవ్వడమే ఇందుకు నేపథ్యం.

✦ కొత్తగా రుణం తీసుకునే వారి వాటా 2% మేర తగ్గుతూ వస్తోంది. 100 కోట్ల భారత యువతలో కేవలం మూడొంతుల మంది సమాచారమే క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీల వద్ద ఉంది. ఏటా 2-3 శాతం మేరే అదనంగా జత చేరుతూ వెళితే మరింత సమయం పట్టొచ్చు.

కొత్త జీఎస్‌టీ రేట్లను త్వరగా అమలు చేస్తేనే పండగ


లేదంటే విక్రయాలు తగ్గుతాయ్: ఫాడా

దిల్లీ: విజయదశమి, దీపావళి సందర్భంగా ఎంతో మంది కార్లు కొనాలనే ఆలోచనతో ఉంటారు. ఇదే సమయంలో డీలర్లూ తమ షోరూములను కొత్త కార్లతో నింపుతుంటారు. ఏడాది మొత్తంలో ఈ సీజనే వారికి ఆసక్తిగా ఉంటుంది. కానీ, కొత్త వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) నేపథ్యంలో కొనుగోలుదారులు తమ నిర్ణయాన్ని వాయిదా వేసుకునే అవకాశం కనిపిస్తోందని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌కు ఈ మేరకు లేఖ రాసింది. సాధ్యమైనంత తొందరగా కొత్త జీఎస్‌టీని అమలు చేయాలని ఇందులో కోరింది.

కేంద్రం ప్రతిపాదించిన కొత్త జీఎస్‌టీ ప్రకారం 5, 18 శాతం శ్లాబులే ఉండనున్నాయి. కొన్ని లగ్జరీ కార్లపై ఇప్పుడు ప్రత్యేక రేటు 40 శాతం విధిస్తున్నారు. ప్రస్తుతం ఆటోమొబైళ్లపై 28 శాతం జీఎస్‌టీ ఉంది. దీనిపై 1-22 శాతం వరకూ కాంపెన్సేషన్ సెస్ కూడా విధిస్తారు. చిన్న పెట్రోల్ కార్లపై 29 శాతం, ఎస్‌యూవీలపై 50 శాతం వరకూ పన్ను పడుతోంది. విద్యుత్ వాహనాలకు మాత్రం 5 శాతం పన్ను వర్తిస్తోంది.

డీలర్ల ఆవేదన ఏమిటంటే..: కొత్త జీఎస్‌టీ అమల్లోకి వస్తే కార్ల ధరలు తగ్గుతాయని కొనుగోలుదారులు వేచి చూస్తున్నారు. ఇది పండగ సీజన్ విక్రయాలను దెబ్బతీసే అవకాశం ఉందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి సమయంలో గిరాకీ పెరిగే అవకాశం ఉంది. కానీ, అప్పటి వరకూ డీలర్లకు ఆర్థిక ఒత్తిడి ఎదురవుతుందని లేఖలో ఫాడా వివరించింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి తీసుకునే స్వల్పకాలిక రుణాలు సాధారణంగా 45-60 రోజుల వ్యవధితో ఉంటాయి. అమ్మకాలు ఆగిపోతే, డీలర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడతారని తెలిపింది. జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించి, కొత్త జీఎస్‌టీ అమలు చేయాలని కోరింది.

ఫెడ్ రేట్ల కోతపై ఆశతో..



ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2,466.24 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.3,176.69 కోట్లు

సెన్సెక్స్ ▲329 **81636** | నిఫ్టీ ▲98 **24968**

సమీక్ష

ఐటీ, వాహన షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతుతో సోమవారం సూచీలు లాభపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) రేట్ల కోతకు దిగొచ్చనే ఆశతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో ర్యాలీ కనిపించింది. ఇది మన మార్కెట్లు పెరిగేందుకు కూడా దోహదం చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 4 పైసలు పెరిగి 87.56 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.34 శాతం పెరిగి 67.96 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు సానుకూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా కదలాడాయి.

✦ బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.37 లక్షల కోట్లు పెరిగి, రూ.455.02 లక్షల కోట్ల (5.21 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 81,501.06 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,306.85 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. 81,364.86 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసినా, ఇంట్రాడేలో 81,799.06 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 329.06 పాయింట్ల లాభంతో 81,635.91 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 97.65 పాయింట్లు పెరిగి 24,967.75 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,021.55-24,894.35 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 19 లాభపడ్డాయి. ఇన్ఫోసిస్ 3.03%, టీసీఎస్ 2.85%, హెచ్‌సీఎల్ టెక్ 2.60%, టెక్ మహీంద్రా 1.52%, టాటా మోటార్స్ 0.95%, టైటన్ 0.89%, సన్ ఫార్మా 0.84%, మారుతీ సుజుకీ 0.75%, టాటా స్టీల్ 0.66%, బజాజ్ ఫైనాన్స్ 0.65% చొప్పున పెరిగాయి. బీఈఎల్ 0.76%, ఏషియన్ పెయింట్స్ 0.46%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.21% నష్టపోయాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే బీఎస్‌ఈ ఫోకస్డ్ ఐటీ 2.35 శాతం, ఐటీ 2.34 శాతం, టెక్ 1.67 శాతం, వాహన 0.51 శాతం మేర పెరిగాయి. భారీ యంత్ర పరికరాలు, టెలికాం, పారిశ్రామిక, ఆర్థిక సేవల రంగాలు క్షీణించాయి. బీఎస్‌ఈలో 1,888 షేర్లు సానుకూలంగా, 2,309 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 189 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

✦ ఆన్‌లైన్ గేమింగ్ సంబంధిత సంస్థలపై ప్రతిపాదిత నిషేధంతో నజారా టెక్నాలజీస్ షేరు 3.46 శాతం తగ్గి రూ.1,115.80 వద్ద స్థిరపడింది. 4 రోజుల్లో సుమారు 20 శాతానికి పైగా నష్టపోయింది.

✦ షేర్ల బోనస్, విభజన ప్రతిపాదనలకు వెల్‌క్యూర్ అండ్ ఫార్మస్యూటికల్ బోర్డు ఆమోదం తెలిపింది. 10 ఈక్విటీ షేర్లకు ఒక షేరును బోనస్‌గా ఇవ్వనుంది. అలాగే రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరును రూ.1 ముఖ విలువ కలిగిన 10 షేర్లుగా విభజించనుంది.

✦ మార్పిడి రహిత డిబెంచర్ల జారీ ద్వారా రూ.3,000 కోట్ల వరకు నిధులను సమీకరించబోతున్నట్లు హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హడ్కో) నియంత్రణ సంస్థలకు సమాచారమిచ్చింది.


✦ 2026 మార్చికల్లా భారత్‌లో హానర్ స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి ప్రారంభిస్తామని పీఎస్ఏవీ గ్లోబల్ (హానర్ బ్రాండ్ పార్ట్‌నర్) సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సీపీ ఖండేల్‌వాల్ వెల్లడించారు. తొలి ఏడాది 1 శాతం మార్కెట్ వాటా పొందడంతో పాటు సుమారు రూ.2,500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలనుకుంటున్నట్లు తెలిపారు.

✦ అగ్ని ప్రమాదాలు, వరదలు, భూకంపాలు తదితర 20కి పైగా ప్రమాదాలకు కవరేజీ ఇచ్చేలా కొత్తగా గృహ బీమా ఉత్పత్తిని ప్రారంభించినట్లు ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పే వెల్లడించింది.

✦ 7 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు రూ.4,805 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని జేకే సిమెంట్ సోమవారం తెలిపింది.

ఈనాడు సినిమా

కొత్త కథ విన్నారా?


రజనీకాంత్

అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌తో నాగ్‌అశ్విన్ సినిమా చేయబోతున్నారా? అందుకు సంబంధించి కథా చర్చలు కూడా మొదలయ్యాయా? - ఇప్పటివరకూ అధికారికంగా ఎలాంటి సమాచారమైతే లేదు కానీ, తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో మాత్రం దీని గురించి జోరుగా చర్చ జరుగుతోంది. 'కల్కి 2898 ఎ.డి'తో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న నాగ్ అశ్విన్ తదుపరి సినిమా కూడా 'కల్కి'కి కొనసాగింపుగానే ఉంటుందనేది ఇప్పటివరకూ ఉన్న సమాచారం. ఆయన కూడా అదే చెప్పారు. అయితే ఇప్పుడు దానికి ప్రత్యామ్నాయంగా మరో సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నారని, ప్రభాస్ చేయాల్సిన సినిమాలు కూడా చాలా ఉండటంతోనే నాగ్‌అశ్విన్ మరో కథని బయటికి తీశారని ప్రచారం సాగుతోంది. ఇదే నిజమైతే నాగ్ అశ్విన్ వరుసగా కమల్‌హాసన్, రజనీకాంత్‌లతో సినిమాలు చేసినట్టు అవుతుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఎ.డి' సినిమాలో కమల్‌హాసన్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

ముంగిస లాంటి వ్యక్తి... ఇన్‌స్పెక్టర్ జెండే



"ఎంత విషపూరితమైన పాము అయినా సరే.. ముంగిస దెబ్బకు కిందపడాల్సిందే. నేను కూడా అలాంటి వ్యక్తినే" అని అంటున్నారు మనోజ్ బాజ్‌పేయీ. ఇదంతా తన రాబోయే సినిమా 'ఇన్‌స్పెక్టర్ జెండే' గురించే. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. ఓం రౌత్ నిర్మాణంలో చిన్మయ్ మండేక్లర్ దీన్ని తెరకెక్కించారు. జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను "మధుకర్ జెండే సీక్రెట్ మిషన్ ప్రారంభమైంది" అనే వ్యాఖ్యతో ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది నెట్‌ఫ్లిక్స్. స్విమ్‌సూట్ కిల్లర్‌గా పేరుగాంచిన కార్ల్ భోజరాజ్‌ను పట్టుకున్న పోలీసు అధికారి మధుకర్ జెండే జీవితాధారంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఆసక్తికర సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్‌లో పోలీసు అధికారిగా కనిపిస్తూ ప్రేక్షకుల్లో నవ్వులు పూయిస్తున్నారు మనోజ్. సెప్టెంబరు 5న రానుందీ చిత్రం.

తెరపైకి 'ది ఫేబుల్'

మనోజ్ బాజ్‌పేయీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'జుగ్నుమా' (ది ఫేబుల్). రామ్ రెడ్డి దర్శకత్వం వహించారు. గతేడాది పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకుంది చిత్రం. ఇప్పుడు దీన్ని నిర్మాత గునీత్ మోంగా, అనురాగ్ కశ్యప్ తెరపైకి తీసుకురావడానికి సిద్ధమయ్యారు. తాజాగా ఈ విషయాన్ని తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ సందర్భంగా గునీత్ మోంగా మాట్లాడుతూ.. "ఈ చిత్రం నన్ను కలవర పెట్టింది. ఓదార్చింది. చాలా అద్భుతంగా, ఉన్నతంగా ఉంది. అందుకే మీ అందరికీ చూపించడానికి ముందుకొచ్చాను. సెప్టెంబరు 12 థియేటర్లలో విడుదల కానుందీ చిత్రము"ని తెలిపింది. దీపక్ డోబ్రియాల్, ప్రియాంక బోస్, తిలోత్మా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

భాగస్వామి కావాలా మీకు?


డయానా, తమన్నా

'డు యూ వాన్నా పార్ట్‌నర్?' అని అడుగుతోంది అందాల తార తమన్నా. మరి ఈమేంటి పార్ట్‌నర్ గురించి మాట్లాడుతుందని అనుకుంటున్నారా? అయితే దీని గురించి పూర్తిగా తెలుసుకోవాల్సిందే. వైవిధ్యమైన పాత్రలతో, ప్రత్యేక పాటలతో కుర్రకారుని అలరిస్తోన్న ఈ భామ.. ఓటీటీ వేదికగా కూడా సత్తా చాటుతోంది. ఇప్పుడామె మరో కొత్త వెబ్‌సిరీస్‌తో రాబోతుంది. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ 'డు యూ వాన్నా పార్ట్‌నర్'. డయానా పెంటీ కీలక పాత్ర పోషించింది. తాజాగా ఈ సిరీస్‌ను ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో. గంగోపాధ్యాయ, నిశాంత్ నాయక్ రూపొందించారు. ఇద్దరు యువతుల స్నేహం, వారు ఎదుర్కొన్న సవాళ్లు తదితర అంశాలతో దీన్ని రూపొందించారు. ఈ కామెడీ డ్రామా వెబ్‌సిరీస్ సెప్టెంబరు 12న రానుంది.

"ఆద్యంతం యాక్షన్ కోణంలో సాగే సినిమా 'ఘాటి'. ఇది క్రిష్ మార్క్ డ్రామాతోనూ నిండి ఉంటుంది" అన్నారు నిర్మాత రాజీవ్ రెడ్డి. ఆయన.. సాయిబాబు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించారు. అనుష్క ప్రధాన పాత్రలో నటించారు. విక్రమ్ ప్రభు, చైతన్య రావు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా సెప్టెంబరు 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు నిర్మాత రాజీవ్ రెడ్డి.


రాజీవ్

అనుష్కకున్న ప్రేక్షకాదరణ అలాంటిది

● "ఇది అరకు - ఒడిశా సరిహద్దుల్లో జరిగే కథ. గంజాయి అక్రమ రవాణా ప్రధానాంశంగా ఉంటుంది. అనుష్క నటన మరోస్థాయిలో ఉంటుంది. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. ప్రేక్షకులకు కనులవిందుగా ఉంటుంది. మేము ఈ చిత్రం కోసం ఒడిశాలోని ఓ మారుమూల గ్రామంలో షూట్ చేశాం. అక్కడ చిత్రీకరణ జరిగినన్ని రోజులు అనుష్కను చూడటానికి ఆమె ఉన్న హోటల్‌కు వేలాదిగా జనం వచ్చేవారు. ఆ జన సమూహాన్ని నియంత్రించడానికి రెండు మూడుసార్లు లాఠీ ఛార్జ్ కూడా అయింది. అనుష్కకు దేశవ్యాప్తంగా ఆ స్థాయి ప్రేక్షకాదరణ ఉంది. ఈ 'ఘాటి' కథకు పార్ట్ 2 చేసే అవకాశం ఉంది. ప్రేక్షకులు దీన్ని విజయవంతం చేస్తే అప్పుడు రెండో భాగం గురించి ఆలోచిస్తాం".

● "ప్రస్తుతం మా బ్యానర్‌లో వరుణ్ తేజ్ - మేర్లపాక గాంధీ కలయికలో ఓ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇప్పటికే 80శాతం చిత్రీకరణ పూర్తయింది. 'అరేబియన్ కడలి' సిరీస్ రెండో సీజన్‌కు సంబంధించి స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. అమెజాన్ కోసమే ఓ ఒరిజినల్ ఫిల్మ్ చేయనున్నాం. మరికొన్ని కథలు స్క్రిప్ట్ దశలో ఉన్నాయి".

ఇప్పుడు ఏ హీరోకి ఆ కంఫర్ట్ జోన్ లేదు


నారా రోహిత్

ఇటీవలే 'భైరవం' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించారు నారా రోహిత్. ఇప్పుడాయన హీరోగా 'సుందరకాండ'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన ఈ సినిమా బుధవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు నారా రోహిత్.

◆ "దర్శకుడు వెంకటేశ్ నాతో ఈ కథాలోచన పంచుకున్నప్పుడు కంగారు పడ్డాను. ప్రేక్షకులు ఎలా తీసుకుంటారో అనిపించింది. ఆ టైమ్‌లోనే వచ్చిన 'బ్రో డాడీ' చిత్రం ఓ కొత్తదారి చూపించింది. అందులోని అంశం కాస్త ఇబ్బందికరమైనదే అయినా దాన్ని చాలా అందంగా డీల్ చేశారు. ఆ స్టైల్‌లో చేస్తే మా కథ కచ్చితంగా నచ్చుతుంది అనిపించింది. ఆ తర్వాత వెంకటేశ్ పూర్తి స్క్రిప్ట్‌ను సిద్ధం చేసి తీసుకురాగా ఇంకా బాగా నచ్చింది".

◆ "ఓ సినిమా చూసేటప్పుడు ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఉంటారో.. ఓ కథ వినేటప్పుడు నేనూ అలాగే ఉంటా. స్క్రిప్ట్ వినూత్నంగా ఉందనిపిస్తే కచ్చితంగా దాన్ని ముందుకు తీసుకెళ్తా. నిజానికి నేనెక్కువ పాజిటివ్ పాత్రల్ని ఇష్టపడుతుంటా. కానీ ఎవరైనా అద్భుతమైన ప్రతినాయక పాత్రను రాసి తీసుకురాగలిగితే కచ్చితంగా నటించే ప్రయత్నమూ చేస్తా. ఇప్పుడు ఏ హీరోకైనా ఒకప్పుడు ఉన్నంత కంఫర్ట్ జోన్ లేదు. గతంలో ఓ విజయం దక్కిందంటే నాలుగైదు సినిమాల దాకా ఊపిరి తీసుకోగలిగే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు అలాంటి అవకాశం లేదు".

◆ "ఈ సినిమా చూస్తున్నంత సేపూ ప్రేక్షకుల ముఖాల్లో నవ్వులు కనిపిస్తూనే ఉంటాయి. ఇందులో నా పాత్రకు కొన్ని పరిమితులుంటాయి. 30ఏళ్లు దాటినా తనకు కావాల్సిన ఐదు లక్షణాలున్న అమ్మాయి దొరకలేదని పెళ్లి చేసుకోకుండా ఉండటం.. అలాంటి అమ్మాయి కోసం వెతకడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది".

పరదా.. తెలుగులో ఓ సాహసోపేతమైన అడుగు


విజయ్, అనుపమ, ప్రవీణ్ కండ్రేగుల

"కమర్షియల్ చిత్రంలో వెయ్యి తప్పులున్నా పట్టించుకోరు. కానీ, నాయికా ప్రాధాన్య చిత్రాల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంద"ని నటి అనుపమ పరమేశ్వరన్ అన్నారు. 'పరదా'ని ఓ ప్రయోగాత్మక చిత్రంగా పేర్కొంటూనే కొందరు అందులో తప్పులు వెతుకుతున్నారని తెలిపారు. ఈ చిత్ర విషయంలో తాము పడిన కష్టాన్ని గుర్తిస్తే చాలని.. దీన్ని ప్రోత్సహిస్తే ఇలాంటి కొత్త కంటెంట్ చిత్రాలు మరిన్ని వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనుపమ ప్రధాన పాత్రధారిగా ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించిన చిత్రమే 'పరదా'. విజయ్ డొంకాడ, పీవీ శ్రీనివాసులు, శ్రీధర్ మక్కువ నిర్మించారు. సంగీత, దర్శన రాజేంద్రన్ కీలక పాత్రధారులు. ఈ సినిమా ఇటీవల విడుదలైన సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో థ్యాంక్ యూ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ.. "తెలుగు సినిమాలో ఓ సాహసోపేతమైన అడుగు 'పరదా'. ఈ సినిమా చేసినందుకు గర్వపడుతున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, రాగ్ మయూర్, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సినిమాలకి పెద్ద అభిమానిని

– ప్రముఖ హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ జె.జె.పెర్రీ


యశ్

పాన్ ఇండియా స్థాయిలో అలరించిన 'కె.జి.ఎఫ్' చిత్రాల తర్వాత యశ్ కథానాయకుడిగా 'టాక్సిక్' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచస్థాయిలో ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఈ చిత్రం రూపొందుతోంది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలపై వెంకట్ కె.నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ అంచనాలతో పట్టాలెక్కిన ఈ సినిమాలో హాలీవుడ్ స్థాయిలో యాక్షన్ ఘట్టాల్ని రూపొందిస్తున్నారు. అందుకోసం 'జాన్ విక్', 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్', 'డే షిఫ్ట్' తదితర చిత్రాలకి పని చేసిన ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ జె.జె.పెర్రీ రంగంలోకి దిగారు. ఇప్పటికే ఆయన హాలీవుడ్ బృందాన్ని తీసుకొచ్చి, కొన్ని యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించారు. త్వరలో 45 రోజులపాటు సాగే ఓ కీలకమైన షెడ్యూల్‌లో మరి కొన్ని యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కించనున్నారు. అందుకోసం కేవలం భారతీయ బృందం మాత్రమే పనిచేయనుందట. జె.జె.పెర్రీ తన బృందాన్ని పక్కనపెట్టి, ఓ భారతీయ బృందంతో సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారని సినీ వర్గాలు తెలిపాయి. ఈ సన్నివేశాల గురించి జె.జె.పెర్రీ స్పందిస్తూ... "నా 35 ఏళ్ల కెరీర్‌లో 39 దేశాల్లో పనిచేశా. భారతీయ సినిమాలకి పెద్ద అభిమానిని. ఎంతో సృజనాత్మకంగా కళాత్మకంగా రూపొందుతుంటాయి భారతీయ సినిమాలు. ఈ సంస్కృతి, నాగరికత ఎంతో గొప్పది. నేను ఇదివరకు చేసిన పోరాట ఘట్టాలతో పోలిస్తే ఎంతో వినూత్నంగా ఉండేలా ప్రయత్నిస్తున్నా" అన్నారు.

తల్లిదండ్రులు కాబోతున్న పరిణీతి-రాఘవ్



నటిగా, గాయకురాలిగా ప్రేక్షకులకు చేరువయ్యింది బాలీవుడ్ కథానాయిక పరిణీతి చోప్రా. భిన్నమైన కథలతో మెప్పించే ఈమె 2023లో రాజకీయ నాయకుడు రాఘవ్ చద్దాతో ఏడడుగులు వేసిన సంగతి తెలిసిందే. తాజాగా వీరిద్దరూ తల్లిదండ్రులు కాబోతున్నామంటూ ఓ తీపి కబురు వినిపించారు. 'మా చిన్ని ప్రపంచం.. త్వరలో మా జీవితాల్లోకి రాబోతుంది" అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఈ విషయాన్ని పంచుకున్నారీ దంపతులు. 'కిల్ దిల్', 'గోల్‌మాల్ అగైన్', 'కేసరి' లాంటి హిట్ చిత్రాల్లో నటించిన పరిణీతి.. గతేడాది 'అమర్ సింగ్ చమ్కీలా'తో తెరపై సందడి చేసింది.

పంట పొలాలతో ఓ ప్రేమ కథ


గీత్ సైని

"ప్రేక్షకులకు ఏమాత్రం బోర్ కొట్టకుండా.. వాళ్ల పెదవులపై చిరునవ్వులు చెదరనీయకుండా రూపొందించిన ప్రేమకథా చిత్రం 'కన్యాకుమారి'. ఇది కచ్చితంగా ఓ మంచి సినిమాగా అందరి మదిలో నిలిచిపోతుంది" అన్నారు నిర్మాత బన్నీవాస్. శ్రీచరణ్ రాచకొండ, గీత్ సైని జంటగా నటించిన ఈ చిత్రాన్ని సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. నటి మధు షాలిని సమర్పిస్తున్నారు. ఇది ఈనెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. బన్నీ వాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ చిత్రం నేను చూశా. చాలా నిజాయతీగా తీశారు. పంట పొలాలతో ఓ ప్రేమ కథను చెప్తూ వెళ్లిన విధానం నాకు బాగా నచ్చింది" అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీచరణ్, గీత్ సైని, మధు షాలిని తదితరులు పాల్గొన్నారు.

పురాణాలకు వర్తమానాన్ని ముడిపెడితే..!


విజయ్‌పాల్

"మంచి సినిమాలు రావడం లేదన్న విసుగుతో ఉన్నారు ప్రేక్షకులు. వాళ్లు కోరుకుంటున్నట్టుగా ఓ కొత్త కథని చెప్పాలి... ఓ కొత్త అనుభూతిని పంచాలనే లక్ష్యంతోనే 'త్రిబాణధారి బార్బరిక్' చిత్రం చేశామ"న్నారు విజయ్‌పాల్ రెడ్డి అడిదల. ఆయన వానర సెల్యూలాయిడ్ పతాకంపై నిర్మించిన చిత్రమిది. సత్యరాజ్, ఉదయభాను, వశిష్ఠ ఎన్.సింహా, సత్యం రాజేశ్ కీలక పాత్రలు పోషించారు. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. ప్రముఖ దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా విజయ్‌పాల్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "నేటి తరానికి పురాణపాత్రల గురించి అంతగా తెలియదు. పురాణాల్లోని బార్బరికుడి అస్త్రంతో వర్తమాన సంఘటనల్ని ముడిపెట్టి తీసిన సినిమానే ఇది. ఆద్యంతం థ్రిల్లింగ్‌గా.. తెలుగు ప్రేక్షకులు కోరుకునే వాణిజ్యాంశాలతో సాగుతుంది. రహస్యంగా వరంగల్, విజయవాడలో ప్రత్యేక ప్రదర్శనల్ని ఏర్పాటు చేసి చాలామందికి ఈ సినిమాని చూపించాం. చాలామంది కన్నీళ్లు పెట్టుకున్నారు. సత్యరాజ్, ఉదయభాను, సత్యంరాజేశ్, వశిష్ఠ, సాంచీరాయ్ ఇలా ప్రతి పాత్ర ఎంతో బలంగా ఉంటుంది. మారుతి సహా ప్రతి ఒక్కరం ఈ సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం. ఏదో ఒకటి తీయాలనుకోవడం లేదు. మా సంస్థలో బలమైన కథలతోనే ముందుకెళుతున్నాం" అన్నారు.

ఓటీటీలో ఈ వారం

కొత్త వారం వచ్చేసింది. ప్రేక్షకులకు ఈవారం రెట్టింపు వినోదాన్ని పంచుతూ వైవిధ్యమైన కథలతో అలరించడానికి ఓటీటీలు కూడా సిద్ధంగా ఉన్నాయి. అదిరిపోయే సినిమాలు, థ్రిల్ చేసే సిరీస్‌లతో ఈ వారమంతా సినీప్రియుల్ని ఎంటర్‌టైన్ చేయడానికి కొత్త కథల్ని అందుబాటులోకి తీసుకొచ్చాయి.



యుద్ధం మొదలైంది

యుద్ధం ఇప్పుడే మొదలైందంటూ ఇటీవలే 'కింగ్‌డమ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన ప్రధాన పాత్రలో గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. థియేటర్లలో అలరించిన ఈ సినిమా ఇప్పుడు బుధవారం నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో సందడి చేయడానికి సిద్ధమైంది. అన్నదమ్ముల చుట్టూ తిరిగే గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రమిది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో సత్యదేవ్ కీలక పాత్ర పోషించారు.

యవ్వన ప్రేమలోని మధుర జ్ఞాపకాలు



తను మనసు ఇచ్చిన వారికి నచ్చే విధంగా ఉండాలని అందంగా తయారవుతూ.. కొత్త కొత్త బట్టల్లో మెరిసిపోతూ తమలో ఉన్న లోపాల్ని సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తుంటారు చాలా మంది ప్రేమికులు. ఇప్పుడీలానే ఓ అమ్మాయి తన ఉంగరాల జుట్టుని సిల్కీగా మార్చుకోవాలని అనుకుంటోంది. ఆమె కథే 'లవ్ అన్‌టాంగిల్డ్'. నామ్ కూంగ్ సన్ దర్శకత్వం వహించారు, గాంగ్ మ్యుంగ్, షిన్ యున్ సూ, చా వూ-మిన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. యవ్వన ప్రేమలోని మధుర జ్ఞాపకాలు అంటూ ఇటీవలే విడుదలైన ట్రైలర్‌తో ఆకట్టుకున్న ఈ సినిమా శుక్రవారం నెట్‌ఫ్లిక్స్‌లో రావడానికి సిద్ధమైంది.

'గెవి' న్యాయ పోరాటం



సర్వైవల్ థ్రిల్లర్‌గా, న్యాయపోరాటం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'గెవి'. ఈ తమిళ చిత్రానికి దయాలన్ దర్శకత్వం వహించారు. షీలా, జాక్వెలిన్ లిడియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా మంచి హిట్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడిది బుధవారం నుంచి సన్‌నెక్స్ట్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. సమాజంలో అణచివేతకు గురై, జీవన పోరాటాన్ని సాగిస్తున్న అణగారిన వర్గాలు హక్కుల కోసం చేసే పోరాటం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. అణచివేత కారణంగా వారి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయి? అనే ఆసక్తికర కథాంశంతో దీన్ని తీర్చిదిద్దారు.


థండర్‌బోల్ట్స్ (సినిమా)
బుధవారం | జియోహాట్‌స్టార్


ది టెర్మినల్ లిస్ట్: డార్క్ వోల్ఫ్ (సిరీస్)
బుధవారం | అమెజాన్ ప్రైమ్


ఫాంటసీ ఫుట్‌బాల్ రాయండ్ అవర్ లైవ్స్ (సినిమా)
బుధవారం | నెట్‌ఫ్లిక్స్


మాయకూతు (సినిమా)
బుధవారం | సన్‌నెక్స్ట్


మై లైఫ్ విత్ ది వాల్టర్ బాయ్స్ 2 (సిరీస్)
గురువారం | నెట్‌ఫ్లిక్స్


ది థర్స్ డే మర్డర్ క్లబ్ (సినిమా)
గురువారం | నెట్‌ఫ్లిక్స్


ది క్రోనికల్ ఆఫ్ ది 4.5 గ్యాంగ్ (సిరీస్)
శుక్రవారం | సోనీలివ్


సాంగ్స్ ఆఫ్ ప్యారడైజ్ (సినిమా)
శుక్రవారం | అమెజాన్ ప్రైమ్


టూ గ్రేవ్స్ (సిరీస్)
శుక్రవారం | నెట్‌ఫ్లిక్స్

ఎన్ని వింతలో ఈ ప్రేమలో!


'గుస్తాఖ్ ఇష్క్'

"సంతోషంలో ఉన్నప్పుడు ఏడుస్తారు.. బాధలో ఉన్నప్పుడు నవ్వుతారు. ఏంటో.. ఈ ప్రేమలో ఎన్ని వింతలున్నాయో అర్థమే కావు" అంటూ 'గుస్తాఖ్ ఇష్క్' సినిమా ప్రపంచాన్ని పరిచయం చేసింది చిత్రబృందం. బాలీవుడ్ నాయిక ఫాతిమా సనా షేక్, విజయ్ వర్మ జంటగా నటిస్తున్నారు. విభు పూరి దర్శకుడు. మనీశ్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. 80ల కాలం నాటి పీరియాడికల్ ప్రేమకథగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు టీజర్‌తో స్పష్టం చేసింది చిత్రబృందం. నసీరుద్దీన్ షా, షరీబ్ హష్మీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా నవంబరులో థియేటర్లలోకి రానున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

పరమాణువుల కేంద్రకం నుంచి విడుదలయ్యే శక్తిని అణుశక్తి అంటారు. ఈ శక్తి కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం అనే రెండు రకాల చర్య ద్వారా విడుదలవుతుంది. భారతదేశం అణుశక్తిని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని ప్రయత్నిస్తూనే, మానవాళి భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అణు ఇంధన సామర్థ్యాన్ని పెంచేందుకు బడ్జెట్‌లోనూ తగిన కేటాయింపులు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న సామర్థ్యాన్ని అంచెలంచెలుగా పెంచేందుకు చర్యలు చేపడుతోంది.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

నియంత్రణలో విద్యుత్.. అది కోల్పోతే విధ్వంసం!

అణు శక్తి

కేంద్రక విచ్ఛిత్తి

యురేనియం లాంటి రేడియోధార్మిక పదార్థాల కేంద్రకాన్ని ఒక న్యూట్రాన్ ఢీకొడితే అది రెండు ముక్కలుగా విడిపోతూ కొంత శక్తిని విడుదల చేస్తుంది. ఈ చర్యను కేంద్రక విచ్ఛిత్తి అంటారు. ఈ చర్య నియంత్రణలో జరిగితే, దీని ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ఇలా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పరికరాలను అణు రియాక్టర్లు అంటారు. ఇదే చర్య అనియంత్రితంగా జరిగితే విధ్వంసానికి దారితీస్తుంది.

ఉదా: అణ్వాయుధాలు

కేంద్రక సంలీనం

తేలికైన కేంద్రకాలు కలిసి భారకేంద్రకంగా మారే ప్రక్రియను కేంద్రక సంలీనం అంటారు. ఈ చర్య జరగాలంటే అధిక ఉష్ణోగ్రతలు అవసరం. సాధారణంగా సంలీన చర్యలు నక్షత్రాల్లో జరుగుతూ ఉంటాయి. కేంద్రక సంలీన చర్య ద్వారా సూర్యుడి నుంచి శక్తి నిరంతరాయంగా విడుదలవుతోంది. ఈ చర్యను నియంత్రించే ప్రక్రియను ఇప్పటి వరకు ఎవరూ కనుక్కోలేదు.

✦ హైడ్రోజన్ బాంబు విస్ఫోటనం జరిగినప్పుడు కేంద్రక సంలీన చర్య జరుగుతుంది. స్థిరమైన శక్తిని ఉత్పత్తి చేయడానికి కేంద్రక చర్యలు ఎంతగానో దోహదపడతాయి. కానీ సరిగ్గా నియంత్రించలేకపోతే అవి మానవ వినాశనానికి కారణమవుతాయి. ఇలాంటి శక్తి సంక్షోభాన్ని నివారించడానికి ముందస్తు ప్రణాళిక చాలా అవసరం.

అణు రియాక్టర్లు

నియంత్రిత కేంద్రక విచ్ఛిత్తి చర్య ద్వారా పనిచేసే రియాక్టర్లు ఆధునిక ప్రపంచానికి విద్యుత్ అవసరాలు తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

▮ భారత్‌లో మొట్టమొదటి అణు రియాక్టర్ అప్సర. దీన్ని 1956లో బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్‌లో ఏర్పాటు చేశారు.

▮ డాక్టర్ హోమీ జహంగీర్ బాబాను భారతదేశ అణుశక్తి పితామహుడిగా పేర్కొంటారు. భారత్ తన స్వశక్తితోనే అణు రియాక్టర్లను ఏర్పాటు చేసుకోగలదని విశ్వసించారు.

▮ 1945లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్‌ను ఏర్పాటు చేసి ఆ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించారు. 1956లో బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్)ను ఏర్పాటు చేసి ప్రయోగాలు మొదలుపెట్టారు. ఈయన స్ఫూర్తి నేటికీ అణుశక్తి రంగంలో శాస్త్రవేత్తలను ముందుకు నడిపిస్తోంది.

▮ అణు రియాక్టర్లకు కావాల్సిన ముఖ్యమైన ఖనిజ వనరులు యురేనియం, ప్లూటోనియం, థోరియం మొదలైనవి. దేశంలో మిగతా అణు ఇంధనాల కంటే థోరియం నిలువలు అధికంగా ఉన్నాయి. ▮ ఝార్ఖండ్ రాష్ట్రంలోని జాదూగూడ యురేనియం నిల్వలకు ప్రసిద్ధి. ఇటీవల ఇక్కడ కనిపెట్టిన నిల్వలు మరో 50 ఏళ్లపాటు దేశీయ అవసరాలకు సరిపోయేలా ఉన్నాయని శాస్త్రవేత్తల అంచనా.

▮ ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని తుమ్మలపల్లెలో యురేనియం నిల్వలు గుర్తించారు. వీటిని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (UCIL) వారి ఆధ్వర్యంలో వెలికితీస్తున్నారు.

▮ పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం అణుశక్తికి తగినంత ప్రాధాన్యమిస్తూ 2025 - 26 కేంద్ర బడ్జెట్‌లో దీనికి పెద్దపీట వేసింది.

కేంద్ర బడ్జెట్‌లోని ప్రతిపాదనలు:

2047 నాటికి దేశ అణు ఇంధన సామర్థ్యం 100 GW ఉండాలని భారత్ సంకల్పించింది. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. శక్తి వనరుల రంగంలో స్వావలంబన, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం లాంటి ఆశయాలతో దీన్ని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా స్వదేశీ అణు సాంకేతికత, పబ్లిక్ ప్రైవేట్ సమ్మేళనంలో ఈ ప్రగతి సాధించాలని నిర్ణయించారు.

న్యూక్లియర్ ఎనర్జీ మిషన్

చిన్న తరహా అణు రియాక్టర్లు (SMR) ఏర్పాటు చేయడానికి కావాల్సిన పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం దీని ముఖ్య ఉద్దేశం. 2033 నాటికి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన కనీసం అయిదు చిన్నతరహా అణు రియాక్టర్లు పనిచేసేలా చర్యలు తీసుకునేలా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి అంచనా వ్యయం కింద రూ.20,000 కోట్లు కేటాయించారు.

❖ వికసిత్ భారత్ కోసం అణుశక్తి మిషన్ భావనతో ఈ పథకం తీసుకువచ్చారు. దేశ భవిష్యత్ ఇంధన అవసరాల కోసం అణుశక్తి కీలకమని గుర్తించడమే ఈ మిషన్ ప్రాముఖ్యతకు కారణం.

❖ ఈ మిషన్‌లో ముఖ్యంగా స్వదేశీ అణు సామర్థ్యాన్ని పెంపొందించడం, పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ పద్ధతిలో చిన్నతరహా అణు రియాక్టర్లను ఏర్పాటు చేస్తారు. ఇందుకు అనుగుణంగా ఈ మిషన్ సక్రమ అమలుకు అడ్డంకిగా భావిస్తున్న అణుశక్తి చట్టానికి, అణుశక్తి కారణంగా జరిగే నష్టాలకు బాధ్యులను చేసే చట్టానికి సవరణ చేయాలని సంకల్పించారు. ఫలితంగా ప్రైవేట్ రంగం నుంచి మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతారని అంచనా.

న్యూక్లియర్ ఎనర్జీ మిషన్ – ప్రైవేట్ భాగస్వామ్యం:

న్యూక్లియర్ ఎనర్జీ మిషన్‌లో భాగంగా భారత ప్రభుత్వం ప్రైవేట్ రంగంలోని వ్యక్తులు లేదా సంస్థలతో భాగస్వామ్యం చేసుకుని కింది మూడు అంశాలపై దృష్టిసారిస్తోంది. అవి:

1. భారత్ చిన్న రియాక్టర్లను (BSR) ఏర్పాటు చేయడం.
2. SMR ల ఏర్పాటుకు పరిశోధనా, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం.
3. అణుశక్తిలో నూతన సాంకేతికత పరిశోధనలను అభివృద్ధి చేయడం.

భారత్ చిన్న రియాక్టర్లు: 220 MW సామర్థ్యంతో పనిచేసే ప్రెజరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లే బీఎస్ఆర్. వీటికి చాలా తక్కువ విస్తీర్ణం సరిపోతుంది. కాబట్టి వీటిని సులభంగా పెద్దపెద్ద పరిశ్రమల్లో అంతర్భాగంగా ఏర్పాటు చేసుకోవచ్చు.

ఉదా: ఉక్కు కర్మాగారాలు, లోహ సంబంధిత కర్మాగారాలు.

☛ ప్రభుత్వం చిన్న రియాక్టర్ల కోసం ప్రైవేట్ సంస్థలకు స్థలం, కావాల్సిన నీటి వనరులు, మూలధనాన్ని సమకూరుస్తుండగా, భారత అణుశక్తి సంఘం (NPCL) బి.ఎస్.ఆర్ నమూనా, దాని నిర్వహణ, కావాల్సిన సాంకేతికతను అందజేస్తోంది.

చిన్నతరహా రియాక్టర్లు (స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు – SMR): చిన్న రియాక్టర్లతో పాటు చిన్నతరహా రియాక్టర్లను ఏర్పాటు చేయాలని బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ సంకల్పించింది. దేశంలోని థోరియం నిల్వలను ఉపయోగించుకుని, మారుమూల ప్రాంతాల్లోనూ అణు విద్యుత్ ఉత్పత్తి చేయాలని వీటిని అభివృద్ధి చేస్తోంది. దీనికి భారత అణుశక్తి శాఖ సహకారం అందిస్తోంది.

◆ ఈ చిన్నతరహా అణు రియాక్టర్లు 30 MW నుంచి 300 MW వరకు శక్తిని ఉత్పత్తి చేస్తాయి. వీటి వినియోగంతో సంప్రదాయ అణు రియాక్టర్ల మాదిరిగా అధిక స్థలం, మూలధన పెట్టుబడి అవసరం ఉండదు.

భారత అణుశక్తి సామర్థ్యం – కేంద్ర ప్రభుత్వ చర్యలు: ప్రస్తుతమున్న 8180 MW సామర్థ్యాన్ని 2031 - 32 ఆర్థిక సంవత్సరం నాటికి 22,480 MW పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రమిస్తోంది. ఇందులో భాగంగా 8 వేల మెగావాట్ల సామర్థ్యంతో 10 రియాక్టర్లను ఏర్పాటు చేయనుంది. వీటిని గుజరాత్, రాజస్థాన్, తమిళనాడు, హరియాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్నారు. మరో 10 రియాక్టర్లను 2031 - 32 నాటికి ఏర్పాటు చేసేలా ప్రయత్నిస్తోంది.

◆ అమెరికా సహకారంతో శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో 6 × 1208 MW అణు విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

753 Word of the Day

Paucity

Telugu meaning: కొరత, లోపం

English meaning: The word paucity (పాసిటీ) is a noun that refers to the presence of something in very small or insufficient amounts.

Synonyms: Scarcity, Shortage

Antonyms: Abundance, Plenty

Usage: **1.** The paucity of job opportunities in the village forced many to migrate to cities.

2. There was a noticeable paucity of evidence to support the claims made in the report.

Latest Updates

Posts in BSF

Directorate of General Border Security Force (BSF) is conducting interviews for the Specialist and General Duty Medical Officer posts in various departments on contractual basis. The total no.of posts is 29. Interviews conducted from September 1 to 3.

Office Assistant Jobs in Central Bank of India

Central Bank of India, Samajik Utthan Awam Prashikshan Sansthan (CBI-SUAPS) in Chhattisgarh is inviting applications for the recruitment of Office Assistant posts on a contractual basis. The total no.of posts is 7. The last date for offline application is 4 September 2025.

Apprentice Posts In NPCIL

Nuclear Power Corporation of India Limited (NPCIL) in Uttar Pradesh is inviting applications for the ITI Trade, Diploma, Graduate Apprentice posts in various departments. The total No.of posts is 70. Last Date for Online applications is 2nd September 2025.

Did You Apply..?

Today (August 26) is the last date for the following Jobs

☛ SBI Recruitment 2025 : Junior Associates - 6,589 posts. ***Qualification:*** Graduation.

☛ Junior Technical Assistant posts in HCSL. ***Eligibility:*** Diploma (Mechanical, Electrical).

☛ 63 Supervisor Jobs in NABARD Consultancy Services. ***Eligibility:*** Bachelor's Degree.

☛ 417 Manager Jobs in Bank of Baroda. ***Eligibility:*** Degree.

☛ 32 Jobs in Airport Authority of India. ***Eligibility:*** Diploma, Degree, PG.

For more information and other notifications - scan QR code

హిమాలయ పర్వతాల్లో ఎత్తయిన శిఖరాలు


స్టడీ జోన్

భారతదేశానికి ఉత్తరాన పెట్టని కోటలా హిమాలయాలు ఉన్నాయి. యురేసియా (లారెన్షియా) భూభాగం, గోండ్వానా భూభాగం ఢీకొనడం వల్ల సంపీడన బలాలు ఏర్పడి టెథిస్ మహాసముద్ర స్థానంలో ఇవి ఏర్పడ్డాయి. సుమారు 30 - 50 మిలియన్ సంవత్సరాల కిందట టెర్షియరీ భౌమకాలంలో ఇవి ఆవిర్భవించాయి. ఇవి ప్రపంచంలోనే అతి తక్కువ వయసు ఉన్న ముడత పర్వతాలు. వీటినే నవీన/తరుణ ముడత పర్వతాలు అంటారు.

✦ ఈ ముడుతలు పడిన నిక్షేపాలు అంతర్జనిత శక్తుల వల్ల పైకి నెట్టుకువచ్చి మొదట ప్రస్తుతం మనకు కనిపించే ఎత్తయిన శ్రేణులు ఏర్పడ్డాయి. తర్వాత మధ్య భాగం, ఆ తర్వాత వాటి దక్షిణంగా ఉన్న పర్వత శ్రేణులు ఏర్పడ్డాయి. 90 - 120 మీ. ఎత్తున్న శివాలిక్ కొండలు హిమాలయాల దిగువన ఉండటం వల్ల వీటిని పర్వతపాద హిమాలయాలు అంటారు. 25 వేల సంవత్సరాలకు పూర్వం గంగా, సింధూ మైదానాలు ఏర్పడ్డాయి.

✦ హిమాలయాలు ఏర్పడిన కాలంలోనే దక్షిణాన ద్వీపకల్ప భాగం అగ్నిపర్వత ప్రక్రియకు లోనవడంతో శిలాద్రవం పైకి వచ్చి చాలా ఎత్తయిన స్వరూపంగా ఏర్పడింది. ఈ విధంగా ఏర్పడిన శిలాద్రవం క్రమంగా కోతకు గురై నునుపుగా ఉండే పడమటి కనుమలు రూపొందాయి. భారత భూభాగాన్ని అయిదు ముఖ్య స్వాభావిక మండలాలుగా విభజించవచ్చు. అవి హిమాలయ పర్వత ప్రాంతం, గంగా - సింధూ మైదానం, ద్వీపకల్ప పీఠభూమి, తీరప్రాంత మైదానాలు, దీవులు.

✦ హిమాలయాలు దేశానికి పశ్చిమ దిశలో జమ్మూ నుంచి తూర్పున అరుణాచల్‌ప్రదేశ్ వరకు 2,400 కి.మీ. పొడవు కలిగి పశ్చిమాన 500 కి.మీ., తూర్పున 200 కి.మీ. వెడల్పుతో 5 లక్షల చ.కి.మీ. వైశాల్యంతో భారత్, చైనా, భూటాన్ నేపాల్, పాకిస్థాన్ దేశాల్లో విస్తరించి ఉన్నాయి.




✦ హిమాలయాలను హిమాద్రి (6,100 మీటర్లు), హిమాచల్ (4,500 మీటర్లు), శివాలిక్ (900 మీటర్లు) అనే మూడు సమాంతర హిమాలయాలుగా వర్గీకరించారు.

✦ ప్రపంచంలో అత్యంత ఎత్తయిన శిఖరాలన్నీ దాదాపు హిమాలయాల్లోనే ఉన్నాయి.

హిమాలయాల్లో ఎత్తయిన శిఖరాలు - అవి ఉన్న ప్రదేశాలతోపాటు.. పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - పర్యావరణ సమస్యలు

వ్యర్థ నిర్వహణ - తాజా అంశాలు



ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా జనాభా రోజురోజుకూ పెరిగిపోతుంటే మరోవైపు భూమిపై పలురకాల వ్యర్థ పదార్థాలు పేరుకుపోతున్నాయి. అత్యంత వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ కారణంగా కాలుష్యం అధికమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో వ్యర్థ నిర్వహణ కోసం అనేక కార్యక్రమాలను రూపొందించి, అమలు చేస్తున్నా విడుదలవుతున్న వ్యర్థాలతో పోలిస్తే వాటి నిర్వహణ అంతంత మాత్రమే. వ్యర్థాల నిర్వహణ కోసం భారత్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, రూపొందించిన చట్టాలు మొదలైన అంశాలపై పోటీ పరీక్షా అభ్యర్థులకు అవగాహన అవసరం.

భారతదేశంలో మురుగు నీటి నిర్వహణ

మన దేశంలో ప్రతి రోజూ సుమారు 33 వేల మిలియన్ లీటర్ల మురుగునీరు విడుదలవుతోంది. ఈ మురుగు నీటిలో కొంత శాతమే శుద్ధి చేస్తున్నారు. దీనికి కారణం, భారతదేశ పట్టణాలు, నగరాల మురుగునీటి నిర్వహణ సామర్థ్యం 18.6% మాత్రమే.

భారత్‌లో ఇ–వేస్ట్ మేనేజ్‌మెంట్

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలు అంటే ఇ-వ్యర్థాలను తిరిగి వినియోగించడానికి లేదా వేరొక వస్తువులు తయారు చేయడానికి రిఫర్బిష్‌మెంట్ లేదా రిపేరింగ్ ప్రక్రియలకు వినియోగించని వ్యర్థాలను ఇ-వేస్ట్‌గా పరిగణిస్తారు.

ఇ-వేస్ట్ వ్యర్థాల నిర్వహణకు కార్యాచరణ, వేస్ట్ టు వెల్త్, భారతదేశంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ, కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



Indian shooters Arjun Babuta and Elavenil Valarivan clinched a gold medal in the 10m Air Rifle mixed team event at the 16th Asian Shooting Championship in Shymkent, Kazakhstan on 23 August 2025. The duo defeated China's Peng Xinlu and LU Dingke by 17-11 in the final.



US President Donald Trump nominates Sergio Gor as the new US ambassador to India and special envoy for South and Central Asian Affairs on 23 August 2025. Gor has played a central role in Trump's administration, overseeing the vetting of senior personnel choices across government. In November 2024, Trump named Gor as his director of the White House Presidential Personnel Office.


India's total fish production surging by 104 percent from 96 lakh tonnes in 2013-14 to 195 lakh tonnes in 2024-25, according to the latest data from the Department of Fisheries. This expansion, particularly in inland fisheries which grew by 142 percent to 147.37 lakh tonnes, underscores the country's emergence as the world's second-largest fish producer, contributing around 8 percent to global output.

India and Australia have reaffirmed their commitment to further advance Comprehensive Economic Cooperation Agreement (CECA). Both sides discussed this during the Eleventh Round of India-Australia Comprehensive Economic Cooperation Agreement (CECA) negotiations, which concluded in New Delhi on 23 August 2025.

For more Current Affairs: Scan QR code

Data Interpretation - Histogram

Directions (Qs. 1 - 4): *Study the following histogram, which represents the frequency distribution of average runs scored by 60 selected players from a district in a local cricket tournament and answer the questions.*




1. How many players scored more than 50 runs on average?
A) 50 B) 10 C) 28 D) 5 E) 12

2. What percentage of players were scored below 50 runs?
A) $83\frac{1}{3}\%$ B) 50% C) $83\frac{2}{3}\%$
D) 65% E) 25%

3. What is overall average score of 60 players?
A) 33.38 B) 38.55 C) 33.83
D) 38.33 E) 39.12

4. What is the ratio of the number of players who scored below 40 runs to the numbers of players who scored 40 and above 40 runs?
A) 7 : 8 B) 3 : 4 C) 8 : 7
D) 4 : 3 E) 1 : 2

Directions (Qs. 5 - 7): *Study the following histogram which shows the weight of students in a college on a particular day and answer the questions.*



5. Number of students of weight more than 40 kg and less than 55kg.
A) 125 B) 115 C) 95
D) 150 E) 122

6. The number of students weighing less than 45 kg is what percent less than the number of students weighing 50 kg or more?


Bank Exams

Quantitative Aptitude

A) $28\frac{3}{7}\%$ B) $28\frac{6}{7}\%$ C) $28\frac{1}{7}\%$
D) $28\frac{4}{7}\%$ E) $28\frac{1}{9}\%$

7. What is the ratio of the number of students having weight below 50 kg to the number of students having weight 55 kg and more than 55 kg.
A) 25 : 13 B) 10 : 11 C) 13 : 25
D) 11 : 10 E) 12 : 7

Directions (Qs. 8 - 12): *Carefully study the following histogram and answer the question. Histogram shows the marks scored by 45 students in a test of 30 marks. A student has to score a minimum of 10 marks to pass the test.*



8. How many students have passed the test and obtained less than 50% marks?
A) 14 B) 10 C) 18
D) 12 E) 11

9. How many students have scored less than two - third of the total marks?
A) 18 B) 40 C) 20 D) 28 E) 12

10. What is the percentage of students who passed the test?
A) $77\frac{7}{9}\%$ B) $79\frac{1}{9}\%$
C) 46% D) 35% E) 24%

11. What is the ratio of the number of students passed to the number of students failed.
A) 7 : 3 B) 2 : 7 C) 7 : 2
D) 5 : 2 E) 2 : 1

12. What is the ratio between the number of students scored highest average marks to the number of students scored lowest average marks?
A) 5 : 3 B) 1 : 2
C) 3 : 5 D) 2 : 1
E) None

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas
Asst. Prof. of Mathematics.

కదులుతూ.. ఆ వైపు దూసుకెళ్లి.. ఆగితే!

కారులో ప్రయాణిస్తున్నప్పుడు స్పీడోమీటర్ గంటకు అరవై కిలోమీటర్లు అని చూపిస్తే, దానిని వడి అంటారు. ఇందులో కదలిక తప్ప దిశ ప్రస్తావన ఉండదు. విమానం గంటకు ఎనిమిది వందల కిలోమీటర్ల వేగంతో ఉత్తరదిశగా దూసుకెళుతోందని పైలట్ ప్రకటిస్తే, దానిని వేగం అంటారు. ఇక్కడ వేగం, దిశ రెండూ ఉంటాయి. కారు స్టార్ట్ చేసి వేగంగా వెళుతున్నారు. ఏదో అడ్డం వచ్చి బ్రేక్ వేశారు. ఇప్పుడు వేగం క్రమంగా పెరిగింది, మళ్లీ తగ్గింది. ఈ విధంగా వస్తువు వేగంలో వచ్చే మార్పు రేటును త్వరణం అంటారు. ఇక్కడ కదలడం, వేగంగా వెళ్లడం, ఆగడం అనే మౌలికమైన అంశాలను సరిగా గుర్తించాలి. వాటిని అభ్యర్థులు స్పష్టంగా తెలుసుకోవాలంటే ప్రాథమిక భావనలను నేర్చుకోవాలి. సదిశ, అదిశ రాశుల మధ్య వ్యత్యాసాన్ని, వాటి ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలి. నిత్యజీవితంలో ఎదురయ్యే కదలికలను వాటికి అన్వయించుకొని అవగాహన పెంచుకోవాలి.

వడి (Speed): ఇది వస్తువు ప్రయాణించిన దూరంపై ఆధార పడి ఉంటుంది. ✦ ఒక వస్తువు సెకను కాలంలో ప్రయాణించిన దూరాన్ని 'వడి' అంటారు. ✦ వస్తువు ప్రయాణించిన దూరంలో మార్పు రేటు 'వడి'. ✦ ఏకాంక సమయంలో వస్తువు ప్రయాణించిన దూరాలను కొలవడం అనేది వస్తువు చలన రేటును కొలిచే పద్ధతుల్లో 'వడి' ఒకటి.
✦ వస్తువు వడిని కొలవడానికి పరిమాణం మాత్రమే అవసరం, దిశ అవసరం లేదు.
✦ వడి అదిశ రాశి.
✦ వస్తువు వడి స్థిరంగా ఉండాల్సిన అవసరం లేదు. చాలా సందర్భాల్లో వస్తువులు అసమ చలనంలో ఉంటాయి. అలాంటి వస్తువు చలన రేటును 'సరాసరి వడి' అంటారు.

$$\text{వస్తువు వడి } (v) = \frac{\text{ప్రయాణించిన దూరం}}{\text{కాలం}} = \frac{d}{t}$$

$$\text{వస్తువు సరాసరి వడి} = \frac{\text{ప్రయాణించిన మొత్తం దూరం}}{\text{మొత్తం కాలం}}$$

దీనికి CGS ప్రమాణం = సెం.మీ./సెకను.
MKS, SI ప్రమాణం = మీటరు/సెకను.




✦ సాధారణంగా వడి, సరాసరి వడిని కిలో మీటరు/గంటల్లో తెలియజేస్తారు.
కిలో మీటరు/గంటలను మీటరు/సెకను లో మార్చాలంటే $\frac{5}{18}$ తో గుణించాలి.
మీటరు/సెకనును కిలో మీటరు/గంటల్లోకి మార్చాలంటే $\frac{18}{5}$ తో గుణించాలి.

వడి - వేగం - త్వరణం

యాంత్రిక శాస్త్రం విభాగంలోని శుద్ధగతి శాస్త్రంలో చలనం ఒకటి. చలించే ప్రతి వస్తువు కొంత దూరం వడి లేదా వేగంతో ప్రయాణిస్తుంది. ఇది కేవలం నిర్ణీత కాలంలో లేదా నిర్దిష్ట సమయంలో జరుగుతుంది. అలాంటి వస్తువులపై వడి లేదా వేగంతోపాటు, త్వరణ ప్రభావం ఉంటుంది. కొన్ని వస్తువులు సమత్వరణంతో, మరికొన్ని అసమ త్వరణంతో, ఇంకొన్ని కోణీయ త్వరణంతో కదులుతాయి.


వేగం (Velocity) - నిర్దిష్ట దిశలో వడి



వస్తువు చలన రేటు వడితోపాటు కదిలే దిశను పేర్కొంటే దానిని వేగంగా చెప్పవచ్చు.
- నిర్దిష్ట దిశలో కదులుతున్న వస్తువు వడియే వేగం.
- వేగం అనేది ఏకరీతిగా ఉండవచ్చు లేదా మారవచ్చు.
- వస్తువు వేగం ఏకరీతి రేటుతో మారుతున్న సందర్భంలో సరాసరి వేగం పొందవచ్చు.

$$\text{సరాసరి వేగం} = \frac{\text{తొలి వేగం} + \text{తుది వేగం}}{2} = \frac{u+v}{2}$$

- నిర్దిష్ట దిశలో వస్తువు వడినే వేగం అంటారు.
- దీనికి ప్రమాణం - CGS ప్రమాణం - సెం.మీ. / సె.
- MKS, SI ప్రమాణం మీ./సె.



త్వరణం (Acceleration) - వేగం మార్పు రేటు

✱ ఏకాంక కాలంలో వస్తువు వేగంలో మార్పు రేటును త్వరణం అంటారు.
✱ వస్తువు వేగంలో మార్పు నిర్దిష్ట దిశలో ఉంటే అది త్వరణం.

$$\text{✱ త్వరణం } (a) = \frac{\text{వేగంలో మార్పు}}{\text{కాలం}}$$

$$a = \frac{v-u}{t} = \frac{\text{తుదివేగం} - \text{తొలివేగం}}{2}$$

త్వరణం ప్రమాణాలు: ✱ CGS ప్రమాణం - సెం.మీ./సె.^{2}
✱ MKS, SI ప్రమాణం - మీటర్/సెకను^{2}
✱ వస్తువు సమాన కాలవ్యవధుల్లో, వేగం సమాన పరిమాణంలో మారితే ఆ చలనాన్ని సమ త్వరణంగా పేర్కొంటారు.
ఉదా: స్వేచ్ఛా పతన వస్తువు చలనం - సమ చలనం.
✱ వస్తువు వేగం అసమానంగా మారితే అది అసమత్వరణం.
✱ త్వరణం అనేది దిశ, వేగంపై ఆధారపడుతుంది.
✱ ఒక వస్తువు వేగంలో మార్పు అనేది సమానమైన కాలవ్యవధుల్లో సమానంగా ఉంటే ఆ త్వరణాన్ని సమ త్వరణం అంటారు.

20 కి.మీ./గం. — 40 కి.మీ./గం. — 60 కి.మీ./గం. — 80 కి.మీ./గం.
5 ని. 5 ని. 5 ని.

నోట్: వస్తువు వేగంలో మార్పు ఉంటేనే త్వరణం ఉన్నట్లు, దాని వేగంలో మార్పు లేకపోతే ఆ వస్తువుకు త్వరణం ఉండదు.

40 కి.మీ./గం. — 40 కి.మీ./గం. — 40 కి.మీ./గం.
5 ని. 5 ని.



✱ సమాన కాల వ్యవధుల్లో వస్తువు వేగంలో మార్పులు అసమానంగా ఉంటే ఆ త్వరణం 'అసమత్వరణం'. ✱ వస్తువు వేగంలో మార్పు ఉన్నప్పుడు ఆ వేగం పెరుగుతూ ఉంటే అలాంటి త్వరణం - ధన త్వరణం.
ఉదా: 1) స్టేషన్ నుంచి బయలుదేరిన బస్సు లేదా రైలు వేగం పెంచినప్పుడు 2) స్వేచ్ఛా పతన వస్తువు కూడా కిందికి పడుతున్నప్పుడు ధన త్వరణాన్ని కలిగి ఉంటాయి. ✱ వస్తువు వేగం క్రమేపీ తగ్గుతూ ఉంటే ఆ వస్తువు త్వరణాలను 'రుణ త్వరణం' అంటారు.
ఉదా: 1) బ్రేకులు వేసిన వాహనాలు. 2) నిట్టనిలువుగా పైకి విసిరిన వస్తువులు. ✱ వేగం, త్వరణాలు దిశలు ఒకే విధంగా ఉండాల్సిన అవసరం లేదు. **ఉదా:** 1) పైకి విసిరిన వస్తువుకు వేగం, త్వరణం మధ్య కోణం = 180°. 2) భ్రమణచలనంలో మధ్య కోణం = 90°. ✱ వస్తువు వేగం శూన్యమైన త్వరణం శూన్యం కావాల్సిన అవసరం లేదు. **ఉదా:** గరిష్ఠ ఎత్తు వద్ద వేగం శూన్యం కానీ త్వరణం శూన్యం కాదు. ✱ వస్తువు వేగంలో మార్పు శూన్యమైతే అక్కడ త్వరణం శూన్యం కానీ, వస్తువుకు త్వరణం లేకుండా వేగం ఉండవచ్చు.
✱ సమ త్వరణంతో కదులుతున్న వస్తువు తొలి వేగం (u), తుది వేగం (v), దాని స్థానభ్రంశం/దూరానికి (s) వస్తు త్వరణం (a), అది ప్రయాణించే కాలం (t) అయితే ఆ వస్తువుకు ఉన్న చలన సమీకరణాలు.

$$v = u + at,\quad s = ut + \frac{1}{2}at^2$$

$$v^2 - u^2 = 2as$$



✱ వస్తువు 'n'వ సెకనులో ప్రయాణించే దూరం.

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

$$S_n = u + a\left(n - \frac{1}{2}\right)$$

✱ ఒక వస్తువుకు ఒక బిందువు వద్ద వేగం (u), వేరొక బిందువు వద్ద వేగం (v) అయితే రెండు బిందువుల మధ్య వేగం

$$V_a = \frac{u^2 + v^2}{2}.$$

✱ నిశ్చల స్థితి నుంచి బయలుదేరిన వస్తువు 't' కాలంలో (a) త్వరణంతో ప్రయాణించి v తుది వేగం పొందితే దాని త్వరణం

$$a = \frac{v}{t}.$$

మాదిరి ప్రశ్నలు

1. ఒక వస్తువు వేగం, త్వరణ దిశలు రెండూ వ్యతిరేకంగా ఉంటే దాని వడి...
   1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
   3) మారదు 4) పెరిగి, తగ్గుతుంది
2. ఒక వస్తువు వేగం దేనిపై ఆధారపడుతుంది? అలాగే దాని మార్గంలో ఒక బిందువు వద్ద ఏ వైపు ఉంటుంది?
   1) చలన దిశ, పైకి 2) చలన దిశ, కిందకు
   3) వడి, స్పర్శరేఖ దిశలో 4) చలన దిశ, స్పర్శరేఖ దిశలో
3. భూమి చుట్టూ తిరుగుతున్న చంద్రుడి త్వరణం శూన్యం అయితే ఆ చంద్రుడు....
   1) అలాగే పరిభ్రమిస్తాడు 2) అక్కడే ఆగిపోతాడు
   3) కిందికి పడతాడు 4) దూరంగా పలాయనమవుతాడు
4. నిశ్చల స్థితి నుంచి బయలుదేరిన వస్తువు 20 మీ./సె.^{2} త్వరణంతో 5 సెకన్లు ప్రయాణిస్తే, అది పొందే తుది వేగం?
   1) 20 మీ./సె. 2) 100 మీ./సె.
   3) 50 మీ./సె. 4) 0



రచయిత
ఎస్.వై.నాయుడు

సమాధానాలు: 1-2; 2-4; 3-3; 4-2.

కార్పొరేట్ మర్యాదలు పాటిస్తున్నారా?

జాబ్ స్కిల్స్



కార్పొరేట్ సంస్థల్లో, పెద్ద కంపెనీల్లో ఎక్కువశాతం బృందాలుగా చేసే పనులే ఉంటాయి. కానీ వ్యక్తిగత ప్రవర్తనలు అభ్యర్థుల వైఖరిని తెలియజేస్తాయి. వస్తువులను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోవడం, అదే పనిగా వదంతుల గురించి మాట్లాడుతుండటం చేస్తే మిగిలిన వారిలో వ్యతిరేక భావం ఏర్పడుతుంది. హుందాగా ఉండే దుస్తులు ధరించడం, సహచరులను గౌరవించడం, మేనేజర్లు, ఉన్నతోద్యోగులతో వినయంగా వ్యవహరించడం, ఇతరుల విజయాన్ని గుర్తించడం ఆచరిస్తే సదాభిప్రాయాన్ని కలిగిస్తాయి. ఇవన్నీ కార్పొరేట్ సంస్థల్లో పాటించాల్సిన కనీస మర్యాదలు. ఇవి ఎక్కడా రాసి ఉండవు, ఎవరూ నేర్పరు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారితో పాటు సీనియర్లకు ఎంతగానో ఉపయోగపడే ఆ 'కార్పొరేట్ ఎటికెట్స్' గురించి తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్



◆ భారతదేశంలో మొదటి జంతు మూలకణ బయోబ్యాంక్‌ను ఎక్కడ ప్రారంభించారు? **జ:** హైదరాబాద్
◆ చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీ విజేత? **జ:** విన్సెంట్ కీమెరో

మాదిరి ప్రశ్నలు

◆ 2030 నాటికి చంద్రుడిపై శాశ్వత మానవ స్థావరానికి అణు రియాక్టర్‌ను ఏర్పాటు చేయాలని ఏ అంతరిక్ష సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది? **జ:** ఎన్ఏఎస్ఏ
◆ Partition horrors remembrance day (పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే)ను ఎప్పుడు జరుపుకుంటారు? **జ:** ఆగస్టు 14
◆ తూర్పు భారతదేశంలో మొదటి ఏసీ లోకల్ రైలును ఏ రాష్ట్రంలో ప్రారంభించారు? **జ:** పశ్చిమబెంగాల్
◆ వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఇటీవల విడుదల చేసిన గ్లోబల్ జెండర్ రిపోర్ట్ 2025లో భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది? **జ:** 131

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌లో మేనేజర్ ఉద్యోగాలు (29)
చివరి తేదీ: 27.08.2025
☛ ఐఐటీ రూపార్‌లో మేనేజర్ పోస్టులు
చివరి తేదీ: ఆగస్టు 27

పుట్టుకతో.. వారసత్వంతో.. నమోదుతో!




వ్యక్తికి, దేశానికి మధ్య ఉండే చట్టపరమైన సంబంధమే పౌరసత్వం. అంటే వ్యక్తికి దేశం ఇస్తున్న చట్టబద్ధమైన హోదా. దీని ద్వారానే ప్రజలకు నిర్దిష్ట హక్కులు, విధులు, బాధ్యతలు సంక్రమిస్తాయి. పౌరసత్వం స్వభావం, అది సంక్రమించే తీరు, దాని గురించి రాజ్యాంగం వివరణ, నిబంధనలు, అందుకు అనుగుణంగా చేసిన చట్టాలు తదితర మౌలికాంశాలన్నింటినీ పోటీపరీక్షలు రాసే అభ్యర్థులు తెలుసుకోవాలి. విదేశీయులు భారత పౌరసత్వాన్ని పొందగలిగే మార్గాలు, ఇక్కడ ఉన్న వారికి పౌరసత్వం రద్దయ్యే సందర్భాలు, ప్రవాస భారతీయులు మాతృదేశంతో అనుబంధాన్ని కొనసాగించే విధంగా తీసుకొచ్చిన 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా' పథకం ప్రయోజనాలు, జాతీయ పౌరపట్టిక రూపకల్పన లక్ష్యం, ప్రజా ప్రాతినిధ్య చట్టం, పౌరసత్వానికి సంబంధించి జరిగిన మార్పు చేర్పులపై అవగాహన కలిగి ఉండాలి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

పౌరసత్వం

1. పౌరసత్వం గురించి రాజ్యాంగంలో ఎక్కడ వివరించారు?
   1) 1వ భాగం, ఆర్టికల్స్ 1 నుంచి 6 వరకు
   2) 2వ భాగం, ఆర్టికల్స్ 5 నుంచి 11 వరకు
   3) 3వ భాగం, ఆర్టికల్స్ 6 నుంచి 12 వరకు
   4) 4వ భాగం, ఆర్టికల్స్ 5 నుంచి 10 వరకు
2. పౌరసత్వంకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ప్రాచీన గ్రీకు రాజ్యంలో తొలిసారిగా 'పౌరసత్వం' భావనకు ప్రాధాన్యం లభించింది.
   బి) దేశంలోని ప్రజలను 'పౌరులు', 'విదేశీయులు'గా వర్గీకరించవచ్చు.
   సి) దేశంలోని పౌరులకు మాత్రమే రాజకీయ హక్కులు లభిస్తాయి.
   డి) దేశంలోని పౌరులు, విదేశీయులకు సమానంగా రాజకీయ హక్కులు లభిస్తాయి.
   1) ఎ, బి, సి 2) ఎ, సి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
3. రాజ్యాంగం ప్రకారం భారతీయ పౌరులకు మాత్రమే లభించే ప్రాథమిక హక్కులను గుర్తించండి.
   ఎ) ఆర్టికల్ 16 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు పొందే హక్కు.
   బి) ఆర్టికల్ 19 ప్రకారం లభించే ఆరు రకాల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు.
   సి) ఆర్టికల్ 25 ప్రకారం లభించే మతస్వేచ్ఛా హక్కు.
   డి) ఆర్టికల్ 29, 30 ప్రకారం లభించే విద్యాసాంస్కృతిక హక్కులు.
   1) ఎ, బి, సి, 2) ఎ, బి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
4. రాజ్యాంగం ప్రకారం భారతీయ పౌరులతో సమానంగా విదేశీయులు కూడా పొందే ప్రాథమిక హక్కులను గుర్తించండి.
   ఎ) ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానులు.
   బి) ఆర్టికల్ 20 ప్రకారం అక్రమంగా విధించే శిక్షలకు వ్యతిరేకంగా రక్షణ పొందే హక్కు.
   సి) ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు.
   డి) ఆర్టికల్ 23 ప్రకారం పీడనాన్ని నిరోధించే హక్కు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
5. ఆర్టికల్ 5 ప్రకారం భారతదేశంలో శాశ్వత నివాసం ఉన్న ఒక వ్యక్తి భారతీయ పౌరసత్వాన్ని పొందాలంటే ఏ అంశాన్ని కలిగి ఉండాలి?
   ఎ) సదరు వ్యక్తి భారతదేశంలో జన్మించాలి.
   బి) సదరు వ్యక్తి తల్లిదండ్రుల్లో ఎవరైనా ఒకరు భారతీయ పౌరులై ఉండాలి.
   సి) రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటికి (1950, జనవరి 26) కనీసం ఐదేళ్లు భారతదేశంలో నివసించి ఉండాలి.
   1) ఎ, బి 2) సి మాత్రమే
   3) ఎ లేదా సి 4) ఎ లేదా బి లేదా సి
6. పౌరసత్వానికి సంబంధించి రాజ్యాంగ ప్రకరణల్లో ఉన్న వివరణలో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఆర్టికల్ 9 - భారతీయ పౌరుడు స్వచ్ఛందంగా విదేశీ పౌరసత్వాన్ని పొందితే ఆ వ్యక్తి సహజంగానే భారతీయ పౌరసత్వాన్ని కోల్పోతాడు.
   బి) ఆర్టికల్ 10 - భారతీయ పౌరసత్వం ఉన్న వ్యక్తి పార్లమెంటు రూపొందించే నిబంధనలకు లోబడి భారత పౌరుడిగా కొనసాగుతాడు.
   సి) ఆర్టికల్ 11 - పౌరసత్వానికి సంబంధించిన అంశాల్లో మార్పులు, చేర్పులు చేసే అధికారం పార్లమెంటుకు ఉంటుంది.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి
7. భారత పార్లమెంటు రూపొందించిన 'పౌరసత్వ చట్టం, 1955' ప్రకారం భారతీయ పౌరసత్వాన్ని పొందే పద్ధతిని గుర్తించండి.
   ఎ) పుట్టుక ద్వారా పౌరసత్వం.
   బి) వారసత్వం ద్వారా పౌరసత్వం.
   సి) నమోదు ద్వారా పౌరసత్వం.
   డి) సహజీకృత పద్ధతి ద్వారా పౌరసత్వం.
   ఇ) భూభాగ విలీనం ద్వారా పౌరసత్వం.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, సి, ఇ 4) ఎ, బి, సి, డి, ఇ
8. 'పుట్టుక ద్వారా' భారతీయ పౌరసత్వం పొందాలంటే సంబంధిత వ్యక్తి ఏ సంవత్సరాల మధ్య భారత్‌లో పుట్టి, శాశ్వత స్థిర నివాసియై ఉండాలి?
   1) 1950, జనవరి 26 నుంచి 1987, జులై 1
   2) 1950, జనవరి 26 నుంచి 1988, ఏప్రిల్ 1
   3) 1950, జనవరి 26 నుంచి 1989, జనవరి 9
   4) 1950, జనవరి 26 నుంచి 1990, జనవరి 9
9. ఒక వ్యక్తి భారతదేశానికి వెలుపల జన్మించినప్పటికీ, అతడు జన్మించే సమయానికి అతడి తండ్రి భారతీయ పౌరుడైతే, ఆ వ్యక్తి 'వారసత్వం ద్వారా' భారతీయ పౌరసత్వం పొందవచ్చు. అయితే ఇది ఏ సంవత్సరాల మధ్య జరిగి ఉండాలి?
   1) 1950, జనవరిన 26 నుంచి 1992, జనవరి 8
   2) 1950, జనవరి 26 నుంచి 1992, డిసెంబరు 10
   3) 1950, జనవరి 26 నుంచి 1993, ఫిబ్రవరి 16
   4) 1950, జనవరి 26 నుంచి 1993, డిసెంబరు 10
10. 'నమోదు ద్వారా' భారత పౌరసత్వం పొందాలంటే సంబంధిత వ్యక్తి ఏ నిబంధనను పూర్తి చేయాల్సి ఉంటుంది?
    ఎ) భారత పౌరుడిని వివాహం చేసుకుని, నమోదు చేసుకునే సమయం నాటికి దేశంలో ఏడేళ్ల సాధారణ నివాసియై ఉండాలి.
    బి) భారత పౌరుల మైనర్ పిల్లలు.
    సి) భారత సంతతికి చెందిన వ్యక్తి అయి ఉండి, రిజిస్ట్రేషన్ కంటే ముందు భారతదేశంలో ఏడేళ్ల సాధారణ నివాసియై ఉండాలి.
    1) ఎ, బి 2) ఎ, సి
    3) ఎ, బి, సి 4) ఎ లేదా బి లేదా సి
11. రాజీవ్ గాంధీని వివాహం చేసుకున్న ఇటలీకి చెందిన సోనియా గాంధీకి భారత ప్రభుత్వం ఏ చట్టం ద్వారా 1983లో భారత పౌరసత్వం కల్పించింది?



    1) భారత పౌరసత్వ చట్టం, 1955, సెక్షన్ 5(1) (C)
    2) భారత పౌరసత్వ చట్టం, 1955, సెక్షన్ 6(1) (C)
    3) భారత పౌరసత్వ చట్టం, 1955, సెక్షన్ 7(1) (C)
    4) భారత పౌరసత్వ చట్టం, 1955, సెక్షన్ 8(1) (C)
12. భారత పౌరసత్వ చట్టం, 1955 ప్రకారం భారతీయ పౌరసత్వాన్ని ఏ కారణంతో ఒక వ్యక్తి కోల్పోతాడు?
    ఎ) పరిత్యాగం బి) తొలగించడం
    సి) బలవంతంగా రద్దు పరచడం
    1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి
13. ఒక వ్యక్తి పౌరసత్వం ఏ సందర్భంలో బలవంతంగా రద్దు అవుతుంది?
    ఎ) రాజ్యాంగం పట్ల విధేయత చూపకపోవడం వల్ల.
    బి) తప్పుడు పద్ధతుల ద్వారా భారతీయ పౌరసత్వాన్ని పొందారని ధ్రువీకరణ అయినప్పుడు.
    సి) భారతదేశ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని శత్రు దేశాలకు అందించినప్పుడు.
    డి) స్వచ్ఛందంగా భారతీయ పౌరసత్వాన్ని వదులుకున్నప్పుడు.
    1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
14. జాతీయ పౌర పట్టికకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ఒక సార్వభౌమ దేశంలో పౌరులను, అక్రమ వలసదారులను గుర్తించేందుకు దీన్ని రూపొందిస్తారు.
    బి) భారతదేశంలో 1951లో తొలిసారిగా జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్‌సీ) రూపొందించారు.
    సి) సుప్రీంకోర్టు జాతీయ పౌరపట్టికను రూపొందించాలని 2013లో కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.
    డి) అస్సాంలో 2015లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
15. జర్మనీ పౌరసత్వం కలిగి ఉన్నారనే కారణంతో ఏ శాసన సభ్యుడి భారతీయ పౌరసత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రద్దు చేశారు?



    1) శశిథరూర్ 2) తారా సింగ్
    3) చెన్నమనేని రమేష్ 4) ముకుత్ శర్మ
16. గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా ఏ తేదీన 'ప్రవాసి భారతీయ దివస్'గా నిర్వహిస్తున్నారు?
    1) జనవరి 9 2) ఏప్రిల్ 9
    3) జులై 9 4) నవంబరు 9
17. విదేశాల్లో నివసిస్తున్న భారత సంతతి వ్యక్తులు, భారతీయులను దేశ అభివృద్ధిలో భాగస్వాముల్ని చేసేందుకు ఏం చేయాలో అధ్యయనం చేసేందుకు 2000లో ఎవరి అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది?
    1) నిరంజన్ దాస్ 2) ఎల్.ఎం.సింఘ్వీ
    3) దేవేంద్ర ముఖర్జీ
    4) ఎం.ఎస్. అహ్లువాలియా
18. ఏ కమిటీ సిఫార్సుల మేరకు 'భారత పౌరసత్వ సవరణ చట్టం-2003' ప్రకారం ప్రవాస భారతీయులకు ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) సౌకర్యం కల్పించారు?



    1) ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ
    2) నానీ పాల్కీవాలా కమిటీ
    3) జగదీష్ శరణ్ వర్మ కమిటీ
    4) పాల్ ఆపిల్‌బీ కమిటీ
19. భారత పౌరసత్వ సవరణ చట్టం, 2003 ప్రకారం ఏ దేశాల్లోని ప్రవాస భారతీయులకు 'ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా' సౌకర్యాన్ని తిరస్కరించారు?
    1) పాకిస్థాన్, నేపాల్ 2) బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్
    3) పాకిస్థాన్, బంగ్లాదేశ్ 4) పాకిస్థాన్, మాల్దీవులు
20. ప్రవాస భారతీయులకు ఏ సంవత్సరంలో ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణ చేసి ఓటు హక్కు కల్పించారు?
    1) 2009 2) 2010 3) 2011 4) 2013
21. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) భారత ప్రభుత్వం 1999లో పీఐఓ (పర్సన్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్) కార్డు పథకాన్ని ప్రారంభించింది.
    బి) పీఐఓ కార్డు ఉన్నవారు భారతదేశాన్ని సందర్శించడానికి వీసా అవసరం లేదు.
    సి) పీఐఓ కార్డుదారులకు రాజకీయ హక్కులు ఉంటాయి.
    1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి
22. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) భారత ప్రభుత్వం 2005లో ఓసీఐ (ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా) పథకాన్ని ప్రారంభించింది.
    బి) 2015లో పీఐఓ, ఓసీఐ పథకాలను విలీనం చేసి ఓసీఐ పథకంగా మార్పు చేశారు.
    సి) పీఐఓ కార్డుదారులందరినీ 2015, జనవరి 9 నుంచి ఓసీఐ కార్డుదారులుగా పరిగణిస్తారు.
    1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి 4) ఎ, బి, సి
23. పౌరసత్వ సవరణ చట్టం, 2019 ప్రకారం ఏ దేశాలకు సంబంధించిన ముస్లిమేతర సమూహాలు భారత్‌లో శరణార్థులు/అక్రమ వలసదారులుగా ఉన్నప్పటికీ వారికి భారతీయ పౌరసత్వం కల్పిస్తుంది.
    1) పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్
    2) పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్
    3) పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్
    4) పాకిస్థాన్, శ్రీలంక



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-2; 2-1; 3-2; 4-4; 5-4; 6-4; 7-4; 8-1; 9-2; 10-4; 11-1; 12-4; 13-2; 14-4; 15-3; 16-1; 17-2; 18-1; 19-3; 20-3; 21-1; 22-4; 23-1.

విదేశాలపై ఆధారపడేలా చేసిన కాంగ్రెస్

● మోదీ విమర్శ

అహ్మదాబాద్: సుమారు 60 నుంచి 65 సంవత్సరాల పాటు అధికారం చెలాయించిన కాంగ్రెస్.. దేశాన్ని విదేశాలపై ఆధారపడేలా చేసి దిగుమతుల్లో కుంభకోణాలకు పాల్పడిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. తమకు రైతులు పశువుల కాపరులు, చిన్నతరహా పరిశ్రమల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. అమెరికాతో సుంకాల వివాదం నేపథ్యంలో తమపై ఎంత ఒత్తిడి వచ్చినా ఈ విషయంలో రాజీపడబోమని తేల్చి చెప్పారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పలు ప్రాజెక్టుల్ని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పేదలకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తమ 11 సంవత్సరాల పాలనలో 25 కోట్ల మంది దారిద్ర్యం నుంచి బయటపడ్డారని తెలిపారు.

✦ రెండు రోజుల గుజరాత్ పర్యటన సందర్భంగా అహ్మదాబాద్ తూర్పు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ప్రధాని రోడ్డు షో నిర్వహించారు.

రక్షణ సంబంధాల వృద్ధికి కృషి చేద్దాం

● భారత్, ఫిజీ నిర్ణయం
● ఇరుదేశాల మధ్య కుదిరిన ఏడు ఒప్పందాలు



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో ఫిజీ ప్రధానమంత్రి సితివేని లిగమామద రబుక

దిల్లీ: ఇరు దేశాల మధ్య రక్షణ సంబంధాల బలోపేతానికి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు భారత్-ఫిజీ నిర్ణయించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతికి సంయుక్తంగా కృషిచేయాలని ప్రతినపూనాయి. ఇందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫిజీ ప్రధాన మంత్రి సితివేని లిగమామద రబుక మధ్య సోమవారం జరిగిన ద్వైపాక్షిక చర్చలు వేదికయ్యాయి. అలాగే వైద్యం, నైపుణ్యాభివృద్ధి, వ్యాపారం వంటి ఏడు ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా 'రక్షణ, భద్రత రంగంలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నాం' అని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా 12 వ్యవసాయ డ్రోన్‌లను, రెండు మొబైల్ మృత్తిక పరిశోధన లేబొరేటరీస్‌ను ఆ దేశానికి ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇరుదేశాల సముద్రాలు వేరైనా అభిలాషలు ఒకే నౌకలో ప్రయాణిస్తాయని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని ఇరు దేశ నాయకులు తిరస్కరించారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరేందుకు భారత్‌కు మద్దతిస్తామని ఫిజీ ప్రధాని పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా రబుక ఆదివారం దిల్లీకి చేరుకున్నారు. భారత్‌ను సందర్శించిన తొలి ఫిజీ ప్రధాని ఈయనే.

భారత్, అమెరికా మధ్య ట్రంప్ పెట్టిన మరో చిచ్చు..



ఇంటర్నెట్ డెస్క్: ట్రంప్ నిర్ణయాలు భారత్, అమెరికాల సంబంధాలను తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్‌లో అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాల పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్యవర్గాలను షాక్‌కు గురి చేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ ఇప్పుడు బలవంతంగా చేశారు. గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ.. భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అని తెలిపారు. పాకిస్థాన్ సహా పొరుగు దేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను ఆయన గమనిస్తారని పేర్కొన్నారు. ఈ చర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకేగాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని భారత్ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందని వివరించారు. ఇక భారత్, అమెరికా సంబంధాల్లో ఇండో-పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని తెలిపారు. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమా రావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియామకం భారత్, అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డారు.

అమెరికాలో భారత్ లాబీయింగ్!

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి రావడానికి కొన్ని రోజుల ముందే భారత్ లాబీయింగ్ యత్నాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వంతో వ్యూహాత్మక అంశాల్లో సంబంధాలను నెరపడం, సోషల్ మీడియా, మీడియా రిలేషన్స్, డిజిటల్ ఆడిట్ వంటి వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సంస్థను నియమించుకుంది. ఫారిన్ ఏజెంట్ రిజిస్ట్రేషన్ ఫైలింగ్ ప్రకారం.. భారత దౌత్య కార్యాలయం నెలకు 75,000 డాలర్లు చెల్లించేలా 3 నెలలకు మెర్క్యురీ పబ్లిక్ ఎఫైర్స్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఇది ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చింది. మెర్క్యురీ సంస్థ.. రిపబ్లికన్ మాజీ సెనేటర్ డేవిడ్ విట్టర్, 2020 ట్రంప్ ట్రాన్సిషన్ బృందం కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా చేసిన బ్రయాన్‌తో కలిసి భారత్ కోసం పని చేస్తుంది.

భారత్‌లో తొలి అభ్యసన వేగవర్ధక

● ఐఐటీ మద్రాస్ భాగస్వామ్యంతో ప్రారంభించిన ఓపెన్‌ఏఐ

దిల్లీ: భారత్‌లో విద్యార్థులు, విద్యావంతులు, పరిశోధకులకు కృత్రిమమేధ వినియోగంలో తోడ్పాటునందించే తొలి అభ్యసన వేగవర్ధక (లెర్నింగ్ ఆక్సిలెరేటర్)ను ఓపెన్‌ఏఐ సోమవారం ప్రారంభించింది. దీనికోసం 5లక్షల అమెరికన్ డాలర్లను వెచ్చించనుంది. ఐఐటీ మద్రాస్ భాగస్వామ్యంతో కృత్రిమమేధ సాధనాలు, శిక్షణల ద్వారా విద్యావంతుల అభ్యసనను వేగిరపరిచేందుకు సహకారం అందిస్తుంది. దీనిలో భాగంగా వచ్చే ఆరు నెలల వ్యవధిలో సుమారు 5లక్షల చాట్‌జీపీటీ లైసెన్సులు పంపిణీ చేయనుంది. విద్యార్థులు, విద్యావంతులకు కృత్రిమమేధలో శిక్షణ ఇచ్చే కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ, అఖిలభారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కూడా భాగస్వామ్యం వహిస్తాయి.

అదనపు సుంకాలపై నేడు సమీక్ష

దిల్లీ: రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో మంగళవారం దిల్లీలో అత్యున్నత స్థాయి సమీక్ష జరగనుంది. ప్రధాన మంత్రి కార్యాలయంలో జరిగే ఈ సమీక్షలో సుంకాలవల్ల భారత ఎగుమతులపై పడే ప్రభావం గురించి చర్చించనున్నట్లు తెలుస్తోంది. సుంకాల ప్రభావాన్ని తట్టుకునేందుకు అత్యవసర రుణపరపతి హామీ పథకాన్ని అందుబాటులోకి తేవాలని ఎగుమతిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై మంగళవారం నాటి సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

భారత సరిహద్దులో పాక్ డ్రోన్ల సంచారం

మెంఢర్, జమ్మూ: భారత్ సరిహద్దులో డ్రోన్ల సంచారం కలకలం సృష్టించింది. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) ప్రాంతాలలో పాకిస్థాన్‌కు చెందిన అరడజను డ్రోన్లు సంచరించినట్లు సోమవారం అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 9.15 గంటల సమయంలో మెంఢర్ సెక్టార్‌లోని బాలాకోట్, లంగోట్, గురసాయి నాలా ప్రాంతాల్లో డ్రోన్ల కదలికలను గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటిని నిఘా కోసం ప్రయోగించినట్లుగా భావిస్తున్నామన్నారు. అత్యంత ఎత్తులో ఎగిరిన డ్రోన్లు ఐదు నిమిషాల్లోనే తిరిగి పాక్‌వైపు మళ్లినట్లుగా తెలిపారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ఆ ప్రాంతాల్లో తనిఖీలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ఫీడర్ కేటగిరీతో ఉద్యోగులకు నష్టం

ఆల్ ఇండియా ఈక్వాలిటీ ఫోరం

ఈనాడు, అమరావతి: ప్రమోషన్లు ఇచ్చేటప్పుడు కల్పించే రిజర్వేషన్ అంశంలో ఫీడర్ కేటగిరీని ప్రాతిపదికగా తీసుకుంటే బీసీ, ఓసీ, మైనార్టీ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని ఆలిండియా ఈక్వాలిటీ ఫోరం కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారుల కమిటీ ఇచ్చిన నివేదికను ఎందుకు పునఃసమీక్షించాలనుకుంటున్నారో అర్థం కావడంలేదన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర సచివాలయంలోని ఫోరం సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంలో కొందరు అధికారులు మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా తప్పుదోవపట్టిస్తున్నారన్నారు. మెరిట్‌లో ఉన్నా పదోన్నతులు లేక నష్టపోతున్న తమకు న్యాయం చేయాలని కోరారు.

పదోన్నతులతో నేత్ర వైద్య విభాగంలో ఖాళీలు భర్తీ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నేత్ర వైద్య విభాగంలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బోధన అనుభవంలో ఈ ఒక్కసారికి సడలింపు ఇస్తూ 13 మంది అసోసియేట్ ప్రొఫెసర్లను.. ప్రొఫెసర్లుగా పదోన్నతికి అర్హత కల్పిస్తూ స్క్రీనింగ్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది.

ఏపీ రాస్కాం ఇక నుంచి ఏపీ రూరల్ అగ్రికల్చర్ పవర్ లిమిటెడ్

ఈనాడు, అమరావతి: వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం 2022లో ఏర్పాటు చేసిన ఏపీ రూరల్ అగ్రికల్చర్ పవర్ సప్లై కంపెనీ పేరును ఏపీ రూరల్ అగ్రికల్చర్ పవర్ లిమిటెడ్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు తగిన చర్య తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.

ఎన్‌టీపీసీలో సమ్మె నిషేధం: రాష్ట్రంలోని ఎన్‌టీపీసీలో 6 నెలలపాటు సమ్మె నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఆర్టీసీ అధికారుల పదోన్నతులకు ఆమోదం

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలోని వివిధ స్థాయిల్లో అధికారుల పదోన్నతులకు శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) చేసిన సిఫారసులకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌ఎం కేడర్‌లో ఉన్న జీవీ రవివర్మ, టి.చెంగల్‌రెడ్డి, పి.చంద్రశేఖర్, ఎ.అప్పలరాజు, జి.నాగేంద్రప్రసాద్‌లకు ఈడీలుగా పదోన్నతులు కల్పించేందుకు సమ్మతించింది. ప్రస్తుతం వీరంతా ఇన్‌ఛార్జి ఈడీలుగా పని చేస్తున్నారు. డివిజనల్ మేనేజర్ కేడర్‌లో ఉన్న 22 మందిని ఆర్‌ఎం కేడర్‌కు, ముగ్గురు అకౌంట్స్ అధికారులను డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ అధికారులుగా, ఇద్దరు డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ అధికారులను చీఫ్ మేనేజర్ (అకౌంట్స్/ ఆడిట్)లుగా, నలుగురు డీఈలను ఈఈలుగా పదోన్నతులు ఇచ్చేందుకు అనుమతించింది.

సభ్యులకిచ్చిన స్వాతంత్ర్యం సభల ప్రతిష్ఠను దిగజార్చడానికి కాదు: ఓం బిర్లా



దిల్లీ: శాసనసభ, పార్లమెంటు సభ్యుల వాక్‌స్వాతంత్ర్యం, విశేషాధికారం అనేవి సభల ప్రతిష్ఠను దిగజార్చడానికి వారికిచ్చిన స్వాతంత్ర్యం కాదని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. శాసన నిర్మాణ సంస్థల ప్రతిష్ఠ క్రమంగా దిగజారుతోందని, క్షీణిస్తున్న దానిని పునరుద్ధరించడం కోసం ఏం చేయవచ్చన్న దానిపై ఆయా సభల సభ్యులు, రాజకీయ పార్టీలు, ఇతరులు ఆలోచించాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ ఇండియాలోని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తొలి భారతీయ స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై వందేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సభాపతుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఆది, సోమవారాల్లో ఈ సదస్సు జరిగింది. ఆయా సభలకు అధ్యక్షత వహించే స్పీకర్లు వివాద రహితులు, స్వతంత్రులు, న్యాయబద్ధులు అన్న అభిప్రాయం ప్రబలేలా ప్రవర్తించాలని ఓం బిర్లా సూచించారు. 'మన రాజ్యాంగ నిర్మాతలు సభలో ఏదైనా మాట్లాడే ప్రత్యేక అధికారాన్ని శాసన నిర్మాణ సంస్థల సభ్యులకు ఇచ్చారు. అయితే వారు ఉద్దేశించిన లక్ష్యం క్రమంగా నీరుగారుతోంది' అని పేర్కొన్నారు. శాసనసభలు, పార్లమెంటు ప్రజల వాణిని వినిపించే వేదికలు కావాలని అభిప్రాయపడ్డారు.

జమ్మూకశ్మీర్ ప్రభుత్వ విభాగాల్లో వాట్సప్‌పై నిషేధం

ఇంటర్నెట్‌డెస్క్: అన్ని ప్రభుత్వ విభాగాల్లో పెన్‌డ్రైవ్ వాడకాన్ని నిషేధిస్తూ జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అధికారిక సమాచారం బట్వాడాకు వాట్సప్ మెసేజింగ్ సర్వీస్‌ను కూడా నిషేధించింది. సైబర్ చౌర్యం ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత సైబర్ దాడులు వెలుగుచూశాయి. దాంతో ప్రభుత్వ సమాచారం నేరగాళ్ల చేతిలో పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది. "కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్ ప్రభుత్వ సమాచారాన్ని పరిరక్షించడం, డేటా ఉల్లంఘనలను సాధ్యమైనంతమేర తగ్గించడం, మాల్వేర్ దాడుల్ని నివారించడం ఈ నిషేధం ప్రధాన ఉద్దేశం. దాంతో ప్రభుత్వ కార్యకలాపాల కోసం పెన్‌డ్రైవ్ వాడకాన్ని నిషేధించాం. ఏదైనా అధికారిక సమాచార మార్పిడి కోసం వాట్సప్, ఇతర సోషల్ మీడియా వేదికలను వాడటాన్ని కూడా నిషేధించాం" అని పేర్కొంది.

భారత్-పాక్ యుద్ధాన్ని ఆపా

● ట్రంప్ పునరుద్ఘాటన

వాషింగ్టన్: భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధంతో సహా తాను ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల మధ్య మొత్తం 7 సమరాలను అడ్డుకున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం పునరుద్ఘాటించారు. తాను ఆపిన ఏడు యుద్ధాల్లో నాలుగింటిని సుంకాలు, వాణిజ్యం బూచి చూపి నిలువరించానని ఆయన అన్నారు. "మీరు కొట్లాడుకొని అందరినీ చంపాలనుకుంటే సరే మీ ఇష్టం. అయితే మీరు మాతో వాణిజ్యం కోసం వస్తే మాత్రం మీపై 100 శాతం సుంకం విధిస్తాను జాగ్రత్త అని నేను వారిని హెచ్చరించాను. వాళ్లు యుద్ధం విరమించేశారు" అని ట్రంప్ అన్నారు. 'నేను నిలిపిన యుద్ధాలన్నిటిలోకీ పెద్దది భారత్- పాకిస్థాన్‌ల మధ్య జరిగిన యుద్ధం. వారి మధ్య యుద్ధం అణ్వస్త్రాలు వినియోగించే స్థాయికి చేరుకుంది. వారు ఏడు యుద్ధ విమానాలను కూల్చుకున్నారు. అప్పుడు నేను ఒకటే మాట అన్నాను. మీకు వ్యాపారం కావాలా? మీలో మీరు యుద్ధాలు చేసుకుంటూ ఉంటే మేం మీతో వ్యాపారం చెయ్యం. మీకు 24 గంటల గడువిస్తున్నాను అని చెప్పాను. అంతే...మా మధ్య యుద్ధం నిలిచిపోయిందని ఇరుదేశాలూ చెప్పాయి. వ్యాపారంతోపాటు, అందుబాటులో ఉన్న ప్రతి అంశాన్నీ ఉపయోగించి యుద్ధాలు ఆపాను" అని ట్రంప్ చెప్పుకొచ్చారు.

శుభాంశు రాకతో మురిసిన లఖ్‌నవూ

● సత్కరించిన సీఎం యోగి ఆదిత్యనాథ్




లఖ్‌నవూలో జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రులతో వ్యోమగామి శుభాంశు శుక్లా

లఖ్‌నవూ: ఇటీవల యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కు వెళ్లివచ్చిన మన దేశ వ్యోమగామి శుభాంశు శుక్లాకు సోమవారం ఆయన సొంత నగరం లఖ్‌నవూలో ఘనస్వాగతం లభించింది. అంతరిక్షంలో 18 రోజుల మిషన్‌ను పూర్తి చేసి భువికి తిరిగి చేరిన అనంతరం శుభాంశు తన సొంత నగరానికి విచ్చేయడం ఇదే ప్రథమం. తల్లిదండ్రులు ఆశా శుక్లా, శంభు శుక్లాలు, భార్య కామ్నా, కుమారుడు కియాశ్‌లతో పాటు అసంఖ్యాక ప్రజానీకం ఆయనకు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. జాతీయ జెండాను ఊపుతూ "వందేమాతరం" అంటూ నినాదాలు చేశారు. విమానాశ్రయం నుంచి ఒక ఓపెన్ టాప్ వాహనంలో వర్షపు చిరుజల్లును కూడా లెక్కచేయకుండా శుభాంశు శుక్లా రోడ్‌షో నిర్వహించారు. "అమెరికా అంతరిక్ష సంస్థ నాసాను భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ మించిపోయే రోజు ఎంతో దూరం లేదు" అని ఆయన ఒక సన్మానసభలో పేర్కొన్నారు. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ సమక్షంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. శుభాంశుకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఖగోళ పరిజ్ఞానం చదువుతున్న విద్యార్థులకు శుభాంశు పేరుపై స్కాలర్‌షిప్ ప్రకటించారు. మరోవైపు శుభాంశును దేశ అత్యున్నత పురస్కారమైన 'భారత రత్న'తో సత్కరించాలని రాష్ట్రీయ కిసాన్ మంచ్ డిమాండ్ చేసింది.

యుద్ధ గాయాలను నయం చేస్తూ..

ఉక్రెయిన్‌లో 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' సేవలు



ఇంటర్నెట్ డెస్క్: రష్యా భీకర దాడులు ఉక్రెయిన్‌కు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. యుద్ధం కారణంగా స్థానికంగా అనేకమంది సైనికులు, సామాన్యుల మానసిక స్థితి దుర్భరంగా మారింది. ఈ క్రమంలోనే చేదు జ్ఞాపకాలు, గాయాల నుంచి వారిని బయటకు తీసుకొచ్చేందుకు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రామా రిలీఫ్, ధ్యానం, శ్వాస అభ్యాస కార్యక్రమాలు వేలాది మంది సైనికులు, నిరాశ్రయులు, పిల్లలకు జీవితంపై కొత్త ఆశను చిగురింపజేస్తున్నాయి.

ఉక్రెయిన్‌లో గురుదేవ్ కార్యక్రమాలను అక్కడి సైనిక నాయకత్వం గుర్తించింది. బెటాలియన్ కమాండర్ గురుదేవ్‌కు గౌరవ పురస్కారం అందజేస్తూ.. ' 'బాంబులు పడినప్పుడల్లా మేం పోరాటానికి సిద్ధమయ్యాం. కానీ మాలోని కోపం, ద్వేషం గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సుల ద్వారా మా జీవితాలు మారాయి. గాయాలతో బాధ పడుతున్నవారూ.. ఇప్పుడు భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేస్తున్నారు. వారి కళ్లలో జీవం ఉట్టిపడుతోంది' ' అని పేర్కొన్నారు. అదేవిధంగా నాయకత్వ శిక్షణ కూడా.. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచిందని అభినందించారు. ఉక్రెయిన్ సైనికులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో తొలిసారి అడుగుపెట్టినప్పుడు అక్కడి దృశ్యాలు తనను కలచివేసినట్లు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'కు చెందిన ఓ బోధకుడు తెలిపారు. "సైనికుల చేతులు, కాళ్లు గాయాలతో నిండిపోయాయి. వారి కళ్లలో భయం, శూన్యం కన్పించాయి. అయితే శ్వాస అభ్యాసాలు నేర్చుకున్న అనంతరం వారు ప్రశాంతతను, భద్రతాభావాన్ని పొందారు'' అని వెల్లడించారు.

2014 నుంచి సైన్యంలో 'మోరల్ అండ్ సైకలాజికల్ సపోర్ట్ విభాగం'లో పనిచేస్తున్న నటాలియా ఓ ఘటనను గుర్తు చేసుకున్నారు. యుద్ధక్షేత్రంలో భయంతో కదల్లేని స్థితికి చేరుకున్న ఓ సైనికుడు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' శ్వాస అభ్యాసంతో తేరుకుని.. తనతో పాటు మరో నలుగురి ప్రాణాలను రక్షించాడని తెలిపారు. ఇదిలా ఉండగా.. 2022 నుంచి ఇప్పటి వరకు 8,000 మందికిపైగా సైనికులు, నిరాశ్రయులు, చిన్నారులు తమ కార్యక్రమాల ద్వారా సాంత్వన పొందినట్లు 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' ఫౌండేషన్ తెలిపింది.

విధానపరమైన లోపాలుంటే...

మరణ దండనను సవాల్ చేయవచ్చు

● సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం వెల్లడి

దిల్లీ: కేసు విచారణలో విధానపరమైన లోపాలుంటే తనకు విధించిన మరణ దండనను దోషి సవాల్ చేయవచ్చని, రాజ్యాంగ అధికరణం 32 అందుకు అనుమతిస్తుందని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. 2008లో నాగ్‌పుర్‌లో నాలుగేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన కేసులో మరణ దండనను ఎదుర్కొంటున్న దోషి వసంత్ సంపత్ అభ్యర్థనను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం సోమవారం అనుమతించింది. మరణ దండనను విధించడానికి ముందు నిందితుడి మానసికస్థితిపై నివేదికను తెప్పించుకుని ట్రయల్ కోర్టు పరిశీలించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు గతంలో ఓ తీర్పు సందర్భంగా స్పష్టం చేసింది. ఈ విషయంలో నిందితుల హక్కులకు భంగం కలిగితే మరణ దండన ఖరారైన కేసులనూ తిరిగి పరిశీలించడానికి అధికరణం 32 అవకాశం కల్పిస్తుందని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. దోషి పిటిషన్‌ను విచారణ జాబితాలో చేర్చడానికి సంబంధించి సీజేఐ అనుమతి కోసం పంపిస్తున్నట్లు తెలిపింది.



సెఫాలజిస్ట్ సంజయ్‌ను అరెస్టు చేయవద్దు

మహారాష్ట్ర ఓటర్ల జాబితాలపై దుష్ప్రచారం చేశారని ఆరోపిస్తూ ఎన్నికల సంఘం (ఈసీ) పెట్టిన రెండు కేసుల్లో అరెస్టు నుంచి సెఫాలజిస్ట్ సంజయ్ కుమార్‌కు సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. ఆయనను నిర్బంధించరాదంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం సోమవారం ఆదేశాలిచ్చింది. ఓటర్ల జాబితాపై సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టులను సంజయ్ కుమార్ తొలగించడంతో పాటు బహిరంగ క్షమాపణ కూడా చెప్పారని ఆయన తరపు న్యాయవాదులు ధర్మాసనానికి తెలిపారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు(2024), అసెంబ్లీ ఎన్నికలు (2025) మధ్య కాలంలో కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అసాధారణ స్థాయిలో హెచ్చు తగ్గులు ఉన్నాయంటూ ఈ నెల 17న తాను పెట్టిన రెండు పోస్టుల్లోని పొరపాటును వెంటనే గ్రహించి తొలగించానని సంజయ్ కుమార్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలపై దుష్ప్రచారం చేసే ఉద్దేశం తనకు లేదని సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్)కు చెందిన పరిశోధన విభాగం 'లోక్‌నీతి' కో-డైరెక్టర్ వివరించారు. తనపై నమోదైన రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని అభ్యర్థించారు.

నిందితుడిని నిర్దోషిగా తేల్చినప్పటికీ నేర బాధితులు అప్పీల్‌కు వెళ్లవచ్చు

విచారణలో నిందితుడిని కోర్టు నిర్దోషిగా తేల్చినప్పటికీ నేర బాధితులు, వారి వారసులు తమకు సరైన న్యాయం జరగలేదని అప్పీల్‌కు వెళ్లవచ్చని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఒకవేళ దోషిగా తేల్చి విధించిన శిక్ష తక్కువగా ఉందని, సరైన పరిహారం లభించలేదని నేర బాధితులు భావించినా కూడా అప్పీలు చేయవచ్చని తెలిపింది. తనకు అన్యాయంగా శిక్ష విధించారని నిందితుడు ఎలాగైతే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి నిబంధనలు అవకాశం కల్పిస్తున్నాయో....నేర బాధితులు కూడా నేర శిక్షాస్మృతిలోని సెక్షన్ 372 ప్రకారం అప్పీలు చేయవచ్చని వివరించింది. కేసు విచారణ సమయంలో నేర బాధితులు మరణిస్తే వారి వారసులు దానిని కొనసాగించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది.

వికటించిన కాలేయ మార్పిడి శస్త్రచికిత్స

● అవయవ దాత, గ్రహీతలైన భార్యాభర్తల మృతి

పుణె: ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స వికటించి దంపతులు మృతిచెందిన ఘటన మహారాష్ట్రలోని పుణెలో జరిగింది. బాపూ కోంకర్ అనే రోగికి ఆయన భార్య కామిని కాలేయం దానం చేశారు. సహ్యాద్రి ఆస్పత్రిలో ఈనెల 15న జరిగిన శస్త్రచికిత్స అనంతరం రెండు రోజులకు భర్త మరణించారు. కాలేయం దానమిచ్చిన భార్య మరో రెండు రోజుల తర్వాత మృతిచెందారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో మహారాష్ట్ర ఆరోగ్య విభాగం శస్త్రచికిత్స నిర్వహించిన ఆస్పత్రికి నోటీసులు జారీ చేసింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే ఈ మరణాలు సంభవించాయని, దీనిపై దర్యాప్తు జరపాలని మృతుల కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. "విచారణకు పూర్తి సహకారం అందిస్తున్నాం. ఈ అంశంపై సమగ్ర సమీక్ష జరగాలి" అని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. మృతుడు బాపూ కోంకర్ అప్పటికే అనేక విషమ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వివరించింది. సజీవ వ్యక్తి నుంచి కాలేయాన్ని సేకరించి మరొకరికి ట్రాన్స్‌ప్లాంట్ చేయడం అత్యంత జటిల ప్రక్రియ అని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది.

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ముఖాముఖి పోటీ

దిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ పర్వానికి సోమవారం తెరపడింది. ఎన్డీఏ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బుచ్చిరెడ్డి సుదర్శన్‌రెడ్డి బరిలో మిగిలారు. వచ్చే నెల 9న జరగనున్న పోలింగ్‌లో వారి మధ్య ముఖాముఖి పోటీ జరగనుంది. పోలింగ్ పార్లమెంటు భవనంలోని ఎఫ్-101 గదిలో జరుగుతుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి.మోదీ వెల్లడించారు. పోలింగ్ ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది.

సీఎం నివాస భద్రత పనులకు రూ.95 లక్షలు

ఈనాడు, అమరావతి: న్యూదిల్లీలోని 1-జనపథ్‌లో ఉన్న సీఎం చంద్రబాబు నివాసం/ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతాపరమైన పనులకు రూ.95 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు జారీ చేసింది. బుల్లెట్ రెసిస్టెన్స్ కిటికీ అద్దాలు, బూమ్ బారియర్స్, మోటరైజ్డ్ స్లైడింగ్ గేట్, బ్యాగేజ్ స్కానర్లల ఏర్పాటు, సెక్యూరిటీ గది నిర్మాణానికి కలిపి ఈ నిధులు మంజూరు చేశారు.

పాస్‌బుక్ రానివ్వకుండా వైకాపా నేత అడ్డుకుంటున్నారు

తెదేపా కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తన పొలానికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాన్ని జారీ చేయనివ్వకుండా వైకాపా జడ్పీటీసీ సభ్యురాలి భర్త అడ్డుకుంటున్నారని పశ్చిమగోదావరి జిల్లా వెలగలేరుకు చెందిన భాస్కర్‌రావు వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్‌ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.హరిబాబునాయుడు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి: ఎస్పీడీ

ఈనాడు, అమరావతి: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. 'సాకురా సైన్సు హై స్కూల్ ప్రోగ్రామ్' కింద జపాన్‌ను సందర్శించి వచ్చిన పుష్పాంజలి(కాకినాడ), హరీష్(విజయనగరం), ఐశ్వర్య(ప్రకాశం), వరుణ్‌సాయి(గుంటూరు) విద్యార్థులు సోమవారం ఎస్పీడీని కలిశారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు. జపాన్‌లాంటి అభివృద్ధి చెందిన దేశాన్ని సందర్శించడం గొప్ప సువర్ణావకాశమని, వీరిని ఆదర్శంగా తీసుకొని ఇతర విద్యార్థులు బాగా చదవాలని సూచించారు.

వయసులో బుడుగు... ఐక్యూలో పిడుగు

● మధ్యప్రదేశ్ చిన్నారి అసాధారణ ప్రతిభ
● 11 ఏళ్లకే 9వ తరగతి చదువుతున్న ఆరవ్ పటేల్



తల్లిదండ్రులతో ఆరవ్

జబల్‌పుర్: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్ పరిధిలో ఉన్న రంఝీ పట్టణానికి చెందిన ఆరవ్ పటేల్ తన అసాధారణ ప్రతిభతో 11 ఏళ్ల వయసులోనే 9వ తరగతి చదువుతూ ఔరా అనిపిస్తున్నాడు. అతడి తండ్రి దిలీప్ అటవీ శాఖలో గార్డు. తల్లి సంధ్య బీఈడీ చేశారు. చిన్నప్పటి నుంచే ఆరవ్‌కు జనరల్ నాలెడ్జ్, గణితం, సైన్స్‌ను ఆమె తల్లి నేర్పించారు. అసాధారణ ప్రతిభాపాటవాలు, ఐక్యూను సొంతం చేసుకున్న ఆరవ్ దేవాస్ పట్టణంలోని ఓ పాఠశాలలో రెండున్నరేళ్లకే నేరుగా ఒకటవ తరగతిలో ప్రవేశం పొందాడు. రెండో ఏడాది 3వ తరగతికి ప్రమోట్ అయ్యాడు. ఆ తర్వాత రంఝీలో ఉన్న సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 8వ తరగతి వరకు చదువుకున్నాడు. 2014 మార్చి 19న జన్మించిన ఆరవ్‌కు 11 ఏళ్ల వయసే ఉన్నందున, తొమ్మిదిలో చేరేందుకు నిబంధనలు అనుమతించవని సీబీఎస్ఈ స్పష్టంచేసింది. మధ్యప్రదేశ్ హైకోర్టు నియమించిన మనస్తత్వ నిపుణుల బృందం ఆరవ్‌కు సాధారణ పిల్లల కంటే ఎక్కువ ఐక్యూ ఉందని తేల్చింది. దీంతో తొమ్మిదో తరగతిలో చేరేందుకు ఆరవ్‌కు సీబీఎస్ఈ ఛైర్మన్ ప్రత్యేక అనుమతిని మంజూరు చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులకు ఆరవ్ యూట్యూబ్ ఛానల్ ద్వారా గణిత పాఠాలు బోధిస్తుండటం విశేషం.

పాలక్కడ్ ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన కాంగ్రెస్

కన్నూర్: లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత, పాలక్కడ్ ఎమ్మెల్యే రాహుల్ మామకుటత్తిల్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ సోమవారం ప్రకటించారు. ఎంతకాలం ఈ సస్పెన్షన్ కొనసాగుతుందన్నది వెల్లడించలేదు. రాహుల్‌పై వచ్చిన ఆరోపణలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. ఓ ప్రసిద్ధ పార్టీకి చెందిన యువనేత తనతో అనుచితంగా ప్రవర్తించాడని, మూడేళ్లుగా వేధిస్తున్నాడని ప్రముఖ నటి రినీ జార్జ్ ఆరోపించడంతో యువజన అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామాచేసిన సంగతి తెలిసిందే. అనంతరం పలువురు మహిళలు, ఓ ట్రాన్స్‌జెండర్ కూడా ఆయనపై దాదాపు ఇలాంటి ఆరోపణలే చేశారు. దీంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని రాజకీయ ప్రత్యర్థులు రాహుల్‌పై ఒత్తిడిని తెస్తున్నారు. ప్రస్తుతం ఆయన పార్టీలో అంతర్గత విచారణను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి రాహుల్‌ను తాత్కాలికంగా తొలగించాలని కాంగ్రెస్ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది.